శ్రీ సాయి సుధ

నిత్య పారాయణ గ్రంథం



శ్రీ సాయి సుధ

నిత్య పారాయణ గ్రంథం



శ్రీ సాయి సుధ - నిత్య పారాయణ గ్రంథం

VICTORY

విక్టరీ

శ్రీ సాయిసుధ



నిత్య పారాయణ గ్రంధం

సమర్పణ

బి.లక్ష్మయ్య శెట్టి

శ్రీ సాయిసుధ

(నిత్యపారాయణ గ్రంథం)

PRICE : Rs.60.00

First Edition : 2001

Title Design:
G.S.N

Composed on D.T.P. by:
VICTORY GRAPHICS

Printed at:
NIRMALA OFFSET PRINTERS,
VIJAYAWADA

Cover page Printed at:
KAMAKSHI OFFSET WORKS

తొలి పలుకులు

ఈ మధ్యకాలంలో హిందూ - ముస్లిముల ఐక్యతకై పాటుపడినవారిలో షిర్డీ సాయి ప్రముఖులు, వారు దేశం నలుమూలల నుండి భక్తులను ఆకర్షించి వారందరికీ భగవంతుడు ఒక్కడేననియు, ఏ పద్ధతిలోనైనా భగవంతుని ఆరాధించవచ్చుననియు తన మాటల ద్వారా, తన చేతల ద్వారా చాటిచెప్పిన మహనీయుడు.

దాసగణు తన హరికథల ద్వారా షిర్డీసాయి మహిమలను సుదూర ప్రాంత ప్రజలకు వినిపించారు. హేమాడ్‌పంత్ సాయిచరిత్రను మరాఠీ భాషలో రచించి వారి అలౌకికమైన చరిత్రను ప్రపంచానికి ఎరుక పరచారు. ఆ తర్వాత అనేకమంది ప్రాంతీయ భాషలలోనే కాకుండా, ఇంగ్లీషు వంటి భాషలలో కూడా రచనలు చేసి విస్తృత ప్రపంచానికి వారి దివ్య చరిత్రను తెలియపరిచారు. అనేక మంది పుణ్యాత్ములు తెలుగులో పారాయణ గ్రంథాలను రచించి పెక్కు కుటుంబాలలో షిర్డీసాయి లీలలను, మహిమలను పారాయణం చేయుటకు అవకాశం కల్పించారు. ఎంతమంది ఎన్ని విధాలుగా రచించినా ఇంకా ఎన్నో రచనలు రావలసిన అవసరం ఉంది. సమాజంలోని వివిధ వర్గాల వారి అవసరాలకు అనుగుణంగా రచనలు చేయాల్సి ఉంది.

నేడు మానవుడు నడవటం లేదు. పరుగులు తీస్తున్నాడు. దమ్మిడీ ఆదాయం లేదు; క్షణం తీరిక లేదు అన్నట్లుగానున్నది అతని పరిస్థితి. ప్రతిదానికి ఉద్వేగ పడ్తున్నాడు. ఇట్టి పరిస్థితులలో గంటల కొలది భక్తి భావనతో పారాయణం చేయగల వ్యక్తుల సంఖ్య బాగా తగ్గిపోతున్నది. అట్టి వారలను దృష్టిలో పెట్టుకొని వీలైనంత తక్కువ సమయంలో పారాయణ చేయుటకు వీలుగా శ్రీసాయిసుధ గ్రంథమును రూపొందించటం జరిగింది. నిర్మల హృదయంతో శ్రద్ధ, సహనంతో ఈ గ్రంథమును పారాయణ చేసి బాబా ఆశీస్సులను పొందవచ్చు.

బాబా మహిమలు అనంతం. ఈ సందర్భమున 23-5-99న నా జీవితంలో జరిగిన ఒక సంఘటనను మీ ముందుంచటం చాల అవసరం. ఆ రోజు ఉదయం గం.8.20 ని॥లకు నేను పొదిలి నుండి TRAX వ్యానులో బంధువులను తీసుకొని వచ్చుటకు మార్కాపురం వెళ్ళుచున్నాను. నేను ఫ్రంట్ సీటులో కూర్చొనియున్నాను. నేను, డ్రైవరు తప్ప ఇంకెవ్వరునూ లేరు. సగందూరం దాటి ఉంటాం. క్రొత్తపల్లి సమీపిస్తుండగా ఒక దుర్ఘటన సంభవించింది. మాకు ఎదురుగా మార్కాపురం నుండి వస్తున్న ఒక అంబాసిడర్ కారు మా వ్యానును గుద్దింది. కారు, వ్యాను బాగా దెబ్బతిన్నాయి. మా వ్యాను ముందు అద్దం పగిలిపోయింది.

దాని ముక్కలు వచ్చి నాకు గ్రుచ్చుకొన్నాయి. నాతల నుండి రక్తం ధారగా కారిపోతున్నది. నేను సాయిరామ్ అని గట్టిగా అరచాను. ఆ ధ్వని ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. మా వ్యాను డ్రైవరు ఏదో గుడ్డను తీసుకొని తలకు కట్టి రక్తంకారటాన్ని ఆపటానికి ప్రయత్నించాడు. అతని ప్రయత్నం నెరవేరలేదు. పొదిలి ఆసుపత్రికి తీసుకొని వెళ్ళాలని తలంచి పొదిలికి వెళ్తున్న ఆర్.టి.సి. బస్సును ఆపాడు. వారు ఆపకుండా వెళ్ళిపోయారు. అంతట ఆ డ్రైవరు నెమ్మదిగా నన్ను ఒక లారీలో ఎక్కించు కొని కొనకనమిట్ల P.H.C. వద్దకు తెచ్చాడు. రక్తసిక్తమైన నా గుడ్డలను చూసి P.H.C. సిబ్బంది ఎంతో బాధపడ్డారు. వారు నియమాలకు విరుద్ధమైనా నాకు ప్రథమ చికిత్స చేసి రక్తం కారటాన్ని ఆపారు. వారు చట్టం కన్నా మానవత్వం గొప్పదని ఋజువు చేసారు. దీని కంతా కారణం నేను ఆరాధించిన ఆ సాయి భగవానుడు వారిలో తెచ్చిన మార్పు, తర్వాత నన్ను బంధువులు పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టరు సుబ్బారావు గారు తన సిబ్బందితో చికిత్స చేసి నన్ను ప్రాణములతో కాపాడారు. దాదాపు 20-30 కుట్లు పడ్డాయి. ముఖమంతా గాయాలు. చెవుల వద్ద, ముక్కువద్ద, కంటి వద్ద, పెదవుల వద్ద గాయాలైనవి. కాని ఏ అవయవమునకు ఎట్టి హాని కలుగలేదు. ఇది బాబా దయకాక మరేమిటి? మధుమూత్ర వ్యాధియున్నవారికి చిన్న గాయమైనా నయమవటానికి ఎంతో కాలం పడ్తుంది. కాని ఒక వారంలోనే నా గాయాలు నయమైనవి. దుర్ఘటన జరిగిన రోజు నుండే నా పనులు నేను చేసుకోగలిగాను. కరుణా సముద్రుడైన బాబా నా పిలుపునందుకొని అందరిలోను సద్భావనలను పెంపొందింప జేసి నాపట్ల మానవతా దృక్పథం కనపరచునట్లు చేసారు. సమాధిలో నుండే భక్తుల పిలుపులకు జవాబివ్వగలనని చెప్పిన బాబా మాటలు నిజమైనవి.

నా జీవితంలో జరిగిన ఎన్నో సంఘటనలు బాబా పలుకులు అక్షర సత్యములని ఋజువు చేసాయి. ఆ సంఘటనలే బాబా సందేశాన్ని ప్రజలందరికీ తెలియ జేయాలనే భావనను నాలో కలిగించాయి. ఆ భావనే ఈ పుస్తకానికి ప్రేరణ.

ఈ పుస్తకంలో పాండిత్యాన్నిగాని, క్రొత్త విషయాలనుగాని వెదకదలచే వారికి నిరాశే ఎదురవుతుంది. మహనీయుల మాటలనే నా శైలిలో తెలుపుటకు మాత్రమే నేను ప్రయత్నించాను. ఈ పుస్తకంలో తెలిపిన విధంగా దీనిని పారాయణ చేసి బాబా కృపకు పాత్రులు కావలెనని నా ఆకాంక్ష. ప్రచురణకర్తల ఆశయం.

ఓం శ్రీ సాయిరామ్

ఇట్లు

బి.లక్ష్మయ్య శెట్టి

బాబా సేవకుడు

విషయ సూచిక

ఐదవరోజు పారాయణ

ఆరవరోజు పారాయణ

ఏడవరోజు పారాయణ

అనుబంధం

శ్రీ సాయినాథుని ఏకాదశ సూత్రములు

1. షిర్డీ ప్రవేశమే సర్వదుఃఖ పరిహారం.
2. ఆర్తులైననేమి, నిరుపేదలైన నేమి ద్వారకామాయిలో ప్రవేశించి నంతనే సుఖ సంపదలను పొందగలరు.
3. ఈ భౌతిక దేహానంతరం సహితం నేను అప్రమత్తుడనే.
4. నా భక్తులకు రక్షణ నా సమాధి నుండియే వెలువడుచుండును.
5. సమాధి నుండియే నేను సర్వ కార్యములు నిర్వహింతును.
6. సమాధి నుండి నా మానుష శరీరం మాట్లాడును.
7. నన్ను ఆశ్రయించు వారిని, నన్ను శరణుజొచ్చిన వారిని నిరంతరం రక్షించుటయే నా కర్తవ్యం.
8. నా యందు ఎవరి దృష్టియో, వారి యందే నా కటాక్షం కలదు.
9. మీ భారంను నాపై పడవేయుడు, నేను మోసెదను.
10. నా సహాయంను కాని, సలహాను కాని కోరిన తక్షణమే యొసంగ సంసిద్ధుడను.
11. నా భక్తుల ఇంట 'లేమి' అను శబ్దమే పొడసూపదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

గ్రంథ పారాయణ మహాత్మ్యం

★ గ్రంథ పారాయణ మహాత్మ్యం గురించి బాబా ఇలా చెప్పారు – "నా లీలలు, నా చరిత్ర తలచుకొంటూ, నన్నే ధ్యానిస్తూ, నాపై భక్తి కలిగి, నా నామం జపించే వారికి ఇంద్రియ విషయాలపై విశ్వాసమెలా ఉండగలదు? నా చరిత్ర విన్నంత మాత్రాన్నే ఎవ్వరినైనా మృత్యుముఖం నుండి రక్షిస్తాను. అతనికి వ్యాధి నివారణమవుతుంది. భక్తి శ్రద్ధలతో నా చరిత్ర శ్రవణం చేసి దానినే మననం చేస్తే నీకు శాంతి లభిస్తుంది. దేహాత్మ భావం మరియు ద్వైత దృష్టి నశిస్తాయి. ఏకాగ్రత, పూర్ణం అయిన భక్తివలన చిత్తమంతా దివ్యశక్తి మండలమవుతుంది"

– శ్రీసాయి సచ్చరిత్ర (3 : 1 – 25)

★ ఆత్మజ్ఞానం లేక ముక్తి పొందటానికి సద్గురువు అవసరం ఎంతైనా వుంది. శ్రీరాముడు విశ్వామిత్రుణ్ణి, శ్రీకృష్ణుడు సాందీపని మహర్షిని సేవించి లోకానికి ఒక ఆదర్శాన్ని చూపారు. కాని ఆత్మజ్ఞానియైన సద్గురువు లభించుట చాలా కష్టం. అందుకే భగవంతుడే భూమిమీద విశ్వగురుడైన దత్తాత్రేయునిగా మానవోద్ధరణ కొరకు పరిసమాప్తి లేని నిత్యావతారంగా నిలిచాడు. ఆయన అనేక యోగ సంప్రదాయాలన్నిటికీ మూల పురుషుడు అయ్యాడు. ఆయన ఇటీవల కాలంలో శ్రీపాద శ్రీ వల్లభుడు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్కోట్ మహరాజ్, శ్రీ షిర్డీ సాయిబాబా, శ్రీ పర్తి సాయిబాబాలుగా అవతరించారు.

ఈ దత్తావతారాలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి : -

1. వారు ఆ శరీరాలు విడిచి పెట్టిన తర్వాత కూడా భక్తులకు భౌతికంగా దర్శనమిచ్చి అనుగ్రహింపగలరు.
2. వీరి అనుగ్రహం పొందటానికి వారి చరిత్రల పారాయణమే ముఖ్యసాధన.

– శ్రీ గురుచరిత్ర

పారాయణచేయు విధానం

1. స్నానంచేసి నిర్మల హృదయంతో శ్రీ సాయిసుధను పారాయణం చేయుటకు ప్రారంభించాలి.
2. ఒక ఎత్తయిన బల్లపై బాబా ఫోటోను, శ్రీసాయిసుధను పెట్టి పూజించాలి. ఆ తర్వాత పారాయణ మొదలు పెట్టాలి.
3. పారాయణను గురువారంనాడు ప్రారంభించి మరుసటి బుధవారం నాటికి ముగించాలి.
4. మరుసటి గురువారం నాడు శ్రీ సాయినాథుని పూజచేసి మిఠాయి పంచి పెట్టాలి. శక్త్యానుసారం బ్రాహ్మణులకు, బంధువులకు, మిత్రులకు భోజనం పెట్టి తాంబూలం, దక్షిణ సమర్పించాలి.
5. ఆ సమయమున శక్త్యానుసారం బాబాకు దక్షిణ పెట్టాలి. ఆ దక్షిణను క్రింది అడ్రసుకు మనియార్డు లేదా డ్రాఫ్ట్‌ద్వారా పంపాలి :

శ్రీ సాయిబాబా సంస్థానం
షిర్డీ పోస్టు, అహమదు నగరు జిల్లా.
పిన్ : 423 109.

బ్యాంకు డ్రాఫ్టు పంపువారికి సూచన :

అన్ని రకాల బ్యాంకుల శాఖలు షిర్డిలో లేవు. కనుక షిర్డీలో బ్యాంకు శాఖలేనిచో అహమ్మదు నగరు బ్యాంకు శాఖ పేరట డ్రాఫ్ట్ తీసుకొని దానిని క్రాస్‌చేసి షిర్డీలోని శ్రీ సాయిబాబా సంస్థానం పేరట రిజిష్టర్డ్ పోస్టులో పంపిన సురక్షితముగా చేరును. సంస్థానం వారు రశీదు, ఊదీ (విభూతి) పంపుదురు.



ఫలశ్రుతి

శ్రీసాయి సగుణ రూపంను ధ్యానించుచున్నచో అది ఆత్మ సాక్షాత్కారమునకు దారితీయును. సర్వస్వ శరణాగతిలో వేడిన భక్తులను సాయి ఎల్లవేళలా కాపాడును.

నిర్మలమైన మనస్సుతో, భక్తి, ప్రేమ, విశ్వాసం, ఏకాగ్రతలతో శ్రీ సాయిసుధ పారాయణను పూర్తి చేసిన వారికి కోరిన కోరికలు సిద్ధించును. ఇదంతయూ వారి వారి భక్తి, విశ్వాసాలపై ఆధారపడియుండును. ఈ రెండునూ లేనిచో ఎట్టి అనుభవమూ కలుగదు.

ఈ గ్రంథంను గురుపూర్ణిమ (ఆషాఢ శుద్ధ పూర్ణిమ), గోకులాష్టమి, శ్రీరామ నవమి, దసరా (బాబా పుణ్యతిథి) నాడు గృహమందు పారాయణ గావించిన వారికి బాబా కరుణ సంపూర్ణంగా లభించును.

ప్రతిరోజు పారాయణ చేయుటకు పూర్వం చేయవలసిన పూజ

విఘ్నేశ్వరుని ప్రార్థన

గజాననా హే శుభాననా
పరమ నిరంజన గజవదనా
వక్రతుండ ధర విఘ్న వినాశా
ప్రణవ స్వరూపా షిర్డి పురీశా
సిద్ధి వినాయక సాయి గజాననా
పరమ నిరంజన గజ వదనా ॥గజ॥

దేవి ప్రార్థన

వైష్ణవి మా హెరాహి మా
విశ్వేశ్వరి మా వాణీ మా ॥ వై ॥
శక్తి స్వరూపిణి సాయి మా
శాంతి ప్రదాయిని సంతోషి మా ॥ వై ॥

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రార్థన

బ్రహ్మ, విష్ణు మహేశ్వరా సాయీశ్వరా
దయాకరో కృపాకరో పరమేశ్వరా
సాయిరాం సాయిరాం (2)

పరమ దయాళా పాప వినాశా
రక్షాకరో రక్షాకరో సాయీశ్వరా
దయాకరో కృపాకరో పరమేశ్వరా. ॥ బ్ర ॥

గురుచరణములకు వందన

మానస భజరే గురుచరణం
సాయీ చరణం ప్రణమామ్యహం
షిర్డీ సాయీ చరణం ప్రణమామ్యహం
నిర్మల హృదయ విరాజిత చరణం
సకల చరాచర వ్యాపక చరణం

పారాయణ తర్వాత మంగళహారతి

1. స్వామి సాయినాథాయ శిరిడీ క్షేత్ర వాసాయ
మామకాభీష్టదాయ మహిత మంగళం

2. లోకనాథాయ భక్తలోక సంరక్షకాయ
నాగలోక స్తుత్యాయ నవ్య మంగళం ॥ స్వామి ॥

3. భక్త బృంద వందితాయ బ్రహ్మ స్వరూపాయ
ముక్తి మార్గ బోధకాయ పూజ్య మంగళం ॥ స్వామి ॥

4. సత్య తత్త్వ బోధకాయ సాధు వేషాయతే
నిత్య మంగళ దాయకాయ నిత్య మంగళం ॥ స్వామి ॥

శ్రీ సాయి సుధ

(శ్రీ సమర్థ సద్గురు సాయిబాబా జీవిత వృత్తాంతం)

నిత్యపారాయణ గ్రంథం

మొదటి రోజు (గురువారం) పారాయణ

భక్త వర్యులారా ! శ్రీ సాయిబాబా పాదములకు మోకరిల్లి వారి జీవిత చరిత్ర పారాయణను ప్రారంభిద్దాం. ఓం శ్రీ సాయిరామ్.

శ్రీ సాయిబాబా జీవిత వృత్తాంతం

ధర్మాచరణ మనుజుని రక్షించును. అదియే జీవునకు శాంతిని, శాశ్వత సౌఖ్యమును ప్రసాదించును. కనుకనే ధర్మం క్షీణించి, అధర్మం వృద్ధి యగు చున్నప్పడు భగవానుడు అవతరించి ధర్మమును లెస్సగ స్థాపించుననియు, దుర్మార్గులను వినాశమొనర్చి వారి బారి నుండి సాధువులను, సజ్జనులను సంరక్షిం చుననియు భగవద్గీతలో చెప్పబడినది :

1. యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్. (4 - 7)

2. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే (4 - 8)

ఒక్కొక్కప్పడు భగవానుడు పై కార్యములను నిర్వర్తించుటకు గాను తాను ఈ లోకమున అవతరించక తన ప్రతినిధులను పంపును. వారు అజ్ఞానులైన భక్త జనులకు సరైన మార్గదర్శకత్వం వహిస్తూ భగవంతుని కార్యమును సుగమం చేయుదురు. జ్ఞానదేవ్, తుకారామ్, రామదాసు, కబీర్ మొ॥లగు పుణ్యాత్ములు ఆ కోవకు చెందినవారే.

ఆధునిక యుగంలో శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురువులు శ్రీ సాయినాథ మహారాజ్ అసంఖ్యాక భక్తజనులను ఉద్ధరించి షిర్డీకి మహా ప్రశస్తిని సంపాదించారు.

'నరజన్మ కొన్న నరుడను' అని రాముడు పలికాడు. కృష్ణుడు 'నరజన్మ కొన్న నారాయణుడను' అని చెప్పాడు. కాని సాయినాథుడు తాను భక్తుల దాసాను దాసుడను అని వినమ్రంగా మనవిచేసుకొన్నాడు. తాను భగవంతుడనని ఏనాడూ చెప్పలేదు. అంతకు మించి తనను భగవంతుని అవతారముగా ప్రస్తుతించే వారిని మందలించి భగవన్నామం జపించి తరించమని చెప్పారు.

శ్రీ సాయిబాబా జన్మ

సాయిబాబా తల్లిదండ్రులను గూర్చిగాని, జన్మను గూర్చిగాని ఎవరికీ ఏమియు తెలియదు. పెక్కుసార్లు ఈ విషయములను తెలుసుకొనుటకు ఎంతో మంది ప్రయత్నించిరి. కాని వారి ప్రయత్నములు నెరవేరలేదు.

సాయిబాబా జీవితం నామదేవుడు, కబీరు మొ॥ యోగపుంగవుల జీవితం వలె యున్నది. నామదేవుడు భీమరథి నదిలో గోణాయికి కన్పించెను. కబీరు భాగీరథీ నదిలో తమాలునకు అగుపడెను. అట్టిదే సాయి జన్మవృత్తాంతం. భక్తుల కొరకు 16 సం॥ల బాలుడుగా షిర్డీలోని వేపచెట్టు క్రింద అవతరించెను.

నానా చోప్‌దారు తల్లి బాబాను గురించి ఈ విధంగా వర్ణించింది - "ఈ చక్కని, చురుకైన అందమైన కుర్రవాడు వేపచెట్టు క్రింద ఆసనములో నుండెను. వేడిని, చలిని లెక్కింపక అంతటి చిన్నవాడు కఠిన తపం ఆచరించుట, సమాధిలో మునిగియుండుట చూచి గ్రామీణులు ఆశ్చర్యపడిరి. ఆ కుర్రవాడు పగలు ఎవరితోను కలిసెడువాడు కాడు. రాత్రి ఎవరికీ భయపడెడివాడు కాడు. చూచిన వారు ఆశ్చర్యమగ్నులై యీ చిన్న కుర్రవాడు ఎక్కడి నుండి వచ్చాడాయని అడుగ సాగిరి. అతని రూపు, ముఖ లక్షణాలు చాలా అందంగా నుండెను. ఒకసారి చూసిన వారెల్లరు ముగ్ధులగుచుండిరి. ఆయన ఎవరింటికీ పోకుండెను. ఎల్లప్పుడు వేప చెట్టు క్రిందనే కూర్చొండెడి వాడు. పైకి చిన్న బాలునివలె కన్పించినప్పటికీ, చేతలను బట్టి చూడగా నిజంగా మహానుభావుడే. అతనిని గూర్చి ఎవరికీ ఏమియు తెలియకుండెను" ఇది సుమారు 1854 నాటి సంఘటన.

బాల్యం

బాబా చిన్నతనంలో భుక్తికొరకు వెదకుచు బీడ్‌గామ్ వెళ్లెను. అక్కడ బట్టలపై అల్లికపని చేయుచుండెను. బాగా కష్టపడి పనిచేయుచుండెను. యజమాని చాలా సంతోషపడెను. అతని వద్ద బాబాకు పూర్వం ముగ్గురు కుర్రాళ్ళు పనిచేసిరి. యజమాని మొదటి వానికి 50 రూ॥, రెండవవానికి 100 రూ॥, మూడవ వానికి 150 రూ॥ ఇచ్చెడి వాడు. కాని బాబా తెలివితేటలను బట్టి, అతనికి వారి ముగ్గురికీ ఇచ్చిన మొత్తం కన్నా రెండింతలు అనగా 600 రూ॥ జీతమిచ్చెను..అంతేగాకుండా తలపాగా, శెల్లా ఇచ్చెను. బాబా వాటిని జాగ్రత్తగా దాచుకొనెను.

గురువుగారి సమాధి స్థానం

ఒకనాడు ఖండోబా దేవుడు (షిర్డీలోని గ్రామ దేవతయగు ఈశ్వరుడు) ఒక వ్యక్తిని ఆవేశించి యుండెను. ప్రజలు ఆ వ్యక్తిని బాబాను గురించి ఈ విధంగా ప్రశ్నించిరి - “ఈ బాలుడు ఎవరు? ఎచ్చటి నుండి వచ్చాడు? ఇతని తల్లిదండ్రులు ఎవరు?” అంతట ఆ వ్యక్తి ఒక స్థలం చూపి గడ్డపారను తీసుకొని వచ్చి అచ్చట త్రవ్వుమనెను. అట్లు త్రవ్వగా ఇటుకలు, వాని క్రింద ఒక వెడల్పు బండ కన్పడెను. ఆ బండను తొలగించగా ఒక సందు కని పించెను. అచ్చట నాలుగు దీపములు వెలుగుచుండెను. ఆ సందు ద్వారా పోగా ఒక భూగృహం కనిపించెను. అందులో గోముఖ నిర్మాణములు, కర్రబల్లలు, జప మాలలు అగపడెను. అంతట ఖండోబా ఆవహించిన వ్యక్తి యిట్లు చెప్పెను - ‘ఈ బాలుడు ఇచ్చట 12 సం॥లు తపస్సు చేసెను’

ప్రజలు ఆ విషయమును కుర్రవానిని అడుగగా అతడు అది తన గురు స్థాన మనియు, అచ్చట వారి సమాధి కలదనియు, కావున దానిని కాపాడవలయు ననియు చెప్పెను. అంతట ప్రజలు దానిని ఎప్పటివలె మూసివేసిరి. కనుకనే బాబా ఆ వేపచెట్టును ఎక్కువగా ప్రేమించెడి వారు. భక్తులు షిర్డీలోని ఆ వేపచెట్టును బాబా గురువుగారి సమాధి స్థానంగా భావించి సాష్టాంగ నమస్కారం చేయు దురు.

అందరూ దగాకోరులే; కాని వాళ్ళమధ్యనే వాళ్ళతోనే వ్యవహరించక తప్పదు

చాంద్‌పాటిల్ తప్పిపోయిన గుర్రమును చూపించుట

ఔరంగాబాద్ జిల్లాలో ధూప్‌ఖేడా యను గ్రామం కలదు. అచ్చట చాంద్ పాటిల్ అను ఒక ధనిక మహమ్మదీయుడు యుండెను. అతడు గ్రామ మునసబు. అతడు ఒకసారి ఔరంగాబాద్ పోవుచుండగా అతని గుర్రము తప్పిపోయెను. రెండు నెలలుగా ఎంత వెదికినను అది కనిపించలేదు.

ఒకనాడు అతడు నిరాశ చెంది దాని జీను మాత్రం భుజంపై వేసుకొని ఔరంగాబాద్ నుండి తన గ్రామానికి పోవుచుండెను. 9 మైళ్ళు నడచిన పిమ్మట సింధోస్ - భింధోస్ అనే జంట గ్రామాల వద్ద ఏలగంగ (గోదావరి ఉపనది) ఒడ్డునయున్న ఒక మామిడిచెట్టు వద్దకు వచ్చెను. దాని నీడలో ఒక ఫకీరు కూర్చొని యుండెను. అతడు కఫ్నీ (పొడుగాటి చొక్కా) ధరించియుండెను. అతని తలపై టోపీ, చంకలో సటకా (దండం) ఉండెను. అతడు చిలిము సిద్ధం చేయుచుండెను. దారినపోవు చాంద్ పాటిల్‌నుచూచి, అతనిని పిలిచి చిలిము త్రాగి కొంత సేపు విశ్రాంతి తీసుకొనమనెను. అతని భుజముపై నున్న జీనును చూసి నవ్వుతూ, "ఈ జీను నీవు మోస్తున్నావేమి?" అని ప్రశ్నించెను. అది తాను పోగొట్టుకున్న గుర్రము దని చాంద్ పాటిల్ చెప్పెను. అంతట ఫకీరు, "అది ఏటి ఒడ్డున వున్నది. చూడుము' ' అనెను. చాంద్ పాటిల్ అచ్చటికి పోయి, గడ్డిమేయుచున్న గుర్రమును చూసి ఆశ్చర్యపడెను. ఈ ఫకీరు సాధారణ మానవుడు కాడనియు, గొప్ప యోగి పుంగవు డనియు భావించెను.

నిప్పును, నీటిని సృష్టించుట

చాంద్‌పాటిల్ గుర్రమును తీసుకొని ఫకీరు వద్దకు వచ్చెను. చిలిము తయారుగా నుండెను. కాని చిలిము వెలిగించుటకు నిప్పు, గుడ్డను తడుపుటకు నీరు కావలసియుండును. ఫకీరు ఇనుపచువ్వను భూమిలోనికి గ్రుచ్చగా నిప్పు వచ్చెను. సటకాను నేలపై మోదగా నీరు వచ్చెను. గుడ్డను ఆ నీటితో తడిపి చిలిము పీల్చి చాంద్‌పాటిల్‌కు అందించెను. ఇదంతయు చూసిన చాంద్‌పాటిల్ ఆశ్చర్య చకితుడయ్యెను.

అతిగా తినకు. అతిగా నిద్రపోకు, ఎంత తినాలో, ఎంత నిద్రపోవాలో నీకే తెలుసు

చిలిము త్రాగటాన్ని గురించి బాబా తన సమకాలీనుడైన మాధవ్‌నాథ్ మహరాజ్‌తో ఒకసారి ఇలా చెప్పారు - "అజ్ఞానమనే పొగాకుకు గురుభక్తియనే నిప్పును పెట్టి చిలిము పీలిస్తే, మనలోని అహంకారం ఆకాశంవలె అనంతమైన పరమాత్మలోనికి ఎగసి లీనమవుతుంది"

ఫకీరు షిర్డీ చేరుట

చాంద్‌పాటిల్ ఫకీరును తన గృహమునకు రమ్మనియు, అతిథిగా నుండుమనియు కోరెను. ఆ మరుసటి దినమే ఫకీరు చాంద్‌పాటిల్ ఇంటికి వెళ్లెను. అచ్చట కొన్ని దినములుండెను. చాంద్‌పాటిల్ బావమరది కొడుకు పెండ్లి సమీపించెను. పెండ్లి కూతురిది షిర్డీ గ్రామం. పెండ్లివారితో కలిసి ఫకీరు షిర్డీ గ్రామం చేరెను. వివాహం ఎట్టి ఆటంకాలు లేకుండా జరిగెను. పెండ్లివారు ధూప్ గ్రామం తిరిగి వెళ్లిరి. కాని ఫకీరు షిర్డీలోనే ఉండి పోయెను. అంతేకాదు, ఎప్పటికీ ఆ ఊరు విడిచి వెళ్లరాదని నిశ్చయించుకొనెను.

ఫకీరునకు సాయిబాబా నామమెట్లు వచ్చెను?

పెండ్లివారు షిర్డీ చేరగానే ఖండోబా మందిరమునకు సమీపమునన్న భక్త మహల్సాపతి గారి పొలంలోని మర్రిచెట్టు క్రింద బస చేసిరి. ఖండోబా మందిరమునకు ఆనుకొనియున్న ఖాళీ జాగాలో బండ్లు విడిచిరి. బండ్లలో నున్న వారు ఒకరి తర్వాత మరియొకరు దిగిరి. ఫకీరు కూడా దిగెను. ఖండోబా ఆలయ పూజారి మహల్సాపతి ఆదరంగా 'ఆ సాయి! (దయచేయుము సాయి) అని స్వాగతం పలికెను. అలనాడు ఎవరికీ చెప్పకుండా షిర్డీ నుండి వెళ్ళిపోయిన ఆ వింత యువకుడే ఈ ఫకీరని గుర్తించి అతడు సంతోషపడెను. నాటి నుండి ఆ ఫకీరునకు ఆ పేరే స్థిరపడెను. కళ్యాణమునకు వచ్చిన ఆయన లోక కళ్యాణమునకు బాట వేసెను.

"సాయి" అంటే మహాత్ములలో శ్రేష్ఠుడు అని బెంగాల్ రాష్ట్రములో వాడుక. ఆ పేరుకు 'సర్వానికి అతీతుడు' అను అర్ధమున్నదని శ్రీరామకృష్ణ పరమహంస చెప్పారు.

అతిథిదేవో భవ. అతిథి అంటే మీ ఇంటికి వచ్చిన బంధువే కాదు; నిన్ను ఆశ్రయించిన ప్రతిజీవి.

కొన్ని ప్రాంతాలలో బాబా అంటే తండ్రి అని అర్ధం కలదు. పెద్ద వారిని ఆదర పూర్వకంగా బాబా అని పిలవటం కూడా వాడుకలో ఉంది. అందుకే మనందరికీ తండ్రియైన సాయిని భక్తులు బాబాగా పిలవసాగిరి. సాయి నామముతో పాటు బాబా నామము కూడా చేరి వారు సాయిబాబాగా ప్రసిద్ధి చెందారు.

బాబా జన్మదినం

బాబా సరియైన పుట్టిన తేదీ ఎవరికీ తెలియదు. కాని బాబా జీవితానికి సంబంధించిన కొన్ని సంఘటనల ఆధారంగా ఆయన పుట్టిన సంవత్సరం తెలుసుకొనే ప్రయత్నం ఈ క్రింద పేర్కొన్న విధంగా చేయబడినది.

బాబా 16 సం॥ల ప్రాయమున షిర్డీ వచ్చి మూడు సం॥లు మాత్రం అచ్చట ఉండిరి. హఠాత్తుగా అచ్చటి నుండి అదృశ్యమైరి. కొంతకాలం తర్వాత ఔరంగాబాదుకు సమీపమున కనిపించిరి. 20 సం॥ల ప్రాయమున చాంద్ పాటిల్ పెండ్లి గుంపులో చేరి షిర్డీ చేరిరి. అప్పటినుండి 60 సం॥లు షిర్డీలోనే ఉండిరి. 1918వ సం॥న మహాసమాధి చెందిరి.

ఈ వివరములను బట్టి బాబా జన్మసంవత్సరమును ఈ విధంగా లెక్కకట్ట వచ్చును -

మహాసమాధి చెందిన సంవత్సరం	....	1918వ సం॥
చాంద్‌పాటిల్ వారి పెండ్లి గుంపుతో వచ్చి షిర్డీలో నున్న కాలము.	....	60 సం॥లు
చాంద్‌పాటిల్ వారి పెండ్లి గుంపుతో షిర్డీవచ్చిన సంవత్సరం	....	1918-60 = 1858వ సం॥
చాంద్‌పాటిల్ వారి పెండ్లి గుంపుతో షిర్డీ వచ్చినప్పుడు బాబా వయస్సు	....	20 సం॥లు
బాబా పుట్టిన సంవత్సరం	..	1858 - 20 =
	..	= 1838 వ సం॥

ఇతర యోగులతో సహవాసం

హిందువులు సాయిబాబాను ఖండోబా దేవాలయంలో అడుగుపెట్టరాదని నిరసిస్తే "సరే సరే. మీరే నా దగ్గరకు రండి!" అంటూ ఆ ఊళ్ళోని ఒక పాడుబడిన మసీదులో నివాసం ఏర్పరచుకొనిరి. బాబాకు 12 సం॥ల ముందే దేవీదాస్ అను యోగి షిర్డీలో నివసించుచుండెను. అప్పుడు దేవీదాస్ 10-11 సం॥ల బాలుడుగా ఉండెను. అతనిది చక్కని ముఖం. అతనివి ప్రకాశించు నేత్రములు. అతడు నిర్వ్యామోహిత అవతారమువలె, జ్ఞానివలె కనబడుచుండెను. అతడు మారుతి దేవాలయంలో ఉండేవాడు. బాబా అతనితో సాంగత్యమునకు ఇష్టపడిరి. అతనితో కలిసి మారుతి దేవాలయంలో కొంతకాలముండిరి. ఆయన ఎల్లప్పుడు అతనితో మాట్లాడుచు కాలం గడుపుచుండిరి. ఆ తర్వాత వారు చావడికి తన బసను మార్చిరి.

తోటను పెంచుట

షిర్డీకి 3 మైళ్ళ దూరముననున్న రాహాతా గ్రామము నుండి బాబా బంతి, గన్నేరు, నిత్యమల్లె మొ॥ మొక్కలను తెచ్చి వాటిని షిర్డీలో నాటి ఒక తోటను పెంచిరి. వారు స్వయంగా బావి నుండి నీళ్ళు చేది కుండలు భుజముపై పెట్టుకొని మోయుచుండిరి. సాయంకాలం కుండలను వేపచెట్టు క్రింద బోర్లించువారు. కుండలు కాల్చినవి కానందున కొద్ది రోజులలోనే పగిలి ముక్కలు ముక్కలు అగుచుండెను. ఆ మరుసటి దినం తాత్యా ఇంకొక రెండు కుండలను ఇచ్చుచుండెను. ఇట్లు మూడు సంవత్సరాలు గడచెను. బాబా కృషితో అచ్చట ఒక పూలతోట ఏర్పడెను. ఆ స్థలంలోనే ఇప్పుడు బాబా సమాధి కలదు. దానినే నేడు సమాధి మందిరం అని పిలిచెదరు. దానిని దర్శించుటకు ఎంతోమంది భక్తులు షిర్డీ వచ్చుచుందురు.

అఖండ దీపం

షిర్డీలో రోడ్డు ప్రక్కన లెండీ తోపుండెను. బాబా దానిలో రోజు రెండు పూటలా ఒక్కరే కొంత సేపుండేవారు. అప్పుడప్పుడు సేవకుడు అబ్దుల్లా ఆయనతో కూడా ఉండేవాడు. అతడు ఇలా చెప్పాడు - "ఆ తోపులో ఒక చోట రెండు అడుగుల

లోతున ఒక గుంటలో బాబా అఖండదీపం పెట్టారు. అది ఆరిపోకుండా పైన ఒక రేకు చుట్టూ సుమారు 20 తెరలుండేవి. నేను ఆ దీపాన్ని కనిపెట్టుకొని ఉండేవాడను. బాబా దాని వద్ద కూర్చొనేవారు. ఆయన కూర్చొన్న చోటు నుంచి ఆ దీపం కనిపించేది కాదు"

మొహియుద్దీన్ తంబోలీతో కుస్తీ

మొహియుద్దీన్ తంబోలీ అనువాడు బాగా కండపుష్టి గలవాడు. అతడు షిర్డీ ప్రాంతంలో తమలపాకులు, తాయెత్తులు అమ్ముకొనేవాడు. అతనికి దివ్యశక్తులున్నవని తలచి ఆ గ్రామస్థులు అతనిని గౌరవించుచుండిరి. సాయికి దిన దినము పెరుగుతున్న కీర్తిని చూచి అతడు ఓర్వలేకపోయాడు. అతడు ఒక రోజున 'షిర్డీలో తానైనా వుండాలి లేక సాయియైనా వుండాలి' అని తగవు పెట్టుకొని ఆ విషయం కుస్తీపోటీలో తేల్చుకోవాలని చెప్పి బాబాపై కలియబడెను. ఆ కుస్తీలో బాబా ఓడి పోయెను. ఆ రోజు నుండి ఆ షరతు ప్రకారం బాబా మసీదు వదలిపెట్టి లెండీ ఏటి ఒడ్డున నున్న తోపులోయుండసాగెను. బాబాకు విరక్తి కలిగి తన దుస్తులను, నివసించు విధానమును మార్చుకొనెను. లంగోటి బిగించుకొని, పొడవు చొక్కాను తొడుగుకొని, నెత్తిపైన గుడ్డ కట్టుకొనుచుండెను. ఒక గోనెముక్కపై కూర్చొను చుండెను. చిరిగిన గుడ్డలతో తృప్తిపడేవాడు, రాజభోగముల కంటె దరిద్రమే మేలని చెప్పేవాడు.

బాబా జనులతో కలిసి తిరిగే వారేకాదు. అడిగినపుడు మాత్రం జవాబిచ్చు చుండిరి. దినమంతయు వేపచెట్టు నీడన గడిపేవారు. అప్పుడప్పుడు కాలవ ఒడ్డున నుండు తుమ్మ చెట్టు నీడన కూర్చొనెడి వారు. సాయంకాలం ఊరకనే పచార్లు చేయుటగాని, నీమ్‌గావ్ పోవటంగాని చేయుచుండిరి.

తాత్యావంటి భక్తులు బాబావున్న చోటునకే వెళ్ళి ఆయనను సేవించెడి వారు. వారెంత బ్రతిమాలినా బాబా గ్రామంలోనికి రాలేదు.

ఒక రోజున అకస్మాత్తుగా తంబోలీకి హృదయ పరివర్తన కలిగి, ఒక మహాత్ముని దర్గావద్ద సాత్వికముగా జీవించదలచి షిర్డీ వదలి వెళ్ళెను. అప్పుడు సాయిబాబా మరలా మసీదుకు వచ్చిరి. వారు తమ ఆత్మబలంతో తంబోలీ కండబలాన్ని, తమ ప్రేమతో అతని ద్వేషాన్ని జయించిరి.

యోగాభ్యాసములు

బాబాకు ధౌతి, ఖండయోగం మొ॥ యోగాభ్యాసములన్నియూ బాగా తెలుసు.

1. ధౌతి : ధౌతి యనగా 3 అంగుళముల వెడల్పు, $22\frac{1}{2}$ అడుగుల పొడవుగల తడిగుడ్డతో కడుపును లోపల శుభ్రపరచుట. కాని బాబాగారి ధౌతి చాలా విచిత్రముగా యుండెడిది.

షిర్డీలో మసీదునకు చాల దూరమున ఒక మర్రిచెట్టు కలదు. అక్కడ ఒక బావి యున్నది. ప్రతి మూడవరోజున బాబా అచ్చటికి పోయి ముఖప్రక్షాళనం, స్నానం చేయుచుండిరి. తర్వాత వారు ప్రేగులను వెడలగ్రక్కి నీటితో కడిగేవారు. ఆ పిమ్మట వాటిని చెట్టుకొమ్మపై ఆరబెట్టి తిరిగి మ్రింగేవారు.

ఒకనాడు బాబా తన ఊపిరితిత్తులను బయటికి కక్కి వాటిని నీటితో శుభ్రపరచి నేరేడు చెట్టుపై ఆరవేయుట కొందరు గమనించిరి.

2. ఖండయోగం : ఖండయోగమనగా శరీర అవయవములన్నింటినీ విడదీసి తిరిగి కలుపుట. బాబా తన అవయవములన్నింటినీ వేరుచేసి మసీదునందు వేర్వేరు స్థలములలో విడిచి పెట్టెడివారు.

షిర్డీ నివాసి అప్పాభిల్ అనేవాడు రాత్రులలో పహరా కాచేవాడు. అతడు ఒక రాత్రి మసీదు చేరి బాబా అవయవములు వేర్వేరు స్థలములందు పడి యుండుట చూచి భయకంపితుడయ్యెను. అతడు బాబాను ఎవరో ఖూనీ చేసి అక్కడ పడవేసి యుండవచ్చునని తలంచి ఆ విషయమును గ్రామ మునసబునకు, కరణమునకు చెప్పదలచెను. కాని తనపైనే ఆ నేరం మోపుదురేమోనని తలంచి, వారికి తెలుపక ఊరకుండెను.

అతడు ఇల్లు చేరి భయముతో బయటకు రాలేదు. మరుసటి దినం మసీదునకు వెళ్లి వస్తున్న వారెవరూ ఆ విషయం ప్రస్తావించలేదు. అతడు ఆశ్చర్యంతో మసీదునకు వెళ్లి చూడగా బాబా ఎప్పటివలే హాయిగా కూర్చొనియుండిరి. క్రిందటి దినం తాను చూసినదంతయూ ఒక స్వప్నమని భావించెను. బాబా అతనిని చూచి, 'రాత్రి భయపడ్డావా?' అని అడిగిరి. తర్వాత సాయి ఖండయోగం చేసేవారని అందరికీ తెలిసింది.

శ్యామాను కరుణించిన రూపం

మాధవరావు దేశ్‌పాండే షిర్డీకి 20 మైళ్ళదూరమున నున్న నిమోన్ గ్రామంలో జన్మించాడు. అతని మూడవ యేట అతని తండ్రి షిర్డీ వచ్చి స్థిరపడిపోయాడు. అతడు షిర్డీలోని పాఠశాలలో ఆరవ తరగతి వరకు చదువుకొన్నాడు. అతడు ఇంగ్లీషు కాని, సంస్కృతంకాని నేర్చుకొనలేదు. అతడు ఒక గ్రామీణుని వలె ఉండేవాడు. అతడు ఎక్కువగా గ్రామస్థులతో కలిసి తిరిగేవాడు. అతనికి షిర్డీలోను, నిమోన్ లోను చిన్న యిల్లు, పొలాలు ఉండేవి. అతడు నిమోన్ గ్రామానికి ఈనాముదారు కావటం వల్ల సంగమ్నేరు, కోపర్‌గావ్ మరియు సిన్నర్ తాలుకాల నుండి కొంత ఈనాము లభించేది. అతనికి కాశీనాథ్, బాపాజీ బల్వంత్ అనే తమ్ముళ్ళు ఉండేవారు.

మాధవరావు సంతానం కలుగనందున రెండవ వివాహం చేసుకొన్నాడు. అప్పడు అతనికి ఏకనాథ్ పంత్, జగన్నాథ్, ఉద్ధవరాజ్ అను ముగ్గురు కొడుకులు జన్మించారు. అతనిది మంచి భారీ విగ్రహం. అతడు మంచి ఆరోగ్యం కలిగియుండెను. 72 వ సం॥వరకూ అతడు జలుబు చేసి కూడా యెరుగడు. అతడు ఎంతో ఆచారవంతుడు. గ్రామములో కొద్దిమంది ఇండ్లకు మాత్రమే వెళ్ళువాడు. అవసరమైనప్పడు స్వయంగా వండుకొనువాడు.

మాధవరావు 15 సం॥ల వయసులో ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించాడు. అతడు పనిచేసే బడి ఆ రోజులలో షిర్డీలో మసీదుకు ఎదురుగా నున్న ఇంట్లో వుండేది. ఆ కాలములోనే సాయి షిర్డీలో ప్రవేశించారు. వారు మసీదులో ఉండేవారు.

మాధవరావు బడి కిటికీ వద్ద కూర్చొని మసీదులో సాయి ఎప్పడెప్పడు ఏమి చేస్తున్నదీ గమనిస్తుండేవాడు. అతడు చిలిము త్రాగటానికి మసీదుకు వెళ్ళేవాడు. అతడు తొలుత సాయిని పిచ్చి ఫకీరుగా భావించేవాడు. క్రమంగా అతని భావములో మార్పు రాసాగింది. రాత్రిపూట పాఠశాలలో పడుకొన్నప్పడు అర్ధరాత్రి అతనికి మసీదులో ఎవరో ధారాళంగా ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషలలో మాట్లాడటం వినిపించేది. చూస్తే మసీదులో సాయి ఒక్కరే ఉండేవారు. ఇలా జరిగిన తర్వాత సాయి గొప్ప సిద్ధపురుషుడను భావం అతనికి కలిగింది. తర్వాత 20 సంవత్సరములు అచంచలమైన విశ్వాసంతో ఆయనను సేవించాడు. ఆయన

మాటే అతనికి వేదవాక్కు. అతడు సాయిని 'దేవా' అని పిలిచేవాడు. సాయి అతనిని ప్రేమగా 'షామా' (కృష్ణా) అనిగాని, 'షామ్యా' (కిష్టిగాడు) అనిగాని పిలిచేవారు. భక్తులు సాయిబాబాను ఏమైనా అడగదలచినచో శ్యామా సహాయం తీసుకొనేవారు.

శ్యామా షిర్డీకి 3 - 4 మైళ్ళ దూరాననున్న 'అష్టగామ్' అనే గ్రామానికి పటేల్‌గా పనిచేసాడు. అతడు అక్కడ ఆయుర్వేద వైద్యం చేసేవాడు. ఎవరికి మందిచ్చినా దానిలో కొంత బాబా ఊదీని కలిపి, ఆయనను ప్రార్థించి ఇచ్చేవాడు. అందువల్ల పెద్ద డాక్టర్లతో నయంకాని రోగాలు కూడా నయమయ్యేవి. నాడీ పరీక్షలో మంచి అనుభవం సంపాదించాడు. స్వంతంగా ఎన్నో వైద్య గ్రంథాలు చదివాడు. అంతియే గాక బాబా వద్ద ఎన్నో వైద్య రహస్యాలను తెలుసుకొన్నాడు.

కపట గురువునకు చేసిన సేవ

మొహియుద్దీన్ తంబోలీ అనువానితో కుస్తీ పోటీ జరిగిన 5 సంవత్సరముల తర్వాతి విషయం. జౌహర్ అలీ అను ఫకీరొకడు తన శిష్యులతో రాహాతా వచ్చెను. వీరభద్ర మందిరమునకు సమీపమున నున్న స్థలములో దిగెను. ఆ ఫకీరు బాగా చదువుకొన్నవాడు. మధురభాషి, తన శ్రావ్యమైన కంఠంతో ఖురాన్‌ను ప్రవచించే వాడు. అతనిని ఆ ఊరులోని భక్తులు బాగా గౌరవించుచుండిరి. ఆ ఫకీరు వారి సహాయంతో వీరభద్ర మందిరమునకు దగ్గరగా ముస్లిములకు ఈద్‌గా గోడ* ను నిర్మించుటకు పూనుకొనెను. ఈ సంఘటనలో అతని సంకుచితమైన మత దృష్టి బయటపడెను. అంతట హిందువులు కొట్లాడి అతనిని గ్రామం నుండి వెళ్ళ గొట్టిరి. అప్పుడు అతడు రాహాతా విడిచి షిర్డీలోని మసీదు చేరెను.

షిర్డీలో జౌహర్ అలీ బాబాతో కలిసి మసీదులో ఉండేవాడు. అతడు ప్రజలతో బాబా తన శిష్యుడని చెప్పుచుండెను. బాబా అతని మాటలకు అడ్డు చెప్పకుండ అతనికి శిష్యుడుగా ఉండుటకు నిశ్చయించుకొనిరి.

గురువునకు శిష్యుని శక్తి తెలియదు. శిష్యునకు గురువు లోపములు తెలుసు. అయినప్పటికీ బాబా ఎప్పుడూ అతనిని అగౌరవపరచలేదు. అతడు చెప్పిన పనులన్నియూ చేయుచుండిరి.

★ కొన్ని ముఖ్యమైన పండుగల సమయమున ముస్లిములు ఈ గోడ ముందు నిల్చొని ప్రార్థనలు చేయుదురు.

బాబా జౌహర్ అలీతో కలిసి రాహోతాలో ఎక్కువ కాలం ఉండేవారు. అప్పడప్పడు ఇద్దరూ కలిసి షిర్డీ వచ్చి పోయెడివారు. షిర్డీలోని బాబా భక్తులకు బాబా రాహోతాలో ఉండటం ఎంత మాత్రం ఇష్టం లేదు. వారు ఒకనాడు బాబాను షిర్డీకి తీసుకొని రావటానికిగాను రాహోతా వెళ్లిరి. ఈద్గాం వద్ద నున్న బాబా వద్దకు వెళ్లి వారు వచ్చిన పనిని గూర్చి తెలిపిరి. అంతట బాబా వారితో ఇట్లు చెప్పిరి - "ఫకీరు ముక్కోపి. చెడ్డవాడు, నన్ను విడిచిపెట్టడు. కనుక మీరు ఫకీరు వచ్చులోపల నాయందు ఆశ విడిచి తిరిగి షిర్డీ పోవుట మంచిది. "ఇంతలో అచ్చటికి వచ్చిన ఫకీరు బాబాను షిర్డీ తీసుకొని పోవుటకు ప్రయత్నించుచున్న ప్రజలను మందలించెను. ప్రజలకు, ఫకీరునకు కొంతసేపు వాగ్వివాదం జరిగెను. చివరకు రాజీ కుదరగా ప్రజలు ఫకీరును, బాబాను షిర్డీ తీసుకొని వెళ్లిరి.

అలీ ప్రవర్తన నచ్చని భక్తులు అతనికీ, దేవీదాసునకు వేదాంత చర్చ పెట్టిరి. అలీ తగిన సమాధానం చెప్పలేక ఓడిపోయి షిర్డీ విడిచి పారిపోయి బిజాపురములో ఉండసాగెను. చాల సంవత్సరముల తర్వాత అలీ షిర్డీ వచ్చి బాబా పాదములపై పడెను. తాను గురువు, బాబా శిష్యుడను అభిప్రాయం అతని మనస్సు నుండి తొలిగెను. పశ్చాత్తాప పడుటచే సాయిబాబా అతనిని ప్రేమతో గౌరవముగానే చూసిరి.

బాబా ఈ సంఘటన ద్వారా శిష్యుడు గురువును ఏ విధంగా కొలవవలెనో, ఎట్లు అహంకారం విడిచి గురువునకు శుశ్రూష చేసి తుదకు ఆత్మసాక్షాత్కారం పొందవలెనో నిరూపించారు.

భిక్షాటన

తన దృష్టి మాత్రమున ముష్టివానిని చక్రవర్తిగా చేయగల శక్తిని కలిగి యున్నప్పటికీ బాబా భిక్షాటనకు వెళ్లేవారు. సుమారు 9 గం॥ ప్రాంతంలో బాబా ఎడమ భుజానికి నాలుగు మడతలు వేసిన గుడ్డను జోలెగా కట్టుకొని, కుడి చేతిలో రేకు డబ్బా తీసుకొని నిత్యం ఐదు ఇళ్లవద్ద మాత్రమే భిక్ష తీసుకొనే వారు. ఆ ఐదు ఇళ్లల్లో బయాజీ మాయీ ఇల్లు ఒకటి. బాబా కేక వేయగానే, ఆ తల్లి పనులన్నీ ఆపివేసి, ఆయనను ఆహ్వానించి, ఆయన ఎదుటనే కూర్చొనేది. అప్పడు 7, 8 సం॥ల వయస్సుగల ఆమె కొడుకు తాత్యా ఆయన భుజాలపై ఎక్కడమో, ఆయన

ఒడిలో పొర్లడమో చేసేవాడు. ఆమె అతనిని కసిరినా, ఆమె ముఖంలో ఏ మాత్రం చికాకు వ్యక్తమైనా, బాబా "ఎందుకమ్మా వానిని కోప్పడుతావు? వానిష్టం వచ్చినట్లు చేయనివ్వు" అనేవారు.

బాబా ద్రవాహారాలను డబ్బాలోను, రొట్టెల వంటి ఘన పదార్థాలను జోలె లోను వేయించుకొనేవారు. భిక్ష తీసుకొని 'మసీదునకు చేరగానే బాబా ఒక రొట్టె, కొద్ది అన్నం ధునికి ఆహుతిగా చేసి, మిగిలినవన్నీ ఒక మట్టి బొచ్చెలో మూత పెట్టకుండా ఉంచేవారు. తొలి రోజుల్లో కుక్కలు, పిల్లులు, బిచ్చగాళ్ళూ, సేవకులూ దాని నుండి తమకు కావలసినంత తీసుకొనేవారు. ఆయన ఏ ప్రాణినీ అసహ్యించు కొని వెళ్ళగొట్టేవారు కాదు. చివరకు మిగిలినవన్నీ రుచి, విచక్షణ లేకుండా కలిపి, కొన్ని ముద్దలు మాత్రం తినేవారు.

బాబా భిక్ష కోసం ఎవరినీ పీడించేవారు కాదు. ఆయన షిర్డీ చేరిన రెండు సంవత్సరాలకు ఆ ప్రాంతంలో కరువు వచ్చింది. అప్పుడు ధనికులైన నందు, తాత్యాల ఇండ్ల వద్ద మాత్రమే ఒక్కొక్క ఇంటి నుండి సగం రొట్టె మాత్రమే తీసుకొనేవారు.

బాబా భిక్షాటన సమర్థనీయమా?

సంతానం, ధనం, కీర్తి సంపాదించుట యందు అపేక్ష వదలుకొని సన్న్యసించువారు భిక్షాటనచే జీవించవచ్చునని శాస్త్రములు చెప్పచున్నవి. ఏలనన వారు ఇంటి వద్ద వంట ప్రయత్నాలు చేసుకొని తినలేరు. బాబా గృహస్థులు కాదు. వారు వానప్రస్థమును కూడ స్వీకరించలేదు. వారు అస్ఖలిత బ్రహ్మచారులు. కనుక వారికి భిక్షాటనం చేయు హక్కు సంపూర్ణముగా గలదు.

సన్న్యాసులకు భిక్షం పెట్టుట గృహస్థుల ధర్మం

భోజన పదార్థాలు తయారు చేయుటకు గృహస్థులు ఐదు పనులు చేయు దురు. - 1. దంచుట లేక రుబ్బుట 2. విసరుట 3. పాత్రలు తోముట 4. ఇల్లు ఊడ్చుట, తుడుచుట 5. పొయ్యి అంటించుట. ఈ ఐదు పనులు చేయునప్పుడు అనేక క్రిమికీటకాదులు మరణించును. కనుక గృహస్థులు ఈ పాపమును అనుభ వించవలసియుండును.

ఈ పాప పరిహారమునకు మన శాస్త్రాలలో ఆరు మార్గాలు చెప్పబడినవి. - 1. బ్రహ్మ యజ్ఞం 2. వేదాధ్యయనం 3. పితృయజ్ఞం 4. దేవయజ్ఞం 5. భూత యజ్ఞం 6. అతిథి యజ్ఞం. వీటిని చేయుట వల్ల గృహస్థులు పాపరహితులై ఆత్మ సాక్షాత్కారం పొంద గలుగుదురు.

బాబా భిక్షాటన ద్వారా గృహస్థులకు తమ ధర్మాన్ని గుర్తు తెచ్చేవారు.

అన్నదానం

ఒక్కొక్క యుగమున ఒక్కొక్క సాధనమునకు ప్రాధాన్యత యుండును. కృతయుగములో తపస్సు త్రేతాయుగములో జ్ఞానం, ద్వాపరయుగములో యజ్ఞం, కలియుగములో దానం చేయవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి.

దానములలో అన్నదానం ఎంతో ముఖ్యమైనది. మిట్టమధ్యాహ్నం మన యింటికి వచ్చిన వారికి అన్నం పెట్టిన తర్వాత మనం భోజనం చేయవలెను. రోగులకు, ముసలివారికి, బలహీనులకు పెట్టిన తర్వాత మిగిలిన వారికి పెట్టవలెను.

బాబా తన ఆహారమునకై కొన్ని ఇండ్లకు వెళ్ళి భిక్ష గ్రహించెడివారు. కాని తన భక్తులకు అన్నదాన మహిమను తెలియజేయుటకై అప్పుడప్పుడు తానే వండి బీదలకు అన్నదానం చేసెడివారు.

బాబా బీదలకు అన్నదానం చేయదలచిన రోజున తానే స్వయంగా దుకాణ మునకు వెళ్ళి డబ్బిచ్చి ధాన్యం, పిండి, మసాలా దినుసులు మొ॥వి కొనెడి వారు. ఉప్పు, మిరియాలు మొ॥ వాటిని వారే విసరుచుండిరి.

మసీదు ముందున్న ఖాళీ స్థలంలో పొయ్యి పెట్టి, దానిపై పెద్ద వంట పాత్రను ఉంచెడివారు. ఆ పాత్రలో కొలత ప్రకారం నీళ్ళు పోసెడివారు. వారు ఒకప్పుడు చక్కెర పొంగలి, మరొకప్పుడు మాంసపు పులావ్ లేదా గోధుమ పిండి అంబలి వండేవారు. ఒక్కొక్కసారి పులుసు కాచి, అందులో గోధుమరొట్టెలు, మిరియాల పొడి వేసేవారు. ఇంకొకసారి అంబలి కాచి మజ్జిగతో కలిపేవారు.

బాబా అన్నం సరిగా ఉడికిందీ లేనిదీ తెలుసుకొనుటకు మండుచున్న పాత్ర లోనికి తన చేతిని పెట్టెడివారు. వారి చెయ్యి కొంచెం కూడా కాలేదికాదు.

వంట కాగానే పాత్రలను మౌల్వీచేత నివేదన చేయించువారు. ఒక్కొక్కప్పుడు బాబా 15, 16 శేర్ల గోధుమలు విసిరేవారు. ఆ పిండితో చక్కగా చపాతీలు చేసి నేరుగా ధుని మీద కాల్చి భక్తులకు పంచేవారు. ఒక్కొక్కదానిలో సుమారు 15, 16 పొరలుండేవి. బాగా తినగలిగిన వారికి కూడా ఒక్కటి తినటం కష్టమయ్యేది. వారు మాంసాహారమును కేవలం మాంసాహారులకే పెట్టెడివారు. అచ్చటికి శాఖాహారులను రానిచ్చేవారు కూడా కాదు.

బాబా వంట వండి బీదలకు పంచిపెట్టు కార్యక్రమమును 1910వ సం॥ వరకు కొనసాగించారు. ఆ తర్వాత భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. భక్తులు పూరీలు, బొబ్బట్లు, బాసంది, సాంజా, పరమాన్నం మొ॥ పదార్థాలను తెచ్చు చుండిరి. అన్నిటినీ ఒక దానిలో వేసి బాబా ముందుంచుచుండిరి. బాబా వాటిని దేవునికి సమర్పించి పావనం చేయుచుండిరి. ఆ తర్వాత శ్యామా, నానాసాహెబ్ మిగిలిన దానిని అక్కడున్న వారికి పంచి పెట్టుచుండిరి. ఆ ప్రసాదం రుచి, ప్రేమ, శక్తి కలిగి యుండెడిది.

రాహాతా ప్రయాణం

రాహాతాలో చంద్రభాను సేర్ అను మార్వాడీయుండెను. అతనిని బాబా ఎంతో ప్రేమతో చూచుచుండిరి. అతని మరణానంతరం అతని అన్న కొడుకగు కుశాల్ చందును కూడా బాబా ప్రేమతో చూచెడివారు.

అప్పుడప్పుడు బాబా తన భక్తులతో కలిసి టాంగాలో కాని, ఎద్దుల బండిలో కాని రాహాతా వెళ్ళేవారు. రాహాతా ప్రజలు బాజా భజంత్రీలతో బాబాను గ్రామ సరిహద్దు ద్వారం వద్ద కలిసి సాష్టాంగ నమస్కారాలు చేసేవారు. గొప్ప వైభవంతో బాబాను గ్రామంలోనికి తీసుకొని వెళ్ళేవారు. కుశాల్ చంద్ బాబాను తన యింటికి తీసుకొనిపోయి కొంతసేపు ప్రేమతో ఉల్లాసంగా మాట్లాడుకొనేవారు. తదుపరి బాబా వారిని ఆశీర్వదించి షిర్డీ వెళ్ళుచుండిరి.

విచిత్ర శయ్య

నానాసాహెబు డేంగలే బాబా నిద్రించుటకై ఒక కర్రబల్లను తెచ్చెను. దాని పొడవు 4 మూరలు, వెడల్పు ఒక జానెడు యుండెను. అది మసీదు యొక్క వెన్ను

పట్టెలకు ఉయ్యాల వలె పాత చినిగిన గుడ్డ పేలికలతో వ్రేలాడదీయబడి యుండెను. ఆ బల్ల నాలుగు మూలలందు వెలుగుచున్న నాలుగు దీపపు ప్రమిదల నుంచి దానిపై బాబా నిద్రించెడివారు.

పాతగుడ్డ పేలికలు ఆ బల్ల బరువును, బాబా బరువును మోయుట ఒక విచిత్రం కాగా ఆజానుబాహులైన ఆ బాబాకు ఆ బల్లపై పడుకొనుటకే స్థలం చాలనప్పడు దాని నలుమూలలా దీపాలు వెలిగించి నిద్రించుట మరొక విచిత్రం కాదా!

బాబా దానిపైకి ఎలా ఎక్కుచుండిరి, దాని నుండి ఎలా దిగుచుండిరి అని తెలుసుకొనవలెనని చాలా మందికి కుతూహలముగా ఉండెను. కానీ ఆ విషయమును బాబా ఎవరికీ తెలియనివ్వలేదు.

కొన్నాళ్ళు గడచిన తర్వాత మహాళ్సాపతిని వదిలిపెట్టి తానొక్కడే దానిపై పడుకొనుటకిష్టంలేక బాబా దానిని విరచి ముక్కలుచేసి ధునిలో వేసిరి. కాకాసాహెబు బాబాకు, మహాళ్సాపతికి వేరు వేరుగా రెండు క్రొత్త మంచాలు తయారు చేయించదలచెను. కాని బాబా దానిపై మహాళ్సాపతి పడుకొనలేడనియు, కేవలం పుణ్యవంతులు మాత్రమే పడుకొనగలరని చెప్పిరి. నేలపై కదలకుండా చక్కగా నిద్రించగలవారు, నిద్రకు బానిసలు కానివారు మాత్రమే దానిపై పడుకొన గలరని తెలిపిరి.

బాబా, తాత్యాకోతే పాటిలు, మహాళ్సాపతి ముగ్గురూ మసీదులో పడుకొనెడి వారు. వారు తమ తలలను తూర్పు, పడమర, ఉత్తరముల వైపు చేసి ఒకరి కాళ్ళు ఒకరికి మధ్య తగులునట్లు నిద్రించుచుండిరి. ప్రక్కలు పరచుకొని వానిపై చతికిల పడి అర్థరాత్రి వరకు ఏవో సంగతులు మాట్లాడుకొనుచుండిరి. అందులో ఎవరైనా పడుకొన్నట్లు కనిపించిన, తక్కిన వారు వారిని లేపు చుండిరి. తాత్యా పడుకొని గురక పెట్టినచో బాబా అతనిని అటు-ఇటు వూపి అతని శిరస్సును గట్టిగా నొక్కుచుండిరి. మహాళ్సాపతిని కౌగలించుకొని, కాళ్ళు నొక్కి వీపు తోమేవారు.

తాత్యాకోతే పాటిలు తల్లిదండ్రులను వదిలి 14 సం॥ల పాటు బాబాతో మసీదులో పడుకొనెను. తండ్రి చనిపోయిన పిమ్మట ఇంటి యజమాని యగుటచే ఇంట్లోనే పడుకోసాగెను.

వింత ప్రవర్తన

బాబా ఎల్లప్పుడు ఆత్మానుసంధానమున మునిగియుండెడివారు. భక్తులపై దయ చూపెడివారు. ఆయన ఎల్లప్పుడు ఒకే ఆసనంపై కూర్చొనెడివారు. ఒక చిన్న పొట్టి కర్రను సదా చేతిలో ఉంచుకొనెడివారు. ఎట్టి ఆలోచనలు లేక శాంతంగా నుండెడివారు. ఎల్లప్పడు 'అల్లా మాలిక్' అనుచుండిరి. ఆయన ఆత్మ జ్ఞానమునకు ఉనికిపట్టు. దివ్యానందమునకు పెన్నిధి. అదృష్టవంతులు మాత్రమే బాబా నిజమైన శక్తిని కనుగొనగలిగిరి. ఆయనను సామాన్య మానవునిగా భావించిన వారిని దురదృష్టవంతులుగా పేర్కొనవచ్చు.

బాబా అంతరంగమున నిరీహులు, నిస్పృహులు. కాని బాహిరముగా ప్రజల మేలుకోరుచుండిరి. ఆయన అంతరంగం శాంతికి ఉనికిపట్టయినను వారు బయటికి చంచల చిత్తులుగా కనిపించేవారు. లోపల పరబ్రహ్మ స్థితి యున్నప్పటికీ బయటికి దయ్యంవలె నటించేవారు. లోపల అద్వైతి అయిననూ బయటికి లౌకిక విషయములందు ఆసక్తి కలవారుగా అగుపించుచుండిరి. ఒక్కొక్కసారి అందరినీ ప్రేమించువారు. మరొకసారి వారిపై రాళ్ళు విసురుచుండిరి. ఒక్కొక్కప్పుడు వారిని తిట్టుచుండిరి. మరొక్కసారి కౌగలించుకొనుచుండిరి. ఒక్కొక్కప్పుడు వారి పట్ల కఠినముగా ప్రవర్తించుచుండిరి. మరొక్కసారి మైనంకంటె మెత్తగా కనిపించెడి వారు. క్షమ, శాంతముల ప్రతిమ వలె అగుపించుచుండిరి. ఆయన కోపంతో వణకుచు, ఎర్రకండ్లను ఇటునటు త్రిప్పనప్పటికీ మాతృప్రేమ, అనురాగముల ప్రవాహంవలె యుండేవారు.

వేపచెట్టు క్రిందనున్న పాదుకల వృత్తాంతం

బొంబాయిలో భాయి కృష్ణజీ అలీ బాగ్‌కర్ అను కాంపౌండరు ఒకడుండెను. అతడు అక్కల్‌కోట మహారాజు గారి భక్తుడు. అతడు అతని ఫోటోను పూజించెడి వాడు. అతడు 1912లో షోలాపూరు జిల్లాలోని అక్కల్‌కోట గ్రామానికి పోయి మహారాజుగారి పాదుకలను దర్శించి పూజింపవలెనని తలంచెను. అతడు అచ్చటికి పోక మునుపే స్వప్నంలో మహారాజు దర్శనమిచ్చి యిట్లు చెప్పిరి - "ప్రస్తుతం షిర్డీ నా నివాస స్థలం, అచ్చటికి పోయి పూజ చేయుము" అందుచే భాయి కృష్ణజీ తన నిర్ణయం మార్చుకొనెను.

భాయి కృష్ణజీ, రామారావు కొఠారె అను డాక్టరు, వారి మిత్రుడు షిర్డీ చేరిరి. వారు భక్త సగుణుతోను, బి.కె. దీక్షిత్‌తోను స్నేహం చేసిరి. వారు అనేక విషయాలు చర్చించుకొనిరి. వారు బాబా ప్రప్రథమమున షిర్డీ ప్రవేశించి వేపచెట్టు క్రింద తపస్సు చేసుకొన్నదాని జ్ఞాపకార్థం ఆ చెట్టు క్రింద బాబా పాదుకలను ప్రతిష్ఠింపదలచిరి. వారు పాదుకలను రాతితో చెక్కించాలనుకొనిరి. డాక్టరు రామారావు బాబా పాదుకల నమూనాను వ్రాయించెను. అతడు ఆ నమూనాను ఖండోబా మందిరమున నున్న ఉపాసినీ మహారాజుకు చూపించెను. వారు కొన్ని మార్పులను చేసి పద్మం, శంఖం, చక్రం మొ॥వి చేర్చి బాబా యోగశక్తిని, వేపచెట్టు గొప్పతనమును తెలుపు ఈ క్రింది శ్లోకమును కూడ చెక్కించమనిరి -

సదా నింబ వృక్షస్య మూలాధి వాసాత్
సుధా స్రావిణం తిక్త మప్య ప్రియంతమ్।
తరుం కల్ప వృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం॥

వారి సలహా ప్రకారం డా॥ రామారావు కొఠారె బొంబాయిలో పాదుకలను చేయించి తన కాంపౌండరు కృష్ణజీ అలీ బాగ్‌కర్ ద్వారా షిర్డీకి పంపెను.

బాబా వాటిని శ్రావణ పౌర్ణమి నాడు స్థాపించమని ఆజ్ఞాపించిరి. అదే ప్రకారం ఆనాడు 10 గంటలకు బి.కె. దీక్షిత్ పాదుకలను తన తలపై పెట్టుకొని ఖండోబా మందిరము నుండి ద్వారకామాయికి ఊరేగింపుగా వచ్చెను. బాబా ఆ పాదములను తాకి అవి భగవంతుని పాదుకలని చెప్పెను. 100 రూపాయల ఖర్చుతో ప్రతిష్ఠా కార్యక్రమం పూర్తి చేయబడెను. అందులో 75 రూపాయలు భక్తుల చందాల ద్వారా వసూలయ్యెను. పాదుకల చుట్టు కంచె, పైన కప్పు వేయబడెను. బి.కె. దీక్షిత్ మొదటి 5 సంవత్సరములు ఆ పాదుకలకు పూజ చేసెను.

కాలిబొటన వ్రేలులో ప్రయాగను చూపిన రూపం

గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ స్థానమే ప్రయాగ. సరస్వతి అంతర్లీనంగా నుండునని చెప్పుదురు. ప్రయాగలో స్నానమాచరించిన వారికి పుణ్యం ప్రాప్తించునని హిందువుల నమ్మకం. అందుచేతనే వేలకొలది భక్తులు అక్కడికి వెళ్లి స్నానం చేయుదురు.

ఒకసారి దాసగణు అచ్చటికి పోయి స్నానమాచరించదలంచెను. బాబా వద్దకు వెళ్ళి అనుమతిని కోరెను. అంతట బాబా అతనితో యిట్లనెను - "అంత దూరం వెళ్ళవలసిన పనిలేదు. మన ప్రయాగ ఇచ్చటనే కలదు. నా మాటలను నమ్ముము" ఇట్లు చెప్పినంతలో ఒక అద్భుతం జరిగింది. దాసగణు మహారాజు బాబా పాదములపై శిరస్సును వుంచిన వెంటనే బాబా రెండు పాదముల బొటనవ్రేళ్ళ నుండి గంగా యమునా జలములు కాలువలుగా పారెను. ఈ చమత్కారం చూచిన దాసగణు భక్తి ప్రేమలతో మైమరచి కంట తడిపెట్టుకొనెను. అతడు బాబా లీలను వర్ణిస్తూ పాట పాడెను.

సంస్కృత పరిజ్ఞానం

ఒకరోజు నానాసాహెబు చాందోర్కరు బాబా పాదములను ఒత్తుచూ నోటిలో ఏదో గొణుగుచుండెను. బాబా నానాను ఏమి గొణుగుచున్నావని ప్రశ్నించిరి. అంతట నానా, "బాబా! అది సంస్కృతశ్లోకం. నీకు తెలియదులే!" అని చెప్పెను.

బాబా నానాతో యిట్లనిరి - "నీవు నీకు తెలియని విషయాలను నన్నడిగి తెలుసుకొనుచున్నావు కదా! మరి నీకు తెలిసిన విషయాలను నేనడిగి తెలుసు కొనుటలో తప్పేముంది? కనుక ఆ శ్లోకం, దాని భావం చెప్పము"

అంతట నానాసాహెబు ఈ శ్లోకం చెప్పెను -

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే ఽ జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః ॥

దాని తాత్పర్యమును తెలుపుతూ నానా యిట్లు చెప్పెను - "గురువునకు సాష్టాంగ నమస్కారమూ, సేవ చేసి ప్రశ్నించు. అప్పుడు బ్రహ్మజ్ఞానులు నీకు జ్ఞానమును ఉపదేశించెదరు".

ఈ తాత్పర్యంతో బాబా సంతృప్తి చెందలేదు. బాబా, నానాల మధ్య సుదీర్ఘమైన చర్చ జరిగెను.

బాబా : ప్రణిపాత అనగానేమి?

నానా : ప్రణిపాత అనగా సాష్టాంగ నమస్కారమని నాకు తెలియును.

బాబా : జ్ఞానుల ముందు ఉత్త సాష్టాంగం చేసినచో సరిపోదు. మనం సద్గురువునకు సర్వస్వ శరణాగతి చేయవలెను. ఇక పరిప్రశ్న అనగానేమి?

నానా : ప్రశ్నలడుగుట.

బాబా : ప్రశ్న అనగానేమి?

నానా : ప్రశ్నించుట.

బాబా : ప్రశ్నయన్నను, పరిప్రశ్న యన్నను ఒకటే అర్థమైనచో వ్యాసుడు 'పరి' యను ప్రత్యయమును 'ప్రశ్న'కు ముందేల చేర్చెదరు?

నానా : 'పరిప్రశ్న' అను మాటలకు అర్థం నాకు తెలియదు.

బాబా : ప్రశ్నించుట దుర్బుద్ధితోగాని, దొంగ ఎత్తుతోగాని, బుట్టలో వేసుకొనుటకు గాని, తప్పలు పట్టుటకు గాని, పనికిమాలిన ఆసక్తితోగాని జరగవచ్చు. సద్గురువులను ఆ విధమైన భావనతో ప్రశ్నించరాదు. వారిని నిజముగా తెలుసుకొనవలెననెడి భావనతో మోక్షం పొందుటకు లేదా ఆధ్యాత్మికవృద్ధికి గాను అడుగవలెను. అందుకే వ్యాసుడు 'ప్రశ్న' అను శబ్దమునకు ముందు 'పరి' అను ప్రత్యయం చేర్చినాడు. ఇక 'సేవ' అనగానేమి?

నానా : ప్రతిరోజు మేము చేయునట్టిది.

బాబా : గురువునకు అట్టిసేవ చేసిన చాలదు. ఇష్టమున్నచోచేయుట, లేనిచో మానుట గురువునకు చేయుసేవ అనిపించుకోదు. శరీరమునకు యజమాని తాను కాననియు, శరీరం గురువుగారిదే ననియు తలంచి గురువునకు సేవ చేయవలెను. ఇక రెండవ పంక్తిలోని 'ఉపదేక్ష్యంతి తే ఽజ్ఞానం' అను దానిలో జ్ఞానమను పదమును ఉపయోగించుటకు బదులు మరొక పదమును ఉపయోగించవచ్చా?

నానా : 'అజ్ఞానము' అను పదమును ఉపయోగించవచ్చు. కాని అప్పుడు ఆ శ్లోకమునకు అర్థముండదేమో!

బాబా : జ్ఞానమూర్తియైన జీవునకు జ్ఞానోపదేశం చేయవలసిన పనిలేదు. ఉపదేశ మనునది వాని తప్పను చూపి వాని అజ్ఞానమును నశింపజేయుట కొరకే. కనుక ఇక్కడ అజ్ఞానము అని చెప్పకోవటమే బాగుంటుంది.

కాలులో గ్రుచ్చుకున్న ముల్లును మరో ముల్లుతో తీసినట్లు, పాత్రకు పట్టిన మసిని మట్టితో రుద్ది పోగొట్టినట్లు, గురువు తన బోధయనే సాత్వికమైన అజ్ఞానముతో శిష్యుని అజ్ఞానమును తొలగిస్తాడు. అప్పుడు శిష్యునిలో దాగివున్న జ్ఞానము శిష్యునికే అనుభవమవుతుంది. కనుక గురువు వాచా బోధించేది కూడా అజ్ఞానమే.

శ్రీకృష్ణుడు తత్త్వదర్శి, జ్ఞానమూర్తి కదా! మరి అతడు అర్జుననేల ఇతర జ్ఞానులను ఆశ్రయించమని చెప్పాడు?

నానా : నాకు తోచుట లేదు.

బాబా : భక్తుడు ఏ గురువునైనా శ్రీకృష్ణునిగనే భావించును. ఏ గురువైనా శిష్యుని తన ఆత్మగనే తలంచును. అట్టి గురువులు, అట్టి శిష్యులు ఇంకను చాలమంది గలరు. కనుక వారిని గూర్చి శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను. దీనివల్ల వారి గొప్పతనం అందరికీ తెలిసే అవకాశం ఏర్పడునని శ్రీకృష్ణుని భావన.

బాబా ఆ శ్లోకమునకు గల అర్థమును ఇంత విపులంగా ఎరుకపరచిరి. అంతట బాబాకు సంస్కృతం తెలియదనియు, తనకు సంస్కృతం బాగా తెలుసునని తలంచిన నానాసాహెబు గర్వం అణగిపోయెను. అతడు సిగ్గుతో తల దించుకొనెను.

బాబా వివరణను బట్టి మనకు ఈ క్రింది విషయాలు తెలియును -

1. జ్ఞానులకు ఉత్త సాష్టాంగ నమస్కారం చేసినచో సరిపోదు. వారికి సర్వస్వ శరణాగతి చేయవలెను. శరణాగతి అనగా శరీరం, మనస్సు, ఐశ్వర్యం అర్పించుట.
2. ఈ శరీరం తనది కాదనియు, గురువు సేవ కొరకే యీ శరీర మున్నదని తలంచుచూ గురువు సేవ చేయవలెను.
3. అజ్ఞానమును నశింపజేసిన ఆత్మసాక్షాత్కారమునకు దోహద పడును.

సర్వస్వ శరణాగతి మాత్రమే గురువును పొందుటకు ఏకైక మార్గమని తెలిపిన సాయినాథ సద్గురువునకు పాదాభివందనములు.

సర్వం శ్రీ సాయిరామార్పణమస్తు

రెండవరోజు (శుక్రవారం) పారాయణ

ఆత్మ స్వరూపులారా! తొలుత మహిమాన్వితుడైన శ్రీ సాయిబాబాకు ఆత్మ ప్రదక్షిణ చేసి వారి జీవిత చరిత్ర పారాయణకు ఉపక్రమించుదాం. ఓం శ్రీ సాయిరామ్.

సాయిబాబా వల్ల షిర్డీకి ప్రాముఖ్యం

సాయిబాబా జ్ఞానమూర్తులు, భక్తులకు నిలయం వంటివారు. ఉదార స్వభావులు. సారమునకే సారం. నశించు వస్తువులందు అభిమానం లేనివారు. ఎల్లప్పడు ఆత్మసాక్షాత్కారమందు లీనమై యుండేవారు. ఇహ పరలోకములకు సంబంధించిన ఎట్టి వస్తువుపట్ల అభిమానం కలిగియుండెడి వారు కాదు. వారి అంతరంగం అద్దంవలె స్వచ్ఛంగా ఉండెను. వారు అమృత వాక్కులను పలికెడి వారు. ధనవంతులను, బీదలను అందరినీ ఒకే దృష్టితో చూసెడివారు. మానావమానములను సమంగా భావించెడివారు. వారు అందరికీ ప్రభువు. అయిన ప్పటికీ వారు అందరితో కలిసి మెలసి యుండెడివారు. పిల్లలతో ఆడుకొనెడి వారు. పాటలు పాడేవారు. పాటలు వినేవారు. కాని సమాధి స్థితి నుండి మరలేవారు కాదు. ఎల్లప్పడు అల్లానామమునే ఉచ్చరించేవారు. ప్రజలు మేల్కొన్నప్పడు వారు యోగ నిద్రలో ఉండేవారు. ప్రజలు నిద్రించినప్పడు వారు మెలకువతో ఉండెడివారు. వారి అంతరంగం లోతయిన సముద్రంవలె ప్రశాంతం. వారి చర్యలు ఇతరులకు సులభంగా అర్థమయ్యేవి కావు. ఒకచోటనే కూర్చొన్నప్పటికీ ప్రపంచమున జరుగు అన్ని సంగతులను ఎప్పటికప్పటికి తెలుసుకొనేవారు.

బాబా దర్బారు ఘనమైనది. నిత్యం అనేక కథలు చెప్పినప్పటికీ మౌనం తప్పేవారు కాదు. మసీదు గోడకు ఆనుకొని నిల్చొనుట కాని, లెండీతోట లేక చావడికి వెళ్లటం కాని చేసేవారు. ఎల్లప్పడు ఆత్మధ్యానం నందే మునిగి యుండెడివారు. సిద్ధపురుషుడైనప్పటికీ సాధకునివలె నటించువారు. అణకువ, నమ్రత కలిగి, నిరహం కారులై అందరినీ ఆనందింపజేసేవారు.

ఇలాంటి బాబా పాదస్పర్శచే షిర్డీ నేల గొప్ప ప్రాముఖ్యం పొందింది. జ్ఞానేశ్వర మహారాజు ఆళందిని వృద్ధిచేసినట్లు, ఏకనాథుడు పైఠనును వృద్ధిచేసినట్లు సాయి బాబా షిర్డీని అభివృద్ధి చేసిరి.

ఆకలిబాధతో నిన్ను ఆశ్రయించిన ప్రతి జీవి అతిథే. అతనిని తృప్తి పరచుము

షిర్డీలోని గడ్డి, రాళ్ళు ఎంతో పుణ్యం చేసుకొన్నవి. బాబా పవిత్ర పాదాలను ముద్దుపెట్టుకొని వారి పాదధూళిని తమ తలపై వేసుకొనగలిగినవి. షిర్డీ భక్తులకు పండరీపురం, జగన్నాథం, ద్వారక, కాశి, రామేశ్వరం వంటి పవిత్ర తీర్థ స్థానమైనది. భక్తులకు సాయిబాబా స్పర్శయే వేదమంత్రం. అది భక్తులను సంసార బంధనముల నుండి విముక్తి గావించి ఆత్మసాక్షాత్కారమును సులభ సాధ్యం చేయుచుండెను. శ్రీసాయి దర్శనం భక్తులకు యోగసాధనంగా ఉండెను. వారితో సంభాషణ భక్తుల పాపములను తొలగించుచుండెను. వారి పాదసేవ వలన భక్తులు త్రివేణి ప్రయాగల స్నానఫలం పొందుచుండిరి. వారి పాదోదకం భక్తుల కోరికలను నశింపజేసెడిది. వారి ఆజ్ఞ భక్తులకు వేదవాక్కుగా ఉండెడిది. వారి ఊదీ ప్రసాదం భక్తులను పావనం చేయుచుండెను.

బాబా భక్తుల బాధలకు శ్రీకృష్ణుడుగ, శ్రీరాముడుగ ఉపశమనం కలిగించు చుండెను. వారు భక్తులకు పరబ్రహ్మ స్వరూపం. వారు ద్వంద్వాతీతులు. వారు నిరుత్సాహం గాని, ఉల్లాసంగాని ఎరుగరు. వారు ఎల్లప్పుడు సచ్చిదానంద స్వరూపులుగా ఉండెడివారు. షిర్డీ కేంద్రమైనను, వారు తమ లీలలను పంజాబు, బెంగాల్, గుజరాత్, కర్నాటక మొ॥ రాష్ట్రాలలో చూపుచుండిరి. ఇట్లు వారి కీర్తి దూరదూర ప్రాంతాలకు వ్యాపించగా భక్తులు అన్ని ప్రాంతాల నుండి వచ్చి షిర్డీ చేరి బాబాను దర్శించి వారి ఆశీర్వాధమును పొందుచుండిరి. వారి దర్శనం మాత్రాన భక్తుల మనస్సులకు శాంతి లభించెడిది. పండరీపురమున విఠల్‌ని దర్శించినచో భక్తులెట్టి ఆనందానుభూతిని పొందుచుండిరో, అట్టి దానిని షిర్డీలో బాబా దర్శనం వల్ల పొందుచుండిరి.

సాయిబాబా శుద్ధానంద చైతన్యమూర్తులు. ఎవరు వారి పాదములను నమ్ముదురో వారికి ఆత్మాను సంధానం కలుగును. అనేక సన్యాసులు, సాధకులు వారి వద్దకు వచ్చుచుండిరి. బాబా వారితో నడచుచూ, నవ్వుతూ పలుకరించు చుండిరి. అప్పుడప్పుడు కోపగించుకొన్నప్పటికీ ఎల్లప్పుడూ నెమ్మదిగా ఉండెడి వారు. వారు సదా తన శరీరమును స్వాధీనములో ఉంచుకొనెడివారు. ఎల్లప్పుడూ వేదాంతమును బోధించుచుండిరి. వారు రాజులను, భిక్షకులను ఒకే రీతిగ ఆదరించు చుండిరి. వారందరి అంతరంగములలోని రహస్యములు తెలుసుకొను

చుండిరి. ఆ రహస్యములను వెలిబుచ్చగనే అందరు ఆశ్చర్యమగ్నులగుచుండిరి. వారు సర్వజ్ఞులు, కాని ఏమీ తెలియని వారి వలె నుండెడివారు. సన్మానములన్నచో వారికిష్టముండెడిది కాదు. మానవ శరీరముతో నున్నప్పటికీ వారు చేయు పనులను చూసినవారు వారిని సాక్షాత్తు భగవంతుడని చెప్పచుండిరి. వారిని షిర్డీలో వెలసిన భగవంతుడని తలంచుచుండిరి.

సాయిబాబా ఇంద్రియ విషయములను అనుభవించువాని వలె పైకి కనిపించినను, వారికి వానియందేమాత్రం అభిరుచి ఉండెడిది కాదు. అనుభవించు స్పృహయే వారికి లేకుండెను. వారు భుజించునప్పటికీ వారికి దేనియందు రుచి ఉండెడిది కాదు. చూచుచున్నట్లు కనిపించినను, వారికి చూచుదాని యందు శ్రద్ధ లేకుండెను. కామమన్నచో వారు అస్కలిత బ్రహ్మచారులు. వారికి దేనియందు మమకారం లేకుండెను. వారిలో కోరిక లేశమాత్రమైనను ఉండెడిది కాదు. వారు స్వతంత్రులు; పరిపూర్ణులు.

బాబాను భగవానుని వలె పూజించిన షిర్డీ ప్రజలు పుణ్యాత్ములు, తినుచు, త్రాగుచు తమ దొడ్లలోను, పొలములలోను పనిచేసుకొనుచు వారు ఎల్లప్పుడు సాయిని జ్ఞప్తి యందుంచుకొని సాయి మహిమను కీర్తించుచుండిరి. సాయి తప్ప ఇంకొక దైవమును వారెరిగి యుండలేదు.

సంగీత పరిజ్ఞానం లేకపోయినను స్త్రీలు తమకు తెలిసిన విధంగా బాబా పాటలను పాడెడివారు. వాటిలో స్వచ్ఛమైన ప్రేమ ద్యోతకమగును. ఆ జానపదుల పాటలు నిజంగా వినసొంపుగా నుండును.

దానధర్మం నేర్ప దక్షిణ కోరే రూపం

తొలి రోజులలో బాబా ఎవరినీ ఏమీ అడిగేవారు కాదు. కాలిన అగ్గి పుల్లలను జేబులో వేసుకొని జాగ్రత్త చేయువారు. ఎవరైనా ఒకటి లేక రెండు కానులు* ఇచ్చినచో నూనె, పొగాకు కొనేవారు. బీడీగాని చిలిముగాని పీల్చేవారు.

బాబాకీర్తి నలు దిశలా వ్యాపించిన తర్వాత అనేకమంది బాబా దర్శనమునకై గుంపులు గుంపులుగా రాసాగిరి. అప్పడు ఆయన వారిని దక్షిణ అడుగసాగిరి.

★ ఒకప్పుడు వాడుకలో నున్న నాణెములు.

అందరిని దక్షిణ అడిగేవారు కాదు. కొంత మందినే అడిగేవారు. అలా దక్షిణ అడిగిన వారిలో ధనికులు, బీదలు, స్త్రీలు, పిల్లలు ఉండెడివారు.

కొంతమంది తమంతట తాముగా బాబాకు దక్షిణ సమర్పించుచుండిరి. బాబా కొంతమంది ఇచ్చిన దక్షిణను తీసుకొనుచుండిరి. మరి కొందరి దక్షిణను తీసుకొనుటకు నిరాకరించుచుండిరి. కొద్దిమంది భక్తులు ఇచ్చిన దక్షిణ నుంచి బాబా కొన్ని రూపాయలు వారికి తిరిగి ఇచ్చి పూజలో పెట్టుకొనుమను వారు. దీని వలన భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుచుండెను.

భక్తులిచ్చిన దక్షిణలో వారనుకొన్న దానిని మాత్రమే తీసుకొని మిగిలిన దానిని బాబా వారికి వాపసు చేయుచుండిరి. బాబా ఒక్కొక్కసారి భక్తులిచ్చిన దానికంటె ఎక్కువ యిమ్మని కోరెడి వారు. వారు తమ వద్ద లేదన్నచో ఎవరివద్ద నైనా బదులు తీసుకొని తనకు ఇవ్వమనెడివారు. కొందరి వద్ద నుంచి ఒకే రోజు మూడు, నాలుగు సార్లు కూడ దక్షిణ అడుగుచుండిరి. ఎవరైనా అడిగినా దక్షిణ యివ్వనిచో బాబా వారిపై కోపగించుకొనెడివారు కాదు. కొంతమంది యితరులకు డబ్బు లేదా యితర వస్తువులిచ్చి వాటిని బాబాకు అందజేయమనెడి వారు. వారిలో కొద్దిమంది ఆ విషయమును మరచిపోయెడివారు. బాబా ఆ విషయమును వారికి గుర్తు చేయుచుండిరి.

దక్షిణ రూపముగా వసూలైన పైకం నుంచి బాబా కొంత చిలిమునకు, కొంత ధునికి ఖర్చు పెట్టుచుండిరి. ఒక్కొక్కసారి మామిడిపండ్లను, కొన్ని ఫలహార వస్తువులను కొని మసీదులో నున్న వారందరికీ పంచి పెట్టుచుండిరి.

బాబా మామిడిపండును చిత్రముగా అన్ని వైపుల నొక్కి భక్తులకు ఇచ్చెడి వారు. దానిని తినువారు నోట పెట్టుకొని చప్పరించగానే రసమంతయు నోటి లోనికి పోయి తొక్క, టెంక వెంటనే పారవేయుటకు వీలగుచుండెను. అరటి పండ్లను ఒలిచి గుజ్జును భక్తులకు పంచిపెట్టి, తొక్కను బాబా ఉంచుకొనెడి వారు.

బాబా దక్షిణలో నుండి ఖర్చుపెట్టగా మిగిలినదంతయు ఆనాడే బీదలకు దానం చేయుచుండిరి. ఒక రూపాయ మొదలు యాభై రూపాయల వరకు బీదలకు ఇచ్చెడివారు. ఆ మరుసటి ఉదయమునకు వారు మామూలు పేద ఫకీరగుచుండిరి. 10 సంవత్సరముల కాలములో వేలాది రూపాయలను దక్షిణ

రూపముగా పుచ్చుకొన్నను మహా సమాధి పొందునాటికి బాబా వద్ద యేడు రూపాయలు మాత్రమే ఉండెను. భక్తులకు దానమును, త్యాగమును గురించి నేర్పుట కొరకే దక్షిణ పుచ్చుకొనెడివారు.

ఒకసారి బాబా దక్షిణ విషయమై ఇలా చెప్పారు - "నేను ఎవరి నుండైనా ఒక్క రూపాయ దక్షిణ తీసుకుంటే దానికి పదిరెట్లు తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. నేను ఎప్పుడూ ఏదీ ఊరకనే తీసుకోను. ఆ ఫకీరు (భగవంతుడు) చూపిన వారి నుండే స్వీకరిస్తారు. వాళ్ళు దక్షిణ రూపములో పుణ్యం నాటి, తర్వాత సమృద్ధిగా ఫలితాన్ని పొందుతారు. సిరి సంపదలు ధర్మాన్ని సాధించటం కోసమే. కేవలం సుఖాల కోసం వెచ్చిస్తే అది వ్యర్థమే. ఇంతవరకు ధర్మం చేసి వుంటేనే ఇప్పుడు సంపద పొందుతావు. అదియూ భగవంతుడిచ్చినదే. దానిని భగవంతునికే సమర్పించటం వల్ల భక్తి, జ్ఞానాలు వృద్ధిపొందుతాయి. నేను మాత్రం చేసేదేమిటి? ఒకటి స్వీకరించి పదిరెట్లు ఇస్తున్నాను."

1917వ సం॥న అప్పాసాహెబు కులకర్ణి ఠాణాకు బదిలీ అయ్యెను. బాలా సాహెబు బేడీ అతనికి బాబా ఫోటోనిచ్చెను. కులకర్ణి ఆ ఫోటోను ఎంతో భక్తితో పూజించుచుండెను. అతడు షిర్డీకి వెళ్ళి బాబాను చూడవలెనని మిగుల కాంక్షించు చుండెను.

ఒకసారి కులకర్ణి భివండి పర్యటనకు వెళ్ళెను. అతడు వెళ్ళిన మూడవ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఒక ఫకీరు అతనింటికి వచ్చెను. అతడు షిర్డీ సాయి బాబాను పోలియుండెను. కులకర్ణి భార్యాబిడ్డలు, "మీరు షిర్డీ సాయిబాబాయా!" అని అతనిని అడిగిరి. అంతట ఆ ఫకీరు, 'లేదు, నేను భగవంతుని సేవకుడను. వారి ఆజ్ఞానుసారం మీ యోగ క్షేమాలను విచారించుటకు వచ్చినాను" అని చెప్పెను. ఫకీరు ఊదీనిచ్చి పూజలో ఫోటోవద్ద ఉంచుకొని పూజించమని చెప్పి వెళ్ళి పోయెను.

ఆనాటి సాయంకాలమే కులకర్ణి యిల్లు చేరెను. భార్య ద్వారా ఫకీరు సంగతి తెలుసుకొనెను. తానుండిన ఫకీరుకు పది రూపాయల దక్షిణను యిచ్చి యుండెడి వాడను కదా! అని మనసున తలంచెను. భోజనం చేయకనే ఫకీరుకై వెదికెను. కాని అతనికి ఫకీరు కనిపించలేదు. భోజనమైన తర్వాత అతడు తన మిత్రుడగు

చిత్రేతో కలిసి వాహ్యాళికి బయలుదేరెను. ఇంతలో మధ్యాహ్నం తన ఇంటికి వచ్చిన ఫకీరు అతని వద్దకు వచ్చి చేయిచాచెను. కులకర్ణి ఫకీరుకు రెండు రూపాయ లిచ్చెను. ఫకీరు సంతుష్టి చెందలేదు. అంతట కులకర్ణి చిత్రే వద్ద మూడు రూపాయలు తీసుకొని ఫకీరుకిచ్చెను. ఫకీరింకను దక్షిణ కావలెననెను. కులకర్ణి ఫకీరును యింటికి ఆహ్వానించెను. ఫకీరు కులకర్ణి ఇంటికి వెళ్లెను. కులకర్ణి ఫకీరుకు మూడు రూపాయలిచ్చెను. ఫకీరుకు మొత్తం తొమ్మిది రూపాయలు (1+ 2 + 3 + 3 = 9) ముట్టెను. అయిననూ ఇంకా దక్షిణ కావలెననెను. కులకర్ణి తన వద్ద 10 రూపాయల నోటు కలదనెను. ఫకీరు ఆ నోటును తీసుకొని 9 రూపాయలు వాపసు చేసెను.

ఈ విధంగా ఫకీరు కులకర్ణి నుండి మనసులో ఇస్తానన్న 10 రూపాయల దక్షిణను వసూలు చేసెను. ఫకీరు వాపసు చేసిన 9 రూపాయలు నవవిధ భక్తిని సూచించును. అప్పటి నుండి కులకర్ణి ఆదాయం బాగా పెరిగెను.

★ ★ ★

గణపతిరావు బోడస్ అను ఒక గొప్ప నటుడుండెను. బాబా మాటిమాటికి అతనిని దక్షిణ అడుగుచుండిరి. అంతట అతడు డబ్బు సంచిని బాబా ముందర కుమ్మరించెను. అప్పటి నుండి అతనికి ధనం లోటు లేకుండెను. ఎల్లప్పడు అతనికి కావలసినంత ధనం లభించుచుండెను.

ఒకసారి బాబా ప్రొఫెసర్ జి.జి. నార్కేను 15 రూపాయలు దక్షిణ ఇమ్మని అడిగిరి. అతడు తన వద్ద దమ్మిడీ అయినా లేదనెను. అంతట బాబా అతనితో ఇట్లు చెప్పిరి - "నీ వద్ద ధనం లేదని నాకు తెలుసు. నీవు యోగవాసిష్ఠమును చదువు చున్నావు కదా! దాని నుండి దక్షిణ యిమ్ము" ఈ సందర్భంలో దక్షిణ అనగా నేర్చు కొన్న విషయమును జాగ్రత్తగా హృదయములో దాచుకొనుట అని బాబా ఉద్దేశ్యం.

★ ★ ★

ఒకనాడు బాబా తార్ఖాడ్ భార్యను ఆరు రూపాయలు దక్షిణగా యిమ్మని కోరిరి. డబ్బు లేకపోవుటచే ఆమె చాల బాధపడెను. అప్పడు తార్ఖాడ్ తన భార్యకు ఈ విధంగా నచ్చచెప్పెను - "ఆరు రూపాయలనగా అరిషడ్వర్గములని అర్థం. కనుక నీ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను బాబాకు సమర్పించుము"

బాబా కోరే పైకం ఆధ్యాత్మిక సత్యాలను సూచించేదిగా ఉండేది. రఘువీర పురందరేను బాబా ఎప్పడూ రెండు రూపాయలు మాత్రమే దక్షిణ కోరేవారు. అతడొక సారి కారణం అడిగాడు - "నాకు కావలసింది కాసులు కావు; నిష్ఠ - సబూరీ (సహనం) అన్నారు సాయి. "బాబా, నేను ఆ రెండూ ఎప్పడో సమర్పించానే" అన్నాడతను. అప్పడు బాబా అతనితో యిలా చెప్పారు - "నీవు వాటిని సమర్పించ లేదు. నీ భక్తిలో స్థిరత్వం లేదు. నీవు నన్ను దృఢంగా అట్టిపెట్టుకొని వుంటే నేను నీ వెంటే వుంటాను"

★ ★ ★

ఒకప్పడు దీక్షిత్ ఒక వేదాంత గ్రంథం చదువుచుండెను. అందులో బ్రహ్మమే సత్యమని, నామ రూపాలతో గోచరించే జగత్తు 'మిథ్య' అని చెప్పబడియుండెను. బ్రహ్మం సత్యమైతే, దాని రూపమైన జగత్తు మిథ్య ఎలా అవుతుందో, అర్థంగాక, అతడు సాయిని ప్రార్థించుచుండగా అప్పడే అతనికి రు. 100/-లు దక్షిణ పంపమని సాయి కబురుచేసారు. వెంటనే అతనికి ఇలా స్ఫురించింది - 'వేదాంతం ఈ జగత్తు లేదనదు; జగత్తనే నామరూపాలు నశిస్తాయని, వాటికి ఆధారమైనది నిత్య మనీ చెబుతుంది. బాబా కోరిన రూ.100లో '1' లేకపోతే సున్నలకు ఉనికి లేనట్లే,' నిత్యమైన సద్వస్తువునకు అన్యమైన రూపాలుండవని అతడు తెలుసుకొన్నాడు, '1' నిత్య వస్తువును, సున్నాలు జగత్తును సూచిస్తాయి.

★ ★ ★

ఒక భక్తుడు దక్షిణ ఇవ్వాలని రు. 2/-లు వేరుగా జేబులో పెట్టు కొన్నాడు. కాని అతడు బాబాకు రు. 1/- మాత్రమే ఇచ్చాడు. సాయి నవ్వుతూ అన్నారు - "ఎంత మోసం? ఈ ఫకీరుకని మొదటి రెండు రూపాయలు జేబులో పెట్టుకొని గూడ ఒక్క రూపాయ మాత్రమే ఇచ్చావు" అతడు ఆశ్చర్యపోయాడు.

★ ★ ★

సాయి పవిత్రుల వద్ద మాత్రమే దక్షిణ స్వీకరించేవారు. ఒకడు ఉంపుడు గత్తెను ఉంచుకొని, సుఖరోగాలతో బాధపడేవాడు. అతడు షిర్డీ చేరి బాబాకు రు.50/- లు ఇవ్వబోయాడు. సాయి కోపంతో, "నీ డబ్బునాకొద్దు. నీవు ఉంచుకొన్న దానికి ఈ డబ్బివ్వు" అని అన్నాడు. అతడు సిగ్గుతో తలవంచుకొని వెళ్ళిపోయాడు.

★ ★ ★

సాయి కోరే దక్షిణ ఒక్కొక్కప్పుడు భవిష్యత్తును నిగూఢంగా సూచించేది. దేవ్ ఐదు గదులతో భవనమును నిర్మించదలచి సాయిని దర్శించాడు. అప్పుడు బాబా నేలపై 25 గీతలు గీస్తూ "గీతకొక రూపాయి చొప్పున రు.25/-లు దక్షిణ ఇమ్ము" అన్నారు. అతడు దక్షిణ ఇచ్చాడు. ఆశ్చర్యమేమిటంటే అది 25 గదుల భవనమైంది.

★ ★ ★

బాబా భక్తులకు సలహాలిచ్చే విధానం చాలా విచిత్రంగా ఉండేది. వారు కొందరికి సూటిగాను, మరి కొందరికి ప్రతీకాత్మకంగాను, ఇంకొందరికి పరోక్షం గాను తెలిపేవారు. వారి సలహాలు భక్తుల అభివృద్ధికి తోడ్పడేవి. వారి మాటలు భక్తుల హృదయాల్లో నాటుకొనేవి.

భక్తుల నుండి దక్షిణ తీసుకొని, వారి పాపములను, దోషములను, తప్పలను పరిహరించి వారికి అనంత ఐశ్వర్యాన్ని సమకూర్చే దేవదేవా! నీకు వందనములు.

ద్వారకామాయిని వెలసిన దైవం

బాబా మసీదునకు ద్వారకామాయి అని పేరు పెట్టారు. మత సామరస్యానికి గాను మసీదునకు బాబా చక్కని పేరు పెట్టారు. ద్వారకామాయి అంటే మత భేదం లేకుండా అందరి చతుర్విధ పురుషార్థాలకు ద్వారాలు తెరచి వుండేదని స్కాంద పురాణంలో చెప్పబడింది.

బాబా మసీదులో హిందువులకు ముఖ్యమైన హోమగుండం (ధుని)ను ఆగ్నేయ దిక్కున ప్రారంభించారు. మసీదులో తులసీకోట కూడా ప్రతిష్ఠింపబడింది.

ధుని

బాబా ధుని వైపు తదేకంగా చూసేవారు. ధునిలో రాత్రి - పగలు అగ్ని ప్రజ్వరిల్లు చుండెను. నేటికి ధుని అట్లే యున్నది.

ధుని పాపాలను దహించునదియే గాక, తినిన ఆహారమును జీర్ణము చేసి శరీరమును నిలబెట్టు వైశ్వానరుని రూపమే.

ఆహారములు నాలుగు రకములు :

1. ఖనిజ సంబంధ అన్నం (Mineral Food) ఉదా : పప్పు.
2. వృక్ష సంబంధమైనది (Plant Food) ఉదా : కూరలు, పండ్లు.
3. జంతు సంబంధమైనది (Animal Food) ఉదా : పాలు, గ్రుడ్లు, మాంసం.
4. మానవ సంబంధమైనది (Human or bio-chemical Food) ఉదా : శరీరమున తయారగు జీవరసాయనాలు.

ఈ నాలుగు రకముల ఆహారమును జీర్ణం చేసి శరీరమును నిలబెట్టువాడు వైశ్వానరుడు. ఈ విషయమును మనకు తెలుపుటకే బాబా 'ధుని' అను వైశ్వానరుని నిరంతరం ఆరాధించువారు.

ఈ సందర్భమున భగవద్గీతలో చెప్పబడిన ఈ శ్లోకమును మననం చేసుకొనుట మరవరాదు.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 5 - 14

జెండా ఉత్సవం

కోపర్‌గావ్‌లో గోపాలరావు గుండు అనునతడు పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరుగా నుండెను. అతడు బాబాకు గొప్పభక్తుడు. అతనికి ముగ్గురు భార్యలున్నప్పటికీ సంతానం కలుగలేదు. సాయి ఆశీర్వాదంచే అతనికి ఒక కొడుకు పుట్టెను. దానికి సంతసించి అతడు 1897లో షిర్డీలో ఒక ఉత్సవమును చేయదలచెను. బాబా దానిని శ్రీరామనవమినాడు చేయమని సలహా ఇచ్చిరి.

ఉత్సవమును జరుపుటకు ప్రభుత్వ అనుమతిని పొందిరి. షిర్డీలో నీటి ఇబ్బంది ఎక్కువగా ఉండెడిది. గ్రామ మంతటికీ రెండు బావులు మాత్రమే ఉండేవి. ఒకటి ఎండాకాలంలో ఎండిపోవుచుండెను. రెండవదానిలో ఉప్పనీళ్ళు ఉండేవి. బాబా ఉప్పనీటి బావిలో పువ్వులు వేసి మంచినీళ్ల బావిగా మార్చిరి. రెండు బావుల నీరు చాలకపోవుటచే తాత్యాపాటీలు దూరం నుండి మోటుల ద్వారా నీరు తెప్పించెను. తాత్కాలికంగా అంగళ్ళు వేసిరి. కుస్తీల పోటీలు ఏర్పాటు చేసిరి.

గోపాలరావు గుండునకు ఒక స్నేహితుడుండెను. అతనిపేరు దాము అన్న కేసర్. అతనిది అహమ్మదు నగర్. అతనికి ఇద్దరు భార్యలున్నను సంతానం లేకుండెను. అతనికి బాబా ఆశీర్వాదంచే పుత్ర సంతానం కలిగెను. అప్పుడు గోపాల రావు అతనిని ఉత్సవం కొరకు ఒక జెండా తయారు చేయించమని కోరగా అతడు సమ్మతించెను. తర్వాత గోపాలరావు నానాసాహెబ్ నిమోన్‌కర్‌ను కోరగా అతడు ఒక నగిషీ జెండా యిచ్చుటకు ఒప్పుకొనెను. ఈ రెండు జెండాలను గ్రామములో త్రిప్పి మసీదు రెండు మూలలందు నిలబెట్టిరి. ఈ పద్ధతిని ఇప్పటికీ అవలంభించు చున్నారు.

ఆగు, ఆగు

ఒకసారి భక్తులందరూ భోజనం చేస్తుండగా శిథిలమైన మసీదు కప్పు నుండి పెటపెటమని శబ్దమైంది. వెంటనే సాయి చేయి పైకెత్తి 'ఆగు, ఆగు' అన్నారు. ఆ శబ్దం ఆగిపోయింది. భోజనం చేసి అందరూ బయటికి రాగానే మసీదు కప్పు నుండి ఒక భాగం సరిగా వీరు కూర్చొన్న చోటనే విరిగి పడింది. బాబా ఆగమన్న దెవరినో అప్పుడు అందరికీ అర్థమై ఆశ్చర్యపోయారు.

మసీదు మరామతులు

జెండా ఉత్సవమును ప్రారంభించిన గుండుకు మరొక మంచి ఆలోచన తట్టెను. అతడు మసీదును తగిన విధంగా తీర్చి దిద్దవలెనని భావించెను. మరామతు పనులు బాబాకు ఇష్టంలేకుండెను. కాని భక్తుడగు మహాల్సాపతి కోరుటచే బాబా అనుమతినిచ్చెను. గోపాలరావు రాళ్లను తెప్పించెను. బాబా రాళ్లను చెక్కించు పనిని నానాసాహెబు చాందోర్కరుకు, రాళ్ళు తాపనచేయు పనిని కాకాసాహెబు దీక్షిత్‌కు అప్పజెప్పెను. వారు ఒక రాత్రిలో మసీదు నేలపై చక్కని రాళ్లను పరిపించిరి. అప్పటి నుండి బాబా గోనెగుడ్డపై కూర్చొండుట మాని చిన్నపరుపు మీద కూర్చొనసాగిరి.

1911 వ సం॥న వ్యయప్రయాసలకోర్చి సభామండపమును పూర్తి చేసిరి. మసీదుకు ముందున్న భాగం చాల చిన్నదగుటచే సౌకర్యముగా లేకుండెను. కాకా సాహెబు దీక్షిత్ దానిని విశాలపరచి పైకప్పు వేయదలచెను. ఎంతో డబ్బు పెట్టి ఇనుప స్తంభములు మొ॥వి తెప్పించి రాత్రికి రాత్రి పాతించిరి.

ఇంకనూ నన్ను నమ్మనిచో రాతి మందిరమున ఉంచుము. అప్పుడు ఒక్కడైనా నన్ను నమ్మును

మరునటి దినం ప్రాతఃకాలమున దీనిని చూచిన బాబా మిక్కిలి ఉగ్ర రూపమును దాల్చిరి. ఒకచేతితో ఇనుప స్తంభమును పెకిలించుచూ రెండవ చేతితో తాత్యాపాటీలు పీకను పట్టుకొనిరి. అతని తలపాగాను బలవంతంగా తీసి అగ్గిపుల్లతో నిప్పంటించి ఒక గోతిలో పారవైచిరి. ఇది చూసిన వారందరూ భయకంపితులైరి. బాబా తన జేబులో నుండి ఒక రూపాయ తీసి బయటకు పారవేసిరి. ఇది శుభ సమయమందు చేయు ఆహుతి కాబోలునని అందరూ తలంచిరి.

తాత్యాకేమి జరుగుచున్నదో ఎవ్వరికీ తెలియలేదు. తాత్యా కూడ చాలా భయపడెను. దీనిలో కలుగజేసుకొనుటకు ఎవ్వరికీ ధైర్యం చాలలేదు. కుష్ఠు రోగియు, బాబా భక్తుడు అయిన భాగోజీ షిందియా కొంచెం ముందుకు పోగా బాబా అతనిని ప్రక్కకు త్రోసిరి. మాధవరావు ప్రయత్నించగా అతనిపై బాబా ఒక ఇటుకరాయి రువ్విరి. జోక్యం చేసుకొన్న వారందరికీ ఇదే గతి పట్టెను. కొంత సేపటికి బాబా శాంతించిరి. వారు ఒక వ్యాపారస్థుని నుండి ఒక జరీ తలపాగాను తెప్పించి స్వయంగా తాత్యా తలకు చుట్టిరి. తాత్యాను ప్రత్యేకంగా గౌరవించుటకు బాబా ఇట్లు చేసి వుండవచ్చును. ఈ వైఖరిని చూసిన వారందరూ ఆశ్చర్యచకితులైరి.

చందనోత్సవం

కొరాహ్లే గ్రామమందు అమీరు షక్కర్ అను ఒక మహమ్మదీయ భక్తుడుండెను. అతడు చందనోత్సవమును ప్రారంభించెను. ఈ ఉత్సవమును గొప్ప మహమ్మదీయ ఫకీరుల గౌరవార్థం చేయుదురు.

చందనపు ముద్ద నుంచిన వెడల్పాటి పళ్ళెమును తలపై పెట్టుకొని, సాంబ్రాణి ధూపములతో, బాజా భజంత్రీలతో ఉత్సవం జరుపుచుండిరి. ఉత్సవం ఊరేగిన పిమ్మట మసీదుకు వచ్చి మసీదు గూటిలోను, గోడలపైనను ఆ చందనమును అందరూ చేతితో తట్టెదరు.

అమీరు షక్కరు మూడు సంవత్సరములు, ఆ తర్వాత అతని భార్య ఆ ఉత్సవమును నిర్వహించెను. ఒకే దినమందు పగలు హిందువులచే జెండా ఉత్సవం, రాత్రి మహమ్మదీయులచే చందనోత్సవం ఏ కొట్లాటలు లేక జరుగుచున్నవి.

జెండా ఉత్సవం శ్రీరామ నవమి, కాలాహండీ ఉత్సవములుగా మారుట

1897 వ సం॥ నుండి, 1911వ సం॥ వరకు జెండా ఉత్సవం, చందనోత్సవం వైభవంగా జరిగినవి. 1912వ సం॥న కొంత మార్పు వచ్చింది. ఆ సం॥న జెండా ఉత్సవం తిలకించుటకు షిర్డీ వచ్చిన కృష్ణారావు జోగేశ్వర భీష్మకు ఒక క్రొత్త ఆలోచన వచ్చింది. అతను కాకా మహాజనితో ఇలా చెప్పెను - "జెండా ఉత్సవమును శ్రీరామ నవమినాడు జరుపుకొనుటలో భగవంతుని సంకల్పం ఏదో ఉండును. హిందువు లందరూ శ్రీరామ జయంతిని ఎంతో వైభవంగా జరుపు కొందురు. అలాంటప్పుడు మనం కూడ ఏల జరుపుకొనరాదు?" కృష్ణారావు ఆలోచన కాకా మహాజనికి కూడ నచ్చింది.

శ్రీరామ నవమి ఉత్సవమును జరుపుకొనుటకు హరికథకుడు, హార్మోనియం వాయించువాడునూ కావాలి. కృష్ణారావు తాను రచించిన రామాఖ్యానమును కీర్తన చేయుటకు, కాకా మహాజని హార్మోనియం వాయించుటకు సంసిద్ధతను వ్యక్తం చేసెను. రాధాకృష్ణ ఆయి సంత్‌వాడ (శొంఠి, పటికబెల్లం పొడి మిశ్రమం) ను చేసెదనని పలికెను. అంతట వారు ఆ ఉత్సవమును జరుపుటకు బాబా అనుమతిని పొందిరి.

శ్రీరామ జయంతిని జరుపుటకు అందరూ సంసిద్ధులైరి. ఆ మరుసటి దినమున మసీదును అలంకరించిరి. బాబా ఆసనమునకు ముందు ఊయెలను వ్రేలాడగట్టిరి. దానిని రాధాకృష్ణ ఆయి ఇచ్చెను. శ్రీరామ జన్మోత్సవం ప్రారంభమయ్యెను. కృష్ణారావు కీర్తన చెప్పటకు లేచెను. మహాజని హార్మోనియం వాయించు చుండెను. బాబా మహాజనిని పిలిపించి ఇదంతయు ఏమిటని ప్రశ్నించిరి. మహాజని శ్రీరామ నవమి మహోత్సవమును జరుపుకొనుచున్న సంగతిని తెలిపెను. అంతట బాబా నిర్గుణ స్వరూపగు 'నింబారు' (గూడు) నుండి ఒక పూలమాలను తీసి మహాజని మెడలో వేసిరి. మరొక దానిని కృష్ణారావుకు పంపిరి. హరికథ ప్రారంభమయ్యెను. కొంతసేపటికి కథ ముగిసెను. 'శ్రీరామ చంద్రమూర్తికి జై' అని, ఎర్ర గుండాను అందరిపైన విరివిగా చల్లిరి. అది ఎటులనో బాబా కంటిలో పడెను. బాబా కోపించిన వారై బిగ్గరగా తిట్టుట ప్రారంభించిరి. ఇది చూసి జనులు పారిపోయిరి. కాని బాబా భక్తులు అక్కడే ఉండిరి. వారు బాబా తిట్లను ఆశీర్వాదములుగా భావించిరి.

శ్రీరామచంద్రుని జననం రావణుడనే అహంకారమును, దురాలోచనలను చంపుటకు ఉద్దేశించింది. కనుక బాబా రూపములో నున్న రాముడు తప్పక కోపగించవలెనని వారు తలంచిరి. షిర్డీలో ఏదైనా క్రొత్తది ప్రారంభించునపుడు బాబా కోపగించుకొనుట ఒక అలవాటు. దీనిని తెలిసిన వారు ఊరకుండిరి.

రాధాకృష్ణ అయి తన ఊయెలను బాబా విరుచుదురేమోయని భయపడెను. అందువలన ఆమె మహాజనిని పిలిచి ఊయెలను తీసుకొని రమ్మని చెప్పెను. మహాజని పోయి దానిని విప్పచుండగా బాబా తీయవలదని చెప్పిరి. కొంత సేపటికి బాబా శాంతించిరి.

మహాజని సాయంత్రం మహా పూజానంతరం మరలా ఊయెలను విప్పబోయెను. అప్పడు బాబా మరుసటి దినం 'కాలాహండి' అను ఉత్సవమును జరిపిన పిమ్మట ఊయెలను తీసివేయవచ్చునని చెప్పిరి.

మరుసటి రోజున కాలాహండీ ఉత్సవం జరిగెను. ఇది శ్రీకృష్ణుని కథతో ముడిపడి యున్నది. కాలాహండీ అనగా నల్లని కుండయని అర్థం. దానిలో అటుకులు, పెరుగు, ఉప్ప, కారం కలిపి వ్రేలాడగట్టిరి. హరికథ సమాప్తమైన తర్వాత దానిని పగులగొట్టిరి. రాలిపడిన అటుకులను భక్తులకు పంచిపెట్టిరి. శ్రీకృష్ణుడు ఈ విధంగానే తన స్నేహితులకు పంచి పెట్టెడివాడు. ఈ ఉత్సవం ముగిసిన తర్వాత ఊయెలను విప్పటకు బాబా సమ్మతించిరి.

ఈ విధంగా బాబా హిందువులకు ఇష్టమైన జెండా ఉత్సవం, ముస్లిములకు ముఖ్యమైన చందనోత్సవముతో పాటు హిందువుల ఆరాధ్య దైవములైన రామ కృష్ణులకు సంబంధించిన ఉత్సవములు షిర్డీలో ఏర్పాటు చేసి హిందూ ముస్లిముల ఐక్యతకై అవిరళ కృషి సలిపిరి.

1913 నుండి శ్రీరామ జయంతి ఉత్సవంలో అనేక క్రొత్త అంశాలు చేర్చబడెను. చైత్ర మాసంలో పాడ్యమి నుండి రాధాకృష్ణ ఆయి నామ సప్తాహమును ప్రారంభించుచుండెను.

ఈ ఉత్సవమును ప్రారంభించినప్పటి నుండి షిర్డీకి వచ్చు భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగెను. దీనితో అంగళ్ల సంఖ్య కూడా పెరిగెను. రాధాకృష్ణ ఆయి శ్రీసాయి సంస్థానమును ఏర్పాటు చేసెను.

సంసారివైతే అరనిముషమైన విశ్రాంతిలేకుండా ఏదో ఒక పని చేయి

గుర్రము, పల్లకి, రథం, పాత్రలు, వెండి సామాన్లు, బక్కెట్లు, వంట పాత్రలు, పటములు, నిలువుటద్దములు బహూకరింపబడెను. ఉత్సవమున ఏనుగులు కూడ వచ్చెను. భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగినను, ఎచ్చట ఎట్టి కొట్లాటలుకాని జరిగేవి కాదు. ఎక్కడా ఎట్టి వ్యాధులు కనిపించేవి కావు. ఇదంతా బాబా మహిమ.

ఈ ఉత్సవ సమయమున తాత్యాకోతే పాటీలు బయటి ఏర్పాట్లను, రాధాకృష్ణ ఆయి ఇంటిలోని ఏర్పాట్లను చూచుచుండెను. రాధాకృష్ణ ఆయి స్వయంగా మసీదును శుభ్రపరచి గోడలకు సున్నం వేయుచుండెను. ఈ పనిని శ్రీరామ నవమికి ఒక రోజు ముందు చేయుచుండెను. ఈ ఉత్సవ సమయమున బీదలకు అన్నదానం చేయుచుండిరి. వంటలు, మిఠాయిలు విస్తారంగా రాధాకృష్ణ ఆయి ఇంటిలో చేయుచుండిరి. అనేక మంది భక్తులు రాధాకృష్ణ ఆయి ఇంటిలో దిగేవారు. రాధాకృష్ణ ఆయి వారికి కావలసిన వసతులు సమకూర్చేది.

దాసగణు హరికథలు చెప్పట

శ్రీరామనవమి ఉత్సవ సమయమున హరిదాసును తెచ్చుట చాల కష్టముగా ఉండెడిది. బాబా ఆ పనిని దాసగణునకు అప్పగించి హరిదాసు సమస్యను శాశ్వతంగా పరిష్కరించిరి.

మహారాష్ట్ర ప్రాంతంలో హరిదాసులు సాధారణంగా హరికథను చెప్పునపుడు ఆడంబరమైన నిండు అంగరఖాలు వేసుకొనెడి వారు. తలపైన పాగా లేక పేటా (ఒక విధమైన ఎర్రని టోపీ), పొడవైన కోటు, లోపల చొక్కా, పైన ఉత్తరీయం, మామూలు ధోవతి ధరించెడివారు. దాసగణు కూడ ఈ వేషంలో హరికథ చెప్పటకు వెళ్ళుచుండెను. బాబా కోటు, కండువా, టోపీ మొదలగునవి తీసివేయమని చెప్పెరి. అప్పటి నుండి దాసగణు నడుము మొదలు తల వరకు ఏమియు ధరించుచుండలేదు. చేతిలో చిరుతలు, మెడలో పూలమాల ధరించెడివాడు. ఇది హరికథను ప్రారంభించిన నారదుని పద్ధతి. నారదుడు చేతియందు తంబూరను ధరించి ఒకచోటు నుండి మరొక చోటునకు హరినామ సంకీర్తన చేయుచు వెళ్ళువాడు.

దాసగణు తన హరికథల ద్వారా సాయి మహిమలను ప్రచారం చేసి అనేక మంది భక్తులు షిర్డీ వెళ్ళి బాబాను దర్శించుకొనేలా చేసిన మహాభక్తుడు. అతని

అసలుపేరు సహస్ర బుద్ధే. అతడు సాయి అంతరంగికులలో ఒకడై వేలాది మంది భక్తుల్ని సాయి అనుగ్రహానికి పాత్రులుగా చేసెను. అతడు నాందేడ్ వాస్తవ్యుడు. పోలీసు డిపార్టుమెంటులో పనిచేసేవాడు.

అతడు మరాఠీ భాషలో చక్కని కవిత్వం చెప్పేవాడు. అతని అనేక గ్రంథాలలో సంత్ కథామృతం, భక్తి లీలామృతం, భక్తి సారామృతం పేరెన్నికగన్నవి.

అతడు 96వ యేట పండరీ క్షేత్రమున శుభకృతునామ సం॥ కార్తీక బహుళ త్రయోదశ (35-11-1962) ఆదివారం ఉదయం 9 గంటలకు పరమపదించెను.

హిందువా? మహమ్మదీయుడా?

బాబా హిందువన్నచో మహమ్మదీయ దుస్తులతో ఉండేవారు. మహమ్మదీయుడన్నచో హిందూమతాచార సంపన్నులుగా కనిపించుచుండిరి. ఆయన శాస్త్రోక్తముగా హిందువుల శ్రీరామనవమి ఉత్సవమును జరిపించుచుండిరి. అదే రోజున మహమ్మదీయుల చందనోత్సవమునకు అనుమతి నొసంగిరి. ఆ ఉత్సవ సమయములందు కుస్తీ పోటీలను ప్రోత్సహించి గెలిచిన వారికి బహుమతులిచ్చు చుండిరి. గోకులాష్టమినాడు 'గోపాల్ కాలా' ఉత్సవం జరిపించు చుండిరి. ఈదుల్ ఫితర్ పండుగనాడు మహమ్మదీయులచే మసీదులో నమాజు చేయించుచుండిరి.

ఒకసారి కొంతమంది మహమ్మదీయులు మొహర్రం పండుగకు మసీదులో తాజీయా[1](తాబూతు) ను నిలిపి కొన్ని దినములు దానినచ్చట ఉంచిన పిదప గ్రామములో ఊరేగించదల మనిరి. బాబా నాలుగు దినముల వరకు మసీదులో తాజీయా నుంచుటకు అనుమతినిచ్చి అయిదవ రోజున ఎట్టి సందేహం లేకుండా తానే దానిని తీసిపైచిరి.

బాబాను మహమ్మదీయుడన్నచో హిందువులకు వలె ఆయన చెవులకు కుట్లుండెను. ఆయనను హిందువన్నచో సున్తీ[2] చేసుకొమ్మని సలహా ఇచ్చుచుండిరి. కాని ఆయన మాత్రం సున్తీ చేసుకొని యుండలేదు.

---

1 తాజీయా: ఇది గోరీ ఆకారంలో ఉండును. దీనిని మొహర్రమ్ పండుగ సమయమున మసీదులో 10 రోజులు ఉంచి తర్వాత తీసి పూడ్చి పెట్టుదురు.

2 సున్తీ : శిశ్నాగ్ర భాగమున ఉండు చర్మమును కోసి తీసివేయు ధార్మిక విధానం.

బాబా మహమ్మదీయుడైనచో గ్రామములో నున్న శని, గణపతి, పార్వతీ శంకర, గ్రామదేవత, మారుతీ దేవాలయాల మరమ్మత్తును ఏల చేయింతురు? ఆయన మహమ్మదీయుడైనచో సనాతన పరాయణులగు బ్రాహ్మణులు ఆయన పాదములపై సాష్టాంగ ప్రణామం ఏల చేయుచుండిరి?

అందుచే సాయిబాబా హిందువా లేక మహమ్మదీయుడా అను విషయ మును ఎవరును సరిగా నిర్ణయించలేకుండిరి. ఇది ఒక వింతకాదు. సర్వమును త్యజించి భగవంతునికి సర్వస్వ శరణాగతి చేసినవారికి దేనితోను సంబంధం గాని, భేదభావంగాని ఉండదు. వారికి జాతి, మతములతో ఎట్టి సంబంధం ఉండదు. సాయిబాబా అట్టివారు. ఫకీరులతో కలసి మత్స్యమాంసములను భుజించు చుండిరి. వారి భోజన పళ్ళెంలో కుక్కలు మూతి పెట్టినను సణుగువారు కాదు.

సర్వజీవులొకటను సర్వాత్మ రూపం

బాబాకు సర్వజీవుల యందు ప్రేమమెండుగా ఉండెను. ఈ విషయమును తెలుపు కొన్ని సంఘటనలు క్రింద పేర్కొనబడినవి.

లక్ష్మీబాయి షిందే ధనవంతురాలు, సుగుణవతి. ఆమె రాత్రింబవళ్ళు మసీదులో బాబా సేవ చేయుచుండెను. ఒకనాడు సాయంకాలం మసీదులో బాబా తాత్యాతో కూర్చొనియుండగా లక్ష్మీబాయి షిందే వచ్చి బాబాకు నమస్క రించెను. బాబా ఇట్లనిరి - "ఓ లక్ష్మీ! నాకు చాల ఆకలివేయుచున్నది" అంతట లక్ష్మీ బాయి బయటికి వెళ్ళి కొంతసేపటి తర్వాత రొట్టె తీసుకొని వచ్చి బాబా ముందు పెట్టెను. బాబా దానిని కుక్కకు వేసిరి. అప్పడు లక్ష్మీబాయి, "ఏమి బాబా! నేను పరుగెత్తుకొని పోయి నా చేతులారా నీ కొరకు రొట్టె చేసి తెచ్చితిని. నీవు కొంచె మైనను తినక కుక్కకు వేసితివి" అప్పడు బాబా "కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చుట వంటిది. కుక్కకు కూడ ఆత్మ కలదు. ప్రాణులు వేరు కావచ్చును. కాని అందరి ఆకలి ఒకటే. ఎవరైతే ఆకలితోనున్న వారికి భోజనం పెట్టుదురో, వారు నాకు అన్నం పెట్టినట్లే" అని పలికిరి.

తాను తెచ్చిన రొట్టెను బాబా తినలేదని బాధతో వెళ్ళిపోతున్న లక్ష్మీబాయితో బాబా ఇలా చెప్పారు - "ఒకటి ... కాదు ... రెండు. రేపటి నుడి రెండు బార్లీ రొట్టెలు తీసుకొనిరా. పాలల్లో నానవేసుకొని తీసుకొని రా, ఇది నీ దినచర్యలో భాగం కావాలి".

బాబా ఎప్పుడూ రెంటికి ప్రాధాన్యం ఇచ్చేవారు. సాయి, బాబా కూడా రెండక్షరాల పదాలే. బాబా భక్తుల నుండి అపేక్షించేవి కూడా రెండే రెండు. అవి - 1) భక్తి 2) సబూరి (సహనం లేక ఓర్పు)

★ ★ ★

ఒకనాడు ఉదయం బాబా లెండితోట నుండి తిరిగి వచ్చుచుండిరి. మార్గమున మేకల మందను చూసిరి. అందులో రెండు మేకల మీద బాబా దృష్టి పడెను. బాబా వాటిని సమీపించి, ప్రేమతో తాకి, లాలించి ముప్పదిరెండు రూపాయలకు కొనిరి. భక్తులు బాబా మోసపోయారని తలంచిరి. వారు అవి ఎనిమిది రూపాయల కంటే ఎక్కువ ఖరీదు చేసేవి కాదనిరి. శ్యామా, తాత్యాకోటే వివరాలు అడిగిరి. అంతట బాబా, "శ్యామా! మీకు ఇంత ఆదుర్దా ఎందుకు? ఇల్లు వాకిరి లేని సన్యాసిని. నేను డబ్బు ఏమి చేసుకొంటాను? నాలుగు సేర్ల పప్పును కొని వాటికి పెట్టు" శ్యామా అట్లే చేసెను. తర్వాత సాయి వాటిని స్వంతదారునికిచ్చి తన జ్ఞాపకాలను తెలియజేసిరి -

"ఓ శ్యామా! ఓ తాత్యా! ఈ బేరములో నేను మోసపోయానని మీరు తలంచు చున్నారు. అది సరియైన అభిప్రాయం కాదు. గత జన్మలో అవి మానవులు. నా జతగాండ్రుగా ఉండిరి. వారొకేతల్లి బిడ్డలు. మొదట వారు పరస్పరం ప్రేమ కలిగి యుండిరి. కాని తర్వాత వారు శత్రువులైరి. పెద్దవాడు సోమరి. చిన్నవాడు చురుకైన వాడు. అతడు చాల ధనం సంపాదించెను. పెద్దవాడు అసూయచెంది చిన్న వానిని చంపి వాని ధనమును అపహరించదలచెను. అతడు తమ్ముని చంపుటకు ఎన్నో ప్రయత్నములు చేసెను. కాని అతని ప్రయత్నములు నిష్ప్రయోజనములయ్యెను. ఇద్దరు బద్ధ శత్రువులైరి. అన్న ఒకనాడు తమ్ముని కర్రతో కొట్టగా, తమ్ముడు అన్నను గొడ్డలితో నరికెను. ఇద్దరూ అదే స్థలమున చచ్చి పడిరి, వారు కర్మఫలముచే మేకలుగా పుట్టిరి. నా ప్రక్క నుండి వెళ్ళుచుండగా వారి ఆనవాలు పట్టితిని. వారి పూర్వ వృత్తాంతమును జ్ఞప్తికి తెచ్చుకొంటిని. ఎంతయినా సహచరులు. వారి యందు కనికరించి, వారికి తిండి పెట్టి, కొంత విశ్రాంతి కలుగజేసి ఓదార్చవలెనని సాను భూతితో ఇక్కడికి తెచ్చితిని. అందుచే ఇంత ద్రవ్యమును వ్యయపరచితిని. దానికి మీరు నేనేదో వ్యాపారం చేసానని, అందులో నష్టపోయానని, విపరీతంగా బాధ పడిపోయి నన్ను నిందించారు. నా వ్యాపారాన్ని ఇచ్చగించని మిమ్మల్ని చూసి వాటిని తిరిగి వాటి యజమాని వద్దకు పంపించి వేసాను".

ఇవ్వడంలో నా లోపం ఉండదు. పుచ్చుకోవడంలోనే మీదే లోపం

ధనం కన్నా మిన్న అప్యాయత. అనీ; డబ్బును సంపాదించగలము; కానీ అప్యాయతలను, అనురాగాన్ని, ప్రేమానుబంధాలను వెలకట్టి కొనలేమని బాబా తమ చేతల ద్వారా భక్తజనులకు నిరూపించారు.

పంచభూతములను శాసించు శక్తి రూపం

పంచభూతములు బాబా అధీనమున యుండెడివి. ఈ విషయం క్రింది రెండు సంఘటనలను బట్టి తెలియుచున్నది.

ఒకనాడు సాయంకాలం షిర్డీలో గొప్ప తుఫాను సంభవించెను. నల్లని మేఘాలు ఆకాశమును కప్పెను. గాలి తీవ్రంగా వీచెను. ఉరుములు, మెరుపులతో కుంభవృష్టి కురిసెను. కొంత సేపటిలో నేలయంతయూ నీటిలో మునిగెను. పక్షులు జంతువులు మిక్కిలి భయపడెను. మనుష్యులు తల దాచుకొనుటకు మసీదులో ప్రవేశించిరి. వారు బాబాను తుఫాను ఆపమని ప్రార్థించిరి. వారి భక్తికి మనసు కరిగిన బాబా మసీదు అంచున నిలబడి బిగ్గరగా గర్జించిరి - "ఆగు, ఆగు, నీ కోపము తగ్గించు, నెమ్మదించు" కొన్ని నిమిషములలో వర్షం తగ్గెను. గాలి వీచుట మానెను. తుఫాను ఆగిపోయెను. చంద్రుడు ఆకాశమున కనిపించెను. ప్రజలందరూ సంతోషముతో తమ తమ గృహముల కేగిరి.

ఒకసారి మిట్ట మధ్యాహ్నం ధునిలోని మంట అమితముగా లేచెను. అది మసీదు వెన్నుపట్టీలను తాకుచుండెను. మసీదులో కూర్చొన్న వారికి ఏమియూ తోచకుండెను. వారు బాబాకు చెప్పటానికి భయపడుచుండిరి. బాబా వెంటనే ఏమి జరుగుచున్నదో గ్రహించిరి. వారు తన సటకా (పొట్టి కర్ర)ను తీసుకొని దగ్గరున్న స్తంభంపై కొట్టుచూ, "దిగు, దిగు, శాంతించుము" - అనిరి. ఒక్కొక్క సటకా దెబ్బకు కొద్దికొద్దిగా తగ్గుచూ కొన్ని నిమిషాలలో మంటలు పూర్తిగా శాంతించెను. మామూలు స్థాయికి చేరుకొనెను.

దీపాలు వెలిగించి మెరుసేటి రూపం

బాబా మసీదునందు దీపాలను వెలిగించువారు. ఆ భక్త అజ్ఞాన తిమిర నాశక దీపాలు రాత్రంతా వెలుగుతుండేవి. వ్యాపారస్థులు దీపాలకు కావలసిన

నూనెను ఇచ్చుచుండిరి. కాని కొంత కాలం తర్వాత హిందువుల నూనెతో బాబా మసీదులో దీపములు వెలిగిస్తున్నారని తలంచిన వ్యాపారస్థులు మూకుమ్మడిగా బాబాకు నూనెను ఇవ్వటానికి నిరాకరించిరి. దీనితో బాబా నిరుత్సాహపడ లేదు. ప్రమిదలలో వత్తులను వేసిరి. రెండు - మూడు నూనె చుక్కలున్న రేకు డబ్బాలో నీళ్ళు పోసి ఆ నీటిని త్రాగిరి. తర్వాత ఆ నీటిని ఆ డబ్బాలోనికి ఉమ్మి వేసిరి. ఆ నీటిని ప్రమిదలలో నింపి వత్తులను వెలిగించిరి. ప్రమిదలన్నియూ తెల్లవారేదాకా చక్కగా వెలిగాయి.

గ్రామస్తుల హృదయాలలోని చీకట్లు తొలగగా వారు ఆయనను క్షమాపణ కోరారు. అప్పడు బాబా, "ఇష్టం లేకుంటే ఏమీ ఇవ్వక్కర లేదు. కాని లేదని అబద్ధం చెప్పవద్దు. ఇవ్వమని చెప్పాలి" అని హితం చెప్పారు. దానితో కళ్ళు తెరచుకొన్న ఆ వ్యాపారస్థులు బాబా భక్తులయ్యారు.

ప్లేగు నివారణకై గోధుమలు విసరుట

అది 1910వ సంవత్సరం, ఒక రోజు ఉదయాన బాబా మసీదులో ముఖ ప్రక్షాళనం చేసుకొనిన వెంటనే గోధుమలను విసరుటకు ఉపక్రమించిరి. నేలపై గోనె సంచిని పరచి దానిపై తిరుగలిని, దాని ప్రక్కన గోధుమల చేటను ఉంచిరి. తర్వాత తిరుగలి వద్ద కూర్చొని, చొక్కా చేతులు పైకెత్తి పిడికెడు చొప్పన గోధుమలు వేయుచు విసరసాగిరి. ఇది చూసిన హేమాడ్‌పంత్ మొదలగువారు ఆశ్చర్య చకితులైరి. ఈ సంగతి గ్రామములో వెంటనే వ్యాపించెను. దీనిని చూచుటకై అబాలగోపాలం బాబా వద్ద గుమికూడిరి.

ఇంతలో నలుగురు స్త్రీలు మసీదు మెట్లెక్కి, బాబాను ప్రక్కకు జరిపి తామే గోధుమలు విసర సాగిరి. ఒకవైపున వారు విసరుచుండిరి. మరొక వైపున బాబా లీలలను గానం చేయుచుండిరి. తొలుత బాబాకు వారిపై కోపం వచ్చెను. కాని వారి ప్రేమకు, భక్తికి మిగుల సంతసించి చిరునవ్వు నవ్విరి.

గోధుమలను విసరుచున్న స్త్రీలు తమ మనసులో యిట్లు తలంచిరి - "బాబాకు యిల్లు - వాకిలి లేదు, పిల్లా - జెల్లా లేరు. వారిపై ఆధారపడిన వారూ లేరు. పైగా వారు భిక్షాటనంపై జీవించుచున్నారు. అలాంటప్పడు వారు గోధుమ పిండితో ఏమి చేసుకొంటారు? వారు దయార్ద్ర హృదయులు. కనుక వారు ఆ పిండిని నాలుగు భాగములు చేసి ఒక్కొక్కరు ఒక భాగమును తీసుకొనుచుండిరి.

అంతవరకు శాంతంగా నున్న బాబా దీనిని గమనించి కోపంతో వారినిట్లు తిట్టిరి - "ఏమమ్మా! మీకేమైనా పిచ్చి పట్టిందా? ఎవరబ్బ సొమ్మనుకొని లూటీ చేయు చుంటిరి? మీ వద్ద నేనేమైనా గోధుమలు తీసుకొన్నానా? మరి ఈ పిండిని తీసుకొనిపోయి గ్రామపు సరిహద్దులపై చల్లండి" బాబా మాటలు విన్న ఆ స్త్రీలు ఆశ్చర్యచకితులై వారి యాజ్ఞను పాటించిరి.

హేమాడ్‌పంత్ బాబాతో ఈ చర్యను గురించి ప్రశ్నించగా వారిట్లు చెప్పిరి - "కలరా దేవత ఊరిలో కొందరిని పొట్టన పెట్టుకోవాలని చూస్తుంది. వారికి బదులు యీ పిండిని తీసుకొమ్మని దానిని ఆజ్ఞాపించాను". అప్పటి నుండి గ్రామంలో కలరా తగ్గెను. ప్రజలందరూ ఆరోగ్యముగ యుండిరి. శ్రీసాయి కలరా వ్యాధిని గోధుమల రూపములో విసరి దానిని రూపు మాపడం నిజంగా బాబా అద్భుత లీల.

విసరుట - అంతరార్థం : బాబా షిర్డీలో 60 సంవత్సరములు నివసించిరి. ఆ కాలమంతయు గోధుమలు విసరిరి. బాబా విసరినది గోధుమలను కాదు; భక్తుల మనో వికారములనూ, పాపములనూ, కష్టాలనూ, ఈతి బాధలనూ.

తిరుగలి - అంతరార్థం : తిరుగలి క్రింది రాయి కర్మ; పైరాయి భక్తి. చేతితో పట్టుకొను పిడి జ్ఞానం. అనగా భక్తి, జ్ఞాన, కర్మల సమన్విత రూపమే 'తిరుగలి'.

పాపములను, కోరికలను తుడిచివేస్తేనే కాని ఆత్మ సాక్షాత్కారం కలుగదు. పాపములను, కోరికలను తుడిచివేయుటకు భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలు తోడ్పడు తాయి. ఈ విషయాన్ని బాబా తిరుగలిపై గోధుమలను విసరుట ద్వారా సామాన్య ప్రజలకు అర్థమయ్యేటట్లు తెలిపిరి.

ధాన్యం తిరుగలిలో విసరబడుతుంది. అట్లే మనిషి ప్రపంచమనే తిరుగలిలో విసరబడతాడు (నాశనమవుతాడు). కాని ఎవడైతే గురువనే తిరుగలి పిడిని గట్టిగా పట్టుకొంటాడో, వాడు నాశనం కాకుండా రక్షింపబడతాడు. తిరుగలి పిడిని గట్టిగా పట్టుకొంటే తిరుగలి రాయి తిరుగదు; ధాన్యం విసరబడదు. అట్లే గురువును గట్టిగా ఆశ్రయించినవాడు నాశనం కాకుండా ఉంటాడు. నిజమైన గురువు ప్రసాదించే జ్ఞానంవల్ల భక్తుడు ఆత్మసాక్షాత్కారాన్ని పొందుతాడు. తద్వారా నాశనం నుండి కాపాడబడతాడు.

ఓ బాబా! నీ లీలలు అద్భుతములు నీ చర్యలు విచిత్రములు భక్తుల పాపహరణ మార్గములు మరింత విచిత్రములు నీ మహిమను అమాయకులమైన మేము ఏమని కొనియాడగలం?

సర్వం శ్రీ సాయిరామార్పణమస్తు

మూడవ రోజు (శనివారం) పారాయణ

ప్రేమ స్వరూపులారా! ఈ రోజున సద్గురువు ఆవశ్యకత, గురువు తన శిష్యులను ఉద్ధరించు విధానము మొదలగు అంశాలను గురించి భక్తి పూర్వకముగా తెలుసుకొందాం. ఓం శ్రీసాయిరామ్.

శ్రీ గురుచరిత్ర ప్రాశస్త్యం

కుశాభావు అనే టీచరు ఒక సాధువును ఆశ్రయించాడు. సాధువు అతనికి ఒక మంత్రం నేర్పాడు. దానివలన ఆయన కోరగానే పండ్లు, మిఠాయిలు వంటివి చిత్రమైన రీతిలో అతని చేతుల లోనికి వచ్చేవి. అదిచూచి జనం అతని చుట్టూ చేరసాగారు. కొందరు అతనిని రకరకాలుగా విమర్శించ సాగారు. అతడు వారిని దండించటానికి తగిన మంత్రాలు నేర్పమని సాధువును వేడించసాగారు. ఆ సాధువు అతనిని యిక నుండి సాయిబాబాను ఆశ్రయించమని చెప్పి హిమాలయాలకు వెళ్లిపోయాడు.

1909 లో కుశాభావు షిర్డీ చేరాడు. కాని బాబా అతనితో ఇలా చెప్పారు - "నీవు మంత్రశక్తితో వేరొకచోటు నుండి వస్తువులను తెప్పిస్తున్నావు. కనుక అది దొంగసొత్తు. ఇది చూసిన వారికి కూడ అట్టి శక్తులపై వ్యామోహం కలుగుతుంది. ఇట్టి శక్తులు అమాయకులను అపవిత్రం చేస్తాయి. కనుక నీవు ఆ శక్తులను గోదావరి నదిలో విడిచి పెట్టినగాని నేను నిన్ను మసీదులోనికి రానీయను" చివరకు అతడు ఆ శక్తులను గోదావరి నదిలో విడిచిపెట్టి వచ్చెను. ఆ తర్వాత బాబా అతనిచేత రోజూ శ్రీ సమర్థ రామదాసు స్వామి వ్రాసిన 'దాస బోధ'ను అతనిచేత చదివించిరి. తర్వాత 'శ్రీగురుచరిత్ర'ను 108 సార్లు పారాయణ గావించిరి.

కుశాభావు ఒక ఏకాదశినాడు ఉపవసించు చుండెను. అతడు బాబాను దర్శించి పూర్వం ఋషులు కందమూలాలు తినేవారని చెప్పాడు. సాయి ఆ పదాన్ని 'కాంద' (ఉల్లిగడ్డ) అని చమత్కరించి అతనికి కొన్ని ఉల్లిగడ్డలిచ్చి తినమన్నారు. అతడు దిక్కుతోచక ఆయన తింటే తానూ తింటానన్నాడు. అప్పుడు ఇద్దరూ చెరి కొన్ని తిన్నారు. తర్వాత సాయి కొందరు భక్తులను పిలిచి, "ఈ సద్బ్రాహ్మణుని

చూడండి. ఏకాదశి నాడు ఉల్లి తిన్నాడు!" అని చెప్పి గేలి చేసారు. కుశాభావు బాబా ఆదేశిస్తేనే ఉల్లి తిన్నాననియు, ఆయన కూడా తిన్నారని చెప్పాడు. బాబా అంగీకరించక, తాము తిన్నది కక్కి చూపారు. అందులో కందమూలాల ముక్కలే గాని, మచ్చుకైనా ఉల్లి లేదు. కుశాభావు అదే మంచి అవకాశమని తలచి ఆయన కక్కిన దానినే మహా ప్రసాదంగా భావించి తిన్నాడు. బాబా అతనిని తిట్టి, కొట్టి వారించాలని చూసారు. కాని అతడు వినలేదు. అతని భక్తి శ్రద్ధలకు సాయి కన్నుల వెంట ఆనందబాష్పాలు కారాయి. ఆయన అతనిని ఆశీర్వదించారు. అతడు అప్పటి నుండి మంచి గురుభక్తుడయ్యాడు.

ఈ లీల ద్వారా బాబా లోకానికి 'శ్రీగురుచరిత్ర' యొక్క ప్రాశస్త్యం తెలిపారు. దాని పారాయణ కుశాభావును పవిత్రుడను చేసి సద్గురుకృపకు పాత్రుడను చేసింది.

శ్రీగురుచరిత్ర పారాయణ ద్వారా భక్తుడు శ్రీ దత్తావతారమైన సద్గురుని లీలలు తెలుసుకొంటాడు. ఆయన లీలలను గురించి, ఆయనను గురించి చింతన చేస్తూ ఆయనకోసం తపిస్తాడు. అప్పుడు ఆయన తొలుత ఏదో రూపంలో స్వప్న దర్శనం, తర్వాత ప్రత్యక్ష దర్శనం ఇస్తారు. అందుకే బాబా శ్రీ గురుచరిత్ర పారాయణకు ప్రాధాన్యం ఇచ్చేవారు.

దత్తాత్రేయుని గురువులు

దత్తాత్రేయునికి మరొక పేరు అవధూత. అవధూత 24 మంది గురువుల నుండి జ్ఞానాన్ని గ్రహించి, అనుష్ఠించి, ఆత్మజ్ఞానం పొందును. అతని 24 మంది గురువులు : 1. భూమి 2. వాయువు 3. ఆకాశం 4. అగ్ని 5. సూర్యుడు 6. పావురం 7. కొండ చిలువ 8. సముద్రం 9. మిడుత 10. ఏనుగు 11. చీమ 12. చేప 13. పింగళ అనే వేశ్య 14. శరకారుడు 15. ఒక బాలుడు 16. చంద్రుడు 17. తేనెటీగ 18. లేడి 19. గ్రద్ద 20. ఒక కన్య 21. సర్పం 22. సాలెపురుగు 23. భ్రమర కీటకం 24. నీరు. వీటి నుండి మనం కూడా ఎంతో నేర్చుకొనవలసి ఉంది.

భూమి జీవుల నుండి తనకెంత బాధ కలిగినా చలించక తన ధర్మాన్ని తాను అనుసరిస్తుంది. అట్లే మానవుడు ఎన్ని బాధలు ఎదురైనప్పటికీ వాటిని సహనంతో సహించి ధర్మమార్గం నుండి చలించకుండా ఉండాలి.

వాయువు వివిధ వస్తువుల శీతోష్ణములను గాని, శుచి అశుచిని గాని, సుగంధ, దుర్గంధాలను గాని పట్టించుకోకుండా వాటి మధ్య అనాసక్తితో సంచరిస్తుంది. అది మనిషికి ఇంద్రియ విషయాలు అనుభవమవుతున్నా వాటిలో తగుల్కొనరాదని నేర్పుతుంది.

ఆకాశం దేనికీ అంటనిది. మనిషి కూడా శరీరానికి, దాని వలన కలిగిన మనోవికారాలకు అంటరానివాడై ఉండాలి.

అగ్ని వివిధ వస్తువుల గుణ భేదాలను దహించి ఏకరూపమైన విభూతిగా మారుస్తుంది. మనిషి కూడా వివిధ వస్తువుల గుణాలను నిరసించి సర్వగతమైన పరమేశ్వరుని తత్త్వాన్ని గ్రహించాలని చెబుతుంది.

సూర్యుడు అన్ని జీవులకూ సమానంగా వెలుగును ప్రసాదిస్తాడు. అట్లే మనిషి సర్వజీవుల పట్లా ఒకే విధంగా ప్రవర్తించాలి.

పుత్ర వ్యామోహంతో ఒక పావురాల జంట వలలో పడ్తుంది. అట్లే మమకార వ్యామోహాలతో తగుల్కొన్నవాడు నశిస్తాడు అని తెలుసుకోవాలి.

సముద్రం వర్షఋతువులో పొంగదు. వేసవిలో కృంగదు. అట్లే మనిషి సుఖాలకు పొంగరాదు; దుఃఖాలకు కృంగరాదు.

మిడుత అగ్నిని చూచి ఆకర్షింపబడి, అందులో దూకి నశిస్తుంది. అలాగే అజ్ఞాని విషయాలను సుఖాలుగా భ్రమించి వాటిలో చిక్కి నశిస్తాడు.

అడవిలో నిలిపిన ఆడ ఏనుగు ప్రతిమను చూచి భ్రమించి, దాని స్పర్శకోరి మగ ఏనుగు దాని వద్దకు చేరి బంధించబడ్తుంది. అట్లే స్త్రీ స్పర్శను కోరిన ముముక్షువు నాశనమును కొని తెచ్చుకొంటాడు.

చీమలు పెట్టిన పుట్టలు పాములకు నిలయములవుతాయి. అవి నిల్వ చేసుకొన్న ఆహారం ఇతరుల పాలవుతుంది. మనిషి దానధర్మాలు చేయక కూడ పెట్టిన దానిని దుర్మార్గులు దోచేస్తారు. చీమ ఎన్ని ఆటంకాలు వచ్చినా లెక్కచేయక నిరంతరం శ్రమిస్తుంది. మనిషి కూడా ఎన్ని విఘ్నాలు, అపజయాలు వచ్చినా నిస్పృహ చెందక నిరంతర కృషితో జ్ఞానం సంపాదించుకోవాలి.

చేప జిహ్వాచాపల్యంచేత ఎరను ఆశించి గాలం మ్రింగి నశిస్తుంది. అట్లే జిహ్వా చాపల్యానికి లొంగిన మనుష్యులు ఆత్మహాని కలిగించుకొంటారు. కనుక జిహ్వను జయిస్తే సమస్తాన్ని జయించవచ్చు.

పింగళ అనే వేశ్య నిద్రపోకుండా రాత్రంతా విటునికోసం వేచి ఉంటుంది. కాని వాడు రాడు. అప్పుడు ఆమె భగవంతుని మరచి అల్ప బుద్ధితో భయశోక మోహాదులను కల్గించే మానవాధముని పొందు కోరినందుకు పశ్చాత్తాప పడ్తుంది. ఆశయే దుఃఖానికి మూలం అని దీనివల్ల తెలుస్తుంది.

శరకారుడు బాణాలను చేయడంలో నిమగ్నమై ప్రక్క నుండి పోతున్న ఊరేగింపును కూడా గుర్తించడు. అట్లే మనిషి భ్రమింపజేసే విషయజాలాన్ని మరచి ఆత్మనిష్ఠుడు కావాలి.

బాలుడు ఎలాంటి చింతలు లేకుండా ఆనందంగా ఉంటాడు. అట్లే మానవుడు ఎలాంటి చింతలు లేకుండా మానావమానాలు విడచి ఆత్మరతుడై సుఖించాలి.

చంద్రకళలు వృద్ధిక్షయాలు పొందినట్లు కనబడతాయేగాని చంద్రగోళం ఎట్టి మార్పులూ చెందదు. అట్లే జననం మొదలు మరణం వరకూ గల మార్పులన్నీ దేహానికేగాని ఆత్మకు గావు.

తేనెటీగ తామరపూవు పరిమళం చేత ఆకర్షింపబడి రాత్రంతా దానిలో బంధింపబడుతుంది. అలాగే రుచికరమైన ఆహార పదార్థముల చేత ఆకర్షింపబడిన యతి గృహస్థుని ఇంట చిక్కి పతితుడగును.

తేనెటీగ వివిధ రంగుల పూల నుండి తేనె గ్రహించినట్లే వివేకి సకల శాస్త్రముల సారమును గ్రహించాలి. తేనెటీగ తేనె సేకరిస్తే తేనె అమ్ముకొనువాడు దానిని అపహరిస్తాడు. కనుక యతి రాత్రికని, రేపటికని అన్నమును దాచి పెట్టరాదు.

లేడి కపటుడైన వేటగాని సంగీతానికి పరవశించి అతనిచేత చిక్కినట్లు లౌకికమైన గీతాలు వినగోరే ముముక్షువు కూడ విషయ వాంఛలలో చిక్కి నశిస్తాడు.

ఒక గ్రద్ధ ఒక చచ్చిన ఎలుకను గొనిపోవుచుండెను. చాలా కాకులు ఆ ఎలుకను ఆశించి గ్రద్ధను బాధించాయి. చివరికి గ్రద్ధ ఎలుకను విడిచింది. అప్పుడు

ఆ కాకులు గ్రద్దను వదలిపెట్టి ఎలుక కోసం వెళ్ళాయి. గ్రద్ద ప్రశాంతంగా చెట్టుమీద కూర్చొనెను. దీనినిబట్టి లౌకిక సుఖాలను ఆశించడం దుఃఖాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. వాటిని వదిలి పెట్టటం వల్ల శాంతి చేకూరును.

ఒక కన్యను చూడటానికి మగ పెళ్ళివారు వచ్చారు. వారిని సత్కరించడానికి ఆ కన్యయే ధాన్యమును దంచసాగింది. పెండ్లికొడుకు వాండ్లు తన చేతి గాజుల శబ్దం ఎక్కడ వింటారోనని ఆ కన్య చేతికి రెండు గాజులు మాత్రమే ధరిస్తుంది. అయినా శబ్దం అవుతుంది. అప్పుడు ఒక గాజు మాత్రమే ఉంచుకొంటుంది. అట్లే పలువురు చేరినా, ఇద్దరు చేరినా ముచ్చట్లు, కబుర్లు తప్పనిసరి. కనుక యోగి ఏకాంతంగా సాధన చేసుకోవాలి.

సర్పం తనకు తానుగా గృహం నిర్మించుకొనదు. చెదలు నిర్మించుకొన్న పుట్టను విడిచిపోయాక దానిలో సర్పం నివశిస్తుంది. అట్లే యోగులు ఇతరులు నిర్మించిన మఠాలలోను, వృక్ష మూలాలలోను జీవించాలి.

సాలెపురుగు తాను అల్లుకొన్న గూటినే కొంత కాలానికి మ్రింగివేస్తుంది. అట్లే బ్రహ్మ తనలో నుండి ఈ సృష్టిని బహిర్గతం చేసి తిరిగి తనలోనే లీనం చేసుకొంటాడు.

భ్రమరం తన గ్రుడ్డు నుండి బయల్పడిన తన కీటాన్ని తెచ్చి గూటి యందుంచి, దానిచుట్టూ ఝుంకారం చేస్తుంది. ఆ ఝుంకారం భీతివలన కీటం ఎల్లప్పుడు భ్రమరాన్ని గురించే చింతించి కొంత కాలానికి తాను భ్రమరం అవుతుంది. అట్లే మంచి శిష్యుడు ఎల్లప్పడు తన గురువును గురించే చింతించి తాను గురువగును.

నీరు సర్వజీవుల దాహం తీరుస్తుంది. అట్లే ముని తన్ను ఆశ్రయించిన వారి హృదయ, దేహ తాపములను తొలగించి రక్షిస్తాడు.

గురువుయొక్క ఆవశ్యకత

భగవంతుడు అనేక ప్రాణులను సృష్టించాడు. కాని అవి భగవంతుని శక్తిని అర్థం చేసుకొనలేక పోయినవి. ఎందుకనగా వాటికి జ్ఞానం లేదు. అందుచే భగవంతుడు మానవుని సృష్టించి అతనికి జ్ఞానం ప్రసాదించాడు. కనుక మానవుడు

ఈ శరీరం అశాశ్వతమనియు, భగవంతుడు మాత్రమే శాశ్వతమని తెలుసుకొని ఈ శరీరమును ఆత్మ సాక్షాత్కారమునకు ఉపయోగపడునట్లు చేసుకొనవలెను. శరీరమును అశ్రద్ధ చేయనూరాదు, అతిగా ప్రేమించనూ కూడదు. అవసరమైనంత జాగ్రత్త మాత్రమే తీసుకొనవలెను. గుర్రపు రౌతు గమ్యస్థానం చేరువరకు గుర్రమును ఏ విధంగా చూసుకొనునో, అదే విధంగా మానవుడు ఆత్మసాక్షాత్కారం పొందు వరకు తన శరీరమును కాపాడుకొనవలెను.

మానవుడు ఆత్మ సాక్షాత్కారమునకై రాత్రింబవళ్ళు విసుగు విరామం లేక కష్టపడవలెను. బద్ధకమును మాని ఆత్మయందే ధ్యానం నిలుపవలెను.

ఆత్మ సాక్షాత్కారమునకై సద్గురువుల సహవాసం పొందవలెను. మతోప న్యాసములు, మత గ్రంథములు ఇవ్వలేని జ్ఞానమును సద్గురువు ఇచ్చును. క్షమ, నెమ్మది, వైరాగ్యం, దానం, ధర్మం మొ॥ గుణములను కలిగియుండి శరీరమును మనస్సును అదుపులో ఉంచుకొనుట, అహంకారం లేకుండుట మొదలగు విషయములను భక్తులు గురువు నుండి నేర్చుకొందురు.

★ ★ ★

ఒకసారి కాకాసాహెబ్ దీక్షిత్‌కు, బాబాకు మధ్య సంభాషణ జరిగినది. సంభాషణ ఇలా కొనసాగింది.

బాబా : పైకి పోవుటకు అనేక మార్గములు కలవు. షిర్డీ నుంచి కూడా ఒక మార్గం కలదు. మార్గం ప్రయాసతో కూడినది. మార్గ మధ్యమున నున్న అడవిలో పులులు, తోడేళ్ళు కలవు.

కాకా : మార్గదర్శకుని వెంట తీసుకొని పోయినచో?

బాబా : అట్లయినచో కష్టమే లేదు. మార్గదర్శకుడు తిన్నగా గమ్యస్థానమును చేర్చును. అతడు మార్గమధ్యముననున్న తోడేళ్ళు, పులులు, గోతుల బారి నుండి తప్పించును. మార్గదర్శకుడే లేనిచో అడవి మృగముల బారిన పడవచ్చు లేదా దారి తప్పి గుంటలలో పడిపోవచ్చు.

దీనిని బట్టి పరమార్థం గురుబోధనల వల్లనే బోధపడునని తెలియు చున్నది. రాముడు వశిష్ఠునకు, కృష్ణుడు సాందీపునకు లొంగి అణకువతో నుండి ఆత్మ

సాక్షాత్కారం పొందిరి. గురువుయందు దృఢమైన నమ్మకం కలిగియుండి అతనికి ఓపికతో సేవ చేసిన శిష్యులకు గురువు ఆత్మసాక్షాత్కారానికి మార్గం చూపును.

★ ★ ★

ఒకనాడు బాబా గురువు యొక్క అవశ్యకతను తెలుపుటకు బంజారా కథను ఈ విధంగా చెప్పిరి - "ఒకసారి మేము, నలుగురు పండితులము భగవంతుని వెదకుటకు అడవులలో తిరుగసాగితిమి. ఇంతలో ఒక బంజారా (వ్యాపారి) కనిపించి మీరు ఏ పనిపై వెళ్ళుచున్నారని అడిగెను. ఆ తర్వాత అతడు మాతో ఇట్లు చెప్పెను - "అడవులలో సంచరించవలయునన్న మార్గదర్శకుడు కావలెను. ఈ ఎండవేళలో అనవసరంగా ప్రయాసపడుదురేల? భోజనం చేసి సేద దీర్చుకొని వెళ్ళండి" కాని మేము అతని మాటలను వినక అడవిలో తిరగసాగితిమి. కాసేపటి తర్వాత మేము ఎక్కడనుండి బయలుదేరి వుంటిమో అక్కడికే తిరిగి చేరితిమి. అక్కడ మేము మరలా బంజారాను కలిసితిమి. అతడిట్లు చెప్పసాగెను - "చిన్నదానికి గాని, పెద్దదానికి గాని సరియైన మార్గం చూపుటకు ఒక మార్గదర్శకుడుయుండి తీరవలెను. ఉత్త కడుపుతో అన్వేషణ జయప్రదం కాదు. భగవంతుడు సంకల్పించనిదే మనకు దారిలో ఎవ్వరూ కలియరు. పెట్టిన భోజనం వద్దనరాదు".

నా మిత్రులు అతని ఆతిథ్యం తీసుకొనుటకు ఇష్టపడక మరలా అన్వేషణకు బయలు దేరిరి. కాని నేను బంజారా ఆతిథ్యం స్వీకరించితిని. తక్కువ కులం వాడైనను, అనాగరికుడైనను ఎట్టి ఫలాపేక్ష లేకుండా ఎంతో ప్రేమతో అతడిచ్చిన ఆతిథ్యమును కాదనలేకపోయితిని.

అంతట ఒక వ్యక్తి నా ఎదుట కన్పించెను. నేను అతనికి జరిగినది చెప్పితిని. అతడు నన్ను శిష్యునిగా స్వీకరించదలచి ఇట్లనెను - "నీవు నాతో వచ్చుటకు ఇష్ట పడెదవా? నీకు కావలసింది నేను చూపెదను." నేను అతనికి గౌరవ పూర్వకంగా నమస్కరించి అతని ఆజ్ఞకు లోబడితిని. అతడు నన్ను తన బడిలో చేర్చుకొనెను. ఆ బడి చాల అందమైంది. అక్కడ నేను నా తల్లిదండ్రులను మరచితిని. తల్లి పక్షి పిల్ల పక్షులను జాగ్రత్తగా చూచుకొన్నట్లు అతడు నన్ను కాపాడెను.

నా మిత్రులలో ఒకడు కర్మకుడు. అతనికి కొన్ని కర్మలు, విధులు, నిషేధములు మాత్రమే తెలియును. రెండవవాడు జ్ఞాని. అతడు తన జ్ఞానమునకు గర్వించు

వాడు. మూడవవాడు భక్తుడు. భగవంతుడే సర్వస్వం చేయునని అతని నమ్మకం. కాని వారందరూ తక్కువ కులం వాడని తలంచి బంజారా ఆతిథ్యమును నిరాకరించిరి. అతని మాట వినక ఎన్నో కష్టముల పాలయిరి"

ఈ కథ వలన గురువు యొక్క ఆవశ్యకతయు, గురువు యొక్క కులముతో పని లేదనియు తెలియును. తల్లి పక్షి పిల్ల పక్షులను పెంచు విధముగా సద్గురువు శిష్యుల యోగక్షేమములను చూచునని బోధ పడును.

బాబా కథలు చెప్పే విధానం విశిష్టమైనది. వారు కథల ద్వారా అనేక పార మార్థిక విషయాలను కూడా భక్తులకు సులభంగా అర్థమయ్యేటట్లు చెప్పవారు.

వారి కథాకథన విధానానికి ప్రణమిల్లి ముందుకు సాగుదాం.

ఓం శ్రీ సాయిరామ్.

బాబా సద్గురువు

గురువులు రెండు రకాలుగా ఉందురు : 1. నియత గురువులు 2. అనియత గురువులు. నియత గురువులనగా నియమింపబడినవారు. ఇట్టి గురువుల సహవాసం నీవు - నేను అను ద్వంద్వ అభిప్రాయమును పోగొట్టి యోగమున ప్రతిష్ఠింప చేసి 'తత్వమసి' అగునట్లు చేయును.

అనియత గురువులు సమయానుకూలముగ వచ్చి ఏదైనా సలహానిచ్చి మన అంతరంగమున సుగుణమును వృద్ధి చేసి మోక్షమును పొందునట్లు చేయుదురు.

పై రెండు రకములలోను సద్గురువులుందురు. వారు మనలను ప్రపంచపు ఉనికికి అతీతంగా తీసుకొనిపోయెదరు. సాయిబాబా అట్టి సద్గురువు. వారి మహిమ వర్ణనాతీతం. వారు తనను దర్శించు భక్తుల భూత, భవిష్యత్, వర్తమానములను అన్నింటినీ చెప్పచుండిరి. వారు ప్రతి జీవి యందు దైవత్వమును చూచుచుండిరి. వారికి స్నేహితులు, విరోధులు సమానమే. నిరభిమానం, సమత్వం వారిలో మూర్తీభవించి యుండెను. వారు దుర్గార్గుల అవసరములను కూడ తీర్చుచుండిరి. కలిమి లేములు వారికి సమానం. మానవ శరీరంతో ఉన్నప్పటికీ వారికి శరీరమందు గాని, గృహంనందుగాని అభిమానం లేకుండెను. వారు శరీరధారుల వలె కనిపించి నను నిజంగా నిశ్శరీరులు, జీవన్ముక్తులు.

గురు-శిష్యుల సంబంధం

ఖాపర్డే దంపతులు

ఒకసారి ఖాపర్డే తన భార్యతో కలిసి షిర్డీకి వచ్చి కొన్ని నెలలుండెను. ఖాపర్డే భార్య బాబాయందు భక్తిశ్రద్ధలు కలిగియుండెను. ఆమె బాబాను మిగుల ప్రేమించు చుండెను. ప్రతిరోజు 12 గంటలకు బాబా కొరకు స్వయంగా నైవేద్యం తెచ్చు చుండెను. దానిని బాబా ఆమోదించిన తర్వాత తాను భోజనం చేయుచుండెను.

ఒకనాడు ఆమె మధ్యాహ్న భోజన సమయమున ఒక పళ్లెంలో సాంజా, పూరీ, అన్నం, పులుసు, పరమాన్నం మొదలగునవి మసీదుకు తెచ్చెను. గంటల కొలదీ ఊరకనేయుండు బాబా ఆనాడు వెంటనే లేచి, భోజన స్థలములో కూర్చొని, ఆమె తెచ్చిన పళ్లెంపై ఆకు తీసి త్వరగా తినటం మొదలు పెట్టిరి. శ్యామా బాబాను ఇట్లడిగెను - "ఎందుకీ పక్షపాతం? ఇతరుల పళ్లెములను నెట్టి వేయుదువు. వాటి వైపు చూడనైనా చూడవు. కాని దీనిని నీ దగ్గరకు ఈడ్చుకొని తినుచున్నావు. ఈమె తెచ్చిన భోజనం అంత రుచికరమా?" అప్పుడు బాబా ఇట్లనిరి - "ఈ భోజనం యథార్థంగా మిక్కిలి అమూల్యమైనది. ఒక జన్మలో ఈమె ఒక వర్తకుని ఆవు. ఇంకొక జన్మలో ఈమె తోటమాలి ఇంటిలో జన్మించెను. తదుపరి ఒక క్షత్రియుని ఇంటిలో జన్మించి ఒక వర్తకుని వివాహమాడెను. తర్వాత ఒక బ్రాహ్మణ.కుటుంబంలో జన్మించెను. చాలాకాలం పిమ్మట నేను ఆమెను చూసితిని. కావున ఆమె పళ్లెం నుండి మరికొన్ని ముద్దలను తీసుకొని తిననిమ్ము" ఇట్లనుచు బాబా ఆమె పళ్లె మును ఖాళీ చేసిరి. చేతులు కగుడుకొనిరి. ముఖ ప్రక్షాళనం చేసిరి. తర్వాత త్రేన్పులు తీయుచు తన గద్దెపైన కూర్చొండిరి. అప్పుడు ఖాపర్డే భార్య బాబాకు నమస్కరించి కాళ్లను పిసుక సాగెను. అంతట బాబా ఆమె చేతులను తోముట ప్రారంభించిరి. భగవంతుడు, భక్తురాలు ఒకరు మరొకరికి సేవ చేయుట అను వింత దృశ్యమును చూసి అక్కడున్న వారందరూ మిగుల ఆశ్చర్యపడిరి.

బాబా ఖాపర్డే భార్య నిజమైన ప్రేమకు మిగుల సంతసించి ఆమెకు ఒక సలహా నిచ్చిరి - "రాజారామ అను మంత్రమును ఎల్లప్పుడు జపించుము. ఇట్లు చేసినచో నీకు మేలగును. నీ మనస్సు శాంతించును"

ఉపవాసాలు ఆరోగ్య సూత్రాలేకాని ఆధ్యాత్మిక సూత్రాలు కావు

ఈ సంఘటన వల్ల మనకు గురుశిష్యులు ఇద్దరూ పరస్పరం ప్రేమించి సేవ చేసుకోన వలెననియు, వారిద్దరి మధ్య ఎట్టి భేదం లేదనియు, వారిద్దరూ ఒకటేననియు, ఒకరు లేనిదే మరొకరు లేరనియు స్పష్టమగుచున్నది.

గురువును సేవించటం వల్లనే మోక్షం లభిస్తుంది

కాకా సాహెబు దీక్షిత్

హరి సీతారామ్ ఉరఫ్ కాకాసాహెబ్ దీక్షిత్ మధ్య పరగణాలలోని ఖాండ్వా గ్రామమందు వడనగర నాగర బ్రాహ్మణ కటుంబంలో జన్మించెను. అతడు ఖాండ్వాలోను, హింగన్ ఘాట్‌లోను ప్రాథమిక విద్యను పూర్తి చేసెను. నాగపూరులో మెట్రిక్‌వరకు చదివెను. బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టన్ కాలేజీలో చదివి 1883లో పట్ట భద్రుడయ్యెను. న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణుడై లిటిల్ అండ్ కంపెనీలో ఉద్యోగమునకు చేరెను. తుదకు స్వయంగా ఒక న్యాయవాదుల కంపెనీ పెట్టెను.

కాకా సాహెబు లండన్‌లో రైలు బండి ఎక్కుచుండగా కాలుజారి పడెను. వందల కొలది ఔషధములు వాడినను అతని కాలునొప్పి, కుంటితనం తగ్గలేదు. అతని మిత్రుడగు నానా సాహెబ్ సద్గురువగు సాయి వద్దకు వెళ్లమని సలహా ఇచ్చెను.

కొంత కాలం తర్వాత కాకాసాహెబు అహమ్మద్ నగర్ వెళ్లెను. అచ్చట అతడు మిరీకర్ యింటిలోదిగెను. అతడు వారి ఇంటిలో నున్న బాబా ఫోటోను చూచి తన మనసులో యిట్లు తలంచెను - "నేను షిర్డీకి వెళ్లి దర్శించ దలచిన వ్యక్తి నన్ను ఆశీర్వదించుటకు ఇచ్చట పటం రూపంలో నున్నారు".

శ్యామా నానాసాహెబు పాన్సే, అప్పా సాహెబు గద్రేల సలహాపై కాకా సాహెబు ను తీసుకొని షిర్డీ బయలుదేరెను. వారు కోపర్‌గావ్‌లో దిగిరి. అక్కడ షిర్డీకి బయలు దేరుచున్న నానాసాహెబును చూసి కాకాసాహెబు చాల సంతోషించెను. కాకా సాహెబు నానాసాహెబ్‌ను కౌగలించుకొనెను. వారు గోదావరిలో స్నానం చేసి షిర్డీ బయలుదేరిరి. షిర్డీ చేరి బాబా దర్శనం చేసుకొనిరి. బాబా దర్శనం చేసుకోగానే కాకా సాహెబు మనస్సు కరగెను. అతని కండ్లు ఆనంద బాష్పములచే నిండెను. బాబా కూడా వారి కొరకు కనిపెట్టుకొనియున్నట్లును, వారిని తోడ్కొని వచ్చుటకే శ్యామాను పంపినట్లు తెలిపిరి.

కాకా సాహెబు బాబాతో ఎన్నో సంవత్సరాలు గడిపెను. షిర్డీలో ఒక వాడాను కట్టి దానినే తన నివాసంగా ఏర్పరచుకొనెను.

ఒక రోజున కాకా సాహెబు భాగవతములో ఏకాదశ స్కంధంలోని ద్వితీయ అధ్యాయమును చదువుచుండెను. అది వృషభ కుటుంబంలోని నవనాథులు భాగవత ధర్మంలోని సూత్రములను జనక మహారాజునకు తెలుపుచున్న ఘట్టం. ఆ ఘట్టమును చదివిన కాకాసాహెబు ఎన్ని జన్మలెత్తినను మోక్షం పొందలేమను అభిప్రాయమునకు వచ్చెను. కాని శ్యామా అతనికి బాబా యందు నిశ్చలమైన విశ్వాసమున్న వారు నిరాశచెంద నక్కరలేదని తెలిపెను.

ఆ మరునటి ఉదయమే ఒక వింత జరిగెను. ఆనందరావు పాఖడే అనునతడు శ్యామాను వెదకుచు పురాణ కాలక్షేపం జరుగుచున్న స్థలమునకు వచ్చెను. కాకా సాహెబు భాగవతం చదువుచుండెను. పాఖడే శ్యామాకు తాను గాంచిన స్వప్నమును వివరించి చెప్పెను. స్వప్నంలో బాబా ఇట్లు తెలిపియుండిరి - "రక్షకమైన భక్తిగాక వేరేదియు మోక్షమును సాధించలేదు. గురుని పాదములు సేవించిన చాలును" పాఖడే స్వప్న వృత్తాంతం కాకాసాహెబు సందేహమును నివృత్తి చేసెను.

బాబా కాకాసాహెబునకు ఒక వాగ్దానం చేసియుండిరి - "అంత్య కాలమున నిన్ను విమానంలో తీసుకొని పోయెదను" 1926వ సంవత్సరం జూలై 5వ తేదీన కాకాసాహెబు హేమాడ్ పంత్‌తో కలిసి రైలులో వెళ్ళుచుండెను. అతడు బాబా విషయం మాట్లాడుచు హేమాండ్‌పంత్ భుజంపై తన తలను వాల్చి ఎట్టి బాధ, చింత లేక ప్రాణములు విడిచెను.

తన గురువునే సంపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించాలి

ఒకసారి పంతు అనునతడు బి.బి. & సి.ఐ. రైలులో ప్రయాణం చేయు చుండెను. అతడు ఎచ్చటికో వెళ్ళవలయునని తలంచుచుండెను. కాని అకస్మాత్తుగా అతడు రైలులో తన బంధువులను, స్నేహితులను కలిసెను. వారందరూ షిర్డీ వెళ్ళు చుండిరి. వారు పంతును కూడ షిర్డీ రమ్మని కోరిరి. పంతు మరొక గురువును నమ్ముకొని యుండుటచే షిర్డీ వెళ్ళదలచలేదు. కాని బంధువుల, మిత్రుల మాటను కాదనలేక షిర్డీ బయలుదేరెను.

వారందరూ ఉదయమే షిర్డీ చేరిరి. వారు 11 గంటలకు మసీదుకు పోయిరి. బాబాను, భక్తుల గుంపును చూసి వారందరూ సంతసించిరి. కాని పంతుకు మూర్ఛవచ్చి క్రింద పడెను. అతని బంధువులు, స్నేహితులు భయపడిరి. అతనికి స్పృహ తెప్పించుటకు ప్రయత్నించిరి. బాబా అతని ముఖంపై నీరు చల్లగా అతడు నిద్రనుండి లేచినవానివలే లేచి కూర్చొండెను. బాబా అతనికి ధైర్యం చెప్పిరి - "ఏమైనను కానిమ్ము. పట్టు విడవరాదు. నీ గురువునే నమ్ముకొనుము. ఎల్లప్పుడు నిలకడగా ఉండుము. ఎప్పుడు వారినే ధ్యానించుము" పంతు తన గురువును జ్ఞప్తికి తెచ్చుకొనెను. అతడు బాబా చేసిన మేలును సదా గుర్తుంచుకొనెను.

★ ★ ★

ఒక పేద బ్రాహ్మణుడు బాబాను ధన సహాయం కోరాడు. కాని లోలోపల ఆయన ముస్లిమనే శంక కూడా ఉంది. మొదట కొంతసేపు సాయి పట్టించుకోలేదు. కాని చివరకు ఒక కాగితపు పొట్లమునిచ్చి, "దీనిని ఇంటికి తీసుకుపోయి నీవు, నీ బిడ్డలు తినండి. దారిలో విప్పి చూడవద్దు" అన్నారు.

అతడు తన ఊరికి బయలుదేరాడు. పోనుపోను కుతూహలం ఎక్కువైంది. చివరికి ఒక కాలువగట్టు చేరి ఆ పొట్లం విప్పి చూసాడు. అందులో పొట్టేలు మాంసం ఉండెను. అతడు దానిని కాలువలో పారవేసెను. నీటికి తగలగానే ఆ మాంసం బంగారంగా మారి, చూస్తుండగానే మునిగిపోయింది. అతడు నిరాశతో తన పైపంచను ఆ కాలువలో పిండుకొనెను. అప్పుడు అందులో ఒక సన్నని బంగారు పోగు కనిపించింది.

దీనిని బట్టి సద్గురువును సంపూర్ణంగా విశ్వసించిన నాడే కృతార్థుడవుతాడని తెలియుచున్నది.

★ ★ ★

సాఠేకు ఏడు రోజులు గురుచరిత్రను పారాయణం చేసిన మాత్రాన ఫలితం కలిగినదనియు, తాను నలుబది సంవత్సరముల నుండి పారాయణం చేయుచున్నను ఎట్టి ప్రయోజనం చేకూరలేదేమని హేమాడ్ పంత్ మిగుల దుఃఖం చెందెను.

ఈ విషయమును తెలుసుకొన్న బాబా అతనిని పిలిచి శ్యామా వద్దకు వెళ్ళి 15 రూపాయల దక్షిణ తీసుకొని, అతనితో కొంతసేపు మాట్లాడి రమ్మని చెప్పిరి.

హేమాడ్ పంత్ శ్యామా వద్దకు వెళ్ళి దక్షిణ విషయం తెలిపెను. శ్యామా తన వద్ద డబ్బు లేదనియు, డబ్బుకు బదులుగా తన 15 సాష్టాంగ నమస్కారములను తీసుకొని బాబా వద్దకు వెళ్ళమని అతనితో చెప్పెను. తర్వాత మాటల సందర్భమున శ్యామా అతనికి రాధాబాయి దేశముఖ్ కథను తెలిపెను.

రాధాబాయి దేశముఖ్

రాధాబాయి అను ముసలమ్మ యుండెను. ఆమె భాశాబా దేశ్‌ముఖ్ తల్లి. ఆమె బాబా కీర్తిని విని, వారిని చూడవలెనని షిర్డీ వచ్చెను. ఆమె బాబాను గాఢముగా ప్రేమించెను. ఆమె బాబాను తన గురువుగా చేసికొని ఏదైనా ఉపదేశం పొంద వలెనని నిశ్చయించుకొనెను. బాబా మంత్రోపదేశం చేయనిచో ఉపవాసముండి మరణించదలచెను. ఆమె అన్నపానాదులు వదిలిపెట్టి మూడు రోజులు గడచెను. శ్యామా బాబాకు ఆ విషయం తెలిపి ఆమెను కరుణించవలసిందిగా కోరెను.

బాబా ఆమెను పిలిపించి ఇట్లు చెప్పిరి - "నేను నా గురువును గురించి చెప్పెదను. దాని వలన నీకు మిగుల ప్రయోజనం చేకూరును. నేను నా గురువును 12 సంవత్సరములు ఆశ్రయించితిని. వారు నన్ను పెంచిరి. భోజనమునకు గాని, వస్త్రమునకుగాని ఎట్టి లోటు లేకుండెను. వారు పరిపూర్ణులు. వారు నన్ను మిక్కిలి ప్రేమించెడివారు. ఆ విధమైన గురువేయుండరు. నేను రాత్రింబవళ్ళు నిద్రాహార ములు మాని వారివైపే దృష్టి నిలిపితిని. వారిని చూడనిచో నాకు శాంతి లేకుండెను. వారి ధ్యానం, వారి సేవ తప్ప నాకు మరొక ఆలోచన ఉండెడిది కాదు. వారే నా ఆశ్రయం. నా మనస్సు ఎల్లప్పుడు వారియందే లగ్నమై ఉండెడిది. వారు నా చెవిలో ఎట్టి మంత్రమును ఊదలేదు. కాని నాకు వారిని వదలిపెట్టే తలంపే కలుగలేదు. నేను వారితోనే యుండుటకు, వారిసేవ చేయుటకు, వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని, వారు నా తలను గొరిగించిరి. వారు రెండుపైసలు దక్షిణ అడిగిరి. ఒక పైసా దృఢమైన విశ్వాసం, రెండవ పైసా సహనం. నేను ఈ రెంటిని సమర్పించగా వారెంతో సంతసించిరి.

నా గురువు నా నుండి మరేమియు కోరలేదు. వారు నన్ను ఉపేక్షించక సర్వకాల, సర్వావస్థలయందును నన్ను కాపాడెడివారు. నేను వారితో కలిసి ఉండెడి వాడను. ఒక్కొక్కప్పుడు వేరుగా ఉండెడివాడను. కాని వారి ప్రేమకు ఎన్నడూ లోటుం

డేది కాదు. ఒక ఒడ్డున నున్న తల్లి తాబేలు మరొక ఒడ్డున నున్న పిల్ల తాబేలును తన దృష్టి మాత్రముచే పెంచునట్లు, నా గురువు నన్ను ఎంతో ప్రేమతో కాపాడెరి.

కాబట్టి నీవు ఎవరి వద్ద ఎట్టి మంత్రోపదేశం పొందుటకు ప్రయత్నించ వద్దు. నీ గురువు యందు సంపూర్ణ విశ్వాసం కలిగియుండుము. సహనంతో వ్యవహరించుము. నీకంతా మేలు జరుగును.

బాబా ఉపదేశం ముసలమ్మకు బాగా నచ్చెను. ఆమె బాబాకు నమస్కరించి ఉపవాసం మానుకొనెను.

ఈ కథ వలన హేమాడ్ పంత్‌నకు కూడా మిగుల ప్రయోజనం చేకూరెను. అతని మానసిక చాంచల్యం తగ్గెను. అతడు సత్యమార్గమును కనుగొన గలిగెను.

బి.వి. దేవ్

బి.వి.దేవ్ దహనులో మామలతదారుగా ఉండెను. అతని తల్లి 25-30 నోములు నోచెను. ఆమె వానికి ఉద్యాపన చేయదలచెను. ఆ శుభ కార్యమునకు బాబా వచ్చిన బాగుండునని తలంచెను. ఈ విషయమును జోగ్‌కు తెలిపెను. జోగ్ ఆ సంగతి బాబాకు తెలియపరచెను. బాబా జోగ్‌తో ఇట్లనిరి - "నన్నే జ్ఞాపకం ఉంచుకొను వారిని నేను మరువను. నన్ను ప్రేమతో పిలుచువారి వద్దకు నేను పరుగెత్తిపోయి ప్రత్యక్షమగుదును. నాకెట్టి వాహనంతోను పనిలేదు. నేను, నీవు, మరొకరు సంతర్పణకు వస్తున్నట్లుగా దేవ్‌కు వ్రాయుము" జోగ్ ఆ విషయమును దేవ్‌కు తెలిపెను. దేవ్ అందుకు ఎంతగానో సంతసించెను.

ఉద్యాపనకు కొద్దిరోజులు ముందుగా బెంగాలీ దుస్తులను ధరించిన ఒక సన్యాసి దేవ్ వద్దకు వచ్చెను. ఆ సన్యాసి దేవ్ సహాయంతో గోసంరక్షణకు గాను చందాలు వసూలు చేయదలచెను. కాని దేవ్ అతనిని కొన్ని నెలల తర్వాత రమ్మనెను.

ఆ సన్యాసి ఉద్యాపన రోజున 10 గంటలకు దేవ్ ఇంటికి ఇద్దరు కుర్రాళ్లతో వచ్చెను. సన్యాసి చందా కొరకు వచ్చి ఉంటాడని దేవ్ తలంచెను. కాని ఆ సన్యాసి భోజనం కొరకు వచ్చానని చెప్పెను. దేవ్ ఆ ముగ్గురికి భోజనం ఏర్పాటు చేసెను. దేవ్ ఉద్యాపనకు బాబా రాలేదేమని ఆలోచించు చుండెను. జోగ్ నుండి వచ్చిన ఉత్తరమును బట్టి బాబా సన్యాసి రూపంలో వచ్చి తన మాటను నిలుపుకొన్నారని తెలుసుకొని దేవ్ చాల సంతసించెను.

దీనిని బట్టి సద్గురువు శరణును పూర్తిగా కోరినచో భక్తుల శుభ కార్యము లన్నియూ సత్యముగా నెరవేరునని తెలియును.

సర్వము శ్రీ సాయి రామార్పణమస్తు

గురువు ఆజ్ఞను పాటించుటే శిష్యుని కర్తవ్యం

ఒకసారి షిర్డీలో కలరా భయంకరంగా వ్యాపించింది. గ్రామంలో మేకలను కోయరాదను నిబంధనను పంచాయతీవారు విధించిరి.

ఒకనాడు ఒక వ్యక్తి మసీదుకు ఒక మేకను తెచ్చెను. అది ముసలిది. అది అత్యంత దుర్బలంగాను, చావుటకు సిద్ధంగాను ఉండెను. సాయిబాబా దానిని ఒక కత్తి వ్రేటుతో నరికి బలి వేయమని బడేబాబాకు చెప్పిరి.

బడేబాబాకు, సాయిబాబాకు సన్నిహిత సంబంధం ఉండెను. బడేబాబా ఎల్లప్పడు సాయిబాబాకు కుడివైపున కూర్చొనువాడు. అతడు చిలిము పీల్చిన తర్వాతనే సాయిబాబా చిలిము పీల్చి దానిని ఇతరులకు ఇచ్చెడివారు. మధ్యాహ్న సమయమున సాయిబాబా బడేబాబాను తన ఎడమ ప్రక్కన కూర్చొండ బెట్టుకొని భోజనం చేయుచుండిరి. వారు వసూలు చేసిన దక్షిణ నుండి బడేబాబాకు రోజుకు 50 రూపాయలు చొప్పన ఇచ్చుచుండిరి. బడేబాబా బయటికి వెళ్ళునప్పడు సాయిబాబా 100 అడుగుల వరకు అతనిని అనుసరించెడివారు.

బడేబాబా మేకనేల అనవసరముగా చంపుటయని తలంచి సాయిబాబా మాటను నిరాకరించెను. అప్పడు సాయిబాబా ఆ పనిని శ్యామాకు అప్పజెప్పిరి. శ్యామా రాధాకృష్ణ ఆయి వద్దకు వెళ్ళి కత్తిని తెచ్చెను. కాని రాధాకృష్ణ ఆయి ఆ కత్తిని వెంటనే తిరిగి తెప్పించుకొనెను. అంతట శ్యామా మరొక కత్తిని తెచ్చుటకు వెళ్ళెను. కాని ఎంతసేపటికి తిరిగి రాలేదు.

అప్పడు కాకాసాహెబ్ దీక్షిత్ వంతు వచ్చెను. అతడు సాఠేవాడాకు వెళ్ళి కత్తిని తెచ్చి ఆ మేకను చంపుటకు సిద్ధపడెను. అతడు తన ధోవతిని ఎత్తి బిగించి కట్టుకొనెను. కత్తిని పైకెత్తి బాబా ఆజ్ఞకు ఎదురు చూచుచుండెను. బాబా అతనితో 'ఏమి ఆలోచించుచున్నావు? నరుకుము' అని గద్దించిరి. కాకా సాహెబ్ కత్తి మేకపై పడబోగా బాబా ఇట్లనిరి - "నీవు ఎంతటి కఠినాత్ముడవు? బ్రాహ్మణుడవై మేకను చంపెదవా?" అప్పడు కాకా సాహెబ్ వినమ్రతతో ఈ విధంగా బదులిచ్చెను - "నీ అమృత వాక్కే మాకు చట్టం. నీ ఆజ్ఞను పాటించుటే మా కర్తవ్యం. అది ఉచితమా, కాదా అనునది మాకు అనవసరం. గురువు ఆజ్ఞను అక్షరాలా పాటించుటే మా విధి, మా ధర్మం"

ఊరకనే చదువుటవలన ప్రయోజనం లేదు

అంతట బాబా దానిని 'తకియా' (ఫకీరు కూర్చొను స్థలం) వద్దకు తీసుకొని వెళ్ళసాగిరి. అది మార్గమధ్యముననే ప్రాణాలను వదిలెను. దీనిని బట్టి గురువు ఆజ్ఞను పాటించువాడే ఉత్తమ శిష్యుడని తెలియుచున్నది.

బాబా మన సద్గురువు
వారి పాదాలే మన ఆశ్రయ స్థానం
వారి మాటలను ఆచరించుటే మన కర్తవ్యం.

బాబా భక్తులకు అవసరమైనదే ఇచ్చే వారు

శ్యామా ఒకనాడు "బాబా! నీవెందరికో సిరి సంపదలిచ్చావు. నాకివ్వలేదేమి?" సాయి ఎంతో ప్రేమతో, "షామా! నీకు సిరిసంపదలు తగవు. నీకు ఇవ్వవలసింది వేరుగా ఉంది" అని అన్నారు.

ఒకసారి సింధీ వర్తకుడొకడు శ్యామాకు బంగారు నాణాలు సమర్పించబోతే, సాయి అతనిని కఠినంగా వారించారు. అతనికి ఇవ్వదలచిందేమో సాయి తమ చర్యల ద్వారా తెలియజేసారు.

ఒకనాడు కాకా మహాజని ఏకనాథ భాగవతం తీసుకొని షిర్డీకి వచ్చెను. శ్యామా ఆ పుస్తకమును చదువుటకై మసీదుకు తీసుకొని పోయెను. అచ్చట బాబా దానిని తీసుకొని చేతితో తాకి, కొన్ని పుటలను త్రిప్పిరి. తర్వాత బాబా దానిని శ్యామాకిచ్చి ఇట్లనిరి - "ఇది నీకు పనికివచ్చును. కనుక దీనిని నీ వద్ద ఉంచుకో. కాకా మహాజనికి ఇవ్వక్కరలేదు".

ఒకసారి రామదాసి (రామదాసు భక్తుడు) షిర్డీకి వచ్చెను. అతడు మసీదులో విష్ణు సహస్రనామమును పారాయణ చేయుచుండెను. బాబా ఆ పుస్తకమును శ్యామాకిచ్చి అతనితో దానిని పారాయణ చేయించదలచిరి. అందువలన ఒక రోజున రామదాసి దానిని పారాయణ చేయుచుండగా బాబా అతనిని పిలిచి తనకు కడుపునొప్పిగా ఉన్నదనియు, బజారునకు వెళ్ళి సోనాముఖిని తీసుకొని రమ్మనియు చెప్పిరి. రామదాసి సోనాముఖిని తెచ్చుటకు బజారునకు వెళ్ళెను. అప్పుడు బాబా అతని విష్ణు సహస్రనామ పుస్తకమును తీసుకొని శ్యామాకిచ్చి, "ఇదెంతో శక్తివంతమైంది. ఒకప్పుడు నాకు గుండెదడ వచ్చి మరణం తప్పదని అనిపించింది. అప్పుడు దీనిని హృదయానికి హత్తుకోగానే, భగవంతుడు దిగివచ్చి

వ్యాధి తగ్గించినట్లు అనిపించింది. ఇది తీసుకొని రోజుకు ఒక నామమైనా భావయుక్తంగా నెమ్మదిగా చదువుము. ఎంతో మేలు చేస్తుంది", అన్నారు.

శ్యామా ఆ పుస్తకమును తీసుకొనిన కోపిష్టియగు రామదాసి తనపై కయ్యమునకు వచ్చుననెను. కాని బాబా శ్యామాకు దానిని బలవంతంగా ఇచ్చిరి. విష్ణుసహస్రనామ పారాయణం చిత్తశుద్ధికి ఒక చక్కటి మార్గమని చెప్పిరి.

శ్యామా తలచిన విధముగనే బజారు నుండి తిరిగి వచ్చిన రామదాసి శ్యామాతో తగువు పెట్టుకొనెను. అప్పుడు బాబా రామదాసితో ఇట్లు చెప్పిరి - "నీవు విచిత్రమైన గ్రంథములను నిత్యం పారాయణ చేయుచుంటివి. కాని నీ మనస్సు ఇంకను అపవిత్రముగాను, అస్వాధీనముగాను ఉన్నట్లున్నది. నీవు ఎట్టి రామదాసి వయ్యా! ఒక పుస్తకం కొరకు శ్యామాతో పోట్లాడుచున్నావా? శ్యామా మనవాడు కాదా? ధనమిచ్చిన పుస్తకములు అనేకం వచ్చును. కాని మనుష్యులురారు. బాగా ఆలోచింపుము. తెలివిగా ప్రవర్తింపుము. శ్యామాకు దానితో ఎట్టి సంబంధం లేదు. నేనే దానిని తీసి శ్యామాకు ఇచ్చితిని. దానిని చదివి అతడు మేలు పొందునని తలంచితిని'

రామదాసి శాంతించెను. అతడు ఆ పుస్తకమునకు బదులుగా శ్యామా వద్ద నున్న 'పంచరత్న గీత' అను గ్రంథమును తీసుకొనెదననెను. శ్యామా ఆ పుస్తకమును ఎంతో ఆనందంతో ఇచ్చెదననెను. 'పంచరత్న గీత' ను చదువుట వలన రామదాసికి కూడ మేలు జరిగెను. హృదయంలో నున్న భగవంతుని తెలుసు కొనుటకు ఆ పుస్తకం ఉపకరించెను.

ఈ విధంగా బాబా శ్యామాకు పవిత్ర గ్రంథం, రామదాసికి వివేకం ప్రసాదించారు.

శ్రీ విష్ణుసహస్రనామం

తర్వాత బాబా భక్తులకు శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రము గురించి ఇట్లు తెలిపిరి - "ధర్మరాజు అంపశయ్యపై నున్న భీష్మాచార్యుని ఈ విధంగా ప్రశ్నించెను. - "1. లోకానికి ఆరాధ్యుడెవరు? 2. ఎవరిని ఆరాధించుట వలన మానవులకు శ్రేయస్సు కలుగును?" అప్పుడు భీష్ముడు ప్రాణం పోవు సమయాన ఇట్లు చెప్పెను - "జగత్ప్రభువు, దేవదేవుడు, అనంతుడు, పురుషోత్తముడగు మహా విష్ణువును సహస్ర నామములతో స్తోత్రం చేసిన జీవులందరకూ శుభం చేకూరును'

★ ★ ★

ఒకనాడు బాపు సాహెబ్ జోగ్ తిలక్ వ్రాసిన 'గీతా రహస్యం' అను పుస్తక మును తీసుకొని మసీదుకు వెళ్లెను. అతడు బాబాను నమస్కరించబోగా ఆ పుస్తకం క్రింద పడెను. అదేమిటి అని బాబా అడిగిరి. బాపు సాహెబ్ దానిని బాబా కిచ్చెను. బాబా కొన్ని నిమిషములు ఆ పుస్తకంలోని పేజీలను త్రిప్పి తన జేబులో నుండి ఒక రూపాయతీసి పుస్తకముపై పెట్టి దక్షిణతో కూడ ఆ పుస్తకమును జోగుకు యిచ్చి దానిని పూర్తిగా చదువమనియు, దాని వల్ల మేలు కలుగుననియు పలికిరి.

గీతా రహస్యం

అచ్చట నున్న శ్యామా మొదలగు భక్తులు గీతా రహస్యమును వివరించమని కోరిరి. అంతట బాబా గీతా రహస్యమును ఈ విధంగా బోధించిరి - "భగవద్గీత శ్రీకృష్ణ పరమాత్మ నోటి నుండి వెలువడినది. కృష్ణుడు అర్జుననకు గీతను ఉపదేశించి 18 అక్షౌహిణుల సేన నాశనానికి కారకుడయ్యెను. కనుక కృష్ణగీత హింసా ప్రబోధాత్మకంగా కనిపించును. కాని కృష్ణగీత భగవద్గీత అయిన విధాన మును వినండి.

భారతయుద్ధంలో కౌరవులందరూ నశించిరి. తొడలు విరిగిన సుయోధ నుడు రణరంగమున రక్తపుమడుగున దొర్లుతూ కొన ఊపిరితో ఉండెను. అచ్చటికి వచ్చిన చిరంజీవియగు అశ్వత్థామతో సుయోధునుడు ఇట్లనెను - "గురుపుత్రా! పంచపాండవుల చావు వార్తను విని నేను చనిపోయెదను" అంతట అశ్వత్థామ గుడారములో నిద్రించిన ద్రౌపది పంచ పుత్రులగు ఉప పాండవులను సంహరిం చెను. ఈ వార్తను తెలుసుకొన్న సుయోధనుడు ప్రాణములను వదిలెను.

ఉపపాండవుల మరణవార్త పాండవుల శిబిరమున వ్యాపించెను. ద్రౌపది నేలపైపడి దొర్లుతూ రోదించుచుండెను. కృష్ణార్జునులు అశ్వత్థామను బంధించి తెచ్చి ద్రౌపది దగ్గర నిలిపిరి. శ్రీకృష్ణ పరమాత్మ ద్రౌపదిలో ప్రవేశించెను. ఆమె ఉప పాండవుల చావుకు కారకుడైన అశ్వత్థామను చంపకుండా భీమార్జునులను నివారించెను. అందరూ ఆశ్చర్యపడిరి. అప్పుడు శ్రీకృష్ణుడు ఇట్లనెను - "ఈ అర్జుననకు గీతోపదేశం చేసి 18 అక్షౌహిణుల సైన్యము నాశనమునకు కారణమైన ఈ గీత కృష్ణగీతగా పరిగణింపబడుచున్నది. కృష్ణయైన ద్రౌపది కారణంగా 'కృష్ణ గీత' 'భగవద్గీత'గా అహింసాశక్తిని అందరికీ తెలియజేయును". ఇదియే గీతా రహస్యమని బాబా తెలుపగా అక్కడున్న భక్తులందరూ ఆశ్చర్యపడిరి.

అధికార మదముతో వచ్చిన వారిని నిరాదరించుట

1910వ సం॥లో ఆంగ్లేయులగు రెవిన్యూ కమీషనర్ కర్టిస్, అతని భార్య, జిల్లా కలెక్టర్ మాక్నెల్ షిర్డీలో చావడికి వచ్చారు. కమీషనర్ ఒక భక్తునితో, "పెద్ద ఉద్యోగులు దర్శనానికి వచ్చారు. సాయిని త్వరగా సిద్ధముకమ్మను" అని చెప్పాడు. సాయిని అలా ఎవరూ ఆజ్ఞాపించలేరని, ఆయన దయ కొరకు వేచి యుండవలసిం దేనని ఆ భక్తుడు పలికెను.

అరగంట తర్వాత బాబా భిక్షకు బయలుదేరుతుంటే శ్రీమతి కర్టిస్ నమస్క రించి "మహారాజ్! మీతో మాట్లాడాలి" అని అన్నది. బాబా, "నేను భిక్షకు వెళ్ళాలి. అరగంట ఆగు" అన్నారు. కాని 10 నిమిషములలోనే తిరిగి వచ్చారు. తమ కొరకే సాయి త్వరగా వచ్చారని తలచి శ్రీమతి కర్టిస్ మరలా నమస్కరించింది. సాయి "ఒక గంట ఆగు" అని చెప్పి మరలా భిక్షకు వెళ్ళారు. అహం దెబ్బతిన్న ఆ ఆంగ్లేయులు వెళ్ళిపోయారు. అధికార మదమును ప్రదర్శించు వారిని సాయి ఆదరించే వారు కాదనియు, వారి సహనమును పరీక్షించుటకే బాబా ఆ విధంగా చేసారనియు మనకు తెలియుచున్నది.

విశ్వాసం, సహనం లేని వానికి భగవంతుడు దూరముగా నుండును కదా!

భక్తుల నిజమైన ప్రేమను గుర్తించుట

1913 వ సం॥న శ్రీరామ నవమికి ముందు నామ సప్తాహం జరుగు చుండెను. ఎక్కడ చూసినా జనం కిటకిటలాడు చుండిరి. సాయి శ్యామాను పిలిచి, "గోడ అవతల ఒక వృద్ధుడు ఉన్నాడు, తీసుకొని రా" అన్నారు. "శ్యామా వెళ్ళి చూడగా ఒక వృద్ధుడుండెను. అతనినోట చొంగకారి, ఈగలు ముసురుచుండెను. శ్యామా అతనిని మసీదులోనికి తీసుకొని వచ్చెను. బాబా అతని మూటలోని కలకండను తీసుకొని, కొంచెం తిని, మిగిలినది అతనికిచ్చి, అతని తలపై చెయ్యిపెట్టి ఆశీర్వ దించిరి.

★ ★ ★

మసీదు ముంగిట ఎప్పుడూ ఒక కుక్క ఉండేది. సాయి దానికి రొట్టెలు పెట్టేవారు. ఒక రోజు దానిన మాధవ్ ఫస్లే "ఛీ పో!' అని తన్నాడు. "అది నా కొరకు వచ్చింది. నీ కొరకు కాదు. దానిని ఏమీ చేయవద్దు" అని బాబా అతనిని తీవ్రంగా మందలించారు.

★ ★ ★

ఒకసారి ఆత్మారాముని భార్య షిర్డీలో ఒక ఇంటి యందు దిగెను. మధ్యాహ్న భోజనం తయారయ్యెను. అందరికీ వడ్డించిరి. ఆకలితో నున్న ఒక కుక్క మొరగుట ప్రారంభించెను. ఆత్మారాముని భార్యలేచి ఒక రొట్టెముక్కను విసరెను. ఆ కుక్క ఎంతో మక్కువగా ఆ రొట్టె ముక్కను తినెను. ఆ రోజు సాయంకాలం ఆమె మసీదుకు పోగా బాబా ఇట్లనిరి - "తల్లీ! నీకు కడుపునిండా గొంతు వరకు భోజనం పెట్టినావు. నా జీవశక్తులు సంతుష్టి చెందినవి. ఎల్లప్పుడు ఇట్లే చేయుము. ఇది నీకు సద్గతి కలుగజేయును. నాయందిట్లే దయ ఉంచుము. మొదట ఆకలితో నున్న జీవికి భోజనం పెట్టిన పిమ్మట నీవు భుజింపుము. దీనిని జాగ్రత్తగా జ్ఞప్తి యందు ఉంచుకొనుము.

ఇదంతయూ అర్థంకాని ఆత్మారాముని భార్య బాబాతో ఇలా పలికెను. - "బాబా! నేను నీకెట్లు భోజనం పెట్టగలను? నేనే నా భోజనముకై యితరులపై ఆధారపడియున్నాను. నేను వారికి డబ్బిచ్చి భోజనం చేయుచున్నాను" అప్పుడు బాబా ఇట్లు చెప్పిరి - "నీవు ప్రేమతో ఇచ్చిన రొట్టెముక్కను తినగా ఇప్పటికీ త్రేపులు వస్తున్నవి. నీవు భోజనం చేయుటకు పూర్వం. ఏ కుక్కకు రొట్టె పెట్టితివో, ఆ కుక్కయు, నేను ఒక్కటియే. అట్లనే పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలగు నవన్నియూ నా అంశములే. నేనే వాని ఆకారంలో తిరుగుచున్నాను. ఎవరైతే నన్ను సమస్త జీవులలో చూడగలుగుదురో వారే నా ప్రియమైన భక్తులు. కాబట్టి నేను, తక్కిన జీవరాశి వేరువేరను భావమును వదిలిపెట్టి నన్ను సేవింపుము"

ఈ అమృత వాక్యములు వినగా ఆమె నేత్రములు కన్నీటితో నిండెను. దీనిని బట్టి భగవంతుడు సర్వజీవులయందు గలడను సత్యమును మనం తెలుసుకొనవలెను. అందువలన మనం సర్వజీవులపట్ల ప్రేమకలిగి యుండవలెను.

★ ★ ★

బురహాన్‌పూరులో ఒక మహిళ ఉండెను. ఒక రోజు ఆమె ఇంటి గుమ్మం వద్ద బాబా నిల్చొనియున్నట్లు, తినుటకు కిచిడీ అడుగుతున్నట్లు స్వప్నం గాంచెను. మేల్కొని చూడగా గుమ్మం వద్ద ఎవరూ లేకుండిరి. స్వప్నంలో చూసిన దృశ్యమునకు ఆమె ఎంతయో సంతసించెను. ఆమె ఆ విషయమును భర్తకు కూడా తెలిపెను.

ఒకరోజు ఆమె తన భర్తతో కలిసి షిర్డీ చేరెను. షిర్డీలో వారు రెండు నెలలుండిరి. వారు బాబాకు కిచిడీ సమర్పించుటకై షిర్డీ వచ్చి యుండిరి. కాని అందుకు 14 రోజుల వరకు వీలు కాలేదు. 15వ రోజున 12 గంటల సమయమున ఆమె కిచిడీ తీసుకొని మసీదు చేరెను. అప్పుడు అందరూ భోజనమునకై కూర్చొని యుండగా తెరవేయబడి యుండెను. అయినను ఆమె తెర పైకెత్తి లోపల ప్రవేశించెను. బాబా ఆమె కిచిడీ కొరకు ఎదురు చూస్తున్నట్లు కనిపించిరి. ఆమె కిచిడీ పెట్టగానే బాబా సంతోషంతో ముద్ద తర్వాత ముద్ద తినసాగిరి. బాబా ఆతురతను చూసిన వారందరూ ఆశ్చర్యపడిరి.

ఒక రామనవమికి మహానగరాల నుండి కోటీశ్వరులు ఎన్నెన్నో మిఠాయిలు తెచ్చి అర్పించారు. కాని సాయి, "నా భోజనమింకా రాలేదు" అని చెప్పారు. కొంత సేపటికి వారు శ్యామాతో, "ఈ జనములో నెట్టుకురాలేక ఒక ముదసలి పేదరాలు రోడ్డు ప్రక్కన చెట్టు క్రింద కూర్చొన్నది. ఆమెను తీసుకురా!" అన్నారు. ఆమె రాగానే బాబా ఆమెతో నాకేమి తెచ్చావన్నారు. ఆమె సాయి కోసం జొన్న రొట్టెలు తెచ్చి యుండెను. కాని మసీదులోని విలువైన నైవేద్యాలు చూచి సిగ్గుపడి ఏమీ తేలేదని చెప్పింది. అంతట సాయి ఆమె దాచిపెట్టుకొన్న మూట అడిగి తీసుకొని, "ఇదీ మన భోజనం" అంటూ ఎంతో ఇష్టంగా తిన్నారు.

బాబా! నీ ప్రేమ అసమానం.

సర్వజీవులను సమానంగా చూసే నీ దృష్టి అనుపమానం.

భక్తుల ప్రేమకు బానిసవయ్యే నీకు శతకోటి వందనాలు.

ఓం శ్రీ సాయిరామ్

నాలుగవ రోజు (ఆదివారం) పారాయణ

అమృత హృదయులారా! సర్వాంతర్యామియగు బాబా తన స్వహస్తములతో భక్తులకిచ్చే ఊదీ మహిమ, తదితర విషయములను గురించి నేడు తెలుసు కొందాం.

ఓం శ్రీ సాయిరామ్!

ఊదీతో రోగాలు హరియించు రూపం

బాబా భక్తుల వద్ద దక్షిణ అడిగి తీసుకొనేవారు. దక్షిణగా వచ్చిన మొత్తంలో కొంత దానం చేయుచుండిరి. మిగతా దానితో కట్టెలను కొని ధునిలో వేయు చుండిరి. ధుని నిరంతరం వెలుగుచుండెను. దానిలోని బూడిదనే బాబా ఊదీ అనుచుండిరి.

షిర్డీ నుంచి ఇంటికి పోవునపుడు బాబా భక్తులకు ఊదీ ప్రసాదమిచ్చి కొంత నుదుటిపై రాసి తన వరద హస్తమును వారి శిరస్సులపై ఉంచుచుండిరి. సంతోషముతోనున్నప్పుడు బాబా "కళ్యాణరామ! రా రమ్ము. గోనెలతోఊదీని తే తెమ్ము' ' మొదలగు పాటలను చాల శ్రావ్యముగా పాడుచుండిరి.

ఊదీ ద్వారా బాబా ప్రపంచంలో కనిపించు వస్తువులన్నియూ అశాశ్వతము లనియూ, కొడుకు, తండ్రి, తల్లి మన వారు కాదనియు; మనం ప్రపంచంలోనికి ఒంటరిగా వచ్చామనియు, ఒంటరిగానే ఈ లోకమును వదలి వెళ్ళుతామనియు భగవంతుడు ఒక్కడే శాశ్వతమనియు తెలుపుచుండిరి.

ఊదీ సర్వపాపములను హరియించును. అది అనేక విధములైన శారీరక, మానసిక రోగాలను కూడా నయం చేయును. క్రింద కొన్ని దృష్టాంతములు పేర్కొన బడినవి.

తేలుకాటుకు మందు

నారాయణ మోతీరాం జాని అనునతడు నాసిక్ నివాసి. అతడు బాబా మాట ప్రకారం ఉద్యోగంమాని 'ఆనందాశ్రమం' అను హోటలు పెట్టి బాగా అభివృద్ధి గాంచెను. అతనికి ఒకసారి తేలు కుట్టెను. ఊదీ రాసిన నొప్పి తగ్గునని తలంచి

ఊదీకై వెదికెను. అది కనిపించలేదు. అతడు బాబా పటం ముందు రాలి పడిన అగరు వత్తి బూడిదనే ఊదీగా భావించి నొప్పియున్న చోట రాసెను. క్షణంలో నొప్పి మాయమయ్యెను.

ఇరానీవాని కుమార్తె మూర్ఛ తగ్గుట

ఒక ఇరానీవాని కుమార్తెకు ప్రతి గంటకు మూర్ఛవచ్చుచుండెను. మూర్ఛ రాగానే ఆమె మాట్లాడలేకుండెను. కాళ్ళు - చేతులు ముడుచుకొని స్పృహ తప్పి పడిపోవుచుండెను. ఏ మందులూ పనిచేయలేదు. ఇరానీ ఒక స్నేహితుని సలహాపై కాకాసాహెబు దీక్షిత్‌ను అడిగి ఊదీ తెచ్చెను. దానిని ప్రతిరోజు నీటిలో కలిపి త్రాగించు చుండెను. ప్రతి గంటకు వచ్చు మూర్ఛ ఏడు గంటలకు ఒకసారి రాసాగెను. కొద్ది రోజుల తర్వాత పూర్తిగా తగ్గెను.

హర్దాపుర పెద్ద మనిషి మూత్రకోశంలోని రాయి కరగుట

హర్దాపుర (మధ్య పరగణాలు) నివాసియగు ఒక వృద్ధుడు మూత్రకోశపు రాయితో బాధపడుచుండెను. వృద్ధుడగుటచే ఆపరేషను చేయించుకొనుటకు భయపడెడి వాడు. ఒక రోజున ఆ గ్రామపు ఇనాముదారు అతని ఇంటికి వచ్చెను. అతడు బాబా భక్తుడు. అతని వద్ద ఊదీ ఉండెను. కొంత మంది స్నేహితుల సలహాపై వృద్ధుని కుమారుడు ఇనాముదారు వద్ద ఊదీని తీసుకొని దానిని నీళ్ళలో కలిపి తండ్రికియిచ్చెను. ఐదు నిమిషములలో ఊదీ గుణమిచ్చెను. రాయి కరిగి మూత్రం వెంబడి బయటకు వచ్చెను. వృద్ధుడు శీఘ్రముగా బాగయ్యెను.

శ్యామా మరదలు ప్లేగు నయమగుట

బాపాజీ సావూల్ శ్యామా తమ్ముడు. అతని భార్యకు ఒకసారి ప్లేగు వ్యాధి సోకెను. ఆమెకు తీవ్రమైన జ్వరం వచ్చెను. ఆమె చంకలో రెండు బొబ్బలు లేచెను. శ్యామా బాబా వద్దకు వెళ్ళి ఆమె వ్యాధిని నయం చేయమని కోరెను. బాబా వ్యాధి నయమగునని చెప్పిరి. వారు శ్యామాతో ఆమెకు ఊదీని పంపమనిరి. శ్యామా తన తమ్ముని ద్వారా ఊదీ పంపెను. బాపాజీ ఊదీని తన భార్య బొబ్బలపై పూసి కొంత నీళ్ళలో కలిపి త్రాగించెను. ఆమెకు బాగా చెమట వచ్చెను. జ్వరం తగ్గెను. అప్పుడు ఆమెకు మంచి నిద్రపట్టెను. మరుసటి ఉదయం ఆమె వ్యాధి నయమయ్యెను. ఇది తెలిసి బాపాజీ మిగుల ఆశ్చర్యపడి బాబాకు నమస్కరించెను.

ప్లేగు జబ్బు నివారణ

బాంద్రాలో బాబా భక్తుడు ఒకడుండెను. అతని కుమార్తె మరొక గ్రామమున ప్లేగు వ్యాధితో బాధపడుచుండెను. అతడు తన కుమార్తెకు ఊదీని పంప దలచెను. కాని అది అతని వద్ద లేకుండెను. కనుక అతడు ఊదీని పంపవలసిందిగా నానా సాహెబుకు కబురు పంపెను. అప్పుడు నానా సాహెబు భార్యతో కల్యాణ్‌కు పోవుటకై ఠాణా రైల్వే స్టేషన్ వద్ద ఉండెను. ఆ సమయమున అతని వద్ద కూడా ఊదీ లేకుండెను. అంతట అతడు రోడ్డుపై నున్న మట్టిని తీసి బాబా సహాయమును అభ్యర్థించి తన భార్య నుదుటిపై రాసెను. అప్పటి నుండి తన కుమార్తె వ్యాధి తగ్గిన దని తెలుసుకున్న బాంద్రా భక్తుడు చాల సంతసించెను.

మైనతాయి ప్రాణ రక్షణ దైవం

1904-1905 వ సం॥న నానాసాహెబు చాందోర్కర్ జామ్నేర్‌లో మామలత దారుగా (రెవిన్యూ ఉద్యోగిగా) ఉండెను. జామ్నేర్ ఖాందేష్ జిల్లాలో షిర్డీకి 100 మైళ్ల దూరమున ఉన్నది. నానాసాహెబు కుమార్తె మైనతాయి ప్రసవవేదనతో బాధ పడుచుండెను. ఆమె పరిస్థితి ఏమియు బాగుగ ఉండలేదు. నానాసాహెబు ఎన్నో మందులు వాడెను. కాని ప్రయోజనం లేకుండెను. బాబా జామ్నేర్‌కు దగ్గరున్న తన స్వగ్రామమునకు వెళ్ళుచున్న రామగిరీ బువా అనే గోసాయిని పిలిచి మార్గమధ్యమున జామ్నేర్‌లో కొంత విశ్రాంతి తీసుకొని నానాసాహెబుకు ఊదీని, హారతి పాటను ఇమ్మనిరి.

రామగిరి బువా తన వద్ద నున్న డబ్బు జల్గామ్ వరకు సరిపోవుననియు, జల్గామ్ నుండి జామ్నేరు వరకు రైలు టికెట్టుకు డబ్బు లేదనియు చెప్పెను. బాబా, "ఏమియు భయపడవద్దు. అన్ని ఏర్పాట్లు జరుగును. వెళ్ళు" అని చెప్పిరి.

రామగిరి బువా రాత్రి రెండున్నర గంటలకు జల్గామ్ చేరెను. అతని వద్ద రెండు అణాలు* మాత్రమే ఉండెను. బువా జామ్నేర్ వెళ్ళుటెలా అని ఆలోచించు చుండెను. ఇంతలో ఒక టాంగావాడు షిర్డీ నుండి వచ్చిన రామగిరి బువా ఎవరని కేక వేయసాగెను. బువా తానేనని చెప్పెను. అంతట టాంగావాడు నానాసాహెబు

★ పాత కాలపు నాణెములు

చాందోర్కర్ టాంగాను పంపాడని చెప్పెను. బువా ఆ టాంగాలో కూర్చొని జామ్నేర్ చేరెను. టాంగా దిగి మూత్ర విసర్జన చేసి బువా 2-3 నిమిషములలో తిరిగి వచ్చెను. అంతలో టాంగా కాని, టాంగావాడు కాని కనిపించలేదు. బువాకు ఎంతో ఆశ్చర్యం కలిగెను. తర్వాత అతడు నానాసాహెబు ఇంటికి వెళ్లెను. నానా సాహెబును అడుగగా తాను ఎట్టి టాంగాను పంపలేదని చెప్పెను. ఆ సంగతి విన్న రామగిరి బువాకు, స్టేషనులో టాంగావాడు తనను సాయి లాగానే పిలిచాడని, సాయి అన్ని ఏర్పాట్లు జరుగుతాయని చెప్పినదీ గుర్తొచ్చింది. అదంతా సాయి లీలేనని తెలుసు కొనవలెను.

బువా నానాసాహెబుకు ఊదీని, హారతిపాటను ఇచ్చెను. నానా సాహెబు ఊదీని నీళ్లలో కలిపి కుమార్తె మైనతాయికి ఇచ్చెను. తర్వాత సాయికి హారతిచ్చి పాటను పాడించెను. కొద్ది నిమిషములలోనే మైనతాయి ప్రసవం సుఖంగా జరిగెను. సరైన సమయంలో బాబా సహాయం చేసెనని నానాసాహెబు చాల ఆనందించెను.

బొంబాయి స్త్రీ సుఖ ప్రసవం

కాయస్థ ప్రభుజాతికి చెందిన ఒక బొంబాయి స్త్రీ ప్రసవించు సమయమున ఎక్కువ బాధ పడుచుండెను. ఆమె ఈసారి గర్భవతి కాగా ఆమె భర్త బాబా భక్తుడగు శ్రీరామ మారుతి సలహాపై షిర్డీకి తీసుకొని వెళ్లెను. దంపతులిద్దరూ కొన్ని మాసములు అక్కడే ఉండి బాబాను పూజించిరి. కొన్నాళ్లకు ప్రసవవేళ సమీపించెను. ఇంతకు పూర్వం వలె ఈసారి కూడా ఆమె మిగుల ప్రసవ బాధపడెను. బాబాను ధ్యానించెను. ఇరుగుపొరుగువారు వచ్చి బాబా ఊదీని నీళ్లలో కలిపి ఇచ్చిరి. ఐదు నిమిషములలో ఆమె ఎట్టి కష్టములు లేక ప్రసవించెను. బిడ్డ చనిపోయి యుండెను. కాని తల్లికి ఎట్టి ప్రమాదం సంభవించలేదు. వారు బాబాకు నమస్క రించిరి.

డాక్టరుగారి మేనల్లుని రాచకురుపు నయమగుట

నాసిక్ జిల్లాలోని మాలేగామ్‌లో ఒక డాక్టరుండెను. అతని మేనల్లుడు రాచ కురుపుతో బాధపడుచుండెను. ఎన్నో మందులు వాడిరి. ఆపరేషన్ కూడా చేసిరి. కాని అతని రాచకురుపు నయం కాలేదు. షిర్డీ బాబా మహిమను విన్న అతని తల్లి దండ్రులు అతనిని తీసుకొని షిర్డీ చేరి మసీదులో బాబా పాదములకు సాష్టాంగ

నమస్కారం చేసిరి. కుర్రవానిని బాబా ముందుంచి బాబాను ఎంతో వినయంగా వేడుకొనిరి. బాబా వారికి అభయమొసంగిరి - "ఇది మసీదు కాదు, ఇది ద్వారకా మాయి. ఇందు కాలుమోపిన వారు ఆరోగ్యమును, ఆనందమును పొందుదురు. వారి కష్టములు గట్టెక్కును." తర్వాత బాబా ఆ కుర్రవాని కురుపు మీద తన చేతిని త్రిప్పిరి. ప్రేమాస్పదమైన చూపులను ప్రసరింపజేసిరి. ఊదీ రాయగా కురుపు నెమ్మదించెను. కొన్ని రోజుల తర్వాత పూర్తిగా నయమయ్యెను. ఆ కుర్రవాని తల్లిదండ్రులు ఎంతో సంతసించిరి. బాబాకు కృతజ్ఞతలు తెలిపి షిర్డీ విడిచిరి.

నిద్రలేమి మటుమాయమగుట

బాంద్రా నివాసి ఒకడుండెను. అతడు కాయస్థ ప్రభు జాతికి చెందినవాడు. అతడు చాల కాలం నుండి నిద్ర పట్టక బాధ పడుచుండెను. నిద్రకు ఉపక్రమించగనే అతనికి గతించిన తండ్రి స్వప్నంలో కని పించి అతనిని తిట్టి అతని నిద్రకు భంగం కలిగించుచుండెను. బాబా భక్తుడొకడు అతనికి ఊదీనిచ్చి ఈ సలహా నిచ్చెను - "ప్రతిరోజు నిద్రించుటకు ముందు కొంచెం ఊదీని నుదుటికి రాసుకొని మిగతా పొట్లమును తలగడ క్రింద పెట్టుకొమ్ము" ఆ వ్యక్తి అట్లే చేసెను. అతనికి సుఖనిద్ర పట్టెను. అప్పటి నుండి ఆ వ్యక్తి బాబా భక్తుడయ్యెను.

చాలవని తలంచిన భోజన పదార్థములు మిగులుట

బాలాజీ బాబా గొప్ప భక్తుడు. అతడు షిర్డీలో బాబా సంచరించు మార్గముల నన్నింటినీ శుభ్రపరచెడివాడు. అతడు మరణించెను. అతని సాంవత్సరికం నాడు నేవాస్కరు తన బంధువులను భోజనమునకు పిలిచెను. భోజన సమయానికి పిలిచిన వారికంటె మూడురెట్లు బంధువులు వచ్చిరి. నేవాస్కరు భార్య వండిన పదార్థాలు చాలవనియు, దాని వల్ల కుటుంబ గౌరవం మంట గలియుననియు బాధపడెను. ఆమె అత్తగారు ధైర్యం పలుకుచూ ఇట్లనిరి - "భయపడకుము. ఇది మనది కాదు. ఇది సాయి ఆహారమే. అన్ని పాత్రలను గుడ్డలతో పూర్తిగ కప్పివేయుము. వానిలో కొంచెం ఊదీ వేయుము. గుడ్డలను పూర్తిగ తీయకుండా వడ్డన

చేయుము. సాయి మనలను కాపాడును". సేవాస్కరు భార్య ఆ ప్రకారమే చేసెను. వచ్చిన వారికి బోజన పదార్థములు సరిపోవుటయేగాక ఇంకా మిగిలెను.

ఊదీ ద్వారా ఈ దృశ్య ప్రపంచం అశాశ్వతమనే పరమ సత్యాన్ని భక్తులకు అనుభవంలోనికి తెచ్చిన బాబాకు ప్రణామాలు.

బాబా ప్రసాదంగా తీసుకొన్న ఊదీ సకల పాపహరి; సకల రోగ హరి

ఓం శ్రీసాయిరామ్

బాబా వింత వైద్యం

తొలిరోజులలో బాబా గ్రామంలో రోగులను పరీక్షించి ఔషధములు ఇచ్చెడి వారు. వారి చేతితో ఇచ్చిన మందులు బాగుగా పనిచేసెడివి. అందువల్ల ఆయనకు మంచి హస్తవాసి గల డాక్టరుగా పేరు వచ్చెను. ఒక సంఘటనను ఇక్కడ పేర్కొన వచ్చు.

ఒక భక్తుని కండ్లు వాచి మిక్కిలి ఎర్రబడెను. షిర్డీలో డాక్టరు దొరకలేదు. అతనిని బాబా వద్దకు తెచ్చిరి. అప్పడు బాబా చేసిన చికిత్స చాలా విచిత్రముగా వుండెను. బాబా నల్ల జీడిగింజలను నూరి రెండు మాత్రలు చేసి ఒక్కొక్క కంటిలో ఒక్కొక్క దానిని వుంచి గుడ్డతో కట్టు కట్టిరి. మరుసటి దినం కట్లను విప్పి నీళ్లను ధారగా పోసిరి. నల్లజీడి పిక్కల మందు పెట్టినప్పడు సున్నితమైన కండ్లు మండనే లేదు. అదే బాబా చేసిన విచిత్రం.

బాబా భక్తుల కోరికలను తీర్చువాడు (నానావల్లి)

షిర్డీలో నానావల్లి అను ఒక విచిత్ర పురుషుడు ఉండెను. అతడు బాబా భక్తుడు. అతడు బాబా పనులను చక్కబెట్టువాడు. అతనికి బాబా గద్దెపై కూర్చొండ బుద్ధి పుట్టెను.

ఒకరోజు బాబాను ఆసనంపై కూర్చొండబెట్టి భక్తులు పూజలు చేయుచుం డిరి. అంతలో నానావల్లి బాబా వద్దకు వచ్చి "లే ! ఆసనం మీద నేను కూర్చోవాలి" అని గర్జించాడు. బాబా వెంటనే ఎంతో నిర్లిప్తంగా లేచి గద్దెను ఖాళీ చేసారు.

నానావల్లి గద్దెపై కొంతసేపు కూర్చుండి లేచి బాబాను తిరిగి కూర్చొనమనెను. బాబా గద్దెపై తిరిగి కూర్చొనగా నానావల్లి బాబా పాదములకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్ళిపోయెను. నానావల్లి ఎంత పుణ్యాత్ముడో, బాబా మహాసమాధి చెందిన పదమూడవనాడు దేహ త్యాగం చేసెను.

శ్యామా, "బాబా! మీరు నానావల్లిని మీ ఆసనంపై ఎందుకు కూర్చోబెట్టితిరి' ' అని అడిగెను. అందుకు బాబా కొంతమంది నన్ను భగవాన్ అంటున్నారు. దాని వల్ల నాకు గర్వం ఏమైనా వచ్చిందేమోనని నానావల్లి నన్ను పరీక్షించాడు. ఆ పరీక్షలో నేను గెలిచిన తర్వాతనే అతడు ఆ ఆసనమును నాకు తిరిగి అప్పగించాడు. అతడు నాలో ఎట్టిమార్పు లేదని తెలుసుకొన్నాడు.

దత్తరూపం

ఒకసారి బినివల్లె షిర్డీ వెళ్ళదలచెను. కాని షడ్డకుడైన నానాసాహెబుతో కలిసి వెళ్ళిన బాగుండుననియు, అతడు షిర్డీకి సంబంధించిన అనేక విషయాలు తెలుపుననియు తలంచెను. అందుచే అతడు ఒకనాడు నానాసాహెబు గ్రామము నకు వెళ్ళెను. అతడు నానాసాహెబును కలిసి ఇట్లనెను - 'నీతోపని వుండి వచ్చాను' అప్పడు నానాసాహెబు తాను షిర్డీకి వెళ్ళుచున్నట్లు, అందువల్ల 2 -3 రోజుల వరకు అతని పని చూడటానికి వీలవుదనియు చెప్పెను. అంతట బినివల్లె తాను కూడ షిర్డీ వచ్చెదనని పలికెను. అందుకు నానాసాహెబు ఎంతో సంతసించెను.

బినివల్లె, నానాసాహెబు కలిసి షిర్డీ వెళ్ళిరి. నానాసాహెబు బినివల్లెతో బాబా దత్తదేవుని అవతారమనియు, బాబాను కలుసుకొనుటకు ముందు దత్తదేవుని దర్శించవలయుననియు చెప్పెను. బినివల్లె అట్లే చేయుదమని పలికెను. దత్తదేవుని దర్శించుటకు ముందు పవిత్రమైన గోదావరి నదిలో స్నానం చేయుటకు వెళ్ళిరి. స్నానం చేయుచుండగా నానాసాహెబు కాలుకు ముల్లు గుచ్చుకొనెను. అతడు నడవ లేక పోయెను. దత్తదేవుని దర్శించుటకు తన అశక్తతను వ్యక్తపరచెను.

బినివల్లె, నానాసాహెబు షిర్డీ చేరి బాబా దర్శనమునకై వెళ్ళిరి. బాబా నానాసాహెబుతో మాట్లాడుచు హఠాత్తుగా అతనిపై కోపమును ప్రదర్శిస్తూ ఇట్లనిరి - "ఇన్నాళ్ళు నా సహవాసం చేసియు ఇట్లేల చేసితివి?" తొలుత నానాసాహెబుకు బాబా కోపమునకు గల కారణం అర్థం కాలేదు. తర్వాత దత్తదేవుని దర్శించకుండా బాబా దర్శనం చేసుకొనుట తప్పగదా అని తెలుసుకొని బాధ పడెను.

★ ★ ★

ఎవడైతే నేలపై చక్కగా పడుకోలేడో అతడు ఉన్నత స్థానం పొందలేడు

అక్కల్‌కోట మహారాజు దత్త సంప్రదాయానికి చెందినవారు. అందువల్ల సాయిబాబా తాను అక్కల్‌కోట మహారాజు అవతారమని పేర్కొన్నారు.

మొట్టమొదట భాయి కృష్ణజీ అక్కల్‌కోట మహారాజు భక్తుడు. అతడు 1912 వ సం॥లో అక్కల్‌కోటకు పోవుచు మార్గమధ్యమున షిర్డీయందు దిగెను. బాబా దర్శనం చేసుకొనెను. ఆ తర్వాత అక్కల్‌కోటకు వెళ్లదలచి బాబా అనుమతి తీసు కొనుటకై వెళ్లెను. అప్పుడు బాబా ఇట్లనిరి - "అక్కల్ కోటలో ఏమున్నది? అక్కడికి ఏల పోయెదవు? అక్కడ ఉండే మహారాజు ప్రస్తుతం ఇక్కడున్నారు. వారు నేనే" ఇది విని కృష్ణజీ అక్కల్‌కోట వెళ్లుట మానుకొనెను. ఆ తర్వాత అతడు అనేక సార్లు షిర్డీయాత్ర చేసెను.

బాబా భక్తులకిష్టమైన రూపంలో దర్శనమిచ్చుట

సాయిబాబాకు భగవన్నామ స్మరణయందును, సంకీర్తన యందును మిక్కిలి ప్రీతి యుండెడిది. వారు ఎల్లప్పుడు 'అల్లా మాలిక్' (అల్లాయే యజమాని) అను చుండెడివారు. వారు నామ సప్తాహం చేయుచుండిరి. నామ సప్తాహమనగా ఏడు రోజులు రాత్రింబవళ్ళు భగవన్నామ స్మరణ చేయుట అని అర్థం.

ఒకసారి సాయిబాబా దాసగణు మహారాజును నామ సప్తాహం చేయమనిరి. సప్తాహం ముగియునాడు విఠలుని దర్శనం కలుగునని వాగ్దానం చేసినచో తాను నామ సప్తాహం చేయుదునని దాసగణు ఒక షరతు విధించెను. బాబా అందుకు అంగీకరించిరి. భక్తుడు భక్తి ప్రేమలచే కీర్తించిన విఠలుడు ఇక్కడే అవతరించునని బాబా చెప్పిరి.

సప్తాహం ముగిసిన మరుసటి రోజు ఉదయమున స్నానానంతరం కాకా సాహెబు దీక్షిత్ ధ్యానంలో మునిగియుండగా విఠలుడు వారికి కనిపించెను. మధ్యాహ్న హారతికి వెళ్లిన కాకాను బాబా ఇలా ప్రశ్నించిరి - "విఠలుడు వచ్చినాడా? నీవు చూసావా? వాడు తొందరగా పారిపోవును. వానిని గట్టిగా పట్టుకొనుము. ఏ మాత్రం అజాగ్రత్తగా నున్నను తప్పించుకొని పారిపోవును."

మధ్యాహ్న సమయాన పటములను అమ్ముకొను వాడొకడు వచ్చెను. అతని వద్ద 25, 30 విఠోబా పటములుండెను. ఆ పటములలోని విఠోబా కాకాసాహెబు

నకు ధ్యానంలో కనిపించిన విఠోబాను పోలియుండెను. కాకాసాహెబు బాబా మాటలను జ్ఞప్తికి తెచ్చుకొని మిగుల ఆశ్చర్యపడెను. ఒక విఠోబా పటమును కొని పూజా మందిరములో ఉంచుకొనెను.

★ ★ ★

బాబా ప్రతిరోజు కొంతమంది భక్తుల నుండి దక్షిణ రూపంలో చాల డబ్బు వసూలుచేసి ఇతర భక్తులకు ఇచ్చెదరని తెలిసి 1916వ సం॥న కాశీ వెళుతున్న మద్రాసు భజన సమాజం షిర్డీ చేరెను.

ఆ సమాజంలోని వారు బాగా భజనచేసిరి. మంచి పాటలు పాడిరి. లోలోన ద్రవ్యమును ఆశించుచుండిరి. కాని యజమానురాలైన లక్ష్మిమాత్రం అట్టిది కాదు. బాబా యందు అమితమైన భక్తి కలిగియుండెను. ఆమె భక్తికి మెచ్చి బాబా ఆమెకు ఇష్టమైన శ్రీరాముని రూపంలో కనిపించెను. ఆమె ఆ విషయమును తన భర్తకు చెప్పెను. కాని అతనికి నమ్మకం కలుగలేదు.

ఒకరోజు బాబా అతనికి స్వప్నంలో కనిపించి ఏమి కావలెనని అడిగెను. అతడు తన గురువగు సమర్థ రామదాస స్వామిని దర్శింప కోరికగలదనెను. బాబా అతనిని వెనుకకు తిరగమని చెప్పిరి. వెనుకకు తిరగగా రామదాస స్వామి కనిపించెను. అప్పటినుండి అతనికి బాబా పైన అమితమైన భక్తి కలిగెను.

ఒకనాడు బాబా రెండు రూపాయల విలువగల మిఠాయిని, రెండు రూపాయల నగదును ఇచ్చి అతనిని మరికొన్ని రోజులు ఉండమంటూ ఇలా ఆశీర్వదించిరి - "అల్లా! నీకు కావలసినంత డబ్బు ఇచ్చును. నీకు మేలు చేయును".

షిర్డీలో వారికి ఎక్కువ ధనం లభించలేదు. కాని తర్వాత వారికి ఎంతో ధనం లభించెను. ఈ విధంగా వారి యాత్ర విజయవంతమయ్యెను. వారికి ప్రయాణమున ఎట్టి కష్టములు కలుగలేదు.

★ ★ ★

ములే శాస్త్రి నాసిక్ నివాసి. అతడు ఆచారములను పాటించు బ్రాహ్మణుడు. ఆరు శాస్త్రములను చదివినవాడు. జ్యోతిషం, సాముద్రికం కూడ అతనికి బాగ తెలియును. అతడు నాగపూరు కోటీశ్వరుడగు బాపు సాహెబు బుట్టీని కలుసు

కొనుటకు షిర్డీ వచ్చెను. బుట్టీని చూచిన తర్వాత బాబా దర్శనమునకై మసీదుకు పోయెను. సాముద్రికం తెలిసిన వాడగుటచే ములేశాస్త్రి బాబా చేతిని చాచమని అడిగెను. బాబా అతని మాటలను పట్టించుకోకుండా నాలుగు అరటిపండ్లను ఇచ్చిరి. తర్వాత ములేశాస్త్రి వాడాచేరెను. అతడు స్నానం చేసి మడిబట్టలు కట్టు కొని అగ్నిహోత్రం మొ॥వి చేయుట మొదలిడెను.

బాబా లెండి తోటకు బయలుదేరిరి. మార్గ మధ్యమున "గేరు (ఎర్రరంగు) సిద్ధంగా ఉంచండి. ఈనాడు కాషాయ వస్త్రం ధరించెదను" అని బాబా అనిరి. ఆ మాటలు ఎవరికీ బోధ పడలేదు.

బాబా లెండి తోట నుండి తిరిగి వచ్చిరి. మధ్యాహ్న హారతికి సర్వం సిద్ధ మయ్యెను. బాబా తన ఆసనంపై కూర్చొండిరి. భక్తులు వారికి నమస్కరించిరి. హారతి ప్రారంభమయ్యెను. బాబా నాసిక్ బ్రాహ్మణుని వద్ద నుండి దక్షిణ తెమ్మని చెప్పిరి. అంతట బుట్టీ స్వయంగా వాడాలో నున్న బ్రాహ్మణుని వద్దకు వెళ్లి ఆ విషయమును చెప్పెను. ఆ మాటలు విన్న ములేశాస్త్రి తన పూజ ముగియక ముందే మసీదుకు వెళ్లెను. మసీదులోనికి తమలాంటి పవిత్రులు ప్రవేశించరాదని తలంచిన ములేశాస్త్రి మసీదుకు కొంత దూరంలో నిల్చొని బాబాపై పువ్వులు విసరెను. అంతట ములే శాస్త్రికి బాబా స్థానంలో తన గురువగు ఘోలక్ స్వామి కాషాయ వస్త్రములలో కూర్చొని యుండుట కనిపించెను. అచ్చటికి తన గురువెట్లు వచ్చెనని అతడు ఆలో చించసాగెను. తర్వాత తన గురువు మసీదునకు ఎందుకు వచ్చునులే అని తలంచెను. బాబాయే తన గురువు రూపములో దర్శనం ఇచ్చారని భావించుటకు అతనికి ఎక్కువ సమయంపట్టలేదు. అంతట అతడు మసీదులోనికి వెళ్లి తన గురువు పాదములపై పడి, లేచి, చేతులు జోడించుకొని నిలువబడెను.

భక్తులంతా బాబా హారతిని పాడిరి. కాని ములేశాస్త్రి తన గురుని నామమును ఉచ్చరించెను. తన గురువు పాదములపై పడి సాష్టాంగమొనర్చి కండ్లు మూసుకొనెను. లేచి కండ్లు తెరచునంతలో బాబా వానిని దక్షిణ అడుగు చున్నట్లు కనిపించిరి. బాబా చిన్న ఆకారం, ఊహకందని వారి శక్తిని చూచి ములేశాస్త్రి మైమరచెను. మిక్కిలి సంతుష్టి చెందెను. అతని నేత్రములు ఆనందబాష్పములచే నిండెను. బాబాకు మరొకసారి నమస్కరించి దక్షిణ ఇచ్చెను.

ఎవరు దేని కోసం కృషి చేస్తారో వాళ్ళు దానినే పొందుతారు

బాబా అద్భుతలీలను చూసిన వారందరూ నిర్ఘాంతపోయిరి. అంతకు పూర్వం 'గేరు సిద్ధంగా ఉంచండి' అని పలికిన బాబా మాటల అర్థమును వారప్పుడు గ్రహించిరి.

రామాయణ రహస్యం

ఒకనాడు బాబా మసీదులో ఉండగా ఒక శ్రోత్రియ బ్రాహ్మణుడు వచ్చి బాబాకు సాష్టాంగ ప్రణామం లొనరించి ఇట్లనెను - "బాబా! ఇది రామాయణ కావ్యం. దీనిని ఎంతోకాలం నుండి పారాయణ చేయుచున్నాను. కాని నా బుద్ధి పరమార్థమును గ్రహించుట లేదు. కావున సర్వజ్ఞులైన తమరిని ఆ విషయం తెలుపుమని కోరుతున్నాను."

అంతట బాబా ఆ గ్రంథపుటలను త్రిప్పతూ ఇట్లు పలికిరి - "రామాయణం మొదటి కావ్యం. ఇది ధర్మప్రతిపాదకం. ఈ కావ్యంలో చెప్పిన విధంగా నడచిన మానవుడు సంపూర్ణ మానవుడగును. శ్రీరాముడు ధర్మమే రూపంగా అవతరించిన వాడు. హృదయమున సత్యమైన బ్రహ్మజ్ఞానం కలిగి బాహ్య జీవితమున ధర్మాచరణ చేయువాడు సంపూర్ణ మానవుడగును.

జ్ఞానం కన్నులాంటిది. ధర్మం కాలు వంటిది. ఇవి రెండూ లేనివారు గ్రుడ్డి - కుంటి వారగుదురు. మానవ జీవితమున బాహ్యమున ధర్మం, అంతరమున జ్ఞానం చాల అవసరం. ధర్మమును ఆచరించనిచో మనస్సునకు అంటియున్న రాగ ద్వేష ములనెడి మలినములు వదలవు. అవి రెండూ వదలనిచో జ్ఞానం కలగదు. జ్ఞానం కలగకుండా ఆచరించిన ధర్మసిద్ధి కలగదు. ఈ విషయమును రామాయణం ప్రతిపాదించును.

రామాయణమను శరీరమునకు సుందరకాండ తల వంటిది. సుందర కాండలోని 15-27 సర్గలు నేత్రముల వంటివి. సుందరకాండ ప్రతి అక్షరం ఒక్కొక్క మహామంత్రం. సుందరకాండ పారాయణవలన సృష్టియందు సర్వమూ లభించును. అందుకే మీరందరూ సుందరకాండ పారాయణ చేయాలి".

శివతత్వమంతా నిండిన రూపం

మేఘశ్యాముని కరుణించిన రూపం

బాబా ఆసనం కొరకు గోనెసంచిని ఉపయోగించుచుండిరి. కాని భక్తులు దానిపై చిన్న పరుపువేసి వీపు ఆనుకొనుటకు చిన్న బాలేసును సమకూర్చిరి.

భక్తులు తమ అభీష్టానుసారం పూజించుటకు బాబా ఎట్టి అభ్యంతరం చెప్పెడి వారు కాదు. కొందరు చామరములతోను, విసనకర్రలతోను విసురుచుండిరి. కొందరు సంగీత వాద్యములను ప్రయోగించుచుండిరి. కొందరు వారి చేతులను, పాదములను కడుగుచుండిరి. కొందరు వారికి చందనం, అత్తరు పూయుచుండిరి. కొందరు తాంబూలము, మరి కొందరు నైవేద్యం సమర్పించుచుండిరి.

మేఘశ్యాముడు విరమ్‌గామ్ నివాసి. అతడు హరి వినాయక సాఠే వంట బ్రాహ్మణుడు. అతడు శివభక్తుడు. సాఠే మేఘశ్యామునితో సాయిబాబా భగవంతుని అవతారమని చెప్పి షిర్డీకి ప్రయాణం చేయించెను. ఎవరో బాబా మహమ్మదీయుడని చెప్పగా మేఘశ్యాముని మనసు కలతచెంది షిర్డీ ప్రయాణమును మానుకొనదలచెను. కాని యజమాని సాఠే అతనిని షిర్డీ వెళ్ళవలసినదిగా బలవంతం చేసెను. అందువల్ల అతడు షిర్డీ వెళ్ళెను. అతడు మసీదుకు పోగా బాబా అతనిని దృష్టిలో ఉంచుకొని అక్కడున్నవారితో ఇలా చెప్పిరి - "ఈ వెధవను తన్ని తరిమి వేయండి' ' తర్వాత బాబా మేఘునితో ఇట్లనిరి - "నీవు గొప్పజాతి బ్రాహ్మణుడవు. నేనా తక్కువ జాతి మహమ్మదీయుడను. నీవు ఇచ్చటికి వచ్చినచో నీ కులం పోవును. కనుక వెళ్ళిపొమ్ము". తన మనసులోని విషయం బాబాకు ఎలా తెలిసెనో అని మేఘశ్యాముడు ఆశ్చర్యపడెను. కాని అతని శంక తొలగలేదు. అతడు మరికొన్ని దినములు షిర్డీలోనే ఉండి తనకు తోచినట్లు బాబాను సేవించి ఇంటికి వెళ్ళెను.

ఒక సంవత్సరం తర్వాత మేఘుడు మరలా షిర్డీ వచ్చెను. ఈసారి మసీదులో ప్రవేశించుటకు, షిర్డీలో వుండుటకు బాబా సమ్మతించెను. దీనితో మేఘునిలో మార్పు కలిగెను. అప్పటి నుండి మేఘుడు బాబాను శివుని అవతారంగా భావించి కొలవసాగెను. శివుని అర్చనకు బిల్వపత్రి కావలెను. మేఘుడు ప్రతిరోజు మైళ్ళ కొలది నడిచి పత్రిని తెచ్చి బాబాను పూజించుచుండెను. కొంతసేపు బాబా పాదములను ఒత్తి వారి పాదతీర్థమును త్రాగుచుండెను.

శివునికి అభిషేకం ఇష్టం, కనుక మేఘశ్యాముడు ఒక సంక్రాంతికి తనకు శివుడైన బాబాకు అభిషేకం చేయదలచి గోదావరి జలం తెచ్చెను. కాని బాబా "నేను ఫకీరును. నాకు స్నానం తగదు" అని ఎంతగానో చెప్పెను. కాని మేఘుడు మాత్రం బాబాకు అభిషేకం చేయవలెనని పట్టు పట్టెను. అప్పుడు బాబా సమ్మతించిరి. వారు మేఘునితో ఇట్లనిరి - "శరీరమునకు తల ముఖ్యం. తలపైనే నీళ్ళు పోసిన శరీరమంతటిపై పోసినట్లగును" కాని మేఘుడు భక్త్యావేశముతో నీళ్ళకుండను పైకెత్తి 'హర గంగే హర గంగే' అనుచు శరీరమంతటిపై నీళ్ళు పోసెను. కాని బాబా తల మాత్రమే తడసి శరీరమంతయు పొడిగా వుండెను. మేఘుని ఆశ్చర్యమునకు అవధులు లేవు.

మేఘశ్యాముడు మసీదులో బాబాను స్వయంగా పూజించుటేగాక వాడాలో బాబా పటమును పూజించు చుండెను. ఒకరోజు వేకువజామున మేఘుడు తన శయ్యపై పడుకొని కళ్ళుమూసుకొనే బాబాను ధ్యానించుచుండెను. అతడు బాబా రూపమును చూసెను. బాబా అక్షతలు చల్లి, "మేఘా, గోడమీద త్రిశూలం గీచి అర్చింపుము" అని అదృశ్యమైరి.

మేఘుడు కళ్ళు తెరిచేసరికి ఎవ్వరూ లేరు. గది తలుపులు మూసే వుండెను. కాని అతని ప్రక్క మీద అక్షంతలు ఉండెను. వెంటనే మేఘుడు బాబాను దర్శించి, ఆ విషయమై అడిగెను. "నేను స్పష్టంగా చెప్పాను కదా! నా మాటలు ఎన్నటికీ వ్యర్థం కావు. నేను ఇంటిలోనికి ప్రవేశించటానికి ఏ ద్వారాలు అక్కరలేదు. నేను సర్వదా, సర్వత్రా ఉన్నాను" అన్నారు సాయి. వెంటనే అతడు తన గదిలో బాబా పటం వద్ద గోడమీద ఎర్రరంగుతో త్రిశూలమును గీచి పూజించెను.

మరుసటి దినమే పూనా నుండి వచ్చిన ఒక భక్తుడు బాబాకు ఒక శివ లింగమును సమర్పించెను. సరిగా అదే సమయానికి మేఘుడు మసీదుకు వచ్చెను. సాయి అతనికి శివలింగమిస్తూ ఇట్లనిరి - "చూడు, సాక్షాత్తు శంకరుడే వచ్చినాడు. జాగ్రత్తగా పూజింపుము." గోడమీద త్రిశూలమును వ్రాసిన వెంటనే లింగం వచ్చుట చూచి మేఘుడు ఆశ్చర్యపడెను.

మేఘశ్యాముడు అనేక సంవత్సరములు బాబా సేవచేసి 1912లో మరణించెను. బాబా అతని కళేబరంపై చేతులుచాచి, "ఇతడే నా నిజమైన భక్తుడు" అనిరి.

శవాన్ని తీసుకొనిపోతుంటే బాబా కొంతదూరం వెళ్ళి శవంపై పూలు చల్లి వచ్చారు. దహనమయ్యాక బాబా సామాన్యునివలె శోకించి, తమ ఖర్చుతో అందరికీ సంతర్పణ కూడ చేసిరి. తర్వాత అతనికిచ్చిన శివలింగాన్నే ఆయన గురుస్థానంలోని వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించిరి.

మేఘు శ్యాముడు జీవించియున్నప్పుడు తాను చనిపోయిన ఏడ్చు బంధువులు ఎవ్వరూ లేరుకదా అని వాపోవుచుండెను. బాబా తన భక్తుని కోరిక ఎలా తీర్చారో గమనించండి.

బాబా తన అభీష్టానుసారమే భక్తులను ఆశీర్వదించుట

భక్తులను ఆశీర్వదించుట బాబా ఇష్టంపై ఆధారపడియుండెను. హాజీ సిద్దీక్ సాల్కే అనునతడు కళ్యాణి నివాసి. అతడు మక్కా, మదీనా యాత్రలు చేసిన పిమ్మట షిర్డీ చేరెను. చావడి ఉత్తర భాగమున బస చేసెను. మసీదు ముందున్న ఖాళీ జాగాలో కూర్చొనుచుండెను. తొమ్మిది నెలల వరకు బాబా అతనిని ఉపేక్షించెను. మసీదులో పాదం పెట్టనివ్వలేదు. హాజీ బాగా అసంతృప్తి చెందెను. అతనికి ఏమి చేయుటకు తోచకుండెను. నిరాశ చెందవద్దని కొందరు ఓదార్చిరి. వారు అతనిని శ్యామాను తోడుతీసుకొని బాబా వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చిరి. హాజీ తన తరపున మాట్లాడమని శ్యామాను వేడుకొనెను. శ్యామా అందులకు సమ్మతించెను.

శ్యామా : బాబా! నీవు అనేక మందికి దర్శనమిచ్చి ఆశీర్వదించుచున్నావు కదా! మరి ముసలి హాజీని మసీదులో ఎందుకు కాలుపెట్టనివ్వుటలేదు?

బాబా : శ్యామా! నీవు చిన్నవాడవు. విషయములను గ్రహించు శక్తి నీకు లేదు. అల్లా ఒప్పుకొననిచో నేనేమి చేయగలను? వారి కటాక్షం లేనిదే మసీదులో ఎవరు కాలు పెట్టగలరు. సరే, నీవు వాని వద్దకు పోయి బార్వే నూతికి దగ్గరున్న కాలిబాట వద్దకు రాగలడేమో అడుగుము.

శ్యామా హాజీని కనుగొనగా అందులకు సమ్మతించెను. అప్పడు బాబా హాజీ 40 వేల రూపాయలు నాలుగు వాయిదాలలో ఇవ్వగలడేమో కనుగొనమనిరి. హాజీ నాలుగు లక్షలు ఇచ్చుటకు కూడ సిద్ధపడెను.

అంతట బాబా శ్యామాతో ఇట్లనిరి - "మసీదులో ఈనాడు మేకను కోసెదము. వానికి దాని మాంసం కావలెనో, రొండి కావలెనో, వృషణములు కావలెనో కను గొనుము" అందుకు హాజీ బాబా మట్టిపాత్రలోని జొన్నరొట్టె ముక్క చాలునని చెప్పెను.

ఈ మాటలు వినగానే బాబాకు మిగుల కోపం వచ్చెను. హాజీ వద్దకు వెళ్ళి ఇట్లనిరి - "నీవు మహనీయుని వలె ఏల నటించుచున్నావు? ఖురానునిట్లే పారాయణ చేయుచున్నావా? మక్కాయాత్ర చేసితినని గర్వించి నన్ను కనుగొన లేక పోయితివా?" ఈ మాటలకు హాజీ గాబరా పడెను.

కాని బాబా మసీదుకు పోయి హాజీకి కొన్ని గంపల పండ్లను పంపిరి. తర్వాత హాజీ వద్దకు వచ్చి తన జేబులో నుంచి 50 రూపాయలు తీసి అతనికిచ్చిరి. అప్పటి నుండి బాబా హాజీని ప్రేమించసాగిరి. భోజనమునకు పిలుచు చుండిరి. అప్ప డప్పడు డబ్బు ఇచ్చుచుండిరి. హాజీ తన ఇష్టమైనపుడల్లా మసీదునకు వచ్చు చుండెను.

బాబా చెప్పిన మేక శరీరంలోని భాగాలు ధర్మార్థకామాలు, హాజీ కోరినది బాబా నిత్యం అనుభవించే మోక్షం. హాజీ కోరిన రొట్టెముక్క గురువుగారు ఎంగిలి చేసినది. సాయిచెప్పిన కాలిబాట కఠోరమైన సాధన, వారు కోరిన నలభై వేలు అంతఃకరణ చతుష్టయం. (మనస్సు బుద్ధి, చిత్తం, అహంకారం), అంతఃకరణములు తొలుత హాజీననే గర్వంలో చిక్కుకొన్నాయి. శరణు పొందాక అతని గర్వం తొల గింది. అప్పుడు సాయి సంతోషంతో అతనికి పండ్లను కానుకగా పంపారు.

బాబా మాటలు సామాన్యులకు అర్థం కావు.

అర్థం చేసుకొని వ్యవహరించిన వారు ధన్యులు.

సర్వస్వ శరణాగతి పొందిన వారికి బాబా సులభ సాధ్యుడు.

ఓం శ్రీ సాయిరామ్

దారి తప్పిన వారిని సన్మార్గమున పెట్టుట

భగవంతరావు తండ్రి విఠోబా భక్తుడు. అతడు ఇంటి వద్ద విఠోబా ప్రతిమ నుంచి పూజించు చుండెను. అప్పుడప్పుడు పండరీపురమునకు వెళ్ళి విఠోబా దర్శనం చేసుకొనెడివాడు.

భగవంతరావు తండ్రి మరణానంతరం విఠోబా పూజను, పండరీపుర యాత్రను మానుకొనెను. ఒకసారి అతడు షిర్డీ వెళ్ళెను. బాబా, అతనిని గురించి భక్తులతో ఇట్లనిరి - "వీని తండ్రి నా స్నేహితుడు. కనుక నేను వీనిని ఇచ్చటికి ఈడ్చుకొని వచ్చితిని. వీడెన్నడూ నైవేద్యం పెట్టలేదు. నన్ను విఠలుని ఆకలితో మాడ్చి నాడు. వీనితో మరలా పూజను ప్రారంభింపచేయుదును"

ఈ కథను బట్టి బాబా దారి తప్పిన వారికి తప్పను బోధించి, చీవాట్లు పెట్టి సన్మార్గమున నడిపెడివారని తెలియుచున్నది.

బాబాకు ప్రార్థనలంటే ఎంతో ఇష్టం

రోహిల్లా బలవంతుడు. పొడుగైన చొక్కా తొడుగువాడు. అతడు బాబా కీర్తి విని, షిర్డీ చేరుకొని స్థిర నివాసం ఏర్పరచుకొనెను. అతడు ఖురానులోని 'కలమా'★ ను రాత్రింబవళ్ళు చదువుచు 'అల్లాహో అక్బరు' అని బిగ్గరగ అరచు చుండెను. దీనివల్ల పగలంతయు పొలములలో కష్టపడి వచ్చిన షిర్డీ ప్రజలకు నిద్రా భంగం, అసౌకర్యం కలుగుచుండెను. వారు కొన్నాళ్ళు ఏదో విధంగా ఓర్చు కొనిరి. తుదకు ఆ బాధను భరించలేక వారు బాబా వద్దకు వెళ్ళి రోహిల్లా అరుపులను ఆపుమని వేడుకొనిరి. బాబా వారిపై కోపగించుకొనిరి - "మీరు మీమీ పనులు చేసుకోండి. రోహిల్లా జోలికి పోకండి. అతనికి ఒక గయ్యాళి భార్య కలదు. అతని ప్రార్థనలు విని ఆమె ఏమియు చేయజాలకున్నది. అతడు ప్రార్థనలను ఆపినచో ఆమె అతనిని, నన్ను బాధ పెట్టును. కనుక మీరు ఓపికతో అతని బాధను అనుభవించండి. కొద్ది దినాలలో అది తగ్గును"

వాస్తవానికి రోహిల్లాకు భార్యయే లేదు. గయ్యాళి భార్య అనగా దుర్బుద్ధి అని అర్థం. బాబా రోహిల్లా ప్రార్థనకు అవరోధం కల్పించలేదు. అందుకు రెండు కారణాలు గలవు -

1. బాబాకు ప్రార్థనలంటే ఎంతో ఇష్టం.
2. భగవంతుని ప్రార్థన దుర్బుద్ధి ప్రభావమును తొలగించును.

★ కలమా: ఇస్లాం మూల మంత్రం. (లా ఇలాహ ఇల్లిల్లాహ, మహమ్మద్ రసూలిల్లాహ)

భక్తుల సేవ

బాయజాబాయి : ఆమె తాత్యాకోతే పాటీలు తల్లి. ఆమె ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు తలపై ఒక గంపలో రొట్టె, కూర పెట్టుకొని అడవిలో బాబా తపస్సు చేయుచున్న చోటునకు పోయి వారికి భోజనం పెట్టుచుండెను. ఒక్కొక్కసారి మైళ్ళ కొలది ముండ్లు, పొదలు దాటి బాబాను వెదకి పట్టుకొని సాష్టాంగ నమస్కారం చేయుచుండెను. ఆమె విస్తరొకటి వేసి రొట్టె, కూర మొ॥వి పెట్టి బాబాకు బలవంతం చేసి తినిపించుచుండెను.

కొన్ని సంవత్సరముల తర్వాత బాబా మసీదులో కూర్చొనియే భోజనం చేసెడి వారు. అప్పటి నుంచి బాయజాబాయికి అడవిలో తిరగవలసిన పని తప్పింది.

ఆమె జీవించినంత వరకు బాబాకు సేవ చేయుట మరవలేదు. ఆమె సేవను గుర్తించిన బాబా ఆమె పుత్రుడగు తాత్యాపాటీలునకు రోజుకు పాతిక రూపాయలు చొప్పన కానుకగా ఇచ్చుచుండిరి. తల్లి - కొడుకు బాబాను సాక్షాత్ భగవంతునిగా చూసెడివారు.

భాగోజి షిండే : బాబా చెయ్యి కాలిన విషయం తెలుసుకొని నానాసాహెబు చాందో ర్కరు ముంబాయి నుండి డాక్టరు పరమానంద్‌ను మందులతో సహా తీసుకొని వచ్చెను. కాని బాబా ఆ డాక్టరుచే చికిత్స చేయించుకొనుటకు అంగీకరించలేదు.

బాబా వద్ద భాగోజీ షిండే అను కుష్ఠురోగి ఉండెను. అతడే ప్రతిరోజూ బాబా కాలిన చేతిపైన నెయ్యిరాసి, ఆకువేసి గుడ్డతో కట్టుకట్టెడివాడు. కొన్ని దినముల తర్వాత చేయి బాగుపడెను. అందరూ సంతోషించిరి. వాస్తవానికి బాబాకు ఎట్టి కట్టూ అవసరం లేదు. కాని భాగోజీ షిండేకు సేవ చేసే అవకాశమును కల్పించుటకై బాబా అతనితో కట్టు కట్టించుకొనేవారు.

భాగోజి షిండే గత జన్మలో పాపి. కనుకనే ఈ జన్మలో కుష్ఠు రోగి అయ్యాడు. అతని వ్రేళ్ళు ఊడ్చుకొనిపోయి యుండెను. అతని శరీరమంతయూ చీము కారుతూ, దుర్వాసన కొట్టుచుండెను. అతడు బయటికి దురదృష్టవంతుడుగా కనిపించినను చాల అదృష్టవంతుడు. ఎందుకనగా అతనికి బాబా సహవాసం, వారికి సేవ చేసే అవకాశం లభించింది.

కష్టమునకు తగిన కూలి

ఒకనాడు మిట్టమధ్యాహ్నమున బాబా రాధాకృష్ణ ఆయి ఇంటి వద్దకు వచ్చి ఒక వ్యక్తిని నిచ్చెన తీసుకొని రమ్మని చెప్పిరి. ఆ వ్యక్తి నిచ్చెన తీసుకొని వచ్చెను. బాబా సాహసించి ఎక్కడి నుంచో ఇంటి పైకప్పు ఎక్కి రాధాకృష్ణ ఆయి ఇంటి మీదుగా నడచి అవతలి వైపునకు దిగెను. రాధాకృష్ణ ఆయిని మలేరియా జ్వరం నుండి రక్షించుటకు బాబా అట్లు చేసియుందురని అక్కడున్న వారు తలంచిరి. బాబా నిచ్చెన తెచ్చిన వానికి రెండు రూపాయలు ఇచ్చిరి. ఒకతను అతనికి డబ్బు ఇవ్వవలసిన పనేముందని బాబాను ప్రశ్నించెను. అంతట బాబా అతనికి ఈ విధంగా చెప్పిరి - “ఒకని కష్టమును ఇంకొకడు ఉంచుకొనరాదు. కష్టపడువానికి సరైన కూలిని ధారాళంగా ఇవ్వవలెను”.

బాబా సలహాను పాటించినచో కూలివాడు సరిగా పనిచేయును. పని చేయువాడు, పని చేయించుకొనువాడు - ఇద్దరూ సుఖపడుదురు. వారిద్దరూ మనస్పర్థలు లేకుండా జీవింతురు. దీనివల్ల సమ్మెలకు తావుండదు. సమాజంలో శాంతి నెలకొనును. దేశం పురోభివృద్ధిని సాధించును.

ఉపవాసమక్కర లేదు

బాబాకు ఉపవాసంలో నమ్మకం లేదు. కడుపులో తడి కలుగజేయు ఆహారం గాని, పౌష్టిక శక్తిగాని లేనిచో భగవంతుని పొగడగల శక్తి నోటికి, అతని నామమును వినగల శక్తి చెవులకు లభించదని వారి అభిప్రాయం. అందుకే బాబా తన భక్తులను ఉపవసించ నిచ్చేవారు కాదు.

ఒక రోజున సాయి దాదాకేల్కర్‌తో ఇలా చెప్పారు - “ఇప్పుడు సిమోగా పండుగలు కదా! బిడ్డలను ఉపవసించనివ్వను” ఆయన మాటలు ఎవరికీ అర్థం కాలేదు. కొద్ది సేపట్లో శ్రీమతి గోఖలే షిర్డీ చేరి కేల్కర్ ఇంట్లో సామాను పెట్టి మసీదు చేరింది. ఆమె సాయి సన్నిధిలో మూడు రోజులు ఉపవసించ తలచింది. సాయి ఆమెతో నెమ్మదిగా చెప్పారు - “ఈ ఉపవాసం, తపవాసం ఎందుకు? దాదా కేల్కర్ ఇంటికి వెళ్ళి బొబ్బట్లు (పోళీలు) చేసి దాదాకు, అతని బిడ్డలకూ పెట్టి నీవు కూడా తినుము” బాబా సలహా సమయోచితంగా ఉండెను. సరిగ్గా అదే

సమయంలో కేల్కర్ భార్య బహిష్టు అయివుండెను. ఇంట్లో వంటచేసేవారు ఎవ్వరూ లేకుండిరి. శ్రీమతి గోఖలే బాబా ఆజ్ఞను పాటించి, దాదా ఇంట్లో వంట చేసి, ఆ కుటుంబానికి పెట్టి తానూ తిన్నది.

★ ★ ★

ఒకసారి దీక్షిత్ యావజ్జీవితం రాత్రిపూట ఉపవసించ దలచెను. ఆ రోజు సాయంత్రం అతడు మసీదు చేరగానే సాయి, "రాత్రి భోజనానికి ఏమి చేయిస్తావు' ' అని అడిగిరి. అప్పుడు దీక్షిత్ "మీరేది చేయించమంటే అది!" అని పలికెను. బాబా రోజు మాదిరిగా రొట్టెలు, కూర చేయించమని చెప్పిరి. దీక్షిత్, "బాబా! ఈ రోజు అలానే చేస్తాను. రేపటి నుండి నేను రాత్రి భోజనం చేయను" అని చెప్పెను. బాబా అప్పుడేమీ మాట్లాడలేదు. కాని రోజూ సాయంత్రం అలాగే హెచ్చరించేవారు. అంతటితో దీక్షిత్ తన నియమాన్ని మానుకొనెను.

★ ★ ★

ఒకరోజు అందరూ ఆరతికి మసీదునకు వెళ్ళునపుడు బల్వంత్ నాచ్నేను వెళ్ళి భోజనం చేయమన్నారు బాబా. ఆ రోజు ఏకాదశి. సాటి భక్తులిద్దరూ ఉపవసిస్తుంటే తాను తినడం బాగుండదని, అతడు ఆ రోజు భోజనం చేయనన్నాడు. నిజానికి అతడు ఎన్నడూ ఉపవసించలేదు. బాబా అతని సహచరులను చూపి, "వీరు పిచ్చివాళ్ళు, నీవైనా వాడాకుపోయి భోజనం చేసిరా!" అన్నారు. వంటవాడు చికాకుపడి, ఆరతి అయితే గాని భోజనం పెట్టనని చెప్పాడు. నాచ్నే మసీదు చేరగానే "భోజనం చేసావా?" అని అడిగారు బాబా. నాచ్నే జరిగింది చెప్పి ఆరతి అయ్యాక తింటానన్నాడు. బాబా పట్టుదలతో "బోజనమయ్యాకనే ఆరతి జరుగుతుంది" అని చెప్పారు. వంటవానికి వడ్డించక తప్పలేదు. భోజనం తర్వాత నాచ్నే చేత తాంబూలం కూడా తినిపించారు బాబా.

పరులను దూషించ సైచని దైవం

ఒకనాడు పండరీపురం నుండి ఒక ప్లీడరు షిర్డీ వచ్చెను. మసీదునకు వెళ్ళి బాబాను దర్శించెను. వారి పాదములకు నమస్కరించెను. అడుగకుండగనే దక్షిణ ఇచ్చెను. జరుగుచున్న సంభాషణలను వినుటకు ఒక మూల కూర్చొనెను. బాబా అతనివైపు చూస్తూ ఇట్లనిరి - "ప్రజలు ఎంత టక్కరులు" వారు పాదములపై

పడుదురు. దక్షిణ ఇత్తురు. చాటున నిందింతురు" బాబా మాటలు ఎవరికీ అర్థం కాలేదు. కాని బాబా తనను ఉద్దేశించే ఈ మాటలు మాట్లాడుచున్నారని ఆ ప్లీడరు తలంచెను. ఎందుకనగా ఒకసారి పండరీపురంలో ప్లీడర్ల గదిలో ప్లీడర్లందరూ సబ్‌జడ్జియగు నూల్కర్ ఆరోగ్యమును గురించి చర్చించునపుడు సాయిబాబాను నిందించిరట. వారిలో ఈ ప్లీడరు కూడా ఉండెనట.

పండరీపురమునకు మూడువందల మైళ్ళ దూరమున షిర్డీలో నున్న బాబాకు ఈ సంగతి తెలిసినదేనని ప్లీడరు చాల ఆశ్చర్యపడెను. అంతేగాకుండా ఆ రోజు నుండి అతడు ఇతరులను నిందించరాదని నిర్ణయించుకొనెను.

ఒకరోజు ఒక భక్తుడు మరొక భక్తుని గురించి అతని పరోక్షములో నిందించు చుండెను. అతని ఒప్పులను వదిలిపెట్టి, తప్పులను మాత్రమే లెక్కించుచుండెను. మిక్కిలి హీనముగా తిట్టుటచే విన్నవారు విసిగిరి. బాబా అతనిని సరిదిద్ద దలచిరి.

బాబా ఒక మధ్యాహ్నమున లెండీ తోటకు పోవుచుండగా ఆ భక్తుడు వారిని కలిసెను. బాబా అతనికి మలం తింటున్న ఒక పందిని చూపి ఇట్లనిరి - "చూడుము. ఈ పంది మలమును ఎంత ప్రీతిగా తినుచున్నదో! సాటివారిని గురించి అపవాదులు కల్పించునట్టి నీ స్వభావమూ అట్టిదే. క్రమంగా నిన్ను సాటివారు ఏవగించుకొంటారు. అంతేకాదు. అలా చేస్తే కష్టపడి నీవు సంపాదించుకొన్న పుణ్యమంతా వారికి, వారి పాపం నీకు వస్తుంది. ఇక షిర్డీ యాత్ర వలన నీకు కలుగు ప్రయోజన మేమి?" ఆ భక్తుడు బాబా మాటలను అర్థం చేసుకొని అక్కడి నుండి వెడలి పోయెను.

మనలో చెడు ఆలోచనలు లేనప్పుడు ఇతరులకు భయపడనేల?

ఒకసారి బీజాపూరు నుండి ఒక మహమ్మదీయుడు కుటుంబ సభ్యులతో బాబాను చూచుటకు వచ్చెను. స్త్రీలు వచ్చి బాబా దర్శనం చేసుకొనిరి. వారిలో ఒక స్త్రీ ముసుగు తీసి బాబా పాదములకు నమస్కరించి తిరిగి ముసుగు వేసుకొనెను. ఆమె ముఖ సౌందర్యమును చూసిన నానా సాహెబు మనసు చలించెను. అతడు ఆమె సౌందర్యమును మరలా మరలా చూడదలచెను. ఆ స్త్రీలు వెళ్ళిన

తర్వాత బాబా అతని తలపై చరచెను. నానా సిగ్గుతో తల వంచుకొనెను. బాబా అతనితో ఇట్లనిరి - "నానా! అనవసరంగా చీకాకు పడుచుంటివేల? ఇంద్రియాలను వాని పనులు చేయనిమ్ము. వానిలో మనం జోక్యం చేసుకొనరాదు. దేవుడు ఈ సుందరమైన ప్రపంచమును సృష్టించినాడు. కాన అందరిని చూసి సంతసించుట మన విధి. మనలో చెడు ఆలోచనలు లేనప్పుడు ఇతరులకు భయపడనేల? నేత్రములు తమ పనిని తాము నెరవేర్చుకొనవచ్చును."

మంచి - చెడుకు నీవు కర్తవు కాదు

శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వాముల వారు (శ్రీ టెంబెస్వామి) సాయి సమకాలికులలో ఒకరు. వారు రాజమండ్రిలో కొంతకాలం ఉండిరి. అప్పుడు నాందేడ్ నుండి పుండలీకరావు అనునతడు మరికొంత మంది భక్తులతో కలసి వారిని దర్శించెను. మాటలలో సాయి ప్రసక్తి రాగానే, ఆ స్వామి తలవంచి నమస్కరించి పుండలీకరావునకు ఒక కొబ్బరికాయ నిచ్చి ఇట్లు చెప్పెను - "దీనిని నా సోదరు డగు సాయికి నా ప్రణామములతో అర్పింపుము. నన్ను మరవ వద్దని వేడుము. నా యందు ప్రేమ చూపుమనుము."

పుండలీకరావు నాందేడ్ తిరిగి వచ్చిన నెల రోజులకు టెంబెస్వామి ఇచ్చిన కొబ్బరికాయను తీసుకొని తన మిత్రులతో కలసి షిర్డీకి బయలుదేరెను. మన్మాడ్ చేరగానే అతడు వారితో కలసి ఒక కాలువ గట్టును చేరెను. వారు ఆకలి తీర్చు కొనుటకు ఇంటి వద్ద నుండి తెచ్చుకొన్న అటుకులను తినసాగిరి. అవి మిక్కిలి కారముగా ఉండెను. అందుచే పుండలీకరావు తన వద్ద నున్న కొబ్బరికాయను పగలగొట్టి దాని కోరును కలిపి అటుకులను రుచికరముగా చేసెను. కాని తర్వాత ఆ కొబ్బరికాయను టెంబెస్వామి బాబాకు సమర్పించుటకై ఇచ్చి వుండెను కదా అని జ్ఞాపకం చేసుకొని పశ్చాత్తాపపడెను.

పుండలీకరావు షిర్డీ చేరుకొని బాబాను దర్శించుటకు వెళ్ళెను. వెంటనే బాబా "నా సోదరుడు పంపిన కొబ్బరికాయ ఏది?" అని అడిగిరి. పుండలీకరావు జరిగిన విషయమును చెప్పి బాబాను క్షమాపణ కోరెను. అతడు ఆ కొబ్బరి కాయకు బదులు మరొకకాయను తెస్తానని చెప్పెను. కాని బాబా అందుకు సమ్మతించ లేదు. తన సోదరుడు పంపినదానికి మరొకటి సాటి కాజాలదని చెప్పిరి.

తర్వాత బాబా అతనిని క్షమించి, ఆశీర్వదించి ఇట్లనిరి - "ఆ విషయమ్మై నీవు దిగులపడనక్కరలేదు. ఆ కొబ్బరికాయ నా సంకల్పం ప్రకారం నీకివ్వబడెను. తుదకు దారిలో పగటగొట్టబడెను. దానికి నీవే కర్తవని ఎందుకు భావింతువు? మంచి - చెడుకు నీవే కర్తవని తలంచవద్దు. అహంకార రహితుడవై ఉండుము'

మరచిన విషయాలను బాబా జ్ఞప్తికి తెచ్చుట

బాంద్రాలో రామచంద్ర ఆత్మారామ్ వురఫ్ బాబా సాహెబు తరఖడ్ అను నతడు ఉండెను. అతడు ఒకప్పుడు ప్రార్థనా సమాజమునకు చెందిన వాడయి నను బాబాకు ప్రియభక్తుడు. అతని భార్యా పిల్లలు కూడా బాబాను మిగుల ప్రేమించు చుండిరి. అతని కుమారుడు తల్లితో కలిసి వేసవి సెలవులను షిర్డీలో గడపదలచెను. కాని షిర్డీ వెళ్ళుటకు సంశయించు చుండెను. తామిద్దరూ షిర్డీ వెళ్లినచో ఇంటి వద్ద తన తండ్రి బాబా పూజను సరిగా నిర్వహించడేమోనని తలంచుచుండెను. కాని ఆత్మారామ్ బాబా పూజను సక్రమంగా నిర్వహిస్తానని మాట ఇవ్వటముచే అతని భార్య, కుమారుడు శుక్రవారం రాత్రికి షిర్డీ చేరిరి.

శనివారం ఉదయమున ఆత్మారామ్ స్నానంచేసి బాబా పటమునకు సాష్టాంగ నమస్కారం చేసి పూజను చేసెను. కలకండను నైవేద్యంగా సమర్పించెను. ఆనాటి సాయంత్రం కూడ సవ్యంగానే పూజ చేసెను. ఆదివారం, సోమవారం కూడ అన్నియూ సక్రమంగానే నిర్వర్తించెను.

ఆత్మారామ్ మంగళవారం నాడు ఎప్పటివలె పూజ చేసి కచేరీకి పోయెను. మధ్యాహ్న భోజనమునకు వచ్చినప్పడు తినుటకు ప్రసాదం లేకుండెను. నౌకరును అడుగగా ఆ రోజు ప్రసాదం పెట్టలేదని చెప్పెను. తన తప్పు తెలుసుకొన్న ఆత్మారామ్ భోజనమునకు కూర్చొన్నవాడు లేచి బాబా పటమునకు సాష్టాంగ నమస్కారం చేసి వారిని క్షమాపణ కోరెను. తర్వాత ఈ విషయమును షిర్డీలోనున్న తన కొడుకు నకు తెలిపి బాబాను క్షమాపణ కోరమనెను. ఈ సంఘటన బాంద్రాలో మంగళ వారం మధ్యాహ్నం 12 గంటలకు జరిగినది.

అదే సమయమందు షిర్డీలో మధ్యాహ్నహారతి ప్రారంభించుటకు సిద్ధంగా నున్నప్పడు బాబా ఆత్మారాముని భార్యతో ఇట్లనిరి - "తల్లీ! బాంద్రాలో మీ యింటికి ఏమైనా తినే ఉద్దేశ్యముతో వెళ్ళాను. తలుపు తాళం వేసి యుండెను. ఎలాగో నేను లోపలికి ప్రవేశించాను. కాని తినుటకేమీ లేక తిరిగి వచ్చితిని.

ఆమెకు బాబా మాటలు బోధపడలేదు. కాని ఆమె కుమారుడు ఇంటి వద్ద పూజలో ఏదోలోపం జరిగిందని తెలుసుకొనెను. అతడు షిర్డీ వదలి వెళ్ళుటకు బాబా అనుమతి కోరెను. అందులకు బాబా నిరాకరించిరి. షిర్డీలోనే పూజ చేయమనిరి. అతడు తండ్రికి షిర్డీలో జరిగినదంతయూ జాబు వ్రాసెను. అదే సమయమున ఆత్మారామ్ బాంద్రా నుండి కుమారునకు జరిగిన విషయము తెలుపుతూ ఉత్తరం వ్రాసెను.

★ ★ ★

బాంద్రా నివాసియగు రఘువీర భాస్కరపురందరే బాబాకు మిక్కిలి భక్తుడు. ఒకనాడు అతడు భార్యతో షిర్డీకి బయలుదేరుచుండెను. ఈ విషయం తెలుసు కొని ఆత్మారాముని భార్య పురందరే భార్యకు రెండు పెద్ద వంకాయల నిచ్చి, ఒక దానితో పెరుగు పచ్చడిని, మరొక దానితోవేపుడు చేసి బాబాకు వడ్డించమని చెప్పెను.

పురందరుని భార్య షిర్డీ చేరిన వెంటనే వంకాయ పెరుగు పచ్చడి చేసి బాబా భోజనమునకు కూర్చొన్నప్పుడు తీసుకొని వెళ్ళెను. బాబాకు ఆ పచ్చడి చాల రుచిగా ఉండెను. కాని వారు దానిని అందరికీ పంచిపెట్టి అప్పడే వంకాయ వేపుడు కూడ కావలయుననిరి. ఈ సంగతి రాధాకృష్ణ ఆయికి తెలుపబడెను. అది వంకాయల కాలం కాకపోవుటచే వాటిని సంపాదించుటెలా అని ఆమె ఆలోచించ సాగెను. తర్వాత వంకాయ పచ్చడి తెచ్చిన పురందరుని భార్యయే వంకాయ వేపుడు కూడ తేవలయుననిరి.

ఈ విధంగా బాబా పురందర్ భార్యకు మరచిపోయిన వంకాయ వేపుడును గురించి జ్ఞప్తికి తెచ్చిరి.

★ ★ ★

1915 డిసెంబరులో గోవింద బలరామ్ మాకడ్ అనువాడు షిర్డీ వెళ్ళి తన తండ్రికి ఉత్తర క్రియలు చేయవలెనని తలంచెను. ప్రయాణమునకు పూర్వం ఆత్మారామ్ వద్దకు వెళ్ళెను. ఆత్మారామ్ భార్య ఒక దూద్‌పేడా (మిఠాయి)ను అతనికిచ్చి బాబాకు సమర్పించమని కోరెను.

గోవిందుడు షిర్డీ చేరెను. బాబాను దర్శించెను. కాని దూద్‌పేడాను తీసు కొని పోవుట మరచెను. ఉదయం, సాయంకాలం అట్లే జరిగెను. బాబా ఓపిక పట్టక తనకొరకేమి తెచ్చావని అతనిని అడిగిరి. గోవిందుడు ఏమీ తేలేదని చెప్పెను. బాబా వెంటనే ఆత్మారాముని భార్య ఇచ్చిన దూద్‌పేడా గురించి జ్ఞప్తికి తెచ్చిరి.

గోవిందుడు బసకు వెళ్ళి దూద్‌పేడా తెచ్చి ఇచ్చెను. తన చేతిలో పడిన వెంటనే బాబా దానిని గుటుక్కున మ్రింగిరి. ఈ విధంగా బాబా ఆత్మా రాముని భార్య భక్తిని మెచ్చిరి. "నా భక్తులు నన్ను నమ్మినట్లు నేను వారిని చేరదీసెదను" అను గీతావాక్యమును బాబా నిరూపించిరి.

భక్తులకు శ్రేయస్కరమైనదే చేసేవారు

బాబా భక్తులు కోరినదెల్లా నెరవేర్చక, పూర్వ కర్మ దృష్ట్యా వారికి శ్రేయస్కర మైనదే చేసేవారు. ఒకామె తన బిడ్డను పాము కరచిందని బాబాతో మొర పెట్టు కొన్నది. బాబా ఊదీ ఇవ్వలేదు. ఆశీర్వదించనూలేదు. ఆ పిల్లవాడు చనిపోయాడు. దీక్షిత్ ఆ తల్లి శోకం చూడలేక బిడ్డను బ్రతికించమని సాయిని కోరాడు. సాయి దీక్షిత్‌తో ఇట్లనిరి - 'బాపూ, నీవు ఈ విషయంలో కల్పించుకోవద్దు. ఇది అతని మంచికే జరిగింది. అతడు ఈ శరీరంతో చేయలేని పనులు ఆ శరీరంతో చేయ గలడు. అతనిని బ్రతికిస్తే ఆ దేహం మరణిస్తుంది. అందుకు నీవు బాధ్యత వహిస్తావా?' దీక్షిత్ తన తప్పును తెలుసుకొనెను.

★ ★ ★

1911లో హర్దా నుండి షిర్డీ వచ్చిన ఒక క్షయరోగి మరణించాడు. అతనిని రక్షించలేదని అతని బంధువులు బాబాపై అలిగారు. తర్వాత బాబా వారితో ఒకరికి కలలో కనిపించి, రోగి తలను తన తొడపై నుంచుకొని క్రుళ్ళిన అతని ఊపిరి తిత్తులను చూపుతూ, "అతనిని ఇంతటి చిత్రహింస నుండి నేను విడుదల చేసాను' ' అని చెప్పిరి. అతని బంధువులంతా తిరిగి సాయిని సేవించసాగిరి.

బాబా భక్తులు కోరినది ప్రసాదించలేకపోతే ఏమీ మాట్లాడేవారు కాదు. గోవిందరావు అనేక సార్లు షిర్డీవచ్చి తనకొక మగబిడ్డను ప్రసాదించమని బాబాను కోరేవాడు. కాని బాబా ఏమీ చెప్పేవారు కాదు. మరొక వివాహం చేసుకొంటే బిడ్డలు కలుగుతారేమోనని చెప్పమంటే కూడా ఆయన మాట్లాడలేదు. అతనికి సంతానం కలుగలేదు.

కర్మ బలీయమైంది. దానిని అందరూ అనుభవించాల్సిందే.
భక్తులకు శ్రేయస్కరమైనదే భగవంతుడు ఇస్తాడు అదే నమ్మకంతో మనం బాబాను ఆరాధించుదాం.

ఓం శ్రీ సాయిరామ్

కలికాలంలో ప్రజలు మంచి బదులు చెడువే అధికముగా గ్రహిస్తారు

ఐదవ రోజు (సోమవారం) పారాయణ

భక్త పుంగవులారా! ఈరోజున మనం బాబా సర్వజ్ఞతను, సంతానం లేని వారికి బాబా యొసంగిన సంతాన భిక్ష మొదలగు విషయాలను తెలుసుకొని వారి లీలామానుష స్వరూపానికి మోకరిల్లుదాం.

సర్వం శ్రీ సాయిరామార్పణమస్తు

బాబా సర్వజ్ఞత

ఎక్కడెక్కడో వున్న మానవుల యొక్క పరిస్థితులు, హృదయగత భావాలు బాబాకు అనుక్షణం తెరచివున్న పుటలలాగా తెలుస్తుండేవి. మానవుల గురించే కాదు, సర్వప్రాణికోటి గురించి కూడా తెలుస్తుండేది. అనేక దృష్టాంతాల ద్వారా మనకు ఈ విషయం బోధపడ్తుంది.

1. హరికానోబా

హరికానోబా బొంబాయి నివాసి. అతడు బాబా లీలలను విని, వారిని పరీక్షింప దలచి షిర్డీ చేరెను. అతడు కాళ్లకు క్రొత్త చెప్పలు ధరించియుండెను. అతడు చెప్పలను మసీదు ముందు విడిచి అవి కనిపించేలా లోపల కూర్చొనెను. అతడు దురభిమానంతో బాబా చెంతన కూడా తన తలపైనున్న జరీ తలపాగ తీయలేదు. కాని బాబాకు భక్తిపూర్వకమైన నమస్కారం చేసెను. బాబా అతనికి ఊదీని, ప్రసాదమును ఇచ్చెను. తర్వాత అతడు మసీదు బయటికి వచ్చి చూచు నప్పటికి చెప్పలు కనిపించలేదు. చీకాకు పడుచు అతడు బసకు చేరెను.

అతడు స్నానం చేసి, పూజచేసి, నైవేద్యం పెట్టి భోజనమునకు కూర్చొండెను. కాని అతని మనసంతా పోయిన చెప్పలను గూర్చియే ఆలోచించుచుండెను. భోజనానంతరం చేతులు కడుగుకొనుటకు బయటకు వచ్చెను. ఇంతలో ఒక మరాఠీ కుర్రవాడు 'కౌన్ హై హరీ కా బేటా, జరీకా ఫేటా' (హరి అనేవాడి కొడుకు, జరీ తలపాగ కలవాడు ఎవరు?) అని కేకలు వేస్తూ కనిపించెను. అతనిచేతిలో ఒక కర్ర వుండెను. దాని చివరన ఒక క్రొత్త చెప్పలజత వ్రేలాడుచుండెను. హరికా నోబా అతనిని సమీపించి వాకబు చేసెను. ఆ కుర్రవాడు బాబా పంపగా తాను

వచ్చాననియు, ఆ చెప్పలు హరి కుమారుడగు కానోబావనియు, సరియైన ఆన వాళ్ళు చెప్పిన వానికి ఆ చెప్పలను ఇవ్వమని బాబా చెప్పాడనియు తెలిపెను. హరికానోబా తాను హరి కుమారుడనని బాబాకు ఎట్లు తెలిసినదని ఆశ్చర్యపడెను. అతడు బాబా సర్వజ్ఞతను గుర్తించి, బాబా గొప్ప సత్పురుషుడని తెలిసికొనెను. అతడు బాబాను పరీక్షించుటకు వచ్చియుండెను. అది నెరవేరెను. అతడు సంతోషంతో ఇంటికి తిరిగి వెళ్ళెను.

2. సోమదేవ స్వామి

సోమదేవస్వామి అను సాధువు బాబాను దర్శించుటకై షిర్డీకి బయలు దేరెను. అతడు షిర్డీకి కొద్ది దూరమున నుండగనే మసీదుపై రెండు జెండాలు ఎగురుట చూసెను. అతడు మనసులో ఇట్లనుకొనెను - "ఈ యోగి జెండాల యందు ఏల మక్కువ చూపుతున్నాడు? ఇది యోగికి తగినది కాదు కదా! ఈ యోగి కీర్తి కొరకు పాట్లు పడుచున్నట్లున్నది" అతడు షిర్డీ వెళ్ళుట మానుకొన దలంచెను. ఇది తెలుసుకొని ఇతర యాత్రికులు అతనితో ఇట్లనిరి - "జెండాలు చూసినంతనే మీరు ఇంత చికాకు పడుతున్నారు. షిర్డీలో రథం, పల్లకి, గుర్రం మొదలగు అలంకారములను చూసినచో మరెంత చికాకు పడుదురో?"

అంతట సోమదేవ స్వామి అట్టి సాధువులను చూచుట కంటె తిరిగి పోవుటయే మేలని తలంచెను. కాని తోటి ప్రయాణీకులు ఆ అలంకారములన్నియూ బాబా చేయించినవి కావనియు, అవన్నీ అతని భక్తులు చేయించినవనియూ, బాబా చాల నిరాడంబరముగా ఉండుననియు చెప్పిరి. వారు అతనికి తన నిర్ణయమును మానుకొని, షిర్డీ వెళ్ళమని సలహా నిచ్చిరి. వారి సలహాను పాటించి సోమదేవ స్వామి షిర్డీ వెళ్ళి బాబాను దర్శించెను. బాబాను చూసిన తర్వాత అతని అభిప్రాయం మారెను. అతడు బాబాను సమీపించగా బాబా అతనితో ఇట్లనెను - "మా వేషం మా వద్దనే ఉండనిమ్ము. నీవు నీ ఇంటికి పొమ్ము. తిరిగి మసీదుకు రావద్దు. మసీదుపై జెండా ఎగురవేయునట్టి వారి దర్శనమేల చేయవలెను. ఇది యోగి లక్షణమా! ఇక్కడ ఒక నిమిషమైనా ఉండవద్దు"

సోమదేవస్వామి, "బాబా నా మనసులోని మాటలనే చెప్పచున్నాడు" అని అర్థం చేసుకొనెను. బాబా కోపమును ఆశీర్వాదంగా భావించెను. పశ్చాత్తాపంతో

శరణు వేడెను. అప్పుడు బాబా అతనిని మసీదులో ప్రవేశించనిచ్చారు. కొన్నాళ్ల తర్వాత అతనికి బాబా యందు గాఢమైన నమ్మకం ఏర్పడెను. అతడు బాబాకు గొప్ప భక్తుడయ్యెను.

3. ఒక డాక్టరు

ఒకనాడు ఒక మామలతదారు తన స్నేహితుడగు ఒక డాక్టరుతో షిర్డీకి వచ్చెను. ఆ డాక్టరు తన దైవం శ్రీరాముడనియు, అందువలన తాను మహమ్మదీయుడగు బాబాకు నమస్కరించననియు చెప్పెను. అంతట మామలతదారు డాక్టరుతో బాబాకు నమస్కారం చేయనక్కర లేదనియు, ఊరక మసీదుకు వచ్చిన చాలునని చెప్పెను. అందుకు డాక్టరు సమ్మతించెను.

మసీదుకు వెళ్లిన తర్వాత బాబాకు నమస్కారం చేసిన వారిలో డాక్టరు ముందుండెను. అంతట మామలతదారు డాక్టరుతో "నీవు నీ మనో నిశ్చయమును మార్చుకొని బాబాకు ఎందుకు నమస్కారం చేసావు?" అని ప్రశ్నించెను. అందకు డాక్టరు, "నా ప్రియదైవమగు శ్రీరాముడు ఆ గద్దెయందు కనిపించుటచే వారి పాదములపై పడి సాష్టాంగ నమస్కారం చేసితిని" అని చెప్పెను.

ఆ మరుసటి దినమే ఆ డాక్టరు బాబా తనను ఆశీర్వదించు వరకు మసీదుకు పోకూడదని నిశ్చయించుకొనెను. కాని నాలుగవ దినమున ఖండేషు నుండి తన ప్రియస్నేహితుడు రాగా, అతడు వానితో కలిసి మసీదులోని బాబా దర్శనంకై పోయెను. అతడు బాబాకు నమస్కరించెను. అంతట బాబా, "ఎవరు పిలిస్తే ఇప్పుడు వచ్చావు" అని డాక్టరును ప్రశ్నించిరి. ఈ ప్రశ్న విన్నంతనే డాక్టరుకు ఆశ్చర్యం కలిగెను. ఆనాటి రాత్రియే బాబా డాక్టరుకు నిద్రలో ఆశీర్వాదమొసంగిరి. డాక్టరు గొప్ప ఆనందానుభూతిని పొందెను. పిమ్మట అతడు తన గ్రామం పోయెను. బాబాయందు అతని భక్తి అనేక రెట్లు వృద్ధి పొందెను.

4. రెండు బల్లుల కథ

ఒకనాడు ఒక భక్తుడు మసీదులో బాబా ముందర కూర్చొనియుండెను. అంతట ఒక బల్లి టిక్కుటిక్కుమని పలికెను. ఒక భక్తుడు బాబాను దాని అర్థమేమిటని అడిగెను. తన చెల్లెలు ఔరంగాబాదు నుండి తనను చూచుటకు వచ్చుచున్నదని ఆ బల్లి చాల ఆనందంగా ఉంది అని బాబా చెప్పిరి. భక్తుడు బాబా మాటలు అర్థంగాక, ఆశ్చర్యంతో కిమ్మనక కూర్చొండెను.

ఆ రోజు మధ్యాహ్నం ఒక వ్యక్తి గుర్రం మీద వచ్చి మసీదు ముందు ఆగెను. అతడు ఎచ్చటికో వెళ్ళుచూ మార్గమధ్యమున అక్కడ ఆగెను. కారణమేమన అతని గుర్రం ఆకలితో ముందుకు పోలేకుండెను. అతడు దానికి దాణా పెట్టుటకై ఉలవల సంచిని తీసి దానిపైనున్న ధూళిని విదలించెను. అప్పుడు ఒక బల్లి క్రింద పడి అందరు చూచుచుండగనే గోడ ఎక్కెను.

బాబా అంతకుముందు బల్లిని గురించి ప్రశ్నించిన భక్తునితో ఆ బల్లి చేష్ట లను గమనించమని చెప్పిరి. అందరూ చూస్తుండగనే ఆ బల్లి అచటికి వచ్చిన తన చెల్లెలు వద్దకు సంతోషంతో పోయెను. చాల కాలం తర్వాత అక్క చెల్లెలు కలుసుకొన్నారు. కాన ఒకరి నొకరు కౌగలించుకొని ముద్దిడుకొన్నారు. గుండ్రంగా తిరుగుచు ఆడుకొన్నారు.

ఇదంతా గమనించిన ఆ భక్తుడు గుర్రపురౌతు వద్దకు వెళ్ళి, "షిర్డీ ఎక్కడ? ఔరంగాబాదు ఎక్కడ? నీవు బల్లిని తీసుకొని షిర్డీ రావడమేమిటి? అక్కా చెల్లెలు కలియుదురని బాబా ఎట్లు చెప్పిరి? ఈ అద్భుతములన్నియు బాబా సర్వజ్ఞతను చాటి చెప్పచున్నవి కదా!" అని పలికెను.

5. చోల్కర్ చక్కెరలేని తేనీరు

దాసగణు తన హరికథలచే సాయి మహిమను నలుపైపులకు వ్యాపింప చేసెను. ఒకనాడు అతడు థాణాలోని కౌపీనేశ్వర ఆలయంలో హరికథ చెప్పచూ సాయి మహిమను గానం చేయుచుండెను. హరికథను వినుటకు వచ్చిన వారిలో చోల్కర్ అనునతడు ఉండెను. అతడు థాణా సివిల్‌కోర్టులో గుమాస్తాగా పని చేయు చుండెను. హరికథ వినుచు అతడు బాబాను ఈ విధంగా ప్రార్థించెను. "బాబా! నేను పేదవాడను, నేను నా కుటుంబమునే పోషించలేకున్నాను. మీ అనుగ్రహంచే నేను ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణుడనై ఖాయమైన ఉద్యోగమును పొందినచో షిర్డీ వచ్చెదను. మీ పాదములకు సాష్టాంగ నమస్కారం చేసి భక్తులకు మీ పేరున కలకండ పంచి పెట్టెదను" అతని మ్రొక్కు ఫలించెను. అతడు ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణుడై ఖాయమైన ఉద్యోగం పొందెను.

అతడు వెంటనే షిర్డీ వెళ్ళదలచెను. కాని బీదతనం అడ్డువచ్చెను. అతడు పొదుపు పాటించి డబ్బుకూడబెట్టి షిర్డీ వెళ్ళదలచెను. పొదుపు చేయుటకై తేనీరు

(టీ) లో చక్కెర వేసుకొనుట కూడ మానెను. ఆ విధంగా డబ్బు కూడబెట్టి షిర్డీ వెళ్ళి బాబా పాదములకు నమస్కరించి భక్తులకు కలకండ పంచిపెట్టెను.

అతడు బాపుసాహెబు జోగు గృహమందు బసచేసియుండెను. అతడు జోగుతో కలిసి మసీదుకు వెళ్ళి ఇంటికి వెళ్ళుటకు బాబా అనుమతి కోరెను. బాబా జోగుతో ఇట్లనిరి - "నీ అతిథికి టీ కప్పులో దండిగా చక్కెరవేసి ఇమ్ము" చోల్కరు బాబా సర్వజ్ఞతకు మిక్కిలి ఆశ్చర్యపడెను. కాని జోగుకు ఏమీ అర్థం కాలేదు. అంతట బాబా వారితో ఇట్లనిరి - "నా ఎదుట భక్తితో చేతులు చాపిన వారిచెంత నేను రాత్రింబవళ్ళు ఉందును. నేను ఇచ్చట శరీరంతోనున్నను, మీరు సప్త సముద్రముల అవతల చేయుచున్న పనులు కూడ నాకు తెలియును. ప్రపంచమున మీకు ఇష్ట మైనచోటుకు వెళ్ళండి. కాని నేను మీ దగ్గరే ఉందును. మీ హృదయమే నా నివాస స్థలం, సర్వజన హృదయాలలో నున్న నన్ను పూజింపుడు. నన్ను ఈ విధంగా గుర్తిం చిన వారు ధన్యులు"

బాబా చోల్కరుకు చక్కని నీతిని బోధించిరి.

6. ముప్పయి వేలు దొరికినవి

ఒకరోజున బాబా భక్తులకు ఈ కథను చెప్పిరి - "నేను ఒకనాడు సముద్ర తీరమున తిరుగుచూ ఒక పెద్ద భవనం వద్దకు వచ్చి దాని వసారాపై కూర్చొంటిని. యజమాని నన్ను బాగా ఆదరించి చక్కని భోజనం పెట్టెను. బీరువా ప్రక్కన శుభ్ర మైన స్థలం చూపి అక్కడ పరుండమనెను. నేను అక్కడ నిద్రపోయితిని. నేను గాఢ నిద్రలో ఉండగా ఆ వ్యక్తినా జేబులోనున్న 30 వేల రూపాయలను దొంగలిం చెను. ఉదయం లేచిన తర్వాత ఈ విషయం తెలుసుకొని నేను మిగుల బాధ పడితిని. 15 రోజుల పాటు వసారాపై కూర్చొనే ఏడ్చుచుంటిని.

ఒక రోజున ఒక ఫకీరు నాకు కనిపించెను. అతడు నా ఏడ్పునకు కారణ మేమిటని అడిగెను. నేను కారణం చెప్పితిని. అతడు ఒక ఫకీరు అడ్రసు ఇచ్చెదనియు, అక్కడకు వెళ్ళి అతని శరణు వేడిన నా ధనం తిరిగి లభించుననియు, ఈలోగా ధనం దొరుకువరకు నాకు ప్రియమైన ఆహారం వదలిపెట్టమనియు చెప్పెను. నేను ఫకీరు చెప్పినట్లు నడచుకొంటిని. నా ధనం నాకు దొరికెను.

నేను వాడాను వదిలి సముద్రపు ఒడ్డుకు పోయితిని. అక్కడ ఒక స్టీమరు ఉండెను. దానిలో జనం ఎక్కువగా ఉండుటచే నేను దానిలోనికి ప్రవేశించలేక పోయితిని. ఒక మంచి నౌకరు సహాయంతో నేను దాని లోనికి వెళ్ళితిని. అది ఇంకొక ఒడ్డునకు తీసుకొని పోయెను. అక్కడ రైలు బండిని ఎక్కి ఈ మసీదుకు వచ్చితిని".

ఈ కథ శ్యామాకు విచిత్రంగా తోచెను. కారణమేమన బాబా ఎప్పడూ సముద్రతీరమునకు వెళ్ళి యుండలేదు. పైగా బాబా వద్ద ఎప్పడూ 30 వేల రూపాయలు ఉండలేదు.

అంతట గోవా నుండి వచ్చిన ఒక భక్తుడు బాబా చెప్పిన కథ తన కథయే ననియు, అది బాబా సర్వజ్ఞతకు నిదర్శనమనియు చెప్పెను. అతడు తన కథను ఈ విధంగా చెప్పెను -

"నావద్ద ఒక బ్రాహ్మణ వంట మనిషి 35 సంవత్సరాలుగా పని చేయు చుండెను. ఒక రోజున అతనికి దుర్బుద్ధి పుట్టింది. అతడు మా ఇంటికి కన్నం వేసి 30 వేల రూపాయల కరెన్సీని దొంగలించి పారిపోయెను. రాత్రింబవళ్ళూ ఏడ్చుచు కూర్చొంటిని. 15 రోజుల తర్వాత ఒక ఫకీరు నా దుఃఖమునకు కారణం తెలుసు కొని ఇట్లు చెప్పెను - "షిర్డీ సాయిని కొలువుము. నీ ధనం దొరికి, వారి దర్శనం చేసుకొనునంతవరకు నీకు ఇష్టమైన ఆహారమును వదిలి పెట్టుము" నేను అట్లే చేసితిని. 15 దినములు గడచెను. ఆ వంట బ్రాహ్మణుడు నా డబ్బు నాకు తిరిగి ఇచ్చెను. తన తప్పను మన్నించమని వేడెను. నాకు సహాయ పడిన ఫకీరు తిరిగి కనిపించలేదు. ఫకీరు చెప్పిన షిర్డీ సాయిబాబాను చూడవలెననెడి గాఢమైన కోరిక నాకుండెను. మా ఇంటికి వచ్చిన ఫకీరు షిర్డీ సాయిబాబాయే అని నా నమ్మకం.

నా ధనమైతే దొరికింది. కాని బాబా దర్శనం చేసుకొనవలెననెడి మ్రొక్కును మరచితిని. ఒకనాటి రాత్రి కొలాబాలో నున్నప్పడు బాబాను స్వప్నంలో చూసితిని. షిర్డీకి పోవలెనను సంగతి అప్పడు జ్ఞప్తికి వచ్చెను. నేను గోవా వెళ్ళితిని. అక్కడ హార్బరుకు వెళ్ళగా స్టీమరులో ఖాళీ లేకుండెను. ఒక నౌకరు సహాయంతో ఏదో విధంగా స్టీమరులో ప్రవేశించితిని. బొంబాయి చేరితిని, అక్కడి నుండి ఇక్కడికి రైలులో వచ్చితిని.

మేమెక్కడ? మా ఇల్లెక్కడ? మా అదృష్టమేమని చెప్పవలెను? బాబాయే నన్ను మ్రొక్కుకొమ్మని ఆజ్ఞాపించిరి. వారే నా ద్రవ్యమును తిరిగి ఇప్పించిరి. వారే నన్ను ఇచ్చటికి తెచ్చిరి. వారి సర్వజ్ఞతను నేనేమని కొనియాడగలను?

ఎంతో దూరానయున్న భక్తుల కథలను తన కథలుగా చెప్పిన బాబా సర్వజ్ఞతను మన మేమని కొనియాడగలం. వారిని మనసారా స్మరిస్తూ వారి గాథను పారాయణ చేద్దాం

7. రెండు రూపాయల కథ

ఒక భక్తుడు బాబాకు దక్షిణగా శ్యామా పేరిట రు. 2/-లు మనియార్డర్ పంపాడు. అది చేరినప్పుడు బాబా భిక్షకు వెళ్ళియుండెను. శ్యామా బాబా సర్వజ్ఞతను పరీక్షింపదలచి ఆ రెండు రూపాయలను మసీదు ముంగిట పాతిపెట్టెను. ఆ విషయమును గూర్చి బాబా వద్ద ఏమీ ప్రస్తావించలేదు. ఆరుమాసాల తర్వాత శ్యామా ఇంట దొంగలుపడి సర్వమూ దోచుకుపోయారు. అతడు ఆ విషయమై బాబాతో మొరపెట్టుకొన్నాడు. అప్పుడు బాబా నవ్వుతూ ఇలా చెప్పారు - "నీ ఇంట దొంగలు పడితే చెప్పకోవటానికి నేనైనా ఉన్నాను. నా రెండు రూపాయలు పోయి 6 నెలలైంది. నేను ఎవరికి చెప్పకోను?" అప్పడు శ్యామా, "అంత చిన్న తప్పనకు ఇంత పెద్ద శిక్షా?" అన్నాడు. "నీలాంటి ఉద్యోగికి అదెంతో, నాలాంటి ఫకీరుకు రెండు రూపాయలు అంతే" అన్నారు సాయి. కర్మసూత్రమెంత సూక్ష్మమో కదా!

8. బాబా పండరీపురమునకు పోవాలనుకొనుట

నానాసాహెబు చాందోర్కరు బాబాకు గొప్ప భక్తుడు. అతడు ఖాందేషులోని నందురుబారులో మామలతదారుగా ఉండెను. అతనికి పండరీపురమునకు బదిలీ జరిగెను. నానాసాహెబు షిర్డీవెళ్ళి విఠోబాయగు బాబాను దర్శించి పండరీపురం వెళ్ళదలచెను. అందుకుగాను అతడు కుటుంబ సహితంగా బయలుదేరెను. ఈ విషయం ఎవరికీ తెలియదు. కాని సర్వజ్ఞుడగు బాబాకు ఈ విషయం ముందుగనే తెలుసు. కనుక నానాసాహెబు నీమ్‌గావ్ చేరగానే షిర్డీలో మసీదులో కలకలం ప్రారంభమయ్యెను. బాబా అక్కడున్న మహాల్సాపతి, అప్పాషిండే, కాశీరామ్‌లతో ఇట్లనిరి - "పండరీ ద్వారములు తెరిచారు. కనుక మన నలుగురమూ కలసి భోజనం చేద్దాం. ఆనందంగా పాడుదాం రండి" వారందరూ బాబాతో కలసి పాట పాడసాగిరి. ఆ పాట భావమిది - "నేను పండరీపురం పోవాలి. నేనక్కడ నివసించాలి. అది నా దైవం యొక్క ఆదేశం"

గత జన్మలో ఇచ్చినదే ఈ జన్మలో అనుభవించుచున్నాము

బాబా పాడుచుండిరి. భక్తులు అనుసరించు చుండిరి. కొద్ది సేపటికి నానా వచ్చి బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసెను. అతడు బాబాను పండరీ పురం వచ్చి తమతో కలసి ఉండవలసిందిగా కోరాలని తల్పంచుచుండెను. కాని బాబాయే స్వయంగా పండరీపురం వెళ్ళాలని పాడుచుండుటచే నానా సాహెబుకు ఆ కోరికను వ్యక్తపరచవలసిన అవసరం ఏర్పడలేదు. అతడు బాబా సర్వజ్ఞతకు ఆశ్చర్యపడి బాబా పాదాలపై పడెను. అతడు బాబా ఆజ్ఞను, ఊదీ ప్రసాదమును, ఆశీర్వాదమును పొంది పండరీపురమునకు పోయెను.

9. సుదూర ప్రాంతాన భక్తాళి రక్షం

(కమ్మరి వాని కొమారుని రక్షించుట)

1910 సం॥ నాటి కథ. ఆ రోజు దీపావళి పర్వదినం. బాబా ధుని ముందు కూర్చొని చలికాచుకొనుచుండిరి. ఉన్నట్టుండి బాబా కట్టెలుకు బదులుగా తన చేతులను ఆ ధునిలో ఉంచారు. బాబా చేతులు కాలి బొబ్బలెక్కడం జరిగింది. అక్కడే వున్న సాయి భక్తులగు మాధవ, శ్యామా ఈ విషయాన్ని గమనించారు. వారు సాయి చర్యలకు విస్మయమొంది బాబా నడుము పట్టుకొని గట్టిగా వెనక్కి లాగారు, వారు 'ఏమైంది బాబా!' అని అడగసాగారు. బాబా తన చేతులు కాలాయి అనే విషయం చెప్పకుండా "హమ్మయ్య!" అంటూ ఇలా చెప్పసాగారు. "కమ్మరి వాని భార్య కొలిమి దగ్గర తిత్తి కొడ్తున్నది. ఇంతలో భర్త పిలవడంతో తన ఒడిలో బిడ్డడున్నాడన్న సంగతి కూడా మరచి పరిగెత్తిందామె. ఆ బిడ్డడు అగ్నిలో పడు తుంటే నా చేతులు చాచి ఆ కుర్రవాణ్ణి కాపాడాను. నా చేతులు కాలాయని బాధ లేదు నాకు. ఆ కుర్రవాడు కాపాడబడ్డాడు. అదే నాకు సంతృప్తినిచ్చే విషయం"

ఈ సంఘటనను బట్టి తల్లి తన పిల్లల సంరక్షణలో అలక్ష్యం చేయవచ్చు; కానీ సాయిమాత మాత్రం తన భక్తుల సంరక్షణలో సదా జాగ్రత్త వహిస్తుందని మనకు తెలుస్తుంది.

సంతానమును ప్రసాదించుట

తల్లిదండ్రులు తమకు సంతానం కలగాలనియు, వారి ముద్దు ముచ్చటలను చూసి ఆనందించాలనియు, పిల్లలు వృద్ధాప్యంలోను, కష్టసుఖాలలోను తమకు అండగా ఉంటారనియు ఆశించటం సహజం. వారు మగపిల్లలయితే

తమను పున్నామ నరకం నుండి కాపాడుతారని విశ్వసిస్తారు. సంతానం స్త్రీకి పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది.

సంతానంలేని వారి బాధలు వర్ణనాతీతం. వారు వాడని మందులు కాని, చేయని వ్రతాలుకాని, మ్రొక్కని దేవతలు కాని ఉండరు. అట్టి అభాగ్యులెందరో బాబాను శరణుజొచ్చారు. బాబా చాలా మందిని సంతానంతో ఆశీర్వదించారు. అట్టి కొంతమందిని గురించి ఇప్పుడు తెలుసుకొందాం.

1. నానాసాహెబ్

నీమ్‌గావ్‌లో జి.డెంగలే అను వ్యక్తి ఉండేవాడు. అతడంటే సాయిబాబాకు ఎక్కువ ప్రేమ. అందువల్ల బాబా అప్పుడప్పుడు అతని ఇంటికి వచ్చేవారు.

జి.డేంగలేకు నానాసాహెబు అను ఒక తమ్ముడు ఉండెను. ద్వితీయ వివాహానంతరం కూడా అతనికి సంతానం కలుగలేదు. డేంగలే అతనితో బాబాను ఆశ్రయించమని చెప్పెను. అతడు అట్లే చేసెను. బాబా ఆశీర్వాదంతో నానాసాహెబుకు సంతానం కలిగెను.

అప్పటి నుండి దూరదూర ప్రాంతాల నుండి భక్తులు బాబాను దర్శించుటకు తండోపతండములుగా రాసాగిరి. వారు దినమంతయు బాబాను చుట్టి యుండెడి వారు.

2. సఖారామ్

సఖారామ్ ఔరంగాబాదుకర్ షోలాపూరు నివాసి. అతని భార్యకు 27 సంవత్సరములైనను సంతానం కలుగలేదు. ఆమె అనేక దేవతలను మ్రొక్కుకొనెను. కాని నిష్ప్రయోజనమయ్యెను. తుదకు ఆమె షిర్డీచేరి బాబాకు సేవ చేస్తూ రెండు నెలలు గడిపెను. ఆమె మసీదుకు ఎప్పుడుపోయినను బాబా చుట్టు భక్తులు గుమి కూడి యుండెడివారు. బాబా ఒంటరిగా నున్నప్పుడు ఆమె వారి పాదములపై పడి తన కోరికను తెలుపదలచెను. ఆమె ఆ విషయమును శ్యామాకు తెలిపెను. శ్యామా ఆమెతో సమయం చూసి అవకాశం కల్పింతునని చెప్పెను.

ఒకరోజున బాబా గద్దెపై కూర్చొనియుండెను. శ్యామా సైగ చేయగా ఆమె బాబాకు నమస్కరించి కొబ్బరికాయ, అగరువత్తులు ఇచ్చెను. బాబా కొబ్బరికాయను ఆడించెను. అది ఎండుది. కనుక లోపల కుడక ఆడుచు శబ్దం వచ్చుచుండెను.

శ్యామా కోరిన ప్రకారం బాబా ఆమెకు 12 మాసముల లోగా సంతానం కలుగునని ఆశీర్వదించిరి.

బాబా చెప్పిన ప్రకారం సంవత్సరంలోగా ఆమె కొడుకును కనెను. 5వ మాసంలోగా, కొడుకును తీసుకొని సఖారామ్ దంపతులు మసీదుకు వచ్చి బాబా పాదములపై పడిరి. సఖారామ్ బాబాకు 500 రూపాయలు సమర్పించెను. ఆ డబ్బుతో బాబా తన గుర్రమగు శ్యామకర్ణకు అశ్వశాల కట్టించిరి.

3. సపత్నేకరు

సపత్నేకరు అక్కల్‌కోటలో న్యాయవాదిగా యుండెను. 1913లో అతనికి గల ఒకే కొమారుడు గొంతువ్యాధితో చనిపోయెను. అతని మనస్సు వికలమయ్యెను. అతడు అనేక పుణ్యక్షేత్రములను సందర్శించెను. కాని అతనికి మానసిక శాంతి లభించలేదు. అప్పుడు అతనికి మిత్రుడగు షేవడే షిర్డీ బాబాను గురించి చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చెను.

షేవడే బాబా గొప్ప భక్తుడు. అతడు న్యాయవాది పరీక్షకు చదువుచున్నప్పడు తోటి విద్యార్థుల కంటే చాల వెనుకబడి యుండెను. అయినను అతనికి బాబా ఆశీర్వాదంచే పరీక్షలో ఉత్తీర్ణుడగుదునను పూర్ణ విశ్వాసం ఉండెను. అతడు అట్లే పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెను.

సపత్నేకరు షిర్డీ వెళ్లెను. గొప్ప భక్తితో బాబా వద్దకు వెళ్ళి ఒక కొబ్బరికాయ పెట్టి బాబా పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసెను. బాబా అతనిని బయటికి పొమ్మనిరి. సపత్నేకరు బాలాషింపీ సహాయంతో బాబా అనుగ్రహం పొందదలచెను. కాని బాబా అతనిని మసీదు వదలి వెళ్ళమని ఆదేశించిరి. సపత్నేకరు బాబాను మరొకసారి వచ్చినపుడైనా దర్శనం ఇమ్మని వేడెను.

ఒక సంవత్సరం గడచెను. ఒక రోజు అతని భార్యకు ఒక స్వప్నం వచ్చెను. స్వప్నంలో ఆమె నీళ్ళకుండ పట్టుకొని లకడ్షాబావికి పోవుచుండెను. ఒక ఫకీరు ఆమె వద్దకు వచ్చి ఇట్లనెను - "నీవు అనవసరంగా శ్రమ పడవద్దు. నీ కుండను స్వచ్ఛజలంతో నింపుదును" ఆమె అతని మాటలకు భయపడి పారిపోసాగెను. ఇంతలో ఆమెకు మెలకువ వచ్చెను. ఆమె స్వప్న వృత్తాంతమును భర్తకు తెలిపెను.

ఆ స్వప్నం ద్వారా షిర్డీ రమ్మని బాబా తెలిపినాడని తలంచి ఆ దంపతులు షిర్డీ చేరిరి. సపత్నేకరు భార్య అప్పడే లెండీ నుండి వచ్చుచున్న బాబాను చూసెను. ఆమె స్వప్నంలో చూసిన ఫకీరుకు, బాబాకు ఏమియు తేడా లేకుండెను. ఆమె మిగుల భక్తితో బాబాకు సాష్టాంగ నమస్కారం చేసెను. బాబా ఆమెకు ఒక విషయము ను చెప్పిరి - "నేను చాల మందులు వాడితిని, అవి పనిచేయలేదు. కాని ఇచ్చట నొప్పలన్నియూ వెంటనే మాయమైనవి". ఇది బాబాకు సంబంధించిన వృత్తాంతం కాదు; సపత్నేకరు భార్యకు సంబంధించింది.

తానడగకనే తన బాధలను గుర్తించి తొలగించిన బాబా శక్తికి సపత్నేకరు భార్య చాల ఆశ్చర్యపడెను.

సపత్నేకరు బాబాను దర్శించగా, వారు అతనిని అక్కడినుండి వెళ్లి పొమ్మని చెప్పిరి. బాబాను తాను లోగడ నిందించి ఎగతాళి చేసిన ప్రతిఫలమిదని సపత్నే కరు గ్రహించెను. బాబా ఒంటరిగానున్నప్పడు కలిసి క్షమాపణ కోరెను. అతడు తన శిరస్సును బాబా పాదాలపై ఉంచగా బాబా తన వరద హస్తమును అతని తలపై పెట్టెను. అతడు బాబా పాదాలను ఒత్తుచూ అక్కడనే కూర్చొండెను. అప్పడు బాబా ఒక వైశ్యుడు జీవితంలో పడిన కష్టములను, అతని ఒక్కగానొక్క కొడుకు మరణించిన కథను చెప్పిరి. సపత్నేకరు బాబా నోటి నుండి తన కథను విని మిగుల ఆశ్చర్యపడెను.

బాబా అక్కడున్న భక్తులకు సపత్నేకరును చూపించి ఇట్లు చెప్పిరి - "నేను వీని కొడుకును చంపితినని నన్ను నిందించుచున్నాడు. నేను లోకుల బిడ్డను చంపెదనా? అదే బిడ్డను వీని భార్య గర్భంలోనికి మరల తెచ్చెదను"

బాబా సపత్నేకరు తలపై తన వరద హస్తం నుంచి ఇట్లనిరి - "ఇక నీ కష్టములు తీరినవి. నాయందే నమ్మకం ఉంచుము. నీ మనోభీష్టం నెరవేరును" ఈ మాటలకు సపత్నేకరు మైమరచెను. బాబా పాదములను కన్నీటితో తడిపెను.

సపత్నేకరు ప్రతిరోజు భార్యతో కలిసి పూజాసామగ్రి, నైవేద్యం తీసుకొని మసీదుకు వెళ్లి, బాబాకు సమర్పించి వారి వద్ద ప్రసాదం తీసుకొనుచుండెను.

ఒకరోజు బాబా అతనిని ఇట్లు ఆశీర్వదించిరి - "కొబ్బరికాయ తీసుకొనుము. దీనిని నీ భార్యచీర కొంగులో పెట్టుము. హాయిగా పొమ్ము". అతడట్లే చేసెను. ఒక

సంవత్సరంలో కొడుకుపుట్టెను. 8 మాసముల శిశువుతో భార్యాభర్తలు షిర్డీకి వచ్చి ఆ శిశువును బాబా పాదములపై పెట్టి ఇట్లు ప్రార్థించిరి - "ఓ, సాయీ! నీ బాకీని ఎట్లు తీర్చుకొనవలయునో తెలియకున్నది. ఇక మీదట మేము సదా నీ పాదములనే ఆశ్రయించెదం. మా మనస్సులను నీ భజనవైపు మరల్చి రక్షింపుము"

వారు తమ కుమారునకు మురళీధర్ అని పేరు పెట్టిరి. తర్వాత భాస్కర్, దినకర్ అను ఇద్దరు కుమారులు జన్మించిరి.

4. రతన్‌జీ షాపుర్జీవాడియా

రతన్‌జీ షాపుర్జీవాడియా అను పార్శీ వర్తకుడు ఒకడు నాందేడులో ఉండెను. అతడు చాల ధనం సంపాదించెను. పొలములు, తోటలు, పశువులు, బండ్లు, గుర్రములు మొదలగు ఐశ్వర్యములతో తులతూగుచుండెను. అతడు ఔదార్యం కలవాడు మంచి దానధర్మాలు చేయువాడు. బీదలకు అన్నదానం, వస్త్రదానం చేయుచుండెను. చూచిన వారందరూ అతడు మంచి వాడనియు, సంతోషంగా నుండుననియు చెప్పుచుండిరి. కాని అతడు పుత్రసంతానం లేదని బాధపడుచుండెను. రాత్రింబవళ్ళు దీనిని గూర్చియే చింతించుచుండెను. అతనికి దాసగణు మహారాజు నందు గౌరవం మెండు. అతడు అతని సలహా మేరకు షిర్డీ వెళ్ళి బాబా దర్శనం చేసుకొనెను. ఒకపూలమాలను బాబా మెడలో వేసి అతని పాదాలపై పడెను. ఒక గంప పండ్లను సమర్పించెను. తనకు పుత్రభిక్ష పెట్టి కాపాడ మని ప్రార్థించెను. బాబా 5 రూపాయలు దక్షిణ ఇమ్మని కోరిరి. మూడు రూపాయల పద్నాలుగు అణాలు* లోగడే ముట్టి యుండుటచే ఇక ఒక రూపాయ రెండు అణాలు ఇచ్చిన చాలుననిరి. రతన్‌జీకి ఆ విషయమేమీ బోధపడలేదు. అతడు బాబాకు ఒక రూపాయి రెండు అణాలు ఇచ్చెను. బాబా మనస్సు కరిగెను. వారు అతనిని ఈ విధంగా ఆశీర్వదించిరి - "చికాకు పడకు. నీ చెడు రోజులు ముగిసినవి. అల్లా నీ మనసులోని కోరికను నెరవేర్చును".

---

* దశాంశ విధానమును అమలు పెట్టక పూర్వం మన దేశములో రూపాయలు, అణాలు పద్ధతి వాడుకలో ఉండెను. ఒక రూపాయకు పదారు అణాలు.

రతన్‌జీ బాబా నుండి సెలవు తీసుకొని నాందేడు వచ్చెను. అతడు తాను బాబాకు లోగడ మూడు రూపాయలా పద్నాలుగు అణాలు ఎప్పుడు ఇచ్చానా అని ఆలోచించసాగెను. కాని ఏమియు బోధపడలేదు. దాసగణునకు కూడ అర్థం కాలేదు. తర్వాత కొద్ది దినములకు రతన్‌జీకి లోగడ నాందేడులోని మౌలా సాహెబుకు ఇచ్చిన మూడు రూపాయలా పద్నాలుగు అణాల సంగతి జ్ఞాపకమునకు వచ్చెను. అప్పుడు మౌలాసాహెబు, బాబా ఒక్కడేనని రతన్‌జీ గుర్తించెను.

కొద్దికాలం తర్వాత రతన్‌జీకి పుత్రసంతానమయ్యెను. దంపతుల ఆనందమునకు అంతులేకుండెను. రతన్‌జీకి బాబాయందు స్థిరమైన నమ్మకం కలిగెను. బాబాపట్ల అతని భక్తి దినదినాభివృద్ధి చెందెను.

5. దాము అన్నా (ఆమ్రలీల)

దాము అన్నాకు ఇద్దరు భార్యలు ఉండిరి. కాని సంతానం లేకుండెను. జ్యోతిష్కులు అతనికి సంతానభాగ్యం లేదని చెప్పిరి.

ఒకసారి దాము అన్నా షిర్డీచేరి బాబాకు నమస్కరించెను. అంతకు పూర్వమే బాబాకు రాలేయను మామలతదారు గోవా నుంచి పంపిన మూడు వందల మామిడి పండ్ల పార్శిలు చేరియుండెను. వాటిలో నాలుగు పండ్లను బాబా దాము అన్నా కొరకు ఒక కుండలో భద్రపరచియుండెను.

బాబా దాము అన్నాను చూడగనే ఇట్లనిరి - "నీవు కుండలోని మామిడి పండ్లను తిని చావు". చావుమనగా అహంకారమును చంపుకోమని బాబా ఉద్దేశ్యం. తర్వాత బాబా భయపడుతున్న అతనితో ఇట్లనిరి - "నీవు తినవద్దు. నీ చిన్న భార్యకు ఇమ్ము." అన్నా అట్లే చేసెను. కొంత కాలమునకు ఆమెకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు జన్మించిరి. బాబా మాటలు నిజమయ్యెను. జ్యోతిష్కుని మాటలు ఉత్తవాయెను.

దాభోల్కర్ హేమాడ్‌పంత్‌గా ప్రసిద్ధి చెందుట

గోవింద రఘునాథ్ ఉరఫ్ అన్నాసాహెబు దాభోల్కరు 1859వ సం॥లో ఠాణా జిల్లాలోని కేళ్వేమాహిమునందు ఒక బీద ఆర్యగౌడ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించెను. అతని తల్లిదండ్రులు దైవభక్తి కలవారు.

దాభోళ్కరు ప్రారంభమున స్వగ్రామమున విద్యను అభ్యసించెను. తర్వాత పూనాలో ఇంగ్లీషులో 5వ తరగతి వరకు చదివెను. ఆర్థిక పరిస్థితులు సరిగా లేనందున చదువుకు స్వస్తి పలికెను. ప్రభుత్వ పరీక్షలలో ఉత్తీర్ణుడై తన ఊరులోనే ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించెను.

ఆ సమయమందు కులాబా జిల్లాలో సాబాజీ చింతామణి చిటిణీస్ అను నతడు మామలతదారుగా ఉండెను. అతడు దాభోళ్కరు తెలివితేటలను, మంచి తనమును గమనించి అతనిని తలాటీ యను గ్రామోద్యోగిగా నియమించెను. తర్వాత అతడు కొంతకాలం గుమాస్తాగాను, మరికొంత కాలం ఫారెస్ట్ విభాగంలో ఉద్యోగిగాను, ఇంకొంత కాలం కరువు విభాగంలో ప్రత్యేక ఉద్యోగిగాను నియమింప బడెను.

అతడు 1901 వ సం॥న థాణా జిల్లాలో శాహాపూరులో మామలత దారుగా నియమింపడెను. 1903వ సం॥లో అతడు బాంద్రాకు ఫస్టుక్లాసు రెసిడెంట్ మెజిస్ట్రేట్‌గా పంపబడెను. అతడు అచ్చట 1907వ సం॥ వరకు పనిచేసెను. అతడు అదే ఉద్యోగమును మార్చాడు, ఆనంద్, బోర్సద్‌లలో చేసి 1910వ సం॥న తిరిగి బాంద్రాకు బదిలీ అయ్యెను.

బాంద్రాలో అతనికి కాకాసాహెబు దీక్షిత్, నానాసాహెబు చాందోర్కరు మంచి స్నేహితులుగా ఉండిరి. వారి సలహా ప్రకారం దాభోళ్కరు బాబా దర్శనం చేసుకొన తలంచెను. కాని షిర్డీ ప్రయాణమునకు ఆటంకం ఏర్పడెను. లోనావలులో నున్న అతని స్నేహితుని కొడుకు జ్వరగ్రస్తుడయ్యెను. మందులు, మంత్రములు ఏవీ పని చేయలేదు. అతని స్నేహితుడు తన గురువుగారిని పిలిపించి తన కొడుకు ప్రక్కన కూర్చొండబెట్టెను. దాని వలన కూడ ప్రయోజనమేమీ కలుగలేదు. ఈ సంగతి తెలుసుకొన్న దాభోళ్కరు మనసులో ఇలా తలంచెను - "గురువుగారు నా స్నేహితుని కుమారుని రక్షింపలేక పోయారు. అలాంటప్పుడు నేను షిర్డీ ఏల పోవలెను?" ఇలా తలంచి అతడు షిర్డీ ప్రయాణమును మానుకొనెను.

కాని ఇంతలో ఒక సంఘటన జరిగింది. నానాసాహెబు చాందోర్కరు ప్రాంత ఉద్యోగిగా ఉండెను. అతడు ఉద్యోగం పనిపై వసయీకి పోదలచి థాణా నుండి దాదరుకు వచ్చెను. అతడు దాదరులో వసయీ బండి కొరకు వేచి యుండెను.

అంతలో బాంద్రా లోకల్‌బండిరాగా దానిలో ఎక్కి బాంద్రా వెళ్లెను. అతడు దాభోళ్కరును రమ్మని కబురు పంపెను. దాభోళ్కరు షిర్డీ ప్రయాణమును మానుకొన్నాడని తెలుసుకొని అతనిపై కోపపడెను. అంతట దాభోళ్కరు అదే రాత్రి షిర్డీపోవ నిశ్చయించుకొనెను.

దాభోళ్కరు సామానుతో స్టేషనుచేరి మన్‌మాడ్‌మెయిలు పెట్టెలో కూర్చొనెను. బండి బయలుదేరునప్పుడు ఆ పెట్టెలోనికి ఒక సాహెబు ఎక్కెను. అతడు దాభోళ్కరును ఎక్కడికి వెళ్ళుచున్నావని అడిగెను. దాభోళ్కరు తన షిర్డీ ప్రయాణమును గురించి చెప్పెను. అంతట సాహెబు దాభోళ్కరుతో ఇట్లు చెప్పెను - "ఈ రైలు దాదర్‌లో ఆగదు. బోరీ బందరు స్టేషనుకు పోవలెను". ఈ చిన్నలీల జరగకుండనిచో దాభోళ్కరు అనుకొన్న ప్రకారం మరుసటి దినం ఉదయం షిర్డీ చేరలేక పోయేవాడు. సాహెబు సలహా పాటించటం వల్ల దాభోళ్కరు ఎట్టి ఇబ్బందియు లేక షిర్డీ చేరెను. అతని కొరకు కాకాసాహెబు వేచియుండెను. ఈ సంఘటన 1910 ప్రాంతంలో జరిగింది.

షిర్డీలో టాంగా దిగిన వెంటనే దాభోళ్కరుకు బాబాను దర్శించవలెననెడి ఆతురత కలిగింది. తాత్యాసాహెబు నూల్కరు అప్పడే మసీదు నుండి వచ్చు చుండెను. అతడు దాభోళ్కరుతో ఇట్లు చెప్పెను - "బాబా వాడా చివరనున్నారు. నీవు తొలుత వారి పాదదర్శనం చేసుకో. స్నానానంతరం ఓపికగా మరలా చూడవచ్చు".

దాభోళ్కరు బాబా పాదములకు సాష్టాంగ నమస్కారంచేసెను. ఆనందంతో పులకరించి పోయెను. నానాసాహెబు చెప్పినదాని కంటె అనేక రెట్లు ఎక్కువ ఆనందం పొందెను. ఎంతో తృప్తిని అనుభవించెను. బాబా పాదములు పట్టిన వెంటనే అతని జీవితంలో గొప్ప మార్పు వచ్చింది. అతడు మనసులో ఇలా తలంచెను -"నన్ను షిర్డీ పోవలసిందిగా ప్రోత్సహించిన వారందరికీ నేను ఎంతో ఋణపడియున్నాను. వారు నా నిజమైన స్నేహితులు. వారి ఋణమును నేను తీర్చుకొనలేను. వారికి నా సాష్టాంగ ప్రణామములు. బాబా దర్శనంతో నా మనసులోని ఆలోచనలు మారిపోయినవి".

షిర్డీ చేరిన మొదటి రోజునే దాభోళ్కరుకు, బాలాసాహెబుకు గురువు ఆవశ్యకతను గూర్చి గొప్ప వివాదం జరిగెను. తర్వాత దాభోళ్కరు ఇతరులతో కలసి మసీదునకు వెళ్లగా బాబా కాకాను పిలిచి ఈ విధంగా అడిగెను - "సాఠేవాడాలో ఏమి జరిగింది? దేనిని గూర్చి జరిగింది? ఈ హేమాడ్‌పంత్ ఏమని పలికెను"

బాబా తనను హేమాడ్‌పంత్‌తో పోల్చినందుకు దాభోళ్కరుకు ఆశ్చర్యం కలిగింది. అతడు తన మనసులో ఇలా తలంచాడు - "నేనెక్కడ? హేమాడ్‌పంత్ ఎక్కడ? నేనేమో మామూలు మనిషిని. హేమాడ్‌పంత్ దేవగిరి యాదవ వంశపు రాజులకు ముఖ్యమంత్రిగా ఉండేవాడు. గొప్ప పండితుడు, మంచి స్వభావం కలవాడు. చతుర్వర్గ చింతామణి, రాజ ప్రశస్తి అనుగొప్ప గ్రంథములను రచించిన వాడు. మోడీ భాషను, క్రొత్త పద్ధతి లెక్కలను కనిపెట్టినవాడు. బహుశా నా అహంకారమును చంపుటకు ఇది బాబా ప్రయోగించిన బాణం కావచ్చు. నేను ఎల్లప్పుడు అణకువ, మమత కలిగియుండవలెనని బాబా కోరిక కావచ్చు. వివాదంలో గెలిచినందుకు బాబా నా తెలివికి మెచ్చి ఈ బిరుదును ఇచ్చి వుండవచ్చు."

దాభోళ్కరు 1916వ సం॥న ప్రభుత్వోద్యోగమును మానుకొనెను. ప్రభుత్వం వారిచ్చు ఫించను అతని కుటుంబపోషణకు చాలకుండెను. అతడు గురు పౌర్ణమి నాడు ఇతరులతో కలిసి షిర్డీ వెళ్ళెను. అణ్ణా చించడీకర్ దాభోళ్కరును గురించి బాబాతో ఇట్లనెను - "ఇతనికి ఫించను సరిపోవుటలేదు. ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఇతని బాధలను తొలగించండి", బాబా అతనితో ఇట్లు చెప్పిరి - "అతడు ప్రస్తుతానికి నా సేవతో తృప్తి పడవలెను. అతని భోజనమునకు ఎట్టి లోటురాదు. త్వరలోనే అతనికి గొప్ప ఉద్యోగం వచ్చును".

దాభోళ్కరు బాబా చెప్పినట్లు జరుగునా లేదా అని సందేహించు చుండెను. కాని బాబా పలుకులు నిజమయ్యెను. అతనికి ఒక ప్రభుత్వ ఉద్యోగం లభించెను. అతడు కొంతకాలం వరకు ఆ ఉద్యోగం చేసెను. ఆ తర్వాత ఉద్యోగం మానుకొని బాబా మహాసమాధి చెందునంతవరకు వారి సేవలో గడిపెను.

1910వ సం॥లో బాబా దాభోళ్కరునకు ఇచ్చిన హేమాడ్‌పంత్ బిరుదు భవిష్యత్తులో సార్థకమైంది. బాబా సమాధి చెందిన తర్వాత దాభోళ్కరు శ్రీ సాయి సంస్థానమును చక్కని తెలివితేటలతో నడిపెను. లెక్కలను బాగుగా ఉంచెను. అంతియేగాక భక్తి, జ్ఞానం, నిర్వ్యామోహం, ఆత్మశరణాగతి, ఆత్మ సాక్షాత్కారం మొ॥ విషయాలతో 'శ్రీ సాయి సచ్చరిత్ర' అను గ్రంథమును 51 అధ్యాయాలలో రచించెను. సాయిని గురించి వ్రాయబడిన అనేక గ్రంథాలకు ఇదే ఆధారం.

హేమాడ్‌పంత్ ఇంటిలో బాబా భోజనం

1917వ సం॥న హోళీ పండుగనాడు వేకువ జామున హేమాడ్‌పంత్‌నకు ఒక స్వప్నం వచ్చెను. స్వప్నంలో బాబా కనిపించి ఆనాడు తాను వారింటికి భోజనము నకు వచ్చెదనని చెప్పిరి. అతడు తన స్వప్నవృత్తాంతమును తన భార్యకు తెలిపెను. ఆమె బాబా షిర్డీలోని మంచి-మంచి పిండి వంటలను విడిచి బాంద్రాలోని మన ఇంటి భోజనమునకు వచ్చునా అని సందేహం వెలిబుచ్చెను. అందుకు హేమాడ్ పంత్ ఈ విధంగా బదులిచ్చెను - "బాబా స్వయంగా రాకపోవచ్చు. ఎవరినైనా పంపవచ్చు. కనుక కొంచెం బియ్యం ఎక్కువ వేసినచో నష్టమేమీ లేదు".

మధ్యాహ్న భోజనం సిద్ధమయ్యెను. హోళీపూజ ముగిసెను. విస్తళ్ళు వేసిరి. ముగ్గులు పెట్టిరి, భోజనమునకు రెండు పంక్తులు తీర్చిరి. రెండింటి మధ్య బాబా కొరకు ఒక పీటను సిద్ధంగా ఉంచిరి. ఇంటి వారందరూ భోజనమునకు కూర్చొనిరి. అతిథి కొరకు ఎదురుచూడసాగిరి. 12 గంటల సమయం దాటినప్పటికి ఎవరూ రాలేదు. తలుపువేసి గొళ్ళెం పెట్టిరి. అగ్నిహోత్రునకు, శ్రీకృష్ణునకు నైవేద్యం పెట్టిరి. అందరికీ నెయ్యి వడ్డించిరి. అందరూ భోజనం చేయుటకు సిద్ధమగుచుండగా మేడమెట్లపై చప్పుడు వినిపించెను. ఇంతలో వెళ్ళి తలుపు తీసెను. అలీ మహమ్మదు, మౌలానా ఇస్మముజాఫర్ అను వారుండిరి. వారు పెద్దదగు చక్కని సాయిబాబా పటమును తెచ్చి ఇచ్చిరి. హేమాడ్‌పంత్ మిగుల ఆశ్చర్యపడెను. అతడు వంగి బాబా పటమునకు నమస్కరించెను. బాబా ఈ విధంగా తన లీలచే తనను ఆశీర్వదించెనని తలంచెను. హేమాడ్‌పంత్ వారిని భోజనశాలకు తీసుకొని పోయెను. ఆ పటమును బాబా కొరకు వేసిన పీటపై పెట్టి వండిన పదార్థములన్నియూ వడ్డించిరి. తర్వాత అందరూ భోజనం చేసిరి. వారు బాబా చక్కని పటమును చూసి ఆనంద భరితులైరి.

ఈ విధంగా బాబా హేమాడ్‌పంత్‌నకు చెప్పిన మాటలను నెరవేర్చిరి.

హేమాడ్‌పంత్‌కు అందిన బాబా ఫోటో వృత్తాంతం

అలీ మహమ్మదు బాంద్రా నివాసి. అతని ఇంటిలో ప్రసిద్ధి చెందిన రహిమాన్ బాబా, మౌలానా సాహెబు మహమ్మదు హుసేన్, సాయిబాబా, తాజుద్దీన్ బాబా మొదలగు యోగుల పటములుండెను. ఒకసారి అతని తలమీద కురుపు లేచెను.

చిత్తశుద్ధి లేకుండా పరమాత్మను పొందాలని తలంచుట జ్ఞానగర్వమే అవుతుంది

అతడు బొంబాయిలో తన కురుపునకు శస్త్రచికిత్స చేయించుకొనెను. అప్పుడు అతడు తన బావమరది ఇంటిలో ఉండెను. అతని బావమరది యోగుల పటము లను సముద్రములో పడవేసినచో అతని వ్యాధి పూర్తిగా నయమగునని అతనితో చెప్పెను. అంతట అతడు తన మేనేజరును బాంద్రాలోని తన ఇంటికి పంపి అక్కడున్న పటములన్నింటినీ సముద్రంలో పడవేయమని చెప్పెను.

రెండు నెలల తర్వాత అలీ మహమ్మదు బాంద్రా చేరెను. అతడు తన ఇంటిలో ఇంతకు పూర్వంవలె గోడమీద బాబా పటముండుట గమనించి ఆశ్చర్యపడెను. తన మేనేజరు ఆ పటమును తీయుట ఎందుకు మరచెనో అతనికి అర్థం కాలేదు. తన బావమరది చూసిన, దానిని కూడా నష్టపరచునని తలంచెను. అతడు వెంటనే దానిని తీసి బీరువాలో దాచెను. దానిని ఏమి చేయాలా అని ఆలోచించ సాగెను. ఒక రోజున బాబా అతనికి కలలో కనిపించి ఇట్లు చెప్పిరి - “మౌలానా ఇస్ము ముజాఫర్‌ను కలిసి వారి అభిప్రాయం ప్రకారం చేయుము”. అలీ మహమ్మదు బాబా చెప్పిన విధంగా ఇస్ము ముజాఫర్‌ను కలిసెను. ఇద్దరూ బాగా ఆలోచించి ఆ పటమును హేమాడ్‌పంత్‌నకు ఇచ్చిన అతడు దానిని భద్రంగా దాచునని ఒక నిర్ణయమునకు వచ్చిరి. వారు దానిని సరైన సమయములో హేమాడ్‌పంత్‌నకు అందించి అతనిని ఆనందపరచిరి.

హేమాడ్‌పంత్ మనసులో సద్విచారములను ప్రోత్సహించుట

హేమాడ్‌పంత్ ఒక బుధవారం రాత్రి పడుకొనునపుడు ఇట్లనుకొనెను - “రేపు గురువారం, శుభదినం, షిర్డీ పవిత్రమైన స్థలం. కావున రేపటి దినమంతయు రామనామస్మరణతో కాలం గడపవలెను.” ఆ మరుసటి దినం లేవగనే రామనామం అప్రయత్నంగా జ్ఞప్తికి వచ్చెను. అతడు మిక్కిలి సంతసించెను. కాల కృత్యములు తీర్చుకొన్న తర్వాత పువ్వులను తీసుకొని బాబాను చూచుటకు బయలుదేరెను. దీక్షిత్ వాడా విడిచి బుట్టీవాడా దాటుచుండగా ‘గురుకృపాంజన పాయే మేరే భాయి’ అను పాట వినబడసాగెను. అది ఏకనాథుని పాట. ఆ పాటను ఔరంగాబాద్ నుండి వచ్చిన ఒక భక్తుడు మసీదులో బాబా ఎదుట పాడుచుండెను. ఆ పాట అర్థమిది - “గురుకృప అను అంజనం లభించింది. దానివల్ల కండ్లు తెరవబడెను. దానిచే నేను శ్రీరాముని హృదయంలోను, బయట, అన్నిచోట్లా, నిద్రావస్థలోను, జాగ్రదావస్థలోను, స్వప్నావస్థలోను చూడగలుగుచున్నాను”.

ఆ పాటను విన్న హేమాడ్‌పంత్ తన మనసులో ఇట్లనుకొనెను. - "నేను ఈ రోజంతయు రామనామ స్మరణచే గడపదలచితిని. నా మనోనిశ్చయమును దృఢ పరచుటకు గాను బాబా ఇట్టి ఏర్పాటు చేసిరి కాబోలు!"

మన వృత్తులను తొలుత గురువునకు సమర్పించవలెను

షిర్డీలో ఆదివారం సంత జరిగెడిది. చుట్టు ప్రక్కల పల్లెల నుండి ప్రజలు వచ్చి దుకాణములు వేసుకొని సరుకులు అమ్ముచుండిరి. అందుచే ఆదివారం నాడు మసీదు జనులతో క్రిక్కిరిసి పోవుచుండెను.

ఒక ఆదివారంనాడు హేమాడ్‌పంత్ సాయిబాబా పాదములను ఒత్తుచూ మనస్సు నందు జపం చేయుచుండెను. శ్యామా హేమాడ్‌పంత్ వద్దకు వచ్చి ఇట్లనెను - "నాన్నా! నీ కోటుకు శనగగింజలు అంటినట్లున్నవి, చూడుము" తర్వాత అతడు హేమాడ్‌పంత్ చొక్కా చేతులను దులిపెను. అంతట కొన్ని శనగ గింజలు నేల రాలెను. ఇది చూసి అక్కడున్న వారంతా హేమాడ్‌పంత్ చొక్కా చేతిలోనికి శనగగింజలు ఎలా వచ్చాయా అని ఆలోచించసాగిరి. వారికి సరియైన సమాధానం లభించలేదు.

అప్పుడు బాబా ఇట్లనిరి - "వీనికి తానొక్కడే తినే దుర్గుణం ఒకటి కలదు. ఈనాడు సంతరోజు. శనగలు తినుచు ఇక్కడికి వచ్చాడు" అంతట హేమాడ్‌పంత్ తానెన్నడును సంతను చూడలేదనియు, ఆనాడు శనగలు తాను కొనలేదనియు, తనకు ఒంటరిగా తిను స్వభావం లేదనియు బదులు చెప్పెను.

ఈ మాటలు విని బాబా ఇట్లు చెప్పిరి - "నీవు చెప్పినది నిజమే. దగ్గరున్న వారికి ఇచ్చెదవు. ఎవ్వరునూ దగ్గర లేనప్పుడు నీవు కాని, నేనుకాని ఏమి చేయ గలము? కాని తినుటకు ముందు నీవు నన్ను స్మరింతువా? నేను నీ దగ్గర లేనా? నీవు ఏదైనా తినుటకు ముందు నాకు అర్పించుచున్నావా?"

దీనిని బట్టి మనకు తెలియునదేమన మనం కామ, క్రోధ, లోభాల ఆలోచనలను మొట్టమొదట గురువునకు అర్పించవలెను. ఈ అభ్యాసం వల్ల మన వృత్తులను నిర్మూలించుటలో గురువు తోడ్పడును.

చేసిన తప్పును తిరిగి చేయకపోవుటయే యథార్థమైన పశ్చాత్తాపం

ఆ సందర్భమున హేమాడ్‌పంత్‌నకు సుధాముని కథ జ్ఞప్తికి వచ్చెను. సుధాముడు, శ్రీ కృష్ణుడు బాల్యమిత్రులు, గురువగు సాందీపుని ఆశ్రమంలో యుండగా ఒక రోజున వారిద్దరూ కట్టెలు తెచ్చుటకు అడవికి వెళ్లిరి. అలసిపోయిన శ్రీకృష్ణుడు సుధాముని తొడపై తల ఉంచి గురకపెట్టుచూ నిద్రపోయెను. అప్పడు సుధాముడు గురుపత్ని ఇచ్చిన శనగలను తినసాగెను. హఠాత్తుగా శ్రీకృష్ణుడు "సోదరా! ఏమి తినుచుంటివి?" అని అడిగెను. సుధాముడు ఇట్లనెను - "తినుటకు ఏమున్నది?" శ్రీకృష్ణుడు 'తథాస్తు' అని అని పలికెను. అందుకే సుధాముడు మిక్కిలి దారిద్ర్యం అనుభవించెను. కాని తర్వాత శ్రీకృష్ణునకు పిడికెడు అటుకులు సమర్పించగా మిక్కిలి వైభవం పొందెను.

దీనిని బట్టి మొదట భగవంతునికి అర్పించి, ఆ భుక్త శేషమునే మనం అనుభవించవలెనని తెలియుచున్నది. ఈ విషయమునే బాబా యుక్తిగా బోధించిరి.

బాబా! నీవు సర్వాంతర్యామివి
ఎక్కడ ఏమి జరిగినా నీకు తెలుస్తుంది
నీ భక్తులలో ఎవరికి ఎప్పడు ఏమి
అవసరమైతే దానిని అందిస్తావు
నీ కరుణ అపారం
నీ మాట అమోఘం
నీ యుక్తి అద్వితీయం
నీకే మా సర్వస్వ శరణాగతి

ఓం శ్రీసాయిరామ్

ఆరవరోజు (మంగళవారం) పారాయణ

ఆత్మ స్వరూపులారా! ఈనాడు మనం బాబా భక్తులకు ఏ విధంగా శారీరక స్వస్థత చేకూర్చేవారో, ఎలా రానున్న ప్రమాదాలను గురించి హెచ్చరిక చేసేవారో మొదలగు విషయాలను తెలుసుకొందాం.

శ్రీ సద్గురు సాయినాథ మహారాజ్‌కీ జై!

బాబాకు మించిన వైద్యుడు లేడు

బాబా డాక్టర్లచేత నయముకాని అనేక రోగముల నుండి తన భక్తులకు ఉపశమనం కలిగించేవారు. అందుకే ఆయన భక్తులందరూ బాబాకు మించిన వైద్యుడు లేడంటారు. కొన్ని దృష్టాంతాలు క్రింద పేర్కొనబడినవి.

1. భీమాజీ బాధను తీర్చిన దైవం

భీమాజీ పాటిల్ పూనా జిల్లా జున్నరు తాలూకా నారాయణ్‌గావ్ గ్రామానికి చెందినవాడు. 1909 వ సం॥లో అతడు తీవ్రమైన క్షయవ్యాధికి గురయ్యాడు. ఎన్ని రకముల ఔషధములు వాడిననూ ప్రయోజనం లేకుండెను. వైద్యులు అతడు బ్రతకడని చెప్పివేసిరి. అతడు 'ఓ భగవంతుడా! నారాయణా! నాకు ఇప్పుడు సహాయము చేయుము' అని ప్రార్థించెను. అతడు బాబా భక్తుడగు నానాసాహెబు చాందోర్కరు సలహా కోరుతూ ఉత్తరం వ్రాసెను. అందుకు నానాసాహెబు బాబాను శరణు వేడుకొనుట ఒక్కటే మార్గమని బదులు వ్రాసెను. అంతట భీమాజీ పాటిల్‌ను షిర్డీకి తీసుకొనివెళ్ళి మసీదులోనున్న బాబా ముందర పెట్టిరి. ఆ జబ్బు వాని గత జన్మలోని పాపకర్మ ఫలితమని భావించి దానిలో జోక్యం చేసుకొనుటకు బాబా ఇష్టపడకుండిరి. రోగి తనకు వేరే దిక్కు లేదనియు, బాబా పాదములనే పూర్తిగా నమ్ముకొన్నాననియు చెప్పెను. అంతట బాబా హృదయం కరిగెను. వారిట్లు చెప్పిరి - "భయపడకు. ఈ మసీదులో కాలు పెట్టగానే ఎంత కష్టమైనా తీరవలసిందే. ఇక్కడి ఫకీరు దయామయుడు"

బాబా చెప్పిన ప్రకారం పాటిల్ భీమాబాయి ఇంటిలో బస చేసెను. పాటిల్ అక్కడుండగా బాబా రెండు స్వప్నములలో అతని రోగమును కుదర్చెను. మొదటి

స్వప్నంలో బాబా తరగతి ఉపాధ్యాయుడుగా పద్యములు కంఠస్థం చేయని విద్యార్థిని కొట్టినట్లు కనిపించిరి. రెండవ స్వప్నంలో బాబా అతని ఛాతీపై పెద్ద బండను వేసి క్రిందకు మీదకు త్రోయుచున్నట్లు కనిపించిరి. ప్రతి 5 నిమిషములకు రక్తం గ్రక్కుచుండిన ఆ రోగి ఒక్కసారి కూడ రక్తం గ్రక్కలేదు.

రోగం నయమై పాటిల్ ఇంటికి వెళ్లెను. అప్పుడప్పుడు షిర్డీ వచ్చుచుండెను. బాబా పట్ల గట్టి నమ్మకం, భక్తి కలిగియుండెను. ఇంతకు పూర్వం చేయుచున్న శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమునకు బదులుగా క్రొత్తగా సాయి సత్యవ్రతమును తన యింట ప్రారంభించెను.

౨. బాలా గణపతి షింపీ

బాలా గణపతి షింపీ అనువాడు బాబా భక్తుడు. అతడు ఒకసారి మలేరియా జబ్బుచే బాధపడుచుండెను. ఎన్ని రకముల మందులు, కషాయములు వాడిననూ జ్వరం తగ్గలేదు. షిర్డీకి వెళ్లి బాబా పాదములపై పడెను. బాబా అతనికి ఒక వింత విరుగుడు చెప్పిరి. లక్ష్మీమందిరం ముందరనున్న నల్లకుక్కకు పెరుగన్నం కలిపి పెట్టమనిరి. అతడు అట్లే చేసెను. అతని మలేరియా జ్వరం శాశ్వతంగా తగ్గెను.

౩. బాపు సాహెబు బుట్టీ

బాపు సాహెబు బుట్టీ ఒకసారి జిగట విరేచనములతోనూ, వమనముల తోనూ బాధపడుచుండెను. ఎన్ని మందులు వాడిననూ తగ్గలేదు. అందుచే అతడు మసీదుకు కూడ రాలేకుండెను. బాబా అతనిని ఇతరుల సహాయంతో మసీదుకు పిలిపించి, "జాగ్రత్త. నీవు విరేచనం చేయకూడదు. నీ వమనం కూడ ఆగవలెను" అని తన చూపుడువ్రేలును ఆడిస్తూ చెప్పిరి. వెంటనే అతని రెండు వ్యాధులు నయ మయ్యెను.

మరొకసారి బుట్టీ కలరా చేతను, తీవ్రమైన దప్పిక తోను బాధ పడుచుండెను. డాక్టరు పిళ్లే ఎన్నో మందులు ఇచ్చి చూసెను. కాని ప్రయోజనం లేకుండెను. అంతట అతడు బాబా వద్దకు వెళ్లి సలహా అడిగెను. బాబా బాదాం పప్పు, పిస్తా, అక్రోటు నానబెట్టి పాలు, చక్కెరలో ఉడికించి తీసుకొమ్మని చెప్పెను.

సాధారణంగా బాబా చెప్పిన పదార్థాలు తీసుకొన్నచో రోగం ముదురునని డాక్టర్లు చెప్పదురు. కాని బుట్టీ బాబా మాటలను అమలు పరచెను. అతని రోగం త్వరలోనే నయమయ్యెను.

4. బాలారామ్ ధురంధర్

బాలారామ్ ధురంధర్ బొంబాయికి దగ్గరున్న శాంతాక్రజ్‌లో ఉండేవాడు. పఠారే ప్రభు జాతికి చెందినవాడు. కొన్నాళ్ళు బొంబాయి న్యాయశాస్త్ర కళాశాలకు ప్రిన్సిపాలుగా వుండెను. అతడు భగవత్ చింతన కలవాడు. ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించువాడు. పండరీపుర విఠోబా భక్తుడు. అతనికి 1912లో సాయిబాబాతో పరిచయమయ్యెను. ఆ పరిచయం కలిగిన ఉదంతం ఈ విధంగా ఉంది.

ఒకసారి బాలారామ్ సోదరులు షిర్డీకి వెళ్ళి బాబాను దర్శించిరి. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత వారు బాలారామ్‌తో తమ అనుభవములను తెలిపిరి. అంతట బాలారామ్‌కు కూడ బాబాను దర్శించాలని కోరిక కలిగెను. అతడు ఒక రోజున తన సోదరులతో కలిసి షిర్డీ బయలుదేరెను. వారందరూ షిర్డీ రాకపూర్వమే బాబా వారి రాకను గురించి భక్తులతో ఇట్లు చెప్పెను - "ఈ రోజున నా దర్బారు జనులు వచ్చుచున్నారు".

వారు షిర్డీ వచ్చి తన దర్శమునకు రాగా బాబా తన భక్తులతో ఇట్లనిరి - "వీరే నా దర్బారు జనులు. ఇంతకుముందు వీరి రాకను గురించే నేను తెలిపింది" ఈ సంగతి విని ధురంధర్ సోదరులు మిగుల ఆశ్చర్యపడిరి.

బాబా ధురంధర్ సోదరులతో ఇట్లు చెప్పిరి - "గత 60 తరాల నుండి మనం పరిచయస్తులం" ధురంధర్ సోదరులు వినయ విధేయతలు కలవారు. వారు బాబా పాదముల వైపు దృష్టి నిలిపిరి. వారిలో సాత్విక భావాలు* కలిగెను. వారు భోజనానంతరం కొంతసేపు విశ్రమించి తిరిగి మసీదుకు వచ్చిరి.

బాలారామ్ బాబాకు దగ్గరగా కూర్చొని బాబా పాదాలు ఒత్తసాగెను. బాబా చిలిము త్రాగి బాలారామునకిచ్చి పీల్చమనెను. బాలారామునకు చిలము పీల్చు అలవాటు లేకున్నను బాబా మాటను కాదనలేక చిలిము పీల్చెను. దానితో 6 సంవత్స రాలుగా నున్న ఉబ్బస వ్యాధి నుండి విముక్తి పొందెను.

★ కన్నీరు కారుట, గగుర్పాటు, గొంతుక ఆర్చుకొని పోవుట మొ॥

ధురంధర్ సోదరులు గురువారం నాడు షిర్డీకి వచ్చియుండిరి. అందుచే వారు ఆనాడు జరిగిన చావడి ఉత్సవమును తిలకించిరి. వారు ఆ ఉత్సవమున హారతి సమయమందును, ఆ మరుసటి రోజు ఉదయాన కాకడ హారతి సమయ మందును బాబా ముఖములో పాండురంగ విఠలుని ప్రకాశమును గాంచిరి.

బాలారామ్ ధురంధర్ మరాఠీ భాషలో తుకారామ్ జీవితమును రచించెను.

5. ఆళందిస్వామి

ఆళంది నుండి ఒక స్వామి బాబా దర్శనమునకై షిర్డీ వచ్చెను. చెవిపోటు ఎక్కువగా నుండుటచే అతనికి నిద్ర పట్టకుండెను. అతడు తిరిగి పోవునపుడు బాబా దర్శనమునకై వెళ్ళెను. శ్యామా అతని చెవిపోటును తగ్గించమని బాబాను వేడుకొనెను. బాబా 'అల్లా అచ్ఛా కరేగా' (భగవంతుడు నీకు మేలు చేయును) అని అశీర్వదించిరి.

ఆళందిస్వామి పూనా చేరెను. పూనా నుండి 'చెవిపోటు తగ్గెను. కాని వాపు తగ్గలేదు' అని షిర్డీకి ఒక ఉత్తరం వ్రాసెను. వాపు పోగొట్టుకొనుటకై శస్త్ర చికిత్స చేయించుకొనవలెనని అతడు బొంబాయి వెళ్ళెను. డాక్టరు చెవి పరీక్ష చేసి శస్త్ర చికిత్స అనవసరమని చెప్పెను. బాబా వాక్కుకు అంత అద్భుతమైన శక్తి కలదు.

6. కాకామహాజని

ఒకసారి కాకామహాజని నీళ్ళ విరేచనములతో బాధపడుచుండెను. అతడు బాబాయే త్వరలో బాగుచేయునని నమ్మెను. ఒకరోజు మసీదు ముందర రాళ్ళ తాపన పని ప్రారంభమయ్యెను. కాకామహాజని ఆ పనిని పర్యవేక్షించుచుండెను. ఇంతలో బాబా కోపోద్రిక్తుడై బిగ్గరగా అరచిరి. అందరు పరుగులు తీసిరి. కాకా మహాజని కూడా పారిపోసాగెను. బాబా అతనిని గట్టిగా పట్టుకొనిరి. ఈ సందడిలో ఒక వ్యక్తి వేరుశెనగపప్పుతో నిండిన ఒక చిన్న సంచిని అక్కడే వదలి పారిపోయెను.

బాబా ఆ సంచిలో నుంచి ఒక పిడికెడు శనగపప్పు తీసి చేతులతో నలిపి, పొట్టును ఊది శుభ్రమైన పప్పును కాకాకు ఇచ్చి తినమనిరి. బాబా కూడా కొంత పప్పుతినిరి. సంచి ఖాళీకాగానే నీళ్ళు తీసుకొని రమ్మని బాబా కాకాను ఆజ్ఞాపించిరి. బాబా కొంచెం నీళ్ళు త్రాగి కాకాను కూడా త్రాగమనిరి. అప్పడు బాబా ఇట్లనిరి -

"నీ నీళ్ల విరేచనాలు ఆగిపోయినవి. ఇప్పుడు నీవు రాళ్ళు తాపన పనిని చూసుకొని వచ్చు" అంతలో పారిపోయిన వారందరూ తిరిగి వచ్చిరి. విరేచనాలు తగ్గుటచే కాకా కూడా వారితో కలిసెను.

వైద్యశాస్త్రప్రకారం వేరుశనగపప్పు విరేచనాలను హెచ్చించును. దీనిని బట్టి వేరు శనగపప్పు ఔషధం కాదనియు, బాబా వాక్కు మాత్రమే ఔషధమనియు తెలియుచున్నది.

7. దత్తోపంతు

దత్తోపంతు హోర్దా గ్రామ నివాసి. అతడు కడుపు నొప్పితో 14 సంవత్సరములు బాధపడెను. ఏ ఔషధమూ గుణమివ్వలేదు. అతడు షిర్డీకి పోయి బాబా పాదములపై పడెను. బాబా అతనిని ఆశీర్వదించి ఊదీ ప్రసాదం ఇచ్చిరి. అతని బాధ తొలగిపోయెను. ఆ బాధ తిరిగి ఎన్నడూ రాలేదు.

8. శ్యామాను కాచిన దైవం

శ్యామా (మాధవరావు దేశపాండే) మూలవ్యాధిచే బాధపడుచుండెను. బాబా అతనికి సోనాముఖి కషాయమిచ్చిరి. వ్యాధి నయమయ్యెను. రెండు సంవత్సరాల తర్వాత అతని జబ్బు తిరుగదోడెను. శ్యామా అదే కషాయమును బాబా ఆజ్ఞలేకుండ సేవించెను. కాని వ్యాధి అధికమయ్యెను. తిరిగి బాబా ఆశీర్వాదంతో వ్యాధి నయ మయ్యెను.

9. గంగాధర పంత్

గంగాధరపంత్ మహాజని అన్న. అతడు చాలా సంవత్సరాలు కడుపు నొప్పితో బాధపడుచుండెను. అతడు బాబా కీర్తి విని షిర్డీ వచ్చెను. కడుపునొప్పి నుండి విముక్తి కలిగించమని బాబాను ప్రార్థించెను. బాబా అతని కడుపు ముట్టుకొని భగవంతుడే బాగుచేయగలడనిరి. అప్పటి నుండి అతని కడుపునొప్పి పూర్తిగా నయ మయ్యెను.

10. నానాసాహెబు చాందోర్కర్

ఒకనాడు నానాసాహెబు పగలు-రాత్రి కడుపునొప్పితో మిగుల బాధ పడెను. డాక్టర్లు ఇంజక్షను ఇచ్చిరి. కాని వాటివల్ల ప్రయోజనం చేకూరలేదు. నానా బాబా వద్దకు వెళ్లెను. బాబా ఆశీర్వదించిరి. దీనివల్ల అతని జబ్బు పూర్తిగా తొలగిపోయెను.

11. కాకాదీక్షిత్

ఒకసారి షిర్డీలోని కాకాదీక్షిత్‌కు తీవ్రంగా జ్వరం వచ్చెను. అతడు శ్యామా ద్వారా బాబాకు కబురు చేసెను. బాబా "నేనేమీ వైద్యుణ్ణి కాను. అతనిని ఇంటికి పొమ్మను" అని చెప్పిరి. శ్యామా ఆశ్చర్యంతో "అతడు మిమ్మల్నే నమ్ముకొన్నాడు. జ్వరంతో ఎలా వెళ్ళగలడు?" అన్నాడు. బాబా తన నిర్ణయం మార్చుకొనలేదు. కాకా దీక్షిత్ బాబా వద్ద సెలవు తీసుకొనుటకు మసీదుకు వెళ్ళెను. బాబా అతనితో ఇలా చెప్పిరి - "నీవు ఇంటికి పో! ఎలా వచ్చిన జ్వరం అలానే నాలుగు రోజులలో పోతుంది. సీమబాదం, పిస్తా వేసిన పాయసం తిని తిరుగు. పడుకోవద్దు" బాబా అతనికి ఊదీనిచ్చి శ్యామాను తోడు పంపారు. వాళ్ళు రాత్రి 11 గంటలకు రైలు దిగి నడిచి ఇంటికి వెళ్ళిరి. అక్కడ కాకాదీక్షిత్ ఎవరి మాటలు వినకుండా బాబా చెప్పిన ప్రకారం నడుచుకొనెను. 9వ రోజు జ్వరం తగ్గెను.

ఈ విధంగా బాబా అపథ్యమైన ఆహారంతో జబ్బులు తగ్గించేవారు. వారి చికిత్సలలోని రహస్యము వారి సంకల్పమే.

12. డాక్టర్ పిళ్ళే

ఒకప్పుడు డా॥ పిళ్ళేకు నారికురుపు లేచింది. అతడు ఆ బాధ భరించలేక దానిని 10 జన్మలలో అనుభవించేలా చేయమని బాబాకు చెప్పించాడు. బాబా, "పది జన్మలు ఎందుకు? పది రోజులు చాలును" అని చెప్పారు. తర్వాత వారు అతనిని పిలిచి తమ దిండుకు ఆనుకోమని చెప్పి, "సర్వకర్తయైన దైవాన్ని శరణు పొంది ఓపికతో కర్మఫలం అనుభవించు. ఆయన ఎలా చక్కబెడుతారో చూడుము" అని పలికిరి. మరుసటిరోజు "ఇప్పుడు ఒక కాకి వచ్చి ఈ కురుపును పొడవగానే బాధ తగ్గిపోతుంది" అన్నారు.

ఇంతలో ప్రక్కనే పనిచేస్తున్న అబ్దుల్లా పొరపాటున పిళ్ళేకాలు త్రొక్కాడు. నారి కురుపు పగిలి పురుగులన్నీ బయటకు వచ్చేసాయి. తర్వాత అతడు, "కాకి ఎప్పుడు వస్తుంది?" అని అడిగాడు. అప్పుడు బాబా, "ఆ కాకివచ్చి కురుపును పొడిచి వేసింది" అన్నారు. కొద్ది రోజుల్లో ఆ కురుపు మానిపోయింది. బాబా అబ్దుల్లానే 'కాకి' అనేవారు.

13. నందిని

ఒక రోజున బాబా భిక్షకు బయలుదేరారు. సునందిని ఇంటికి వచ్చారు. అప్పుడు ఆమె ఇంట్లో లేదు. కాని కోపర్‌గావ్ నుంచి వచ్చిన ఆమె చెల్లెలు నందిని ఉంది. ఆమె మూడురోజుల నుండి పంటినొప్పితో బాధ పడుతుంది. భక్తుల పాలిట కల్పవృక్షమైన సద్గురు సాయినాథునకు భిక్ష పెడితే తన పంటి బాధ తొలగిపోతుం దని తలచింది. ఆమె హృదయంలో భక్తిభావం పెల్లుబికింది. ఆమెలేని శక్తిని కూడ గట్టుకొని రొట్టె తెచ్చి బాబాకు సమర్పించింది. బాబా ఆమెను ఉల్లిపాయ తెమ్మన్నారు. నందిని ఇంట్లో లేదన్నది. ఆ మాటలు కూడ ఆమె అతి కష్టంతో మాట్లాడింది. ఆమె పన్ను సలిపింది. ఆ బాధకు కళ్లనుండి నీరు వచ్చాయి. ఆమె బలవంతంగా ఏడ్పు ఆపుకొంది. "నాకు ఉల్లిపాయ కావాలి కొరుక్కోవడానికి" అని బాబా అడిగారు. అంతట నందిని చేయునది లేక అతి కష్టంతో కొట్టుకు వెళ్లి ఉల్లిపాయ తెచ్చి ఇచ్చింది.

బాబా వారింటి ముందే కూర్చొని ఉల్లిపాయ కొరికారు. ఆశ్చర్యం. నందిని పిప్పి పన్ను కదిలినట్లయింది. ఆమె దానిని తాకగానే ఊడిపడింది. ఆమె ఆ పంటిని ఇంటిపైకప్పు పైకి విసరివేసింది. అంతేకాకుండా పంటిలోని చీము, చెడురక్తం అంతా బయటికి వచ్చింది. ఆమె ఉమ్మి వేసింది. బాబా, "అల్లా భలా కరేగా" అంటూ లేచి వెళ్లారు.

బాబా అద్భుత శక్తికి ఆమె ఆశ్చర్యపడి సాయి! సాయి! భగవాన్ అంటూ భక్తితో నమస్కరించింది.

14. ఖాపర్డే కుమారుడు

దాదాసాహెబు ఖాపర్డే అమరావతి నివాసి. అతని భార్య, అతని చిన్న కొడుకు షిర్డీలో వుండిరి. అతని చిన్న కొడుకునకు జ్వరం వచ్చెను. ఆ జ్వరం ప్లేగు జ్వరంగా మారెను. అంతట అతని భార్య తన కొడుకును తీసుకొని స్వగ్రామమైన అమరావతికి వెళ్లదలచెను. వెళ్ళుటకు పూర్వం బాబా వద్దకు అనుమతికై వెళ్లెను. బాబా ఇట్లు చెప్పిరి -"ప్రస్తుతం ఆకాశం మేఘాలచే కప్పబడియున్నది. కొద్ది సేపట్లో మేఘాలు చెదరిపోయి ఆకాశం మామూలు స్థితికి చేరుకొనును" ఆమె కొడుకు ప్లేగు జ్వరం త్వరలో తగ్గునని బాబా తన మాటలలో సూచించిరి. తర్వాత బాబా కఫనీని పైకెత్తి తన చంకలో కోడిగ్రుడ్లంత పెద్దవిగానున్న నాలుగు ప్లేగు పొక్కులను చూపి ఇట్లనిరి - "చూచితివా! భక్తుల కొరకు నేనెట్లు బాధపడుచున్నానో!"

ఆమె బాబా ఆదేశానుసారం తన కొడుకు దగ్గరకు వెళ్ళెను. అతని జ్వరం తగ్గి మామూలు స్థితికి వచ్చియుండెను.

దీనిని బట్టి బాబా భక్తుల బాధలను తాను స్వీకరించి వారికి స్వస్థత చేకూర్చు చుండెననియు, వారి మనసు మైనము కన్నా మెత్తనిదనియు, వెన్నెల వలె హాయిని గొల్పునదనియు తెలియుచున్నది.

15. హరిశ్చంద్ర పితళే కుమారుడు

బొంబాయిలో హరిశ్చంద్ర పితళే అను ఒక వ్యక్తి యుండెను. అతని కుమారుడు మూర్ఛరోగముతో బాధపడుచుండెను. ఎన్ని మందులు వాడినా తగ్గ లేదు. బాబా అనేక అసాధ్యమైన రోగాలను కూడ నయం చేసాడని విని హరిశ్చంద్ర పితళే సపరివారంగా షిర్డీ చేరెను. అనేక పండ్ల బుట్టలను తీసుకొని మసీదు చేరెను. బాబాకు నమస్కరించెను. రోగియైన తన కొడుకును బాబా పాదములపై వైచెను. బాబా ఆ బిడ్డవైపు చూడగానే ఒక వింత జరిగెను. పిల్లవాడు స్పృహతప్పి నేలపై పడెను. అతని నోట చొంగకారెను. అతని శరీరమునకు చెమటలు పట్టెను. అతడు చచ్చిన వానివలె యుండెను. దీనిని చూచి అతని తల్లిదండ్రులు చాలా భయపడిరి. తల్లి కన్నీరు వరదలై పారసాగెను. అప్పుడు బాబా ఆమెను ఇలా ఓదార్చిరి - "నీవు ఏడవకు. కొంతసేపు ఓపిక పట్టుము. కుర్రవానిని బసకు తీసుకొని వెళ్ళుము. అరగంటలో వానికి స్పృహవచ్చును" పితళే కుర్రవానిని వాడాకు తీసుకొని వెళ్ళ గానే వానికి స్పృహ వచ్చెను. పితళే కుటుంబంలోని వారందరూ సంతసించిరి.

పితళే దంపతులు బాబా దర్శనమునకై వెళ్ళిరి. పితళే బాబా పాదాలకు వినయంతో సాష్టాంగ నమస్కారం చేసి వారి పాదాలను ఒత్తుచూ కూర్చొండెను. మనస్సులో బాబా చేసిన ఉపకారమునకు నమస్కరించుచుండెను. అది గమనించిన బాబా అతనితో ఇట్లనిరి - "నీ ఆలోచనలు, సంశయాలు భయోత్పాతములు. ఇప్పుడు చల్లబడినవా? నమ్మకం, సహనం కలవారిని భగవంతుడు తప్పక రక్షించును".

పితళే అందరికీ మిఠాయి పంచిపెట్టెను. బాబాకు చక్కని పండ్లను, తాంబూ లములను ఇచ్చెను. అతని భార్య బాబాను కృతజ్ఞతా భావముతో చూడసాగెను. ఆమె కళ్ళనుండి ఆనందబాష్పములు రాలుచుండెను. ఆమె భక్తి భావమునకు బాబా మిగుల సంతృప్తి చెందిరి.

పితళే దంపతులు కొన్ని రోజులు బాబా వద్ద సుఖముగానున్న తర్వాత ఇంటికి వెళ్ళదలచిరి. బాబా దర్శనమునకై మసీదుకు వెళ్ళిరి. బాబా వారికి ఊది ప్రసాద మిచ్చి ఆశీర్వదించిరి. తర్వాత పితళేతో ఇట్లనిరి - "నేను లోగడ రెండు రూపాయలు ఇచ్చియుంటిని. ఇప్పుడు మూడు రూపాయలు ఇస్తున్నాను. పూజా మందిరంలో వీనిని పెట్టుకొని పూజింపుము. మీకు మేలు జరుగును".

పితళేకు బాబా మాటలు అర్థం కాలేదు. ఇంటికి వెళ్ళిన తర్వాత పితళే తన తల్లికి షిర్డీలో జరిగిన సంగతి చెప్పి బాబా మనకు లోగడ రెండు రూపాయలు ఎప్పుడు ఇచ్చియుండిరని అడిగెను. అంతట అతని తల్లి అతనితో ఇట్లు చెప్పెను -

"ఇప్పుడు నీవు నీ కొడుకుని తీసుకొని షిర్డీ వెళ్ళావు కదా! అట్లే మీ నాన్నగారు నిన్ను తీసుకొని అక్కల్‌కోట మహారాజు గారి వద్దకు వెళ్ళియుండిరి. వారు మీ నాన్నగారి పూజలకు మెచ్చి రెండు రూపాయలిచ్చి పూజా మందిరంలో పెట్టుకొని పూజించుచుండిరి. తర్వాత మనము మరచితిమి. అక్కల్‌కోట మహారాజు గారు సాయిరూపంలో నీవు మరచిన దానిని జ్ఞప్తికి తెచ్చారు. నీవు ఆ రూపాయలను పూజించి తాత ముత్తాతల ఆచారం ప్రకారం సత్ప్రవర్తనతో నడువుము." పితళేకు శ్రీ సాయి సర్వాంతర్యామి తత్త్వమునందు, వారి శక్తియందు నమ్మకం కలిగెను.

ఓ సాయీ! ఈ ఇలలో నీకు మించిన వైద్యుడు కలడా!

నీమాటే మందు.

నీ ఊదీయే టానిక్.

నీ దృష్టియే వైద్య విధానం.

నీ ఆశీర్వాదమే చికిత్స

నీ ద్వారకామాయియే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

నీ శరణుగోరిన వానికి స్వస్థత చేకూరకుండునా?

ఓం శ్రీ సాయిరామ్

బాబా హెచ్చరిక

1. బాలాసాహెబు మిరీకర్

బాలాసాహెబు మిరీకర్ సర్దారు కాకాసాహెబు మిరీకర్ కుమారుడు. అతడు కోపర్‌గావ్‌కు మామలతదారుగా యుండెను. అతడు చితళీ గ్రామ పర్యటనకు వెళ్ళుచూ మార్గమధ్యమున నున్న షిర్డీలో దిగి మసీదుకు పోయి బాబాకు నమస్కరించెను. బాబా అతని యోగక్షేమముల నడిగి తెలుసుకొని ఈ విధంగా చెప్పిరి - "నీవు కూర్చొన్న ఈ మసీదే ద్వారకామాయి. ఈ మసీదు తల్లి చాల దయకలది. ఒకసారి ఆమె తొడపై కూర్చున్న భక్తులను అన్ని కష్టముల నుండి కాపాడును. నీకు పొడుగాటి బాబా తెలియునా? అనగా సర్పం. అది మిక్కిలి భయంకరమైనది. కాని ద్వారకామాయి కాపాడుచుండగా అది నిన్నేమి చేయగలదు?"

బాబా బాలాసాహెబుకు ఊదీ ప్రసాదమిచ్చి ఆశీర్వదించిరి. తర్వాత శ్యామాను పిలిచి బాలాసాహెబుతో పాటు చితళీ వెళ్ళి ఆనందించమని చెప్పిరి. బాలాసాహెబు అక్కడ శ్యామాకు ఇబ్బంది కలుగు నేమోనని తలంచి అతనిని రావద్దని చెప్పెను. శ్యామా ఆ విషయమును బాబాకు తెలిపెను. అప్పుడు బాబా అతనితో ఇట్లనిరి - "సరే వెళ్ళవద్దు. వాని మంచిని మనం కోరితిమి. నుదుటన వ్రాసియున్నది కాక తప్పదు"

ఈలోపల బాలాసాహెబు తిరిగి ఆలోచించి శ్యామాను వెంట రమ్మనెను. శ్యామా బాబా వద్ద సెలవు తీసుకొని బాలాసాహెబుతో కలిసి టాంగాలో బయలుదేరెను. వారు రాత్రి 9 గం॥లకు చితళీ చేరి ఆంజనేయస్వామి దేవాలయంలో బస చేసిరి. కచేరీలో పనిచేయువారు ఎవరూ రానందున వారొక మూల కూర్చొని మాట్లాడసాగిరి. చాపపైన కూర్చొని బాలాసాహెబు వార్తాపత్రికను చదువుచుండెను. అతని అంగవస్త్రంపై ఒక సర్పము బుసకొట్టుచుండెను. అది గమనించిన ఒక నౌకరు లాంతరు తెచ్చి, సర్పమును చూచి, 'పాము, పాము' అని అరచెను. బాలాసాహెబు భయముతో వణకసాగెను. అందరూ కట్టెలను తెచ్చిరి. పాము బాలాసాహెబు నడుము నుండి క్రిందకు దిగెను. శ్యామా మొదలగు వారు దానిని కొట్టి చంపిరి. అప్పుడు బాబా శ్యామాను ఎందుకు పంపారో బాలాసాహెబుకు అర్థమైంది. తనను అపాయం నుండి కాపాడిన బాబా పట్ల అతని ప్రేమ దృఢమైంది.

2. బాపు సాహెబు బుట్టీ

షిర్డీలో నానాసాహెబు డేంగలే అను జ్యోతిష్కుడు బాపు సాహెబు బుట్టీ అను వ్యక్తితో ఇట్లనెను - "ఈ దినం అశుభం. నీ ప్రాణమునకు హాని కలుగును" ఈ మాటలు విన్న బాపు సాహెబు చాల భయపడెను. కాని బాబా అతనికి ధైర్య మిస్తూ ఇట్లు పలికిరి - "మృత్యువు ఎట్లు చంపునో చూచెదము గాక!"

ఆనాటి సాయంకాలం బాపుసాహెబు బుట్టీ మరుగుదొడ్డికి పోయెను. అక్కడ అతడు ఒక పామును చూసెను. అతడు తన నౌకరును ఒక పెద్ద కర్ర తీసుకొని రమ్మనెను. నౌకరు కర్రను తెచ్చునంతలో పాము అదృశ్యమయ్యెను. బాబా మాటలను జ్ఞప్తికి తెచ్చుకొని బాపుసాహెబు సంతసించెను.

3. అమీరు శక్కర్

అమీరు శక్కర్ కోపర్‌గావ్ తాలూకా లోని కొరాలే గ్రామమునకు చెందిన వాడు. అతడు కసాయి జాతికి చెందినవాడు. బాంద్రాలో కమీషను వ్యాపారం చేయుచుండెను. అతడు కీళ్లవాతంతో బాధపడుచుండెను. అతడు వ్యాపారం విడిచి పెట్టెను. అతడు షిర్డీ చేరి బాబాను ప్రార్థించెను. బాబా అతనిని చావడిలో ఉండ మనిరి. అతడు అట్లే చేసెను. చావడిలో యుండుటచే అతనికి బాబా సాంగత్యం సులభంగా లభించుచుండెను.

అతడు చావడిలో 9 నెలలు యుండెను. అతనికి విసుగు కలిగెను. అందు వల్ల ఒకనాటి రాత్రి ఎవరికీ చెప్పకుండా కోపర్‌గావ్ వెళ్లెను. అక్కడ ఒక ధర్మశాలలో దిగెను. ధర్మశాలలో ఒక ఫకీరు చావుకు సిద్ధంగా యుండెను. ఆ ఫకీరు దాహంగా నున్నదనెను. అమీరు శక్కర్ అతనికి నీరు తెచ్చియిచ్చెను. ఆ నీళ్లను త్రాగి ఫకీరు చనిపోయెను. అమీరు ఆ విషయమును పోలీసులకు తెలుపదలచెను. కాని దాని వల్ల తాను చిక్కులలో పడుతానని తలచి రాత్రికి రాత్రే షిర్డీ వెళ్లిపోయెను. బాబా ఆజ్ఞ లేకుండా షిర్డీ విడిచిపెట్టుటవల్లే అలాంటి ఇబ్బంది కలిగిందని గ్రహించి పశ్చా త్తాపపడెను. బాబా ఆజ్ఞానుసారం చావడిలోనే యుండి రోగ విముక్తుడయ్యెను.

ఒకనాడు అర్థరాత్రి సమయమున బాబా ఇట్లనిరి - "ఓ అబ్దుల్లా! నా పరుపు వైపు ఏదో దుష్ట ప్రాణి వచ్చుచున్నది" అబ్దుల్లా లాంతరు తెచ్చి బాబా పరుపు చూసెను.

కాని ఏమియూ కనిపించలేదు. అమీరు శక్కర్ బాబా మాటలను, క్రియలను కొద్ది కొద్దిగా అర్థం చేసుకొనుచుండెను. కనుక అతడు తన పరుపు వైపు చూసెను. దిండుకు సమీపమున ఏదో కదలుచుండుటను గమనించెను. అంతలో అచ్చట ఒక పాము కనబడెను. అది తలను క్రిందకు, పైకి ఆడించుచుండెను. దానిని వెంటనే చంపిరి.

ఇట్లు బాబా సకాలమున హెచ్చరిక చేసి అమీరు శక్కర్‌ను కాపాడిరి.

4. దాము అన్నా

దాము అన్నా (దామోదర్ సావల్ రామ్ రాసనే) అనునతడు తన బొంబాయి స్నేహితుని సలహాపై పత్తిలో జట్టీ వ్యాపారం చేసి బాగా లాభం పొందదలచెను. కాని వ్యాపారం చేయుటకు ముందు బాబా సలహాను తీసుకోదలచెను. బాబా సలహా తీసుకొని తనకు వ్రాయమని శ్యామాకు ఉత్తరం వ్రాసెను. శ్యామా బాబా సలహా కోరెను. బాబా శ్యామాతో ఇట్లనిరి - "సేటుకు పిచ్చి పట్టింది. అతనికెట్టి లోటు లేదు. ఉన్నదానితో సంతుష్టి చెందమనియు, లక్షలు ఆర్జించుటకు ఆయాస పడవద్దని వ్రాయుము". శ్యామా ఆ విషయమునే దాము అన్నాకు తెలిపెను. దాము అన్నా నేరుగా బాబాను కలిసి సలహా తీసుకొన్న బాగుండునని తలంచి షిర్డీ వచ్చెను. బాబాకు నమస్కరించెను. వారి పాదములు ఒత్తుచూ కూర్చొండెను. అతడు నేరుగా బాబాతో జట్టీ వ్యాపారమును గురించి మాట్లాడుటకు సాహసించలేకపోయెను. అతడు మనసులో ఇట్లనుకొనెను - "వ్యాపారంలో సహాయపడినచో కొంత లాభం బాబాకిచ్చిన బాగుండును" అతని మనసును తెలుసుకొన్న బాబా ఇట్లనిరి - "ప్రపంచ విషయాలలో తగుల్కొనుటకు నాకిష్టం లేదు". బాబా అసమ్మతిని గ్రహించి దాము అన్నా ఆ పనిని మానుకొనెను.

మరొకసారి అతడు ధాన్యం వ్యాపారం చేయదలచెను. ఆ ఆలోచనను గ్రహించి బాబా ఇట్లనిరి - "నీవు 5 సేర్లు చొప్పున కొని 7 సేర్లు చొప్పున అమ్మవలసి వచ్చును. కనుక ఈ వ్యాపారం కూడ మానుకో" బాబా చెప్పిన విధంగానే ధాన్యము ధర విపరీతంగా పడిపోయెను.

చూసారా! ఇట్లు బాబా తన భక్తులకు సకాలములో సరైన హెచ్చరిక చేసి వారిని నష్టం నుండి కాపాడిరి.

చేసిన ప్రతినలు తీర్చెడు రూపం

1. శ్యామా

బాబాకు తన భక్తులపైన అమితమైన ప్రేమ ఉండేది. వారు భక్తులకిచ్చిన మాటను నిలువుకొనేవారు. ఈ విషయమును ఋజువు చేయు అనేక దృష్టాంతములు కలవు. కొన్ని క్రింద పేర్కొనబడినవి.

శ్యామా బాబాతో సెలవు తీసుకొని నాగపూరు, గ్వాలియర్ వెళ్ళెను. అక్కడ శుభ కార్యములకు హాజరయ్యెను. అక్కడి నుండి కాశీ వెళ్ళెను. కాశీలో రెండు నెలలు వుండెను. తర్వాత అయోధ్యకు వెళ్ళెను. అక్కడ 21 రోజులుండెను. అక్కడి నుండి గయకు వెళ్ళి పండా యింటిలో దిగెను.

పండా యిల్లు చాల పెద్దది. ఇంటిలో బాబా పటము ఒకటుండెను. అది ఎంతో ఆకర్షణీయంగా వుండెను. దానిని ఎవరిచ్చారని శ్యామా పండాను ప్రశ్నించెను. అందుకు పండా శ్యామా అనునతను 12 సంవత్సరాల క్రితం బాబాను దర్శించినపుడు ఇచ్చాడని తెలిపెను. అప్పుడు శ్యామా "నేనే ఆ శ్యామాను" అని పలికెను. పండా తనకు బాబా పటమును ఇచ్చిన వ్యక్తియే తనింటికి అతిథిగా వచ్చాడని తెలుసుకొని ఎంతో సంతసించెను.

శ్యామాకు లోగడ బాబా చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చెను - "నీవు కాశీ, ప్రయాగ యాత్రలు ముగించుకొని గయకు చేరుటకు పూర్వమే నేను గయకు చేరు కొందును" అప్పడు శ్యామా కండ్ల నుండి నీరు కారెను.

పండా శ్యామాకు రాచమర్యాదలు అందించెను. శ్యామాను ఏనుగుపైన కూర్చుండబెట్టి ఊరేగించెను.

2. పాము-కప్ప కథ

బాబా ఒకనాడు ఈ కథను చెప్పిరి - "నేను ఒక దినం ఉదయాన ఉపాహారం ముగించిన తర్వాత వ్యాహ్యాళికి పోయి ఒక చిన్ననది ఒడ్డున చేరితిని. నదిలో స్నానం చేసి హాయిగా కూర్చొంటిని. చిలిము త్రాగుటకు సిద్ధమగుచుంటిని. ఇంతలో ఒక బాటసారి వచ్చి నా ప్రక్కన కూర్చొనెను. అతడు నన్ను తనింటికి భోజన

మునకు రమ్మని ఆహ్వానించెను. అతడు చిలిము వెలిగించి నాకు అందజేసెను. అంతలో మాకు కప్ప బెకబెకమనుట వినిపించెను. బాటసారి ఆ దృశ్యమును ఎంతో కుతూహలముతో గమనించి 10-12 నిమిషములలో ఒక పాము ఆ కప్పను మ్రింగునని నాతో చెప్పెను. అంతట నేను దానినెట్లు విడిపింతునో చూడమంటిని.

చిలిము పీల్చిన తర్వాత మేము కప్ప వుండు చోటునకు వెళ్ళితిమి. బాటసారి నన్ను పాము దగ్గరకు పోవద్దని హెచ్చరించెను. పాము మీద పడి కరచునని అతని భయం. నేను అతని మాటను లెక్కచేయలేదు. నేను ముందుకు పోయి ఇట్లంటిని - "ఓ వీరభద్రప్పా! నీ శత్రువు బసప్ప జన్మనెత్తి పశ్చాత్తాప పడుట లేదా! నీవు సర్పజన్మనెత్తినను వానియందు శత్రుత్వం వహించియున్నావా? ఛీ! సిగ్గులేదా! మీ ద్వేషములను విడిచి శాంతింపుడు".

ఈ మాటలు విని ఆ పాము కప్పను వెంటనే వదిలిపెట్టి నీటిలో మునిగి అదృశ్యమయ్యెను. కప్ప కూడా గెంతుతూ చెట్ల పొదలలో దాగెను. ఇది చూసి బాటసారి ఆశ్చర్యపడెను. అతడు వీరభద్రప్ప, బసప్పలను గురించి అడిగెను. అప్పడు నేనిట్లు చెప్పితిని -

"మా ఊరికి 4-5 మైళ్ళ దూరాన ఒక పురాతన శివాలయముండెను. అది పాతబడి శిథిలమయ్యెను. ఆ గ్రామంలోని ప్రజలు దానిని మరమ్మత్తు చేయుటకై కొంత ధనమును ప్రోగుచేసిరి. ఆ ధనమును ఒక ధనవంతునకిచ్చి ఆ దేవాలయ మును బాగుచేయు బాధ్యతను అతనికి అప్పగించిరి. కొన్ని దినముల తర్వాత అతడు ఆ ధనమంతయు ఖర్చయినదని చెప్పెను. కాని దేవాలయ అభివృద్ధి మాత్రం పెద్దగా కనిపించలేదు. అతడు తన సొంత డబ్బును కొంచెమైనా వెచ్చింపకపోగా ప్రజలిచ్చిన ధనములో కూడా కొంత కాజేసెను. కనుక గ్రామవాసులు మరలా చందాలు వసూలుచేసి ఆ ధనమును అతనికిచ్చిరి. ఆ ధనికుడు ఆ ధనమును తీసుకొనెను. కాని పని ఏమీ చేయించలేదు. కొన్నాళ్ళ పిమ్మట మహాదేవుడు అతని భార్యకు కలలో కనిపించి ఇట్లు చెప్పెను - "నీవు దేవాలయపు శిఖరమును కట్టుము. నీవు ఖర్చుపెట్టిన దానికి 100 రెట్లు ఇచ్చెదను" ఆమె ఆ విషయమును భర్తకు చెప్పెను. అతడు, "ఆ శివుడు నాకే ఎందుకు చెప్పకూడదు? ఇది కేవలం మన మధ్య స్పర్థను కలిపించటానికి వచ్చిన పీడకల" అని ఆమె మాటను త్రోసిపుచ్చెను.

మరికొన్ని దినాల తర్వాత మహాదేవుడు ఆమెకు స్వప్నంలో తిరిగి కనిపించి ఇట్లు చెప్పెను - "నీ భర్త దగ్గరున్న చందాల గురించి దిగులుపడవద్దు. నీ సొంతమైన దేదయినా వెచ్చించి పని జరిపించు" అంతట ఆమె తన తండ్రి తనకిచ్చిన బంగారు నగలు దానం చేయ నిశ్చయించెను. కాని లోభియైన ఆమె భర్తకు అది రుచించలేదు. అతడు భగవంతుని కూడా మోసగించుటకు సిద్ధమయ్యెను. అతడు భార్య నగలను అతి తక్కువ ధర (రు.1000/-)కు తానే కొనెను. ఆ వెయ్యి రూపాయలను కూడా మందిర నిర్మాణమునకు ఇవ్వదలచుకోలేదు. దానికి బదులుగా ఒక పొలమును దేవదేయముగా ఇచ్చెను. అది పూజారి అధీనములో వుండిపోయెను. ఆ పొలం కూడా అతని సొంతం కాదు. దుబ్కీ అను పేదరాలు ఆ పొలమును అతని వద్ద 200 రూపాయలకు కుదవపెట్టియుండెను. ఆ పొలం పనికి రానిది. సాగులో లేనిది. దాని విలువ చాలా తక్కువ. దాని వలన వచ్చు ఆదాయం కూడా ఏమియు లేదు. ఈ విధంగా లోభియగు ఆ ధనవంతుడు దైవమును, భార్యను, దుబ్కీని మోసగించెను. కొన్నాళ్లకు గొప్ప తుఫాను రాగా లోభి యింటిపై పిడుగు పడెను. లోభి, అతని భార్య చనిపోయిరి. దుబ్కీ కూడా మరణించెను.

తర్వాతి జన్మలో ఆ లోభి మధురలో ఒక బ్రాహ్మణ కుటుంబమున వీరభద్రప్పగాను, అతని భార్య ఆలయ పూజారి కుమార్తె గౌరి గాను, భూమిని తాకట్టు పెట్టిన పేదరాలు దుబ్కీ ఆలయ ధర్మకర్తయైన చెన్న బసప్పగాను జన్మించెను. వీరభద్రప్ప గౌరిని వివాహమాడెను. వీరభద్రప్ప, గౌరి ఇద్దరూ నా భక్తులుగా యుండిరి. ఈ జన్మలో కూడ వీరభద్రప్పకు ధనముపై ఎక్కువ ఆశయుండెను.

ధరలు హఠాత్తుగా పెరిగెను. గౌరి పొలము విలువ కూడా హెచ్చెను. దానిని అమ్మగా లక్ష రూపాయలు వచ్చెను. అంటే గత జన్మలో ఆమె దేవునికిచ్చిన నగలకు వందరెట్లు విలువకు అమ్మకమైంది. ఆ ధనమును గురించి తగవు ప్రారంభమయ్యెను. ఆ ధనమును గౌరి అనుమతి లేకుండా ఖర్చుపెట్టుటకు వీలులేదని నేను చెప్పితిని. ఆమె భర్తకు దీనిపై ఎట్టి అధికారం లేదంటిని. ఇది విని వీరభద్రప్పనాపై కోపగించుకొనెను. భార్యయగు గౌరిని తిట్టెను. ఆమె నా వద్దకు వచ్చి అతని మాటలను పట్టించుకోవద్దని చెప్పి నన్ను ఆశ్రయించెను. ఆనాటి రాత్రికి మహాదేవుడు గౌరికి స్వప్నములో కనిపించి ఇట్లనెను - "ధనమంతయు నీదే. ఎవరికీ ఏమీ

ఇవ్వవద్దు. చెన్న బసప్ప సలహా తీసుకొని దేవాలయ మరమ్మతుల కొరకు కొంత ఖర్చు చేయుము. ఇతరులకై ఖర్చుచేయునపుడు మసీదులోని బాబా సలహా తీసుకో. వడ్డీలో సగము చెన్నబసప్పకివ్వు. వీరభద్రప్పకు దీనిపై ఎట్టి అధికారమూ లేదు" ఈ మాటలకు వీరభద్రప్ప మిగుల కోపించి చెన్న బసప్పను ముక్కలు ముక్కలుగా నరికెదనని బెదరించెను. చెన్నబసప్ప నన్నాశ్రయించెను. నేను శత్రువు నుండి అతనిని కాపాడుదునని వాగ్దానం చేసితిని. కొంత కాలమునకు వీరభద్రప్ప, చెన్న బసప్ప ఇద్దరూ మరణించిరి. ఈ జన్మలో వీరభద్రప్ప పాముగాను, చెన్నబసప్ప కప్పగాను జన్మించెను. చెన్నబసప్ప బెకబెకలాడుట విని, నేను చెప్పిన వాగ్దానమును జ్ఞప్తికి తెచ్చుకొని అతనిని రక్షించితిని"

ఈ కథ వలన మనకు ఈ విషయాలు తెలియుచున్నవి -

1. బాబా తన మాటను నిలుపుకొనువారు.
2. మన కర్మలేగాదు, మన భావాలు కూడా పునర్జన్మకు కారణమవుతాయి.
3. ఋణశేషముకాని, శత్రుశేషము కాని యున్నచో దానికి తగిన బాధను అనుభవించవలసి యుండును.
4. ధనమునందు పేరాశ యున్నచో అది మానవుని హీనస్థితికి తెచ్చును.

రామ్‌లాల్‌ను షిర్డీకి రప్పించుకొనుట

రామ్‌లాల్ బొంబాయి నివాసి. అతడు పంజాబీ బ్రాహ్మణుడు. ఒక రోజు బాబా అతనికి స్వప్నములో మహంతుని వలె కనిపించి తనవద్దకు రమ్మనెను. అతని చిరునామా తెలియనందున రామ్‌లాల్‌కు ఏమి చేయాలో దిక్కుతోచలేదు. కాని భగవంతుని కరుణ ఉంటే భక్తునికన్నీ సుగమములే. ఆనాడు సాయంకాలం అతడు ఒక దుకాణంలో బాబా ఫోటోను చూసెను. స్వప్నంలో అతడు చూసిన మహంతు ముఖ లక్షణాలు ఆ ఫోటోలోనున్న బాబాతో సరిపోయెను. అతడు విచారించగా ఆ పటము సాయిబాబాదని తెలిసెను. అంతట అతడు షిర్డీకి పోయి బాబాను దర్శించి తన అంత్యకాలం వరకు అక్కడే ఉండెను.

గ్రహబాధ తొలగించు సౌఖ్య ప్రదాత

తెండూల్కర్ కుటుంబం బాంద్రాలోయుండెను. ఆ కుటుంబంలోని వారం దరూ భక్తులు. తెండూల్కర్ వైద్య పరీక్షకు కూర్చొనవలెనని రాత్రింబవళ్ళు కష్టపడి చదువుచుండెను. కాని జ్యోతిష్కులు ఆ సంవత్సరం గ్రహములు అతనికి అనుకూలంగా లేవనియు, మరుసటి సంవత్సరం అతడు పరీక్షకు కూర్చొన్న బాగుండునని చెప్పిరి. అందుచే అతడు భయపడి ఆ సంవత్సరం పరీక్షకే వెళ్ళనని పట్టుబట్టెను. ఆ విషయం అతని తల్లియగు సావిత్రీబాయి బాబాకు తెలిపెను. బాబా ఆమెతో ఇట్లనిరి - "జ్యోతిష్కుల మాటలను లెక్కచేయక, నాయందు నమ్మకం వుంచి తన పాఠాలను బుద్ధిగా చదువుకొమ్మని మీ అబ్బాయికి చెప్పేది. ధైర్యంగా పరీక్షకు వెళ్ళ మనేది. అతడు ఈ సంవత్సరం తప్పక ఉత్తీర్ణుడగును"

తెండూల్కర్ బాబా మాటలతో ధైర్యం తెచ్చుకొని పరీక్ష వ్రాసెను. కాని తగినన్ని మార్కులు రావేమోనని తలంచి మౌఖిక పరీక్షకు వెళ్ళదలచలేదు. కాని పరీక్షకులు అతడు లిఖిత పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడనియు, మౌఖిక పరీక్షలో కూర్చోవచ్చనియు తెలిపిరి. అందువల్ల అతడు మౌఖిక పరీక్షకు హాజరయ్యెను. అతడు దానిలో కూడా ఉత్తీర్ణుడయ్యెను.

దీనిని బట్టి గ్రహములు వ్యతిరేకంగానున్ననూ బాబాను సంపూర్ణ విశ్వాసంతో కొలచినచో మన ప్రయత్నములు తప్పక నెరవేరునని తెలియుచున్నది.

అనుగ్రహ బలము

సద్గురుని అనుగ్రహము వల్లనే మనకు దిశానిర్దేశనం లభిస్తుంది. అనుగ్రహానికి భక్తి మాత్రమే సాధనం. ఇలాంటి సంఘటనలు అనేకం బాబా భక్తుల జీవితాలలో సంభవించాయి. కొన్ని ఉదాహరణలు ఇక్కడ పేర్కొనబడినవి.

1. చింకి గుడ్డలు దొంగలించడమెందుకు?

బి.వి.దేవ్ దహనులో మామలతదారుగా యుండెను. అతడు జ్ఞానేశ్వరీ (మరాఠీ భాషలో జ్ఞానేశ్వరుడు భగవద్గీతపై వ్రాసిన వ్యాఖ్య)ని చదువుచుండగా ఏవో చెడు ఆలోచనలు ప్రవేశించి అతని మనసును చిరాకుపరచుచుండెను. అందువల్ల అతడు బాబా చెప్పినప్పుడే జ్ఞానేశ్వరిని చదవాలని నిర్ణయించుకొనెను.

దేవ్ 1914వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో కుటుంబ సహితంగా షిర్డీకి వెళ్ళెను. ఒకరోజు బాబాను దర్శించి ఒక రూపాయి దక్షిణ యిచ్చెను. బాబా 20 రూపాయలు అడుగగా అతడు ఆ మొత్తమును చెల్లించెను. అతడు ఆనాటి రాత్రి మాస్కర్ అను వ్యక్తిని కలిసి నీవు బాబా అనుగ్రహమునెట్లు సంపాదించితివని అడిగెను. అతడు సరైన సమాధానం చెప్పక ఆ విషయమును దాటివేసెను.

మరుసటిదినం దేవ్ బాబా దర్శనమునకై వెళ్ళెను. బాబా అతనిని 20 రూపాయలు దక్షిణ యిమ్మని కోరిరి. దేవ్ వెంటనే ఆ మొత్తమును చెల్లించెను. మసీదు నిండా జనులు యుండుటచే దేవ్ ఒక మూలకు వెళ్ళి కూర్చొనెను. బాబా అతనిని పిలిచి తన వద్ద కూర్చోమని చెప్పిరి. దేవ్ అట్లే చేసెను. భక్తులందరూ వెళ్ళిన తర్వాత దేవ్ మాస్కర్‌ను సమీపించి "నీవు బాబా అనుగ్రహం ఎట్లు పొందితివో తెలుపుము" అని అడిగెను. బాబా దేవ్‌ని పిలిచి మాస్కర్‌తో ఏమి మాట్లాడు చుంటివని అడిగిరి. దేవ్ మాస్కర్‌తో మీ కీర్తిని గురించి అడిగి తెలుసుకొను చుంటినని బదులు పలికెను.

బాబా దేవ్‌ని 25 రూపాయలు దక్షిణ అడుగగా దేవ్ వెంటనే సంతోషంతో ఇచ్చెను. బాబా అతనిని లోపలికి తీసుకొనిపోయి స్తంభం వద్ద కూర్చొని ఇలా గద్దించిరి - "నా గుడ్డపేలికలను నాకు తెలియకుండా దొంగిలించితివేల? తల నెరసినా ఈ పద్ధతి పోలేదా? గొడ్డలితో నరుకుతా జాగ్రత్త"

దేవ్ బిత్తరపోయెను. అతడు, "నేను బాబా గుడ్డపేలికలను దొంగిలించడ మేమిటి?" అని ఆలోచించసాగెను. ఒక గంట తర్వాత బాబా అతనిని వాడాకు వెళ్ళమనిరి. వారు సాయంకాలం అతనికి కబురు పంపిరి. అతడు రాగానే బాబా అతనితో ప్రేమతో ఇట్లనిరి - "గుడ్డ పేలికల విషయం చెప్పి నేను నిన్ను బాధ పెట్టానా? దొంగతనం చేస్తే అంగీకరించక తప్పదు. ఏమి చేస్తాము? దైవమే సాక్షి".

తర్వాత బాబా 12 రూపాయల దక్షిణ తీసుకొని నీవు రోజూ ఉదయం వాడాలో 'జ్ఞానేశ్వరి' పారాయణ చెయ్యి. నీకు మంచి జరీ శాలువ ఇవ్వదలచాను. చింకి గుడ్డలు దొంగిలించడమెందుకు? అన్నారు. భక్తితో సద్గ్రంథ పఠన ద్వారా సాయి అనుగ్రహాన్ని పొందాలి గాని, వారినీ, వీరినీ ఆశ్రయించగూడదని బాబా భావం. సామాన్యుల బోధలు చింకి గుడ్డలు. సద్గురువు యిచ్చేది జరీ శాలువ. దానిని పొందాలంటే దానిని ఇవ్వగలవారినే అడగాలి.

ఈసారి దేవ్‌కు పారాయణ చక్కగా సాగింది. 2-4-1914న బాబా అతనికి స్వప్నంలో కనిపించి అధ్యాత్మ చదువమని చెప్పారు.

2. గత జన్మపాప -పుణ్యములను అనుభవించక తప్పదు

గోపాలనారాయణ అంబేద్కర్ బాబా భక్తుడు. అతడు పూనా నివాసి. అతడు అనేక చోట్ల అనేక రకాల ఉద్యోగాలు చేసెను. కాని అతని స్థితి దినదినం దిగజార సాగెను. అతడు ప్రతి సంవత్సరం షిర్డీకి వెళ్లి బాబాకు తన కష్టములను తెలుపు చుండెను. 1916లో అతని స్థితి మరింత దిగజారెను. అతడు భార్యతో కలిసి షిర్డీ వెళ్లెను. రెండు నెలలు అక్కడే ఉండెను. ఒక రోజున బావిలో పడి చనిపోవలెనని నిశ్చయించుకొనెను. అదే రోజున సుగుణమేరు నాయక్ అనే హోటలు యజమాని అంబేద్కర్‌ను పిలిచి 'అక్కల్ కోట మహారాజుగారి చరిత్ర' అను పుస్తకమునిచ్చి చదవమనెను.

అంబేద్కర్ ఆ పుస్తకమును తీయగా ఈ కథ వచ్చెను - "అక్కల్‌కోట మహారాజుగారి కాలములో ఒక భక్తుడు దీర్ఘరోగముచే బాధపడుచుండెను. ఒక రోజు బాధను సహించలేక నిరాశ చెంది బావిలో దుమికెను. వెంటనే మహారాజు వచ్చి వానిని బావిలోనుంచి బయటకు తీసి ఈ విధంగా చెప్పిరి - "గత జన్మ పాప పుణ్యాలను నీవు అనుభవించకతప్పదు. నీ అనుభవం పూర్తి కాకున్నచో ప్రాణ త్యాగం నీకు తోడ్పడదు. నీవు ఇంకొక జన్మ ఎత్తి బాధ అనుభవించవలెను. కనుక మరికొంత కాలం ఈ కర్మలను అనుభవించి గత జన్మల పాపముల నేల శాశ్వతంగా తుడిచి వేయరాదు?"

ఈ కథను చదివి అంబేద్కర్ మిగుల ఆశ్చర్యపడెను. అతని మనస్సు కరగెను. ప్రాణత్యాగం చేయవలెననెడి సంకల్పంను మానుకొనెను. అంబేద్కర్ అక్కల్ కోట మహారాజ్‌గారి శిష్యుడు. కనుక బాబా అతనిని తన గురువైన అక్కల్‌కోట మహారాజు గారి చరిత్రను చదువునట్లు చేసి అతనిలో మార్పు తెచ్చిరి.

అప్పటి నుండి అంబేద్కర్‌లో బాబా యందు నమ్మకం పెరిగెను. బాబా ఆశీస్సులతో జ్యోతిష్యం చదివి అందులో ప్రావీణ్యం పొందెను. దానితో కావలసినంత ధనం సంపాదించెను. అతని పరిస్థితి మెరుగయ్యెను.

3. మన కళ్ళతో సమస్తం చూడవలెను

లాలా లక్ష్మీచంద్ ఒక ఉద్యోగి. అతడు ఒకసారి స్వప్నంలో ఒక ముసలి వానిని, అతని చుట్టూ వున్న భక్తుల గుంపును చూసెను. కొద్ది రోజుల తర్వాత అతడు దాసగణు హరికథను వినుటకు వెళ్ళెను. సభలో బాబా పటమును పెట్టుట దాసగణునకు ఆనవాయితీ. లక్ష్మీచంద్ బాబా పటమును చూసిన తర్వాత తాను స్వప్నంలో చూసిన ముసలి వ్యక్తి బాబాయే అని నిశ్చయించుకొనెను. అంతట అతడు బాబా దర్శనమునకై షిర్డీ వెళ్ళదలచెను.

ఒకరోజు రాత్రి 8 గంటలకు అతని స్నేహితుడగు శంకరరావు వచ్చి తలుపు తట్టి షిర్డీకి వచ్చెదవా అని అడిగెను. అతని ఆనందమునకు అవధులు లేవు. పిన తండ్రి కుమారుని వద్ద 15 రూపాయలు అప్పు తీసుకొని షిర్డీకి బయలుదేరెను. రైలులో అతడు, శంకరరావు భజన చేసిరి. అతడు బాబాను గూర్చి తోటి ప్రయాణీకులను అడిగి తెలుసుకొనెను. వారు బాబా గొప్ప యోగిపుంగవులని చెప్పిరి.

లక్ష్మీచంద్ కోపర్‌గావ్ రాగానే బాబా కొరకు జామపండ్లను కొనదలచెను. కాని ఆ గ్రామ పరిసరాల సౌందర్యం చూసి, ఆ ఆనందంతో ఆ విషయం మరచెను. షిర్డీ సమీపించుచుండగా అతనికి ఆ విషయం జ్ఞప్తికి వచ్చెను. అంతలో ఒక ముసలమ్మ నెత్తిపై జామపండ్ల గంప పెట్టుకొని గుర్రపుబండి వెంట పరుగెత్తు కొని వచ్చుచుండెను. లక్ష్మీచంద్ బండిని ఆపి కొన్ని పండ్లను కొనెను. అప్పుడు ఆ ముసలమ్మ తక్కిన పండ్లను కూడా తీసుకొని తన తరపున బాబాకు అర్పించమని కోరెను. తాను జామపండ్లను కొనదలుచుట, వానిని మరచిపోవుట, ముసలమ్మను కలుసుకొనుట, ఆమె భక్తి - ఇవన్నీ చూసిన లక్ష్మీచంద్‌కు ఆశ్చర్యం కలిగెను.

లక్ష్మీచంద్, శంకరరావు మసీదుకు వెళ్ళి బాబాను చూసి చాల సంతసించిరి. బాబా లక్ష్మీచంద్‌ను ఉద్దేశించి ఇట్లనిరి - "టక్కరి వాడవు. దారిలో భజన చేసావు. నా గురించి ఇతరులను అడిగి తెలుసుకొన్నావు. ఇతరులను అడగనేల? మన కళ్ళతో సమస్తం చూడవలెను. నీ స్వప్నం నిజమైందా లేదా? ఆలోచించుము. 15 రూపాయలు అప్పు తీసుకొని నా దర్శనం చేసుకొనవలసిన పని ఏ ముంది?" బాబా మాటలతో లక్ష్మీచంద్‌కు జ్ఞానోదయమయ్యెను.

4. నాకు బ్రహ్మజ్ఞానం కావాలి

ఒకనాడు ఒక ధనికుడు బాబా వద్దకు వచ్చెను. అతడు ధనమును, పొలమును, తోటలను సంపాదించెను. అతనికి అనేకమంది సేవకులుండిరి. అతడు బాబాకు తన ఐశ్వర్యంను గురించి చెప్పి తనకు బ్రహ్మజ్ఞానమును ఉపదేశించమని కోరెను.

బాబా అతని మాటలను విననట్లు ప్రవర్తించిరి. వారు ఒక బాలుని పిలిచి నందు మర్వాడి వద్దకు పోయి 5 రూపాయలు బదులు తెమ్మనిరి. ఆ బాలుడు కొంత సమయం తర్వాత వట్టి చేతులతో తిరిగి వచ్చెను. ఆ తర్వాత ఆ బాలుడు బాబా చెప్పిన ఇద్దరు - ముగ్గురు వ్యక్తుల వద్దకు వెళ్ళెను. కానీ ఫలితం లేకపోయెను. ఆ ధనికుడు బాబా తనకు వెంటనే బ్రహ్మజ్ఞానం ప్రసాదించుట లేదేమి అని విసుగు చెందసాగెను. తన కొరకు టాంగావాడు వేచియున్నాడని బాబాతో చెప్పెను.

బాబా కొంతసేపు ఆగి ఆ ధనవంతునితో ఇట్లు చెప్పిరి - "చూడుము. నీవు కొంతసేపటి నుండి యిక్కడ జరుగుచున్న దానినంతటిని గమనించుచున్నావు. 5 రూపాయల అప్పు దొరకటం కూడ ఎంతో కష్టంగానున్నది. నీవు ఎంతో ధన వంతుడనని చెప్పావు. నాకు 5 రూపాయలు ఇవ్వటం నీకు పెద్ద కష్టమైన పనేమీ కాదు. కాని ఇవ్వటానికి నీకు మనసు రాలేదు. మరి నావద్ద నున్న బ్రహ్మజ్ఞానమును నీకెందుకు బోధించవలెనాయని నేను ఆలోచిస్తున్నా".

ఈ మాటలు విన్న ధనికుడు తన తప్పును తెలుసుకున్నాడు. బాబా కోరితే 5 రూపాయలే కాదు, ఎంతైనా యివ్వగలనని చెప్పాడు. అప్పుడు బాబా యిట్లు చెప్పిరి - "బ్రహ్మజ్ఞానం పొందుటకు కావలసిన మొదటి పాఠం దీని నుండి లభిస్తుంది. పేరాశను, లోభమును వదలిపెట్టనిదే బ్రహ్మజ్ఞానం లభించదు. నేను కోరిన 5 రూపాయలనగా 5 వస్తువులను భగవంతునికి సమర్పించిన కాని బ్రహ్మజ్ఞానం సిద్ధించదు. 5 వస్తువులు ఏవనగా

1) పంచప్రాణములు (ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానం)
2) పంచేంద్రియాలు (5 జ్ఞానేంద్రియాలు : కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం)
(5 కర్మేంద్రియాలు : నోరు, చేతులు, కాళ్ళు, గుదము, ఉపస్థము)
3) మనస్సు
4) బుద్ధి
5) అహంకారము

నా వద్ద అనంతమైన బ్రహ్మజ్ఞానం కలదు. కాని దానిని పుచ్చుకొను వారికి ఈ క్రింది అర్హతలుండాలి :

1. అన్ని బంధనముల నుండి ముక్తి పొంది, ఇతర సుఖములను లక్ష్యపెట్టక బ్రహ్మ జ్ఞానం పొందవలెననెడి తీవ్రమైన కోరికను కలిగియుండాలి.
2. ఇహపర సౌఖ్యముల పట్ల విరక్తి పొందవలెను.
3. దృష్టిని అంతర్ముఖం గావించి లోనున్న ఆత్మను ఏకధ్యానంతో చూడవలెను.
4. దుర్మార్గం నుండి బుద్ధిని మరలించవలెను. తప్పులు చేయుట మానవలెను. మనస్సును చలింప చేయరాదు.
5. ఎల్లప్పుడూ సత్యం పలకవలెను. తపస్సు చేయాలి. బ్రహ్మచారిగ ఉండవలెను.
6. ప్రియమైన వాని కంటె శ్రేయస్కరమైన వాటినే కోరవలెను.
7. ఫలాపేక్ష లేకుండ విధులను నిర్వర్తించాలి.
8. మనస్సును, ఇంద్రియాలను తన వశమున ఉంచుకొనాలి.
9. గురువు సహాయం తీసుకొనాలి.
10. భగవంతుని కటాక్షం పొందాలి.

5. ఈశావాస్యోపనిషత్తు

ఈశావాస్యోపనిషత్తులో వేదసంహితలోని మంత్రాలు కలవు. అందుచే దానిని మంత్రోపనిషత్తు అందురు. దానిలో యజుర్వేదంలోని 40వ అధ్యాయమగు 'వాజసనేయ సంహిత'యున్నది. కనుక దానికి 'వాజసనేయ సంహితోపనిషత్తు' అను పేరు కూడా కలదు. ఇది యితర ఉపనిషత్తుల కన్నా శ్రేష్ఠమైనది. సాత్వలేకర్ అనునతడు బృహదారణ్యకోపనిషత్తును ఈశావాస్యోపనిషత్‌పై వ్యాఖ్య అని చెప్పి యున్నాడు.

ఈశావాస్యోపనిషత్తు చాలా చిన్నది. కాని అందులో అంతర్దృష్టిని కలిగించు అనేక అంశాలున్నవి. 18 శ్లోకములలో ఆత్మను తట్టుకొను స్థైర్యముగల ఆదర్శ యోగీశ్వరుని వర్ణన యున్నది. జ్ఞాన, కర్మలకు సమన్వయముగా అనేక విషయాలు చెప్పబడినవి. ఈశావాస్యోపనిషత్తులోని కవిత్వం నీతి, నిగూఢతత్త్వము, వేదాంతంల మిశ్రమమని ప్రొఫెసరు రానడే గారు చెప్పియున్నారు.

ఈశావాస్యోపనిషత్తు గొప్పతనం దానిలో బోధింపబడిన ఆధ్యాత్మిక విషయాలపై ఆధారపడియున్నది. దాని ప్రారంభ వాక్యాలే ఎంతో శ్రేష్ఠమైనవి. ఎందుకనగా వాటిలో భగవంతుడు సర్వాంతర్యామి అని చెప్పబడింది.

ఇట్టి శ్రేష్ఠమైన ఈశావాస్యోపనిషత్తును దాసగణు మరాఠీ భాషలోనికి ఓవీ ఛందములో అనువదించుటకు ఉపక్రమించెను. కాని దానిని అనువదించుట అతనికి కష్టంగా నుండెను. బాబా సలహాను కోరెను. బాబా అతనిని ఈ విధంగా ఆశీర్వదించిరి - "నీవు తొందర పడవద్దు. ఆ విషయంలో ఎట్టి కష్టమూ లేదు. నీ తిరుగు ప్రయాణంలో విలీపార్లేలో కాకాసాహెబు దీక్షిత్ పనిపిల్ల నీ సందేహం తీర్చును. సాయి పరాచికమాడారని అందరూ అనుకొన్నారు. కాని దాసగణు బాబా పలుకులను బ్రహ్మ వాక్కులుగా భావించెను.

దాసగణు షిర్డీ నుండి విలీపార్లే చేరి కాకాసాహెబు దీక్షిత్ యింటిలో బస చేసెను. ఆ మరుసటి దినం ఉదయం దాసగణు నిద్రనుండి లేచినప్పుడు కాకా పనిపిల్ల (నామ్యా చెల్లెలు) ఆనందంతో ఎర్ర చీరను గురించి పాట పాడుచుండెను. ఆ చిన్న పిల్ల పేదపిల్ల; చింకి గుడ్డను కట్టుకొని యుండెను. కాని ఎంతో సంతోషంతో పాట పాడుచుండెను. ఆమె పరిస్థితి చూసి దాసగణునకు జాలి కలిగెను. అతడు రావు బహద్దూర్ ఎల్.వి. ప్రధాన్‌కు చెప్పి ఆ పిల్లకు ఒక మంచి చిన్న చీరను కానుకగా యిప్పించెను. ఆ చీరను పొంది ఆమె అమితానంద పరవశురాలయ్యెను. ఆ మరుసటి దినం ఆ క్రొత్తచీరను ధరించి ఆ పిల్ల ఎంతో ఆనందంతో నాట్యం చేయ దొడంగెను.

ఆ తర్వాతి రోజున ఆ పనిపిల్ల క్రొత్తచీరను పెట్టెలో దాచుకొని మామూలు చింకి బట్ట కట్టుకొని వచ్చెను. కాని ఆ పిల్ల ఆనందమునకు లోటు లేకుండెను. దిగులుకాని, నిరాశకాని లేక ఆడుచు పాడుచు యుండెను. ఇది చూసిన దాసగణు బాగా ఆలోచించి ఈ అభిప్రాయమునకు వచ్చెను - "కష్టసుఖములనునవి మన మానసికస్థితిపై ఆధారపడియుండును. భగవంతుడిచ్చిన దానితో మనం సంతృప్తి చెందాలి. భగవంతుడు మనలను అన్ని విధాలా కాపాడి మనకు కావలసింది ఇచ్చుచుండును. భగవంతుడు ప్రసాదించినదంతయూ మన మేలు కొరకేనని గ్రహించాలి. ఆ పిల్ల పేదరికం, ఆమె చింకి బట్ట, క్రొత్తచీర, దానినిచ్చిన దాత, దానిని తీసుకొన్న పిల్ల, దాని భావం - ఇవన్నియూ భగవంతుని అంశాలే. భగవంతుడు వీటన్నిటి యందు వ్యాపించియున్నాడు"

వా కోపమైనా అప్పుచేయకు, ఉన్నంతలోనే తృప్తి చెందటం నేర్చుకో

ఈ విధంగా దాసగణు కాకాదీక్షిత్ పనిపిల్ల ద్వారా ఈశావాస్యోపనిషత్తు నీతిని అనగా ఉన్నదానితో సంతృప్తి చెందుట, మనకు జరుగు ప్రతి విషయమూ భగవంతుని యాజ్ఞచే జరుగుననియు, చివరికది మన మేలునకే జరుగుననియు గ్రహించెను. బాబా కాకా పనిపిల్ల ద్వారా దాసగణునకు ఈశావాస్యోపనిషత్తులోని నీతి బోధపడునట్లు చేసిరి.

బాబా నీ కరుణ అపారం.

నీవు కొన్ని సందర్భాలలో భక్తులకు నేరుగా చెప్పదలచింది చెప్పదువు

మరికొన్ని సందర్భాలలో పరోక్షంగా తెలిపెదవు

అంతేగాక ఇతరుల ద్వారా కూడ విషయం అవగత పరచెదవు.

నీవు ఎప్పుడు ఎట్టి లీలను ప్రదర్శింతువో కదా!

ఓం శ్రీ సాయిరామార్పణమస్తు

ఏడవరోజు (బుధవారం) పారాయణ

ఆనంద స్వరూపులారా! ఈనాడు మనం ఆచరణ, షిర్డీ ఉత్సవాలు మొదలగు విషయములను తెలుసుకొందాం. మనం ఏకాగ్రచిత్తులమై ఆ అంశాలను పారాయణ చేసి బాబా ఆశీస్సులను పొందుదం గాక!

ఓం శ్రీసాయిరామ్!

చదివిన వాటిని ఆచరించాలి

వి.హెచ్.ఠాకూర్ రెవిన్యూ శాఖలో గుమాస్తాగా ఉండెను. ఒకసారి అతడు బెల్గాం సమీపమందలి వడ్‌గామ్ అను పట్టణమునకు ఒక సర్వే పార్టీతో వెళ్లెను. అక్కడ అతడు 'అప్ప' అను కన్నడ యోగిని దర్శించి వారి పాదములకు నమస్కరించెను. ఆ యోగి ఠాకూర్‌తో ఇట్లనిరి - "నీవు 'విచార సాగర' మను గ్రంథమును చదువుము. అట్లు చేసిన నీ కోరికలు నెరవేరును. నీవు నీ ఉద్యోగపు పని మీద ఉత్తర దిక్కునకు వెళ్ళెదువు. అప్పుడు నీవు ఒక యోగిని దర్శింతువు. అతడు నీ భవిష్యత్తునకు చక్కని మార్గం చూపును"

ఠాకూర్ తొలుత జున్నర్‌కు, ఆ తర్వాత కళ్యాణ్‌కు బదిలీ అయ్యెను. కళ్యాణ్‌లో ఉండగా అతనికి నానాసాహెబు చాందోర్కర్‌తో పరిచయమయ్యెను. నానా సాహెబు ఠాకూర్‌కు సాయిబాబాను గురించి అనేక సంగతులు తెలిపెను.

ఠాకూర్ ఒకసారి షిర్డీ వెళ్లి సాయిబాబాను దర్శించెను. అతని పాదములకు నమస్కరించి మిక్కిలి సంతసించెను. కళ్ళు ఆనందబాష్పములచే నిండెను. ఒడలు గగుర్పాటు చెందెను. బాబా అతనితో "ఆధ్యాత్మ మార్గం మిగుల కఠినమైనది. నానేఘాట్‌లో ఎనబోతు పైన స్వారిచేయునంత సులభం కాదు. అప్పా చెప్పిన దంతయు నిజమే. ఊరక చదువుట వలన ప్రయోజనం లేదు. నీవు చదివిన దంతయూ ఆలోచించి ఆచరణలో పెట్టాలి" - అని చెప్పిరి. ఠాకూర్ 'విచార సాగర' మను పుస్తకంలోని సిద్ధాంత భాగమును అంతకు పూర్వమే చదివియుండెను. కాని ఆచరణలో పెట్టదగిన దానిని షిర్డీలో నేర్చెను.

★ ★ ★

నా గురువు నన్ను రెండు పైసలు దక్షిణ అడిగెను - 1.విశ్వాసం 2. ఓర్పు

అనంతరావు పాటంకర్ అను పెద్ద మనిషి ఒకసారి పూనా నుండి షిర్డీ వచ్చి బాబా దర్శనం చేసుకొనెను. అతడు పూజ చేసిన తర్వాత బాబాతో ఇట్లనెను - "నేను ఉపనిషత్తులు చదివితిని. అష్టాదశ పురాణాలను వింటిని. కాని మానసిక శాంతి లభించలేదు. మీరు నాయందు దయచూసి ఆశీర్వదించండి" అప్పడు బాబా అతనికి ఒక కథను చెప్పిరి -

"ఒకనాడు ఒక వర్తకుడు నా వద్దకు వచ్చెను. అతని ముందు ఒక ఆడ గుర్రము లద్దివేసెను. అది తొమ్మిది ఉండలుగా పడెను. ఆ వర్తకుడు జిజ్ఞాసతో పంచెకొంగు సాచి తొమ్మిది ఉండలను అందులో పెట్టుకొనెను"

పాటంకర్‌కు ఈ కథ బోధపడలేదు. అతడు దాదాకేల్కర్‌ను ఆ కథకు అర్థం చెప్పమని అడిగెను. కేల్కర్ ఈ విధంగా చెప్పెను - "ఆడ గుర్రమనగా భగవంతుని అనుగ్రహం. తొమ్మిది ఉండల లద్ది అనగా నవవిధ భక్తి. అవి ఏవన 1. శ్రవణం (వినుట) 2. కీర్తనం (ప్రార్థించుట) 3. స్మరణం (జ్ఞప్తియందు ఉంచుకొనుట) 4. పాదసేవనం (సాష్టాంగ నమస్కారం చేయుట) 5. అర్చనం (పూజ) 6. నమస్కారం (వంగి నమస్కారం చేయుట) 7. దాస్యం (సేవ) 8. సఖ్యత (స్నేహం) 9. ఆత్మ నివేదనం (ఆత్మను సమర్పించుట)

ఈ నవవిధ భక్తిని ఆచరించుట వలన నీకు మానసిక శాంతి లభించును. భక్తిలేని సాధనములు (జపం, తపం, యోగం, మత గ్రంథముల పారాయణ, వాటి లోని సంగతులను బోధించుట) అన్నియూ నిష్ప్రయోజనం".

ఆ మరుసటి దినం పాటంకర్ బాబాను నమస్కరించుటకు వెళ్లెను. అప్పడు బాబా గుర్రపులద్ది తొమ్మిది ఉండలను ప్రోగుచేసితివా లేదా అని ప్రశ్నించిరి. అంతట పాటంకర్ "బాబా! మీ ఆశీర్వాదం లభించిన వాటిని ప్రోగు చేయవచ్చును" అని చెప్పెను. బాబా పాటంకర్‌ను ఓదార్చుచు శాంతి - క్షేమములు కలుగునని ఆశీర్వ దించిరి. ఇదివిని పాటంకర్ అమితానంద భరితుడయ్యెను.

అర్హత కలవారికే భగవద్దర్శనం అవుతుంది

ఒక వ్యక్తి నిత్యజీవితంలో ధనం కొరకు ప్రాకులాడుతూ, ఆలయానికి వచ్చి నపుడు మోక్షం కోరేవాడు. ఇది ఆత్మవంచనే అవుతుంది. ఈ విషయమును అతనికి తెలుపుటకై సాయి ఒక పిల్లవాణ్ణి పిలిచి ఏ వర్తకుని వద్ద నుండైనా వంద రూపా

యలు అప్పు తెమ్మన్నారు. ఆ పిల్లవాడు కొంతసేపటి తర్వాత వచ్చి ఎవ్వరూ ఇవ్వలేదనియు, నమస్కారములు మాత్రం అర్పించినారనియు చెప్పెను. తర్వాత బాబా నానా సాహెబును పిలిపించి పైకం అడిగారు. నానా ఒక వర్తకునికి చీటీ వ్రాసి పంపగా అతడు వంద రూపాయలు అప్పుగా పంపాడు.

అప్పుడు సాయి మోక్షం కోరిన భక్తునితో ఇట్లు చెప్పిరి - "చూసావా! జీతం సంపాదించు ఉద్యోగికి (నానాకు) మాత్రమే అప్పు పుట్టింది. అట్లే అర్హత కలవారికి మాత్రమే భగవద్దర్శనం అవుతుంది"

బాబా ఇచ్ఛలేనిదే ఎవ్వరూ షిర్డీకి వెళ్ళలేరు

ఎంతోమంది బాబాను దర్శించాలని తలంచుచుండిరి. కాని బాబా ఇచ్ఛ లేనిదే ఎవ్వరూ వారి వద్దకు పోలేకుండిరి. వారి వంతు రానిదే బాబాను స్మరించు వారు కాదు. ఎవ్వరూ తమ ఇష్టానుసారం షిర్డీ పోలేకుండిరి. బాబా ఆజ్ఞ ఉన్నంత వరకే వారు షిర్డీలో ఉండగలిగిరి. బాబా పొమ్మనిన వెంటనే షిర్డీ విడవవలసి వచ్చేది. కాబట్టి సర్వం బాబా ఇష్టంపై ఆధారపడియుండెను.

ఒకసారి కాకా మహాజని బొంబాయి నుండి షిర్డీకి వెళ్లెను. అతడు కూడ ఒక వారం ఉండి గోకులాష్టమి ఉత్సవం చూడదలచెను. అతడు బాబా దర్శనమునకై వెళ్లెను. అప్పుడు బాబా అతనిని నీవు ఎప్పుడు ఇంటికి వెళ్ళుదువని అడిగిరి. ఈ ప్రశ్న విని కాకామహాజనికి ఆశ్చర్యం కలిగెను. అయినా అతడు బాబాతో వారి అనుమతి లభించగనే వెళ్ళుతానని చెప్పెను. అందుకు బాబా రేపే పొమ్మని చెప్పిరి. కాకా మహాజని బాబా ఆజ్ఞను పాటించెను.

బొంబాయి చేరిన తర్వాత కాకామహాజనికి బాబా ఎందుకలా చెప్పిందీ అర్థమైంది. అతని యజమాని అతనిరాకకై ఎదురు చూచుచుండెను. ఆఫీసు మేనేజరు అకస్మాత్తుగా జబ్బు పడుటచే కాకామహాజని అవసరం ఎక్కువగా ఉండెను. ఆ విషయమును కాకామహాజనికి తెలుపుతూ అతడు షిర్డీకి కూడా వ్రాసియుండెనట.

★ ★ ★

భావూ సాహెబ్ ధుమాళ్ అను ఒక ప్లీడరు ఉండెను. అతడు కోర్టు పనిపై నిఫాడ్ పోవుచుండెను. అతడు ఒకసారి షిర్డీవెళ్లి బాబా దర్శనం చేసుకొనెను. ఆ తర్వాత అతడు అక్కడి నుండి నిఫాడ్ వెళ్లదలచెను. కాని బాబా అతనిని షిర్డీలోనే ఒక వారం ఉండమనెను. ఈలోగా నిఫాడ్ మెజిస్ట్రేటుకు కడుపునొప్పి వచ్చి కేసు వాయిదా పడెను. తర్వాత ధుమాళ్ బాబా అనుమతి తీసుకొని నిఫాడ్‌కు పోయి కేసుకు హాజరయ్యెను. కేసు కొన్ని నెలల వరకు సాగెను. నలుగురు మెజిస్ట్రేట్లు దానిని విచారించిరి. చివరకు ధుమాళ్ కేసు గెలిచెను. అతని కక్షిదారు విడుదల అయ్యెను.

★ ★ ★

నానాసాహెబు నిమోన్‌కరు దంపతులు షిర్డీలో మసీదులోనే వుంటూ బాబా సేవచేయుచుండిరి. ఒకసారి బేలాపూర్‌లో నున్న వారి కుమారునకు జబ్బు చేసెను. నానాసాహెబు భార్య బేలాపూర్‌కు పోయి కొన్ని దినములు అచ్చటుండి తన కుమారుని, తన బంధువులను చూడదలచెను. కాని నానాసాహెబు ఆమెను మరుసటి దినమే షిర్డీ తిరిగి రావలెనని చెప్పెను. ఆమెకు ఏమి చేయుటకు తోచకుండెను. ఆమె బేలాపూరు వెళ్ళుటకు ముందు బాబా అనుమతి తీసుకొనుటకై వెళ్లెను. అప్పుడు బాబా నానాసాహెబుతో మాట్లాడుచుండిరి. బాబా నానాసాహెబు సమక్షంలోనే అతని భార్యతో ఇట్లనిరి - "ఆలస్యం చేయకుండా వెళ్ళు. బేలాపూరులో 4 రోజులు ప్రశాంతంగా బంధువులతో గడిపి షిర్డీకి రా".

ఈ విధంగా బాబా నానాసాహెబు ఆజ్ఞను రద్దుచేసి ఆమె అభీప్సితం నెరవేరునట్లు చేసిరి.

బాబా ఆజ్ఞకు వ్యతిరేకంగా పోయినచో ప్రమాదం

బాబా ఆజ్ఞ లేనిదే ఎవరూ షిర్డీ విడువలేకుండిరి. వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా పోయినచో అనుకోని కష్టాలు వచ్చుచుండెడివి. ఈ విషయం క్రింది సంఘటనల ద్వారా స్పష్టమగును.

ఒకనాడు తాత్యాకోతే పాటీలు మసీదుకు వచ్చి బాబాకు నమస్కరించి కోపర్‌గావ్ సంతకు పోవుచున్నారని తెలిపెను. అంత బాబా ఇట్లనిరి - "తొందర పడవద్దు. కొంచెం ఆగుము. సంత సంగతి అలా ఉండనిమ్ము. పల్లె విడిచి బయటకు

పోవద్దు" కాని తాత్యా ఆతురతను గమనించిన బాబా మాధవరావు దేశపాండే నైనా తోడుతీసుకొని వెళ్లమనిరి. తాత్యా బాబా మాటలను లెక్కచేయక టాంగాలో కోపర్‌గావ్‌కు బయలుదేరెను.

టాంగాకు కట్టిన గుర్రములలో ఒకటి క్రొత్తది; మిక్కిలి చురుకైనది. అది సావుల్‌బావి దాటిన వెంటనే వడిగా పరుగెత్తసాగెను. కొంత దూరం వెళ్లిన తర్వాత కాలు బెణికి అది కూలబడెను. తాత్యాకు పెద్దదెబ్బ తగలలేదు. కాని బాబా మాటలను జ్ఞప్తికి తెచ్చుకొనెను. మరొకమారు బాబా మాటలను లెక్కచేయకుండా కోల్హారు గ్రామమునకు టాంగాలో బయలుదేరి ప్రమాదమునకు గురయ్యెను.

★ ★ ★

ఒకసారి ఐరోపా దేశస్థుడు బాబాను దర్శించుటకు షిర్డీ వచ్చెను. అతడు మసీదులోనికి ప్రవేశించుటకు మూడుసార్లు ప్రయత్నించెను. కాని బాబా అతనికి అనుమతి నివ్వలేదు. బయటినుండే చూడమనిరి. అతడు బాబా తనను అగౌరవ పరచాడని తలంచి షిర్డీ వదలి వెళ్ల దలచెను. బాబా వద్ద సెలవు తీసుకొనుటకై వెళ్లెను. బాబా తొందరపడవద్దనియు, మరుసటి దినం వెళ్లమనియు అతనితో చెప్పిరి. తక్కినవారు కూడా బాబా మాటలను సమర్థించిరి. కాని అతడు వారి మాటలను లక్ష్యపెట్టకుండా టాంగాలో బయలుదేరెను. తొలుత గుర్రములు బాగా పరుగెత్తెను. సావుల్ బావి దాటిన తర్వాత ఒక త్రొక్కుడు బండి ఎదురు వచ్చెను. దానిని చూచి గుర్రములు బెదిరి త్వరగా పరుగెత్తసాగెను. టాంగా తలక్రిందల య్యెను. ఐరోపా దేశస్థుడు క్రిందపడి కొంత దూరం ఈడ్వబడెను. తత్ఫలితంగా గాయాలై కోపర్‌గావ్ ఆసుపత్రిలో చాల కాలం పడియుండెను.

బాలకరామ్ మాన్కర్‌కు టికెట్టును ఇచ్చుట

బాలకరామ్ మాన్కర్ బాబా భక్తుడు. అతడు భార్య చనిపోయిన తర్వాత గృహభారమును కొడుకునకు అప్పగించి షిర్డీ వచ్చి బాబాకు సేవ చేయసాగెను. కొంతకాలం తర్వాత బాబా అతని భక్తికి మెచ్చి 12 రూపాయలు ఇచ్చి మత్స్యేంద్ర నాథుడు తపస్సు చేసిన సతారా జిల్లాలోని మచ్ఛేంద్రగడ్‌కు వెళ్లియుండమనిరి.

మాన్కర్‌కు షిర్డీ వదలి వెళ్ళుటకు ఇష్టంలేదు. కాని బాబా ఆజ్ఞను పాటించి మచ్ఛేంద్రగడ్ వెళ్లెను. అక్కడి శుభ్రమైన నీటిని, ఆరోగ్యకరమైన గాలిని, చుట్టు ప్రక్కల నుండు సుందరమైన ప్రకృతి దృశ్యములను చూసి సంతసించెను. అచ్చట తీవ్రంగా ధ్యానం చేయసాగెను.

ఒకరోజున బాబా అతనికి భౌతికంగా దర్శనం యొసంగిరి. అప్పుడతను బాబాను, "నన్నేల ఇచ్చటికి పంపితివి" అని అడిగెను. బాబా అతనితో "షిర్డీలో నీ మనసు అనేక ఆలోచనలతో కలవరపడుచుండెను. నీ చంచల మనస్సుకు నిలకడ కలిగించుటకు నిన్ను ఇక్కడికి పంపితిని. నేను ఎల్లప్పుడు షిర్డీలోనే ఉందునని తలంచితివి. నేను ఇక్కడ నీకు దర్శనం ఇచ్చితిని కదా! భక్తులు ఎక్కడ స్మరిస్తే అక్కడ నేను ఉన్నానని తెల్పుటకే నిన్ను ఇక్కడికి పంపితిని" అని చెప్పి అదృశ్యమైరి.

మాన్కర్ కొంత కాలం తర్వాత మచ్ఛేంద్రగడ్ నుండి బాంద్రాకు బయలు దేరెను. దాదరుకు టికెట్టు తీసుకొనుటకై అతడు బుకింగ్ ఆఫీసు దగ్గరకు వెళ్లెను. అచ్చట జనం క్రిక్కిరిసి యుండుటచే అతనికి టిక్కెట్టు దొరకలేదు. అతడు ఆందోళన చెందసాగెను. ఇంతలో ఒక జానపదుడు అతనిని సమీపించి ఇట్లనెను. - "దయ చేసి నా దాదరు టికెట్టును తీసుకోండి. నా కిచ్చట అవసరమైన పనియుండుటచే దాదరుకు వెళ్ళుటలేదు" టికెట్టు లభించుటచే మాన్కర్ చాల. సంతోషించెను. అతడు టికెట్టు పైకమును తీసి ఇచ్చునంతలో ఆ జానపదుడు అదృశ్యమయ్యెను.

మాన్కర్ ఇంటికి వెళ్ళి అచ్చట కొంతకాలముండి తిరిగి షిర్డీ చేరెను. బాబా సేవ చేయుచూ వారి ఆశీర్వాదములతో ప్రాణం విడిచెను.

బాబా దర్శనంతో మనఃశాంతి

నాసిక్ జిల్లా వాణిలో కాకాజీ వైద్య అనునతడు మనఃశాంతి లేక బాధ పడుచుండెను. అతడు సప్తశృంగి దేవాలయంలో పూజారిగా ఉండెను. అతడు సప్తశృంగి దేవతను తన మానసిక ఆందోళనను తొలగించమని ప్రార్థించు చుండెను.

ఒకనాటి రాత్రి ఆ దేవత అతనికి స్వప్నంలో కనిపించి "బాబా వద్దకు పొమ్ము. నీ మనస్సు శాంతించును" అనెను. అతడు బాబా యనగా త్ర్యంబకేశ్వరుడు

(శివుడు) అని తలంచి నాసిక్‌లోని త్ర్యంబకమునకు వెళ్లెను. అతడక్కడ 10 రోజులు ఉండెను. అతడు నిత్యం వేకువజామునే స్నానం చేసి రుద్రమును జపించుచు అభిషేకం చేయుచుండెను. కాని అతని మనస్సుకు శాంతి లభించలేదు. స్వగ్రామ మునకు వచ్చి సప్తశృంగి దేవతను మరలా ప్రార్థించెను. దేవత అతనికి మరలా స్వప్నంలో కనిపించి బాబా యనగా షిర్డీ సాయిబాబా అని చెప్పెను.

కాకాజీ షిర్డీ పోవుటెట్లు? ఎప్పుడు పోవాలి? బాబాను చూచుటెలా? అని ఆలోచించుచుండెను. మనసా-వాచా-కర్మణా బాబాను సందర్శించాలనే బలీయ మైన కోర్కెతో అతనుండెను. అతనిని దైవం కూడా కరుణించెను. ఆ సమయము ననే బాబాకు ముఖ్యభక్తుడగు శ్యామా కూడా తన గృహదేవతయగు సప్తశృంగికి మ్రొక్కులు చెల్లించటానికి రావటం జరిగెను.

శ్యామాకు చిన్నతనంలో జబ్బు చేసినప్పుడు అతని తల్లి తమ కులదేవత యగు సప్తశృంగి దేవత పవిత్ర చరణములందు శ్యామాను ఉంచుతానని మ్రొక్కు కొన్నది. ఆ తర్వాత ఆమెకు రొమ్ముమీద తామర రావడంతో చాల బాధ పడింది. ఆ వ్యాధి కనుక తగ్గితే ఆ దేవతకు వెండి స్తనాలు చేయించి ఇస్తానని మ్రొక్కుకొన్నది. ఆ రెండు మ్రొక్కులను తీర్చకుండానే ఆమెకు మరణం ఆసన్నమైంది. అపుడు ఆమె తన రెండు మ్రొక్కులను తీర్చమని తన కుమారుడగు శ్యామాకు చెప్పి మరణిం చింది. శ్యామా కూడా ఆ మ్రొక్కులను గురించి మరచిపోయాడు.

ఈ విధంగా 30 సం॥లు గడిచిపోయాయి. ఒక రోజున శ్యామా తమ్ముడు బాలాజీ షిర్డీ వచ్చిన ఒక ప్రసిద్ధ జ్యోతిష్యుని కలిసాడు. అంతట అతడు బాలాజీకి ఈ విధంగా సలహా ఇచ్చాడు - "మీ అన్నగారు మీ అమ్మగారికి ఇచ్చిన మాట ప్రకారం సప్తశృంగి దేవతకు మ్రొక్కులు తీర్చలేదు. అదియే మీరు ఇప్పుడు పడుతున్న బాధలకు ముఖ్య కారణం. కనుక మీరు వెంటనే ఆ మ్రొక్కును తీర్చిన మీ బాధలన్నీ తొలగి మీరు హాయిగా ఉండగలరు.

శ్యామా ఆలస్యానికి చింతించి వెంటనే ఆ దేవతకు రెండు వెండి స్తనాలు చేయించి సాయి సలహా ప్రకారం మ్రొక్కు తీర్చుకొనుటకు వాణి వెళ్లి సప్తశృంగీ దేవాలయపు పూజారియగు కాకాజీ వైద్యను కలిసాడు.

శ్యామా సప్తశృంగి దేవతకు మ్రొక్కులు చెల్లించిన తర్వాత కాకాజీని వెంట తీసుకొని షిర్డీ చేరెను. కాకాజీ మసీదుకు పోయి బాబా పాదాలపై పడెను. బాబా దర్శన మాత్రముననే అతనికి మానసిక శాంతి లభించెను. కాకాజీ అచ్చట 12 రోజులుండి బాబా సెలవు తీసుకొని, వారి నుండి ఊదీ ప్రసాదమును, వారి ఆశీర్వాదమును పొంది ఇల్లు చేరెను.

సద్గతి నొసంగుట

1. తాత్యా సాహెబు

1909 వ సం॥న తాత్యాసాహెబు పండరీపురంలో సబ్-జడ్జిగా ఉండెను. అతనికి యోగులందు నమ్మకం ఉండేది కాదు. కాని అతని వద్ద మామలత దారుగా నున్న నానాసాహెబు చాందోర్కరుకు యోగులందు మిక్కిలి నమ్మకం. అతడు తాత్యాసాహెబుకు బాబా లీలను తెలిపి షిర్డీకి పోయి బాబా దర్శనం చేసుకోమని బలవంత పెట్టెను.

తాత్యాసాహెబు షిర్డీకి వెళ్ళుటకు రెండు షరతులను విధించెను -

1. బ్రాహ్మణ వంటవాడు లభించాలి.

2. బాబాకు సమర్పించుటకు చక్కని నాగపూరు కమలాలు దొరకాలి.

అతని రెండు షరతులు నెరవేరెను. అంతట తాత్యా షిర్డీకి వెళ్ళెను. అతడు బాబాను దర్శించెను. అతడు బాబా అవతార పురుషుడని తెలిసికొనెను. అతడు తన అంత్యదశలో షిర్డీలోనే ఉండి మత గ్రంథములను శ్రద్ధగా పారాయణ చేయు చుండెను. అతని చివరి క్షణాలలో బాబా భక్తులు అతనికి బాబా పాద తీర్థమును ఇచ్చిరి. అతని మరణవార్త విని బాబా ఇట్లనిరి - "అయ్యో! తాత్యా నా కంటె ముందే వెళ్ళిపోయెను. అతనికి పునర్జన్మ లేదు".

2. విజయానంద స్వామి

విజయానందస్వామి మద్రాసుకు చెందినవాడు. అతడు మానస సరోవర యాత్రకు బయలుదేరెను. మార్గమధ్యమున బాబా సంగతి విని షిర్డీలో ఆగెను. అక్కడ హరిద్వారం నుంచి వచ్చిన సన్యాసియగు సోమదేవస్వామిని కలుసు

కొనెను. సోమదేవస్వామి మానస సరోవర యాత్రలోని కష్టములను వివరించెను. ఆ కష్టములను విని విజయానంద స్వామి తన మానస సరోవర యాత్రను మాను కొనెను. ఇది తెలుసుకొని బాబా విజయానంద స్వామిపై కోపగించుకొనిరి - "ఈ పనికిరాని సన్యాసిని తరిమివేయండి. కష్టానికి భయపడేవాడు సన్యాసికాడు. ఇతని సాంగత్యం మనకు పనికి రాదు. "బాబా కోపపడినను విజయానందునకు వారిపై ప్రేమ కలిగెను. కావున అతడు షిర్డీ వదలుటకు ఇష్టపడలేదు.

రెండు రోజుల తర్వాత తల్లికి జబ్బుగా నున్నదని విజయానందునకు మద్రాసు నుండి ఉత్తరం వచ్చెను. అతడు ఇంటికి పోవుటకు బాబా అజ్ఞను వేడెను. బాబా అతనిట్లు ప్రశ్నించిరి - "నీ తల్లిని అంతగా ప్రేమించువాడవైతే, సన్యాసం ఎందుకు తీసుకొంటివి? కాషాయ వస్త్రములు ధరించువానికి దేనియందూ అభిమానం తగదు" తర్వాత వారతనికి ఈ సలహా ఇచ్చిరి - "నీవు వసతి గృహమునకు వెళ్ళి ద్వారాలు బంధించి, ఓర్పుతో జాగ్రత్తగా వేచి ఉండుము. దొంగలు సర్వం దోచుకు పోతారు. ధనం, శరీరం అశాశ్వతములని గుర్తుంచుకో. సుఖాపేక్ష విడిచి నీ ధర్మ ములో నిలువుము. నీ పూర్వపుణ్యం నిన్ను ఇక్కడకు తెచ్చింది".

భాగవతములో 12 స్కంధములు గలవు. ప్రతి స్కంధంలోని 9వ అధ్యాయం లో భక్తితత్త్వం బోధింపబడింది. కనుక భాగవత గ్రంథమును పారాయణ చేసిన భక్తుల దగ్గరకు భగవంతుడు పరుగు పరుగున వచ్చి వారికి మోక్షం ప్రసాదించును. ప్రహ్లాదుడు, ధ్రువుడు, మార్కండేయుడు మొదలైన వారందరూ అట్టివారలే. నీవును భాగవతమును శ్రద్ధగా పారాయణ చేసి కృతార్థుడవుకమ్ము.

మరుసటి రోజున విజయానంద స్వామి బాబా చెప్పిన ప్రకారం భాగవత పారాయణను లెండితోటలో ఏకాంతమున ప్రారంభించెను. రెండు పారాయణలు చేయగనే అలసిపోయెను. వసతి గృహమునకు వచ్చి రెండు దినములుండెను. మూడవ రోజున బడేబాబా తొడపై ప్రాణములు వదలెను.

సాయి అతని దేహాన్ని ఒక రోజు ఆగి సమాధిచేయమన్నారు. కారణం భక్తు లకు తెలియలేదు. అతని మరణములో ఏదో మోసముందని శంకించి పోలీసులు వచ్చి విచారించారు. తర్వాత మోసమేదీ లేదని నిర్ణయించి ఆ శరీరాన్ని సమాధి చేయుటకు అంగీకరించారు.

సాయి విజయానందునితో చెప్పిన వసతి గృహం అశాశ్వతమైన దేహం; యమదూతలు దొంగలు; మూయనున్న ద్వారాలు ఇంద్రియాలు, మనస్సు. బాబా అతనితో పారాయణ ద్వారా భగవంతునిపై మనస్సు నిలిపి శరీరం విడువుమని చెప్పిరి. ఎందుకనగా అతడు తల్లిపై మమకారంతో చనిపోతే పతితుడైన సన్యాసిగా దుర్గతి పొందేవాడు. తన సన్నిధిని సద్వినియోగం చేసుకొనేటట్లు సాయియే చూసుకొన్నారు.

3. పులి

విజయదశమికి ఒక వారం ముందు కొందరు ఒక బండి మీద ఒక పులిని గొలుసులతో కట్టి మసీదువద్దకు తెచ్చిరి. జబ్బుగా వున్న పులిని ఒక సర్కస్ కంపెనీ వద్ద చౌకగా కొని, గ్రామాలలో ప్రదర్శించి వారు డబ్బు సంపాదించుకొనుచుండిరి. దాని జబ్బు తగ్గితే దానిని సర్కస్‌వారికే ఎక్కువ వెలకు అమ్మవచ్చని వారి తలంపు. అదెంతో బాధతో గర్జిస్తుంటే చూచి సాయి, "పాపం దానినలా కట్టిపారేసారేమి? విప్పండి. దాని బాధను నేను తీరుస్తాను" అని చెప్పారు.

తొలుత వారు భయపడ్డారు. కాని గంపెడాశతో దానిని విప్పారు. అది మెల్లగా బండి దిగి, మసీదు మెట్లెక్కి ఆయన ఎదుటకు వచ్చింది. అది బాబాను తదేకంగా చూచి, వారి చూపులకు తట్టుకోలేక తలవాల్చెను. బాబా దానిపైపు చూసెను. అది ప్రేమతో బాబా వైపు చూసెను. బాబా పాదాల వాసన చూసెను. వెంటనే తన తోకనే నేలపై మూడుసార్లు కొట్టి తెలివి తప్పి క్రింద పడి చనిపోయెను.

అదెక్కడ జన్మించిందో! కాని మహాభక్తునిలా సాయి వద్ద శాశ్వతంగా దుఃఖ నివృత్తి పొందింది. జరిగిన నష్టాన్ని కొంత వరకైనా భర్తీ చేయాలనే ఉద్దేశ్యంతో కాబోలు బాబా వారికి రు. 50/- లు బహూకరించారు.

షిర్డీలో ఉత్సవాలు

పల్లకీ - చావిడి ఉత్సవం

ఒక రోజు పెద్ద వర్షం వచ్చి మసీదంతా తడిసిపోయి, బాబాకు కూర్చొనేందుకు చోటు కూడ లేకపోయింది. భక్తులు ఆయనను నాటి రాత్రికి చావడిలో ఉండ మన్నారు. ఆయన అంగీకరించలేదు. కాని భక్తులు పట్టుబట్టి ఆయనను అక్కడికి

తీసుకొని వెళ్ళారు. ఆ రాత్రి ఆయన అక్కడ విశ్రమించారు. నాటి నుండి ఆయన ఒక రాత్రి మసీదులోను, మరొక రాత్రి చావడిలోను నిద్రించేవారు.

చావడి మసీదుకు దగ్గర రెండు గదులతో ఉండెను. 10-12-1909 నుండి బాబా చావడిలో నిద్రించు రోజున భక్తులు ఆయనను మసీదు నుండి చావడికి ఊరేగింపుగా తీసుకొని పోవుచుండిరి. అదియే చావడి ఉత్సవంగా పేరొందినది. ఇది నేటికీ గురువారం రాత్రి పల్లకీ ఉత్సవంగా జరుగుతున్నది.

ఒకప్పుడు భక్తులు హోర్దా నుండి బాబాకు ఒక పల్లకీ పార్శెలు చేసి పంపారు. బాబా దానిని మసీదు ముంగిట పెట్టించి మూడు మాసాలు తెరవనివ్వలేదు. ఒక రోజు రఘువీర్ పురందరే బాబా కోపగించినా, తిట్టినా లెక్కచేయకుండా ఆ పల్లకీని విప్పి పూలతో అలంకరించాడు. బాబా ఆ పల్లిలో కూర్చొనుటకు అంగీకరించలేదు. భక్తులు బ్రతిమాలగా చివరకు పల్లకీలో వారి పాదుకలను ఊరేగించాలని, సాయి పాదచారియై ఊరేగింపుతో వెళ్ళాలని రాజీ కుదిరింది.

ఉత్సవం ఏర్పాటు : చావడి ఉత్సవం ప్రారంభమైనప్పటి నుండి చావడిని బాగ అలంక రించుచుండిరి. దానిని తెల్లని పైకప్పుతోను, నిలువుటద్దములతోను, రంగు రంగుల దీపములతోను అలంకరించుచుండిరి.

చావడిలో బాబా నిద్రించు సమయం ఆసన్నం కాగానే భక్తులు మసీదులో గుమికూడి కొంతసేపు మండపంలో భజన చేసెడివారు.

బయట బహిరంగ స్థలంలో కొందరు దివిటీలు సరిచేయుచుండిరి. కొందరు పల్లకిని అలంకరించుచుండిరి. కొందరు చేత బెత్తములు ధరించి 'శ్రీసాయి నాథ మహరాజ్‌కీ జయ్' అని కేకలు వేయుచుండిరి. మసీదు మూలలను తోరణములతో అలంకరించుచుండిరి. మసీదు చుట్టూ దీపములు కాంతులను వెదజల్లుచుండెను.

బాబా శోభా యాత్ర

1. మసీదు నుండి చావడి వరకు

బాబా గుర్రము 'శ్యామకర్ణ' ను చక్కగా అలంకరించెడువారు. తర్వాత తాత్యా పాటీలు కొంతమందితో కలసి వచ్చి బాబాను సిద్ధంగా ఉండమని కోరేవాడు. బాబా శరీరంపై మామూలు కఫనీని వేసుకొని, చంకలో సటకా పట్టుకొని

చిలిమును, పొగాకును తీసుకొని, పైన ఉత్తరీయం వేసుకొని బయలుదేరుటకు సిద్ధమగు చుండిరి. తర్వాత తాత్యా జలతారు సెల్లాను బాబాపై వేసెడివారు. అంతట బాబా తన కుడి పాదం బొటనవ్రేలుతో ధునిలోని కట్టెలను ముందుకు త్రోసి కుడి చేతితో మండుచున్న దీపమును ఆర్పి చావడికి బయలుదేరుచుండిరి.

బాబా బయలుదేరగా వాయిద్యములు మ్రోగెడివి. మతాబా మందు సామగ్రి నుండి అనేక రంగుల కాంతులు వెలువడుచుండెను. స్త్రీ-పురుషులు భజన చేయుచూ ఉత్సవంలో నడచుచుండిరి. కొందరు సంతోషంతో నాట్యం చేయు చుండిరి. కొందరు జెండాలను చేత పట్టుకొనుచుండిరి. బాబా మసీదుపైకి రాగా భక్తులు 'శ్రీసాయినాథ మహరాజ్‌కీ జై' అని కేకలు పెట్టుచుండిరి.

కొందరు భక్తులు బాబాకు ఇరు ప్రక్కలా చామరములు వీచుచుండిరి. మార్గమంతయు అడుగులకు మడుగులు ఒత్తుచుండిరి. బాబా భక్తుల భుజములపై చేతులు వేసి నడచుచుండిరి. తాత్యా బాబా ఎడమ చేతిని, మహాల్సాపతి కుడి చేతిని పట్టుకొనెడి వాడు. బాపు సాహెబ్ జోగ్ బాబా తలపై గొడుగు పట్టెడివాడు.

చావడి దగ్గరకు వచ్చునప్పటికి బాబా బాలభానునివలె ప్రకాశించుచుండిరి. అచట బాబా ఉత్తరంవైపు ముఖం పెట్టి నిల్చొనెడివారు. సమస్త వాయిద్యములు మ్రోగగా బాబా తన కుడిచేతిని క్రిందకు, మీదకు ఆడించెడివారు. అప్పుడు కాకా సాహెబు దీక్షిత్ ముందుకు వచ్చి ఒక వెండి పళ్లెంలో పువ్వులు, గులాల్ పొడిని తీసుకొని బాబాపై పెక్కుసార్లు చల్లుచుండెను. అప్పుడు వాయిద్యములు శక్తి కొలది మ్రోగించబడుచుండెను. అప్పటి బాబా కాంతిని వర్ణించుటకు మాటలు చాలెడివి కావు. ఒక్కొక్కసారి మహాల్సాపతి ఆనందంతో దేవత ఆవహించిన వానివలె నృత్యం చేయుచుండెను. తాత్యాపాటీలు లాంతరు పట్టుకొని బాబాకు ఎడమ ప్రక్కన నడచు చుండెను.

2. చావడిలో

తాత్యా చావడిలోనికి ముందుగా ప్రవేశించెడివాడు. అతడు ఒక ఆసనం వేసి దానిపై బాలీసు నుంచి బాబాను కూర్చొనబెట్టుచుండెను. బాబాకు ఒక మంచి అంగరఖాను తొడుగు చుండెను. తర్వాత భక్తులు బాబాకు అనేక రకములుగా పూజలు చేయుచుండిరి. బాబా తలపై తురాయి కిరీటమును పెట్టి, పూలమాలలు

వేసి మెడలో నగలు వేయుచుండిరి. నుదుటిపై కస్తూరి నామమును, మధ్యన బొట్టును పెట్టుచుండిరి. తలపైనున్న కిరీటమును అప్పుడప్పుడు తీయుచుండిరి.

నానాసాహెబు గిర్రున తిరుగు కుచ్చుల ఛత్రమును పట్టుకొనుచుండెను. బాబాసాహెబు ఒక వెండి పళ్లెంలో బాబా పాదములను కడిగి, అర్ఘ్యపాద్యములు అర్పించి చేతులకు గంధం పూసి తాంబూలం ఇచ్చుచుండెను. బాబా గద్దెపై కూర్చొని యుండగా తాత్యా మొదలగు భక్తులు వారి పాదములకు నమస్కరించుచుండిరి. బాబాకు ఇరువైపుల నున్న కొంతమంది భక్తులు చామరములతోను, విసనకర్రల తోను విసరుచుండిరి.

ఇంతలో శ్యామా చిలిము తయారుచేసి తాత్యాకు ఇచ్చెడివాడు. తాత్యా ఒకసారి పీల్చి బాబాకు ఇచ్చుచుండెను. బాబా పీల్చిన తర్వాత భక్త మహాల్సాపతి మొ॥వారు పీల్చుచుండిరి. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత భక్తులు బాబా మెడలో పూలమాలలు వేసెడివారు. వాసన చూచుటకు చేతికి పూలగుత్తులను ఇచ్చెడి వారు. ఆ తర్వాత బాపు సాహెబు హారతి ఇచ్చువాడు. హారతి సమయాన మేళ తాళాలు మ్రోగెడివి. ఆ తర్వాత భక్తులు బాబా ఆశీర్వాదమును పొంది వారికి నమస్కరించి తమ తమ ఇండ్లకు వెళ్ళెడివారు. బాబా కోరికపై తాత్యా ఇంటికి వెళ్ళి అర్ధరాత్రి సమయాన ఒకసారి వచ్చి బాబా క్షేమములను కనుగొని వెళ్ళుచుండిరి.

గురు పూర్ణిమ

1908వ సం॥లో ఒక రోజున పండరీపురం నుండి వచ్చిన కృష్ణజీ మాల్కర్ చావడిలో ఉండెను. బాబా శ్యామాతో ఆ ముసలయ్య (మాల్కర్)ను ధుని వద్ద ఉన్న స్తంభాన్ని పూజించుకొమ్మని చెప్పమనిరి. శ్యామా అతనికి ఆ విషయం చెప్పెను. అప్పుడు బాబా శ్యామాతో, "మీరంతా కూడా చేసుకోరాదా!" అని చెప్పిరి. శ్యామా అందుకు ఈ విధంగా బదులు చెప్పెను - "దేవా! మీకైతే చేస్తాం. కాని స్తంభాన్ని ఎందుకు పూజిస్తాం?" బాబా తొలుత అందుకు అంగీకరించలేదు. కాని శ్యామా పట్టుబట్టిన మీదట తనను పూజించుటకు అంగీకరించిరి. తాత్యా, దాదా కేల్కర్, శ్యామా మొదలగువారు సాయికి ధోవతులిచ్చి పూజించారు. ఆ రోజు వ్యాస గురు

పూర్ణిమ. కనుక అప్పటి నుండి షిర్డీలో గురుపూర్ణిమ చేసుకోవటం ఆచారమైంది. సాయి నోటి మీదుగా భక్తులకు చేసుకోమని చెప్పిన ఉత్సవం ఇదొక్కటే.

సాయి స్తంభాన్ని పూజించమనటంలో కూడా 'గురువును సేవించు' అను భావమే ద్యోతకం అవుతుంది. స్తంభం నేలలో దృఢంగా నాటుకొని ఉంటుంది. అది ఇంటి కప్పును మోసే ఆధారం. అది భవనాన్ని ఆశ్రయించే వారందరినీ రక్షిస్తుంది. అట్లే సద్గురువు సర్వానికి ఆధారమైన ఆత్మనిష్ఠలో, గురుభక్తిలో నాటుకొని ఉంటారు. అందుకే సాయి స్తంభాన్ని పూజించమన్నారు.

72 గంటల సమాధి

అది క్రీ.శ. 1886వ సంవత్సరం. హిందూ పంచాంగం ప్రకారం వ్యయనామ సంవత్సరం. ఒక రోజున బాబా వద్ద మహాల్సాపతి ఒక్కడే ఉన్నాడు. తనకు బాబా చరణ సన్నిధిలో జీవించే మహాభాగ్యం లభించిందని తలంచాడు తన మనస్సులో.

"మహాల్సా! నీవు నన్ను స్మరిస్తే నీ ఆపదలు సప్తసముద్రాలంత అయినా దాటి స్తాను. నా మాటల్లో విశ్వాసం ఉంచు. నీకు తప్పక మేలు కలుగును" అని చెప్పాడు బాబా. మహాల్సా తల ఊపాడు అప్రయత్నంగా.

"పూజలతో నాకు పనిలేదు. షోడశోపచారాలు నాకు అక్కరలేదు. అష్టాంగ యోగాలూ అవసరం లేదు. భక్తి, శ్రద్ధ - ఈ రెండూ ఉంటే చాలు. భక్తి ఎక్కడ ఉంటుందో అక్కడే నేను ఉంటాను. నన్ను శరణు కోరిన వాని బరువు - బాధ్యతలు, యోగక్షేమాలు, మంచి-చెడ్డలు నా భుజాన వేసుకొంటాను" - అని చెబుతూ, "అరే మహాల్సా! నేను హఠాత్తుగా మాయమైతే నీవెలా వుంటావు?" అని బాబా అడిగారు.

పిడుగులాంటి ఈ ప్రశ్నకు మహాల్సాపతి బిత్తర పోయాడు. అతని కండ్ల వెంట నీళ్ళు తిరిగాయి. "బాబా! నన్ను అలాంటి మాటలతో బాధించవద్దు. దేవా! నేను నీ చరణదాసుడను. నీవు లేని ఈ లోకాన్ని నేను ఊహించుకోలేను. ప్రభూ! నన్ను కరుణించు" అని మొర పెట్టుకొన్నాడు మహాల్సాపతి.

"మహల్సా! దేహమంటేనే నశించేది. పండితుడవైన నీవు దీనిని అర్థం చేసుకో". బాబా అతనికి ఎక్కువ మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదు. "మహల్సా నేను అల్లా వద్దకు వెళ్ళాలి. తిరిగి మూడు రోజులలో ఈ ద్వారకామాయికి వస్తాను ...... అల్లాను ఒప్పించి వస్తాను. తప్పక వస్తాను.... ఒక వేళ రాకపోతే మాత్రం ఆ వేప చెట్టు దగ్గర సమాధి చేసేది. గుర్తుగా రెండు జెండాలను పాతిపెట్టు. ఎవరేమి చెప్పినా వినవద్దు. మూడు రోజులు ఈ దేహాన్ని ఇలాగే కాపాడుకో" అని బాబా మహల్సాపతి తలపై తన తొడను ఉంచి పడుకొన్నారు.

మహల్సాపతి నిరుత్తరుడై కదలక మెదలక ఉండిపోయాడు. అతడు సాయి నామస్మరణ చేస్తూ బాబా రాకకై నిరీక్షించసాగాడు. బాబా శరీరం నుండి ప్రాణం పోయినట్లుండెను. ఆ వార్త షిర్డీ గ్రామంలో దావానలంలా వ్యాపించింది. ఊరి వారందరూ అచ్చట చేరి న్యాయవిచారణ చేసి బాబా చూపిన స్థలంలో సమాధి చేయదలచిరి. కాని మహల్సాపతి అడ్డగించెను. తన తొడపై బాబా శరీరమును ఉంచుకొని మూడు రోజులు అట్లే కాపాడుచుండెను. మూడు దినముల తర్వాత తెల్లవారు జామున మూడు గంటలకు బాబా శరీరంలో ప్రాణమున్నట్లు కనిపించెను. ఊపిరాడుట మొదలయ్యెను. కడుపు కదలెను. కండ్లు తెరచెను. కాళ్ళు చేతులు సాగదీయుచు బాబా లేచెను. దీనిని బట్టి బాబా పరబ్రహ్మ స్వరూపుడని తెలియు చున్నది.

ఇటుకరాయి విరుగుట

బాబా తన భౌతిక శరీరమును విడుచుటకు కొన్ని దినముల ముందు ఒక దుశ్శకునమయ్యెను.

1918వ సంవత్సరం. అక్టోబరు నెల. ఒక రోజున బాబా భిక్షకు వెళ్ళారు. వారు తమ గురుప్రసాదమని ప్రాణప్రదంగా చూచుకొనే ఇటుక మసీదులో నేలపై ఉండెను. బాబా దానిపై ఆనుకొని ఆసనస్థులగుచుండిరి. మహల్సాపతి, కాశీరామ్ షింపీలు దానికి ప్రతిరోజూ అభిషేకం, పూజ చేసి, ధుని దగ్గరున్న స్తంభం ప్రక్కన పెట్టేవారు. ఆరోజున మాధవ ఫస్లే మసీదు చిమ్ముతూ, దానిపై దుమ్ము పడకుండా చేతిలోనికి తీసుకోగానే, అది జారి క్రిందపడి రెండు ముక్కలయ్యెను. సాయి కోపి

స్తానని ఫస్లే భయంతో వణికిపోయాడు. కొద్ది సేపట్లో సాయి రానేవచ్చారు. విరిగిన ఇటుకను చూచి దానిని చెక్కిలికి అనించుకొని కన్నీరు కారుస్తూ, "విరిగినది ఇటుక కాదు. నా అదృష్టమే ముక్కలు ముక్కలుగా విరిగిపోయినది. ఇది నా జీవితపు తోడూ-నీడ. ప్రాణానికి ప్రాణం. దీని సహాయం వలననే నేను ఆత్మాను సంధానం చేయుచుంటిని. నా జీవితమందు నాకెంత ప్రేమయో, ఆ ఇటుక పైనా నాకంతే ప్రేమ. ఈ రోజు ఇది నన్ను విడిచింది. ఇక నేను ఎక్కువ కాలం జీవించను' ' అన్నారు. అప్పుడు బూటీ వెండి లేక బంగారు తీగతో వాటిని కలిపి గట్టిగా చుట్టించి ఇస్తానని చెప్పాడు. కాని బాబా దానికి సమ్మతించలేదు.

బాబా యోగీశ్వరుడైనను మామూలు మనిషివలె వ్యవహరించిరి.

బాబా సమాధి చెందుట

1918 సెప్టెంబరు 28వ తేదీన బాబాకు కొంచెం జ్వరం తగిలెను. జ్వరం 2-3 దినములు ఉండెను. అటు తర్వాత బాబా భోజనమును మానెను. అందుచేత క్రమంగా బలహీనులైరి.

బాబా దేహత్యాగం చేయటానికి నిర్ణయించుకొన్న తర్వాత వజే అనునతనిని పిలిచి 'రామ విజయం' అను గ్రంథమును పారాయణం చేయమనిరి. అతడు వారంలో ఒకసారి పఠించెను. తర్వాత మూడు రోజులలో రెండవసారి పఠించెను.

1918 అక్టోబరు 15వ తారీఖు. మంగళవారం. హారతి తర్వాత బాబా కాకా సాహెబును, బుట్టీని తమ-తమ బసలకు పోయి భోజనం చేయమనిరి. కాని లక్ష్మీబాయి షిండే, భాగోజి షిండే, బయ్యాజీ, అప్పాకోతే పాటిల్, లక్ష్మన్ బాలా షింపీ, నానాసాహెబు అక్కడనే ఉండిరి. దిగువమెట్ల మీద శ్యామా కూర్చొని యుండెను. లక్ష్మీబాయి షిండేకు 9 నాణెములు దానం చేసిన పిమ్మట బాబా తనకు మసీదు బాగ లేదనియు, తనను రాతితో కట్టిన బుట్టీవాడాకు మార్చిన బాగుండుననియు చెప్పి బయ్యాజీ శరీరంపై ఒరిగిరి. నానాసాహెబు నీళ్ళు తెచ్చి బాబా నోటిలో పోసెను. నీరు బయటకు వచ్చెను. అతడు బిగ్గరగా 'ఓ దేవా' అని అరచెను. అంతలో బాబా కండ్లు తెరచి మెల్లమెల్లగా 'ఆహా' అనిరి. బాబా తన భౌతిక శరీరమును విడిచిపెట్టినని తెలిపోయెను. అప్పుడు గం. 2.30 ని॥ల సమయం.

నాకు జాతీయత, దేశభాషాదులతో పనిలేదు. మానవులందరూ నా వారే.

బాబా సమాధి చెందిన విషయం తెలుసుకొని షిర్డీ ప్రజలందరూ, స్త్రీలు - పురుషులు - బిడ్డలు. మసీదుకు పోయి ఏడ్వసాగిరి. బాబా శరీరమును ఎట్లు సమాధి చేయవలెనా అని పెద్దలు తర్కించుకొనసాగిరి. మహమ్మదీయులు (ఖుషాల్ చంద్, అమీరు షక్కర్ మొ॥) బాబా శరీరమును అరుబయట సమాధి చేసి దానిపై గోరీ కట్టవలెననిరి. కాని గ్రామ మునసబగు రామచంద్ర పాటీలు దృఢ స్వరంతో, "మీ ఆలోచన మాకు సమ్మతం కాదు' అని పలికెను.

అందుచే గ్రామస్థులు రెండు వర్గములుగా చీలిరి. మామలతదారు ఎన్నికను నిర్వహించెను. బుట్టీవాడాను ఉపయోగించుటకు రెండు రెట్ల కంటె ఎక్కువ ఓట్లు వచ్చెను. అప్పుడు రెండవ పార్టీవారు కూడా మనసు మార్చుకొని బాబాను వాడాలో సమాధి చేయుటకు అంగీకరించిరి. అందువల్ల మురళీధర్‌కు కట్టినచోట శాస్త్రోక్తంగా బాబాను సమాధి చేసిరి. బాబాయే మురళీధరుడు. వాడా దేవాలయమయ్యెను. బాబా శరీరం 36 గంటలు గాలి పట్టినప్పటికీ బిగిసిపోలేదు. అవయవములన్నియూ సాగుచుండెను. అందుచే వారి కఫనీని చింపకుండా సులభంగా తీయుటకు వీలయ్యెను.

బాబా సమాధి చెందు విషయమును ముందే తెలుపుట

బాబా సమాధిచెందు విషయమును రెండు సంవత్సరములకు ముందే సూచించిరి. కాని అది ఎవరికీ బోధపడలేదు. విజయదశమినాడు సాయంకాలం గ్రామంలోని వారందరూ సీమోల్లంఘనం★ చేసి తిరిగి వచ్చుచుండగా బాబా హఠాత్తుగా కోపోద్రిక్తులైరి. ఆయన తన తలగుడ్డ, కఫనీ, లంగోటీ తీసి వానిని చించి ముందున్న ధునిలోనికి విసరివైచిరి. అక్కడ దిగంబరుడై నిలచి ఎర్రగా మండుచున్న కండ్లతో బిగ్గరగా అరచిరి - "ఇప్పుడు సరిగా గమనించి నేను హిందువునో, మహమ్మదీయుడనో చెప్పండి" ఈ మాటలకు అచ్చటున్న వారందరూ గడగడ వణకసాగిరి. అప్పుడు భాగోజి షిండే (కుష్ఠురోగ భక్తుడు) ధైర్యంతో దగ్గరకు పోయి

★ సీమోల్లంఘనమనగా గ్రామపు సరిహద్దులు దాటుట. పూర్వం రాజులు విజయదశమినాడు దిగ్విజయానికి బయలుదేరి పొలిమేరలు దాటేవారని చెబుతారు. అందరూ శమీపత్రం, ఆలింగన, నమస్కారాలు ఇచ్చిపుచ్చుకొని పాత ద్వేషాలు మరచి నాటి నుండి పరస్పరం ప్రేమభావం వహిస్తారు.

లంగోటి కట్టి ఇట్లనెను - "బాబా! శుభమా అని సీమోల్లంఘనం జరుగుతుంటే ఇదంతా ఏమిటి?" అప్పడు బాబా సటకాను నేలపై కొడుతూ ఇట్లు చెప్పిరి - "ఈ దినమే నా సీమోల్లంఘనం" ఈ విధంగా బాబా తాను దసరానాడు సమాధి చెందుదునని సూచించిరి. కాని ఎవరూ అర్థం చేసుకోలేదు.

ఇది జరిగిన కొంత కాలం తర్వాత రామచంద్ర పాటీలు తీవ్రంగా జబ్బు పడిరి. ఎన్ని ఔషధములు సేవించినను గుణమివ్వలేదు. ఒకనాడు బాబా పాదములను పట్టుకొని ప్రార్థించెను. అంతట బాబా అతనితో ఇట్లు చెప్పిరి - "నీవు ఆతుర పడవద్దు. నీ చావు చీటీ తీసివైచితిని. త్వరలో బాగుపడెదవు. కాని తాత్యా 1918 సం॥న విజయదశమినాడు మరణించవలసి యున్నది. ఈ విషయం ఎవ్వరికీ తెలుపవద్దు"

బాబా చెప్పిన ప్రకారం రామచంద్ర పాటీలు జబ్బు నయమయ్యెను. 1918 ఆశ్వయుజ మాసమున తాత్యాకోతే పాటిల్ జబ్బుపడెను. బాబా కూడా జ్వరంతో ఉండిరి. తాత్యా బాబానే పూర్తిగా నమ్ముకొని యుండెను. విజయదశమి రానే వచ్చెను. తాత్యా మరణం ఖాయమనుకొనిరి. ఇంతలో వింత జరిగెను. తాత్యా మరణం తప్పెను. అతనికి బదులుగా బాబా గతించిరి. వారిలో వారు మరణం మార్చుకొన్నట్లు కనిపించెను. బాబా తన ప్రాణమును తాత్యాకు సమర్పించెనని ప్రజలు తలంచిరి. బాబా తన పేరుకు బదులుగా తాత్యాపేరు తెలిపిరి. ఈ విధంగా బాబా తన సమాధిని ముందుగానే సూచించిరి.

సమాధి మందిర నిర్మాణం

శ్రీమాన్ బాపు సాహెబు బుట్టీ నాగపూర్‌లో కోటీశ్వరుడు. అతడు బాబా భక్తుడు. షిర్డీలో సకుటుంబంగా ఉండేవాడు. అతనికి షిర్డీలో ఒక సొంత భవనముండిన బాగుండునని ఆలోచన కలగెను. కొన్ని రోజుల తర్వాత దీక్షిత్ వాడాలో నిద్రించుచుండగా అతనికి బాబా స్వప్నంలో కనిపించి ఒక వాడాను మందిరంతో సహా నిర్మించమని చెప్పిరి. అచ్చట నిద్రించుచున్న శ్యామాకు కూడ అట్టి స్వప్నమే కనిపించెను. ఇద్దరికీ ఒకే రకపు స్వప్నం వచ్చుటచే బాపు సాహెబు బుట్టీకి చాల ఆశ్చర్యం కలిగెను. ధనికుడగుటచే అతడు వాడాను నిర్మించదలచెను. శ్యామా

సహాయంతో ఒక ప్లాను గీసెను. కాకాసాహెబు దీక్షిత్ దానిని ఆమోదించెను. బాబా కూడా దానికి తన సమ్మతిని తెలిపిరి. శ్యామా పర్యవేక్షణలో భూమ్యుపరిగృహం, భూగృహం, బావి పూర్తయ్యెను. బాబా కూడా కొన్ని సలహాలు ఇచ్చుచుండిరి. మిగిలిన పని జోగుకు అప్పగించబడెను.

దానిని నిర్మించునపుడు బుట్టీకి ఒక ఆలోచన తట్టెను. చుట్టు గదులుండి దాని మధ్య ఒక విశాలమైన హాలులో మురళీధరుని (శ్రీకృష్ణుని) ప్రతిమను ప్రతిష్ఠించిన బాగుండును కదా అని తలంచెను. బుట్టీ ఈ విషయమును బాబాకు తెలిపెను. అప్పుడు బాబా అతనితో ఇట్లనిరి - "దేవాలయం పూర్తికాగానే నేనే అచ్చట నివసించుటకు వచ్చెదను. మన మందరం అచ్చట ఉందాము. అందరు కలసిమెలసి ఆడుకొందాం".

కొబ్బరికాయ కొట్టి పని ప్రారంభించిరి. కొద్ది కాలంలోనే పని పూర్తయ్యెను. మురళీధర్‌ని విగ్రహం తయారుచేయుటకు ఆర్డరు ఇచ్చిరి. అది తయారు కాక మునుపే బాబాకు తీవ్రమైన జ్వరం వచ్చెను. వారు శరీరమును వదలిపెట్టుటకు సిద్ధంగా నుండిరి

సమాధి చెందకముందు, "నన్ను రాతి మందిరంలో ఉంచండి" అన్న బాబా పలుకులు వినిపించెను. అంతట బాబా పవిత్ర శరీరమును మధ్య మందిరంలో పెట్టి సమాధి చేసిరి. ఇట్లు మురళీధర్ కొరకు నిర్ణయించిన స్థలం నందు బాబా సమాధి చేయుటచే బాబాయే మురళీధరుడనియు, బుట్టీవాడాయే సమాధి మందిరమనియు తెలియుచున్నది.

హిందూ - ముస్లిముల సమైక్యతకు ప్రతీక

బాబా హిందూ -ముస్లిముల సమైక్యతకు ప్రతీక. ధూలియా కోర్టు వారు బాబాను నీ మతమేమిటి అని ప్రశ్నించగా బాబా తన మతమును కబీరు మతమని తెలిపిరి. బాబా కబీరువలె హిందూ ముస్లిముల ఐక్యతకై పాటు పడినారు. వారు కేవలం హిందూమతాన్ని కాని, ఇస్లామ్ మతాన్ని కాని నమ్ముకోకుండా రెండు మతాల లోని విశేషాలను జోడించి ప్రజలకు ఒక విశిష్టమైన జీవిత విధానాన్ని ప్రసాదించారు.

బాబా ముస్లిములకు ఆరాధ్య స్థలమైన మసీదులో నివసించుచుండిరి. కాని వారు మసీదునకు హిందువులకు ఇష్టమైన 'ద్వారకామాయి' అని పేరు పెట్టారు. షిర్డీ చేరిన తొలిరోజుల్లో వారు మసీదులోనే నివసించినప్పటికీ, తర్వాత మసీదులో ఒక రోజు, చావడిలో ఒకరోజు నిద్రించెడివారు. వారు మసీదులో హిందువుల, పారశీల ఆరాధ్యమగు అగ్నిహోత్రమును 'ధుని' పేరట ఏర్పాటు చేసారు. వారు ప్రారంభించిన ధుని నేటికీ షిర్డీలో వెలుగుచున్నది. అంతేకాకుండా హిందువులకు పవిత్రమైన తులసీకోటను కూడా మసీదులో ఏర్పరచారు. ఒకేరోజు పగలు హిందువులకు ఇష్టమైన జెండా ఉత్సవం, రాత్రి ముస్లిములకు ఇష్టమైన చందనోత్సవం జరుపుకొనుటకు ప్రోత్సహించేవారు. మసీదులో హిందువులకు ఇష్టమైన దీపారాధన గావించుటయే గాకుండా వారికి ఇష్టమైన శ్రీరామనవమి, కృష్ణాష్టమి పండుగలు జరుపుకొనుటకు అనుమతి ఇచ్చారు.

బాబా హిందువులను విష్ణుసహస్రనామం, ఏకనాథ భాగవతం, జ్ఞానేశ్వరి, వివేక చూడామణి, పంచదశ భావార్థ రామాయణం, యోగవాశిష్ఠం వంటి సద్గ్రంథములు పఠించమని చెప్పెడివారు. వారు హిందువులతో తమ గురువు వెంకూసా అని చెప్పారు. వారు హిందూ ధర్మానికి చెందిన శ్రీనృసింహ సరస్వతి, అక్కల్ కోట స్వామి, తపోవన సాధువు, గురు ఘోలప్ మహరాజ్, ధునివాలే, దాదా మహరాజ్ మొ॥వారు తమ రూపాలేనని తెలిపారు.

ఎవరైనా భక్తులు దేవతలకు చెల్లిస్తామన్న మ్రొక్కులను మరచిన బాబా వాటిని గుర్తుచేయుచుండిరి. వారు హిందువుల పునర్జన్మ సిద్ధాంతమును నమ్ముచుండిరి. వారు చెన్నబసప్ప, వీరభద్రప్ప అనెడి వెనుకటి భక్తులు ద్వేషం, అసూయ వలన పాము, కప్పగా జన్మించిన విషయం తెలిపారు. ఒక జన్మలో బాబా స్నేహితులుగా ఉన్నవారు ఈ జన్మలో మేకలుగా పుట్టారని వివరించారు. వేద మంత్రం మరచిన దక్షిణాది బ్రాహ్మణులకు వేదమంత్రం గుర్తు చేసారు. భగవద్గీత శ్లోకానికి అద్వితీయ వివరణ ఇచ్చి తమ అపారమైన సంస్కృత జ్ఞానాన్ని ఎరుక పరచారు. రామ సప్తాహం జరుపుకొనుటకు ప్రోత్సహించి తద్వారా సప్తాహం ప్రాముఖ్యతను, నామ స్మరణ మహోత్మ్యమును ఎరుక పరచారు.

బాబాకు జబ్బు చేసినపుడు వారి ఆరోగ్యం కొరకు భక్తులు శాంతులు, అభిషేకాలు, పూజలు చేయిస్తే వారు కాదనేవారు కాదు. హైందవ ఆచారం ప్రకారం చందనమద్ది ధూపదీపాలతో పూజిస్తే అంగీకరించారు. అవసాన దశలో రామ విజయమనే గ్రంథాన్ని చదివించుకొని శ్రద్ధగా విన్నారు.

బాబా తనను పేద ఫకీరుగా చెప్పుకొనే వారు. అంతేగాకుండా వారు ఫకీరు వలె వేషధారణ చేసుకొనెడివారు. క్షౌరంకూడా ముస్లిముల వలె చేయించుకొనెడి వారు. ఖురాను మంత్రాలకు సరియైన అర్థం ఫకీర్లకు, హజ్ సిద్ధిక్ వంటి పండితు లకు బోధించేవారు. ముస్లిం ఫకీర్లతో కలిసి రాత్రి సమయాలలో తాకియాకు వెళ్ళి కాళ్ళకు గజ్జెకట్టి నృత్యం చేసేవారు. అరబ్బీ, పారసీ భాషలలో పాటలు పాడేవారు. ముస్లిం భక్తులను రంజాన్ వంటి పండుగలు, ఉరుసులు జరుపుకొమ్మని ప్రోత్స హించువారు. ముస్లిములతో రోషన్ షా తమ గురువని తెలిపారు.

బాబా తన నిర్యాణానికి ముందు ఔరంగాబాదులోని షంసుద్దీన్ మియా, బన్నేమియా అనే ఫకీర్లను పిలిపించుకొని వారితో ఖవ్వాలీలు పాడించి 'నియాజ్' (అన్నదానం) చేయించారు. అల్లాను నిరంతరం స్మరించేవారు. భక్తులతో 'అల్లా అచ్ఛాకరేగా' అని చెప్పెడివారు. ఏకాంతంగా ఉన్నప్పుడు అరబ్బీ మంత్రాలను గొణుగు తుండేవారు. ఇదంతా హిందువులకు ఇష్టమైన ధుని ఎదుట నిల్చొని చేసెడి వారు. ఇతర మతస్థులు ఒక క్రైస్తవుణ్ణి నిందిస్తూ ఉండగా బాబా, 'అతడు నా సోదరుడు. అతనిని దూషించవద్దు' అని తెలిపారు.

కొంతమంది హిందువులు బాబాను ముస్లిమ్‌గా తలచి మనసులో బాధ పడుచుండిరి. వారితో బాబా ఇట్లు చెప్పేవారు - "నేను ముస్లిమ్‌ను కాను. స్వచ్ఛమైన బ్రాహ్మణుడను. బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపిస్తాడు." కొంత మంది భక్తులు, "బాబా! నీవు ముస్లిము ఫకీరువై యుండి కూడా హిందూ ఆచారాలను ఎందుకు పాటిస్తున్నావు?" అని అడిగేవారు, వారితో బాబా ఇలా చెప్పే వారు - "ఏ దేశంలో వుంటే ఆ వేషం ధరించాలి"

శ్యామా ఒకసారి బాబాతో బ్రహ్మలోకం మొ॥వి వుంటే తనకు చూపమని పట్టుపట్టాడు. బాబా భగవంతుని ముందు అవి అల్పములని, అశాశ్వతములని, వాటిని పట్టించుకోవద్దనీ చెప్పినా అతడు వినలేదు. బాబా అతనిని కళ్ళు మూసుకో మన్నారు. అతనికి ఆయా లోకాలు కనిపిస్తుంటే బాబా సత్యలోకంలో బ్రహ్మను, వైకుంఠంలో విష్ణువును, కైలాసంలో శివుణ్ణి చూపి మనం కోరవలసింది వీటికి అతీతమైనది" - అన్నారు.

ఏ విషయంలోనైనా జాగ్రత్త అవసరమే. కాని సర్వానికి కర్త భగవంతుడే అను విషయాన్ని మరచిపోకూడదు. ఒకసారి షిర్డీ పరిసరాలలో కలరా వ్యాపిం చింది. ప్రక్క గ్రామాలతో సంబంధం లేకుండా ఆ గ్రామస్థులు జాగ్రత్త పడ్డారు. ఊరి లోనికి ఒక కట్టెల బండి కూడా రాకుండా నిషేధించి, దానిని ఉల్లంఘించిన వారికి జరిమానా ప్రకటించారు. ఇంతలో ఆ ఊరు సమీపించిన కట్టెల బండిని సాయియే పిలిచి, మసీదులో ధునికిగాను వేయించారు. ఎవరూ ఆయనకు ఎదురు చెప్పలేదు.

ఒక ముస్లిమ్ తనకు సంతానం కల్గితే షిర్డీలో మిఠాయి పంచుతానని మ్రొక్కుకొన్నాడు. అతని కోరిక ఫలించింది. అతడు షిర్డీ చేరి మిఠాయి పంచటానికి బాబా అనుమతి కోరాడు. ఆయన నవ్వి మారుతి ఆలయంలో పంచమన్నారు. అతడు ఆశ్చర్యంతో "నేను ముస్లిమ్‌ను గదా, అదెలా సాధ్యం?" అన్నాడు. బాబా ఉగ్రులై, "ఏమి ముస్లిమ్‌వురా నీవు! ఆలయంలో మిఠాయి పంచుపో!" అని గద్దిం చారు. అతడు బాబా ఆజ్ఞను పాటించాడు. సర్వగతుడైన భగవంతునిపై భక్తికి మత భేదం ఆటంకం కాదని బాబా భావం.

నైజాం రాష్ట్రానికి చెందిన ఒక ఖాజీ షిర్డీ వచ్చి మసీదులో అగ్నిహోత్రం, గంటలు మొ॥వి ఉంచటం తగదని బాబాతో చెప్పాడు. బాబా ఉగ్రులై, "నీవు అసలు ముస్లిమ్‌వేనా? నీకు నమాజ్, షరియత్ (ఇస్లామ్ ఆచారకాండ), ఖురాన్ తెలుసా? భగవంతుని శక్తిని ఋజువు చేయగలవాడే ముస్లిమ్" అన్నారు.

సాయి మత మౌఢ్యాన్ని నిరసించేవారు. భక్తులు ఆయనను మొదట పూలతో మాత్రమే పూజించేవారు. ఒకనాటిరాత్రి మహల్సాపతికి స్వప్నంలో ముఖానికి చందనం పూయబడిన సాయి దర్శనమిచ్చారు. మరుసటి రోజు నుండి అతడు బాబాను అలానే అలంకరించసాగాడు. అతనిని ముస్లిములు దండించ దలచిరి. అందుచే అతడు ఆ మరురోజు మసీదు ముంగిట నుంచే సాయిని పూజించ సాగెను. సాయి అతనిని "లోపలకు వచ్చి నా ముఖాన చందనం అద్దు. ఎవరు అడ్డువస్తారో చూస్తాను" అని గద్దించారు. అంతట ఆ ముస్లిములు భయపడి వెళ్ళి పోయారు. హిందువులు తమ మతానుసారం సాయిని ఆరాధించసాగిరి.

బాబా దృష్టిలో మతం మార్చుకొనుట ద్రోహం, లజ్జాకరం. బడేబాబా ఒక హిందూ యువకుణ్ణి ముస్లిమ్‌గా మార్చి గర్వంగా బాబాకు చూపాడు. సాయి ఉగ్రులై, ఆ యువకుని చెంపమీద కొట్టి, "నీ అబ్బను మార్చుకొన్నావుట్రా?" అన్నారు.

ఒక పఠాను తమ మతాచారాలతో హిందువులు మసీదును అపవిత్రం చేస్తున్నారని తలంచాడు. ఒకనాటి రాత్రి అతడు బాబాను చావడిలో నిద్రిస్తున్న హిందువులనందరినీ చంపటానికి అనుమతి కోరాడు. అప్పుడు బాబా శాంతంగా ఇలా చెప్పారు - "ఇందులో తప్పేదైనా వుంటే అది నాదే. వారందరినీ చంపే కంటే నన్నే చంపితే సమస్య తీరుతుంది". అతడు కూడ సిద్ధమయ్యాడు. ఒకరోజు అతడు దుడ్డుకర్రతో సాయిని కొట్టబోయాడు. అతడు కర్ర ఎత్తిన క్షణములో బాబా అతని వైపు తీవ్రంగా చూసి అతని చేయి తాకారు. అతని బలమంతా పోయి కుప్పకూలి పోయాడు.

ఇదే విధంగానే హిందువులను కూడ సంస్కరించారు సాయి. బల్వంత్ నాచ్నే 1915లో ఒకనాటి రాత్రి 8 గంటలకు సాయిని దర్శించి ముక్తిమార్గం చెప్పమని ప్రార్థించాడు. అప్పుడు సాయి, "దేవ్‌పూర్ వెళ్ళి అక్కడ అనాదిగా మీ పూర్వీకులు అర్చిస్తున్న శిలలను ఆశ్రయించు" అన్నారు. అతనికేమీ అర్థం కాలేదు. ఇంటికి వెళ్ళినతర్వాత, నిజంగానే వారి పూర్వీకులు దేవపూర్‌లో కొన్ని విగ్రహాలను పూజించేవారని అతని తండ్రి చెప్పాడు.

శ్రోత్రియుడైన నానా చాందోర్కర్ తనకు భోజన సమయంలో తరచుగా అతిథులు దొరకడం లేదన్నాడు. బాబా అతనితో ఇలా చెప్పారు - "నానా! అతిథి

అంటే మానవుడే గాదు. భోజన సమయానికి వచ్చిన ఏ ప్రాణియైనా అతిథే. క్రిమి కీటకాదుల నుండి మానవుల వరకు నిజంగా లభించిన అతిథులను నీవు గుర్తించుట లేదు. కాక బలికి బయట సమృద్ధిగా అన్నం విడిచిరా! ఏ ప్రాణినీ పిలువ వద్దు. తరమవద్దు. ఏ ప్రాణి వచ్చిందన్నది పట్టించుకోవద్దు. అలా చేస్తే లక్షలాది అతిథులను ఆదరించినట్లే."

బాబా మహాసమాధి పొందుతానంటే భయభ్రాంతులైన భక్తులు సాయితో మొర పెట్టుకొన్నారు - "ఇన్నాళ్ళు మీతో కలసిమెలసి వుండి, మీరు లేకుండా......!" అప్పుడు భక్తాభీష్ట ప్రదాతయైన సాయి తనకు మళ్ళీ జన్మలేదనియు, సమాధి అనంతరం కూడా తలచిన వారిని తలచిన క్షణాన కరుణించగలనని అభయమిస్తూ ఇలా పలికారు - "చూడండి. ఇది విడిచి పెట్టవలసిన పాంచభౌతిక శరీరం. దీనితో కొందరిని మాత్రమే రక్షింపగలను. అందరిని గురించి ఆలోచించలేను, రక్షించలేను. ఈ శిథిల శరీరాన్ని విడిచిపెట్టినచో అనంతమైన భక్తులు తలచిన తక్షణం ఆదుకోగలను. అది నా కర్తవ్యం".

భక్తులు సాయిని 'శ్రీరామకృష్ణ శివమారుత్యాది రూపాయనమ!' అని కొలుస్తారు. రాముడు ఆదర్శ మానవుడు. కృష్ణుడు ప్రేమకు ప్రతిరూపం. శివుడు భిక్షకుడైనను భక్తులకు అడిగిన క్షణమే అడిగిన వరమును ఇచ్చువాడు. మారుతి అనన్య భక్తికి ప్రతీక. ఈ లక్షణాలన్నీ మేళవించుకొని వెలసిన దివ్య రూపమే సాయిబాబా! వారి ఈ రూపం సదా మన మనస్సులలో నిలచి ఉండాలని ప్రార్థిస్తూ వారికి సాష్టాంగ ప్రణామములర్పిద్దాం. వారి ఆశీర్వాదంతో వారు చూపిన ధర్మమార్గాన నడుద్దాం.

పారాయణ సంపూర్ణం

ఓం శ్రీసాయిరామార్పణమస్తు

అనుబంధం

వసతి గృహాలు

1. సాఠేవాడా : హరి వినాయక సాఠే అనునతడు నిర్మించుటచే దీనికి 'సాఠే వాడా' అని పేరు వచ్చింది. అప్పట్లో షిర్డీకి పోయిన భక్తమండలికిదే నివాస స్థలం.

వేపచెట్టును, దాని చుట్టూ వున్న స్థలంను వాడుకొని ఇది కట్టబడెను. వేపచెట్టు చుట్టూ ఎత్తుగా అరుగులు కట్టిరి. మెట్లు కట్టిరి. మెట్ల దిగువున ఒక గూడు వంటిది కలదు.

భక్తులు మండపంపై ఉత్తర ముఖంగా కూర్చొందురు. అక్కడ గురువారం, శుక్రవారం ధూపం వేసినవారు బాబా కృపచే సంతోషంగా వుందురు. ఈ వాడా చాలా పురాతనమైంది.

2. దీక్షిత్‌వాడా : న్యాయవాదియగు కాకాసాహెబు దీక్షిత్ ఇంగ్లాండుకు వెళ్ళెను. అచ్చట రైలు ప్రమాదమున అతనికాలు కుంటుపడెను. ఎంత ప్రయత్నించినను అది బాగు కాలేదు. అతని స్నేహితుడగు నానాసాహెబు చాందోర్కరు అతనిని షిర్డీ సాయిబాబాను దర్శించమనెను.

అతడు 1909 వ సం॥న బాబాను దర్శించి ఈ విధంగా కోరుకొనెను - "నా కాలు కుంటితనం కన్నా నా మనసులోని కుంటితనం తొలగించుము".

బాబా దర్శన మాత్రాన అతడు పరమానంద భరితుడై షిర్డీలో నివసించుటకు నిశ్చయించుకొనెను. అతడు తన కొరకు, భక్తుల కొరకు ఒక వాడాను నిర్మించ దలచెను. 10-12-1910 వాడాకు పునాది వేసెను. 1911వ సం॥న శ్రీరామ నవమినాడు ఆవాడకు గృహప్రవేశం జరిగెను.

3. బుట్టీవాడా : బుట్టీ నాగపూర్ నివాసి. అతడు చాలా ద్రవ్యం వెచ్చించి ఒక పెద్ద రాతి మేడను కట్టించెను. అందుచే దీనికి "బుట్టీవాడా" అని పేరు వచ్చింది.

ఈ స్థలంలో మొట్టమొదట పూలతోట వుండెను. ఆ తోటలో బాబాయే తోట మాలిగా మొక్కలకు నీరు పోయుచుండెను. ఈ స్థలంలో బాబాగారి భౌతిక దేహం సమాధి చేయబడెను.

ప్రస్తుతం షిర్డీ సంస్థానం వారు నిర్మించిన వసతి గృహం అత్యాధునిక సౌకర్యములతో భక్తులకు అందుబాటులోనున్నది. అంతేగాక నేడు అనేక హోటళ్ళుకూడా కలవు.

షిర్డీలో చూడవలసిన ప్రదేశాలు

1. ఖండోబా దేవాలయం : ఏ క్షేత్రానికి వెళ్ళినా తొలుత ఆ గ్రామ దేవతను దర్శించాలని మన పెద్దలు చెబుతారు. కనుక షిర్డీ వెళ్ళినప్పుడు మొట్టమొదట ఖండోబా (శివుని) దేవాలయంను దర్శించి ఆ స్వామి ఆశీస్సులను తీసుకొన్నచో యాత్ర నిర్విఘ్నం అగును. ఈ దేవాలయం షిర్డీ బస్టాండు ఎదురుగా వున్న మర్రిచెట్టు ప్రక్క సందులో గలదు. బాబా తొలుత పెండ్లి బృందంతో వచ్చింది ఇక్కడికే. ఇక్కడే దేవాలయపు పూజారియగు మహల్సాపతి బాబాను "ఆయియే సాయి" అని పిలిచింది. సాయి ఆజ్ఞపై ఉపాసనీ మహారాజ్ తపస్సు చేసింది కూడా ఇక్కడే.

2. మారుతి ఆలయం : మారుతి క్షేత్రపాలకుడుగా వున్నాడు. అందుకే బాబా వచ్చేటప్పుడు, పోయేటప్పుడు అతనితో సంభాషించేవారు. ఇది మసీదుకు, చావడికి మధ్య సందులో వుంది. ఇక్కడే బాబా దేవీదాసు, జానకీదాసు వంటి మహాత్ములతో చర్చలు జరిపేవారు.

3. గురుస్థాన్ (వేపచెట్టు - పాదుకలు) : ఇది బాబా యొక్క గురువు నివసించిన ప్రదేశంగా చెప్పబడును. బాబా మొదటిసారి షిర్డీ వచ్చినప్పుడు ఇక్కడ ఈ వేప చెట్టు క్రింద కూర్చొనిరి. మొదటి సారిగా 16 సంవత్సరాల బాలుడుగా ఇక్కడే కనిపించిరి. ఇక్కడ బాబా తపస్సు చేసిన కారణాన ఆయన కూర్చొన్న వైపున గల ఆకులు తీపిగా వుండును.

చెట్టు మొదట్లో బాబా పాదుకలు, ప్రక్కన బాబా పటం, బాబా మేఘునికిచ్చిన శివలింగం, బాబా చిన్న విగ్రహం వుంటాయి. గురు, శుక్ర వారాలలో దీనిని శుభ్ర పరచి పూజించిన వారి, సాంబ్రాణి వెలిగించిన వారి చిక్కులు, బాధలు, రోగాలు తొలగిపోతాయని బాబా వాక్కు.

వేపచెట్టుకు ప్రదక్షిణలు చేసి, పాదుకలను నమస్కరించవలెను. ఇచ్చట ధ్యానం, నామజపం, సచ్చరిత్ర పారాయణ చేయుట మంచిది.

4. ద్వారకామాయి (మసీదు) : బాబా నివసించిన మసీదు ఇది. బాబా దీనిలో 60 సం॥లు నివసించిరి. బాబాయే దీనికి ద్వారకామాయి అని పేరు పెట్టిరి.

ఇక్కడ బాబా స్వయంగా వెలిగించిన ధుని కలదు. దీని నుండి వచ్చిన విభూతిని బాబా ఊదీ అని పిలిచెదరు. వారు దానిని భక్తులకు ఇచ్చెడివారు. ఆవుపేడతో చేసిన పిడకలు, ఆవునెయ్యి, కర్పూరం, గుగ్గిలం, సాంబ్రాణి, మఱ్ఱి, మేడి, తెల్ల జిల్లేడు ఇత్యాది సమిధలు ధునిలో వేయడం ఆచారం. పీచు తీయని కొబ్బరి కాయలను ధుని ప్రక్కనగల గోనెసంచిలో వుంచిన దేవస్థానం వారు సమయమును బట్టి వానిని ధునిలో వేయుదురు. ఇక్కడ బాబాను మనస్ఫూర్తిగా ప్రార్థించిన భక్తులకు బాబా తగిన సమాధానం ఒసంగుదురు.

ధునికి ఎదురుగా బాబా చిత్రపటం కలదు. దీనిని బాబా జీవిత కాలముననే చిత్రించిరి. ఈ చిత్రాన్ని చూస్తే బాబాను చూసినట్లేనని చెబుతారు.

బాబా చిత్రపటం ముందు బాబా పాదుకలు కలవు. బాబా ఈప్రదేశముననే కూర్చొనెడివారు.

ద్వారకామాయిలో బాబా ఉపయోగించిన తిరుగలి, కొలంబయను మట్టి పాత్ర, మంచినీటి కుండ గలవు. గోధుమల బస్తా, బాబా స్నానం చేయుటకు వాడిన రాయి, నింబారు, దీని దగ్గర నంద దీపాలు వున్నవి. ప్రక్కగదులలో పల్లకీ, రథము ఉన్నవి. వీటిని బాబా ఎప్పుడూ ఉపయోగించలేదు.

ముందు వసారాలో బాబా కూర్చొన్న రాయి, వంట చేసిన పొయ్యి, వారు నిలబడిన ప్రదేశమునకు గుర్తుగా పాదుకలు, తులసీ బృందావనం, గుఱ్రపు బొమ్మ, పులిబొమ్మ కలవు.

5. చావడి : రోజు విడిచి రోజు బాబా ఇక్కడ కుడి ప్రక్కనున్న కటకటాల వెనుక నిద్రించువారు. బాబా కాలముననే ఇక్కడ రకరకాలైన దేవుళ్ళ చిత్రపటాలు వుండేవి.

ఇచ్చట ఒక చెక్కబల్ల, చక్రాల కుర్చీ వున్నవి. బాబా మహాసమాధి చెందిన తర్వాత వారి శరీరంను ఈ చెక్కబల్లపై నుంచిరి. చక్రాల కుర్చీని మాత్రం బాబా ఉపయోగించ లేదు.

ముందున్న పంచలో పారాయణ చేసుకొందురు. ప్రతిరోజు రాత్రి భజన జరుగును. ప్రతి గురువారం రాత్రి ఇక్కడ చావడి ఉత్సవం బ్రహ్మాండంగా జరుగును. బాబా పాదుకలు, సటకా (పొట్టికఱ్ఱ), కోటును ద్వారకామాయి నుండి ఊరేగింపుగా ఇక్కడికి తెచ్చెదరు.

6. శ్రీసాయి సమాధి మందిరం : ఇది షిర్డీలో అతి పవిత్రమైన ప్రదేశం. దీనిని బుట్టీవాడా అని కూడా పిలిచెదరు. ఇక్కడే బాబా శరీరంను సమాధినందుంచిరి. బాబా సమాధిని దర్శించినపుడు, "నా సమాధి నుండే నేను సకల కార్యములు నిర్వహింతును'

అని చెప్పిన బాబా పలుకులను స్మరణకు తెచ్చుకొనవలెను. సమాధి పైన బాబా పెద్దపాల రాతి విగ్రహం 1950లో ప్రతిష్ఠింపబడెను.

దక్షిణం వైపున (క్యూలో వెళ్ళునపుడు) అద్దముల గదిలో బాబా ఉపయోగించిన కఫనీ (చొక్కా), సటకా, తిరగలి వున్నాయి.

ఈ మందిరమున 'నాథ' విధానములో బాబా విగ్రహానికి 4సార్లు హారతి నిత్తురు.

1. ఉదయం గం. 5-15 ని॥లకు	**- 5 వత్తులతో కాకడ ఆరతి**
2. మధ్యాహ్నం 12 గం॥ లకు	**- 5 వత్తులతో మధ్యాహ్న ఆరతి**
3. సాయంకాలం గం. 6-15 ని॥లకు	**- 1 వత్తితో సాయంసంధ్యా ఆరతి**
4. రాత్రి 10 గం॥లకు	**- 5 వత్తులతో శేజ్ ఆరతి**

ఇవికాక ఉదయం 6 గం॥కు మంగళస్నానం (అభిషేకం), 7 గంటలకు అర్చన జరుపబడును.

ప్రతి సంవత్సరం శ్రీరామనవమి, చందనోత్సవం, శ్రీకృష్ణాష్టమి, గురుపూర్ణిమ, దత్తజయంతి, విజయదశమి (శ్రీసాయి పుణ్యతిథి) వైభవంగా జరుపబడును.

మందిరమునకు ఉత్తరం వైపునగల షెడ్‌నందు శ్రీసాయి సత్యవ్రతములు జరిపింపబడును.

7. లెండి ఉద్యానవనం : దీన్ని బాబాయే స్వయంగా పెంచి పోషించారు. బాబా ప్రతిరోజు ఇచ్చటికి వచ్చేవారు. ఇచ్చట వారొక నందదీపంను వెలిగించిరి. అది అఖండ దీపం. దానిలో నువ్వులనూనె పోయుట ఆచారం.

ఇచ్చట బాబా స్వయంగా త్రవ్విన బావి, దత్తమందిరం, మేడిచెట్టు, రావి చెట్టు, వేపచెట్టు గలవు. ఇచ్చట శ్యామకర్ణయను గుఱ్ఱం సమాధి; ముక్తరామ్, అమీదాస్, మెహతాయను భక్తుల సమాధులు కలవు. ఈ ఉద్యానవనంలోనికి ప్రవేశించే ముందే బాబాకు అంకిత భక్తులైన అబ్దుల్లా, నానావల్లి, కుంభార్, తాత్యా, అయ్యర్‌ల సమాధులు గలవు.

8. శ్రీమతి లక్ష్మీబాయి షిండే ఇల్లు : ఇది చావడికి ఎదుట వీధిలో వున్నది. సాయి ఆమెకు ఇచ్చిన 9 రూపాయలు నవవిధ భక్తికి ప్రతీకలుగా ఇక్కడ చూడవచ్చును.

9. మహల్సాపతి ఇల్లు : ఇది శ్రీమతి లక్ష్మీబాయి షిండే ఇంటికి దగ్గర్లో వుంది. సాయి ఇతనికి ఇచ్చిన 3 రూపాయలు, పాదుకలు, కఫ్నీ, బెత్తం ఇక్కడ చూడవచ్చు.

10. శక్తి గణపతి దేవాలయం

11. ఈశ్వర దేవాలయం

12. గోదావరి నది : ఇది షిర్డీకి దగ్గరున్న కోపర్‌గావ్‌లో కలదు. ఇక్కడ సంకల్పంతో స్నానం చేసి తర్పణాలు వదులుకోవాలి.

13. ఉపాసనీ బాబా సమాధి : ఇది షిర్డీకి 4 మైళ్ళ దూరాన వున్న సకోరి అనే గ్రామమున వుంది.

షిర్డీకి తీసుకుపోవలసినవి

1. సాయిబాబా జీవిత చరిత్రకు సంబంధించిన పారాయణ గ్రంథం

2. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం 3. నువ్వులనూనె

4. వత్తులు 5. ప్రమిదలు 6. అగ్గిపెట్టె 7.కర్పూరం

8. కొబ్బరికాయలు (పీచు తీసినవి కొన్ని, పీచు తీయనివి కొన్ని)

9. ఆవునెయ్యి 10. ఆవు పిడకలు 11. మర్రి, మేడి, తెల్లజిల్లేడు మొ॥ సమిధలు

12. గుగ్గిలం లేక సాంబ్రాణి 13. అగరువత్తులు 14. గంధం

15. పూలు 16.పన్నీరు 17. పటికబెల్లం 18. భజన చేయుటకు తాళాలు

19. కూర్చొనుటకు చిరు చాపలు 20. కెమెరా, రీలు.

షిర్డీ నుండి తీసుకురావలసినవి

1. ఊది 2. ఫోటోలు 3. బాబా సమాధిపై ఉంచిన శాలువాలు.

శ్రీ షిర్డీ సాయి హారతులు

పరమ పవిత్రమైన శ్రీ షిర్డీ పుణ్యక్షేత్రములో సమర్థ సద్గురు సాయినాథుని పూజలలో ఈ హారతులు అతి ముఖ్యమైనవి. ప్రతిదినం శ్రీ సాయినాథునికి నాలుగు హారతులు ఇస్తారు.

1. కాకడ హారతి : ఇది వేకువ ఝామున గం. 5-15 ని॥లకు దీపాన్ని వెలిగించి అగరు వత్తుల ధూపాన్ని స్వామి వారికి చూపిస్తూ, వెన్నను నివేదనగా ఇస్తూ, 5 వత్తులతో ఈ హారతిని యిస్తారు.

2. మధ్యాహ్న హారతి : మధ్యాహ్నం 12 గంటలకు ధూప, దీప నైవేద్యానంతరం 5 వత్తులతో హారతి ఇస్తారు.

3. సాయంసంధ్యా హారతి : ఒకే ఒక వత్తితో సాయంత్రం 6-15 ని॥లకు ధూప దీప నైవేద్యానంతరము హారతి ఇవ్వబడుతుంది.

4. శేజారతి : రాత్రి 10 గంటలకు ధూప, దీప నైవేద్యానంతరం 5 వత్తులతో హారతి ఇవ్వబడుతుంది.

ఈ హారతులు అత్యంత ప్రాముఖ్యతను కలిగియున్నవి. ఈ హారతులు మరాఠీ భాషలో వ్రాయబడినవి. తెలుగులిపిలో ఈ హారతులను యథాతథంగా ఇవ్వడమైనది. భక్తులు ప్రతినిత్యం ఈ హారతులను పఠించి బాబా అనుగ్రహం పొందవచ్చు.

కాకడ హారతి

I. భూపాళి

1. జోడూనియాకర చరణి - ఠేవిలా మాథా ।
పరిసావీ వినంతీ మాఝీ - సద్గురునాథా ॥ 1

2. అసోనసో భావ ఆలో - తఝియా ఠాయా ।
కృపాదృష్టీ పాహే మజకడే - సద్గురురాయా ॥ 2

3. అఖండీత సావే ఐసే - వాటతే పాయీ ।
సాండూనీ సంకోచ్ ఠావ్ - థోడాసా దేఈ ॥ 3
తుకాహ్మణే దేవా మాఝీ - వేడీ వాకుడీ ।
నామేభవ పాశ్ హాతీ - అపుల్యా తోడీ ॥ 4

2. భూపాళి

ఉఠా పాండురంగా (అతా) ప్రభాత - సమయోపాతలా।
వైష్ణవాంచా మేళా గరుడ - పారీ ధాటలా ॥ 1
గరుడపారా పాసుని మహా - ద్వారా పర్యంత్ ।
సురవరాంచీ మాందీ ఉభీ - జోడునియా హాత్ ॥ 2
శుకసనకాదిక నారద తుంబర - భక్తాంచ్యాకోటీ
త్రిశూలడమరూ ఘేఉని ఉభా - గిరిజేచా పతీ ॥ 3
కలియుగీచా భక్త నామా - ఉభా కీర్తనీ ।
పాఠీమాగే ఉభీడోలా - లావునియా జనీ ॥ 4

3. భూపాళి

ఉఠా ఉఠా శ్రీ సాయినాథ గురు - చరణ కమలదావా।
ఆధివ్యాధి భవతాప వారునీ - తారా జడజీవా ॥ 1
గేలీ తుహ్మా సోడునియా భవ - తమరజనీ నిలయా ।
పరిహీ అజ్ఞానాసీ తుమచీ - భులవి యోగమాయా ॥
శక్తిన యాహ్మా యత్కించిత్ హీ - తిజలా సారాయా ।
తుహ్మీచ్ తీతే సారుని దావా - ముఖజన తారాయా ॥
భో సాయినాథ మహారాజ్ - భవతిమిర నాశక రవీ ।
అజ్ఞానీ అహ్మీకితీ (తుమచీ) - తవ వర్ణానీ థోరవీ ।
తీవర్ణితా భాగలే - బహువదని శేషవిధి కవీ ।
సకృపహో వుని మహిమా తుమచా -
తుహ్మీచ వదవావా ॥ ఆధి ॥ ॥ ఉఠా ॥ 2

భక్తమనీ సద్భావధరునిజే - తుహ్మా అనుసరలే ॥
ధ్యాయాస్తవతే దర్శన తుమచే - ద్వారి ఉభేలే ॥
ధ్యానస్థా తుహ్మాస్ పాహునీ - మన అముచేఘూలే ॥
పరితద్వచనామృత ప్రాశాయా - తే ఆతురఝూలే ॥
ఉఘడూనీ నేత్రకమలా । దీనబంధూ రమాకాంతా ।
పాహి బా కృపాదృష్టీ - బాలకా జశీ మాతా ॥
రంజనీ మధురవాణీ - హరి తాప్ సాయినాథా ।
అహ్మీచ్ అపులే కార్యాస్తవ తుజ - కష్టవితో దేవా ॥
సహన కరిశితే ఐకునిధ్యావీ - భేట్ కృష్ణదావా ॥ ఉఠా ॥ ॥ ఆధి ॥ 3

4. భూపాళి

ఉఠా పాండురంగా ఆతా దర్శన ద్యాసకళా
ఝూలా అరుణోదయా సరళీ - నిద్రేచీ వేళా ॥ 1
సంత సాధూ మునీ అవఘే - ఝూలేతీ గోళా
సోడా శేజే సుఖే ఆతా - బహుద్యా ముఖకమలా ॥ 2
రంగమండపీ మహాద్వారీ - ఝూలీసే దాటీ ।
మన ఉతావీళ రూప - పహావయా దృష్టీ ॥ 3
రాఈ రఖుమా బాఈ తుహ్మా - యే దాఊదయా
శేజే హాలవునీ జాగే - కరా దేవరాయా ॥ 4
గరుడ హనుమంతా ఉభే - పాహతీ వాట్
స్వర్గీచే సురవర ఘేఉనీ - ఆలే బోభాట్ ॥ 5
ఝూలే ముక్తద్వార్ లాభ్ - ఝూలా రోకడా
విష్ణుదాస్ నామా ఉభా - ఘేఉని కాకడా 6

5. అభంగము

ఘేఉనియా పంచారతీ కరూ - బాబాసీ ఆరతీ
కరూసాయిాసీ ఆరతీ - కరూ బాబాసీ ఆరతీ 1

ఉఠా ఉఠాహో బాంధవ - ఓవాళూ హరమాధవ
సాయీ రమాధవ - ఓవాళూ హరమాధవ 2
కరూనియా స్థిరమన - పాహు గంభీర హేధ్యాన
సాయిచేహేధ్యాన - పాహు గంభీర హే ధ్యాన 3
కృష్ణనాథా దత్తసాయీ - జడోచిత్త తుఝే పాయీ
చిత్తా తుఝెపాయీ - జడోచిత్త తుఝెపాయి 4

6. కాకడ హారతి

కాకడ ఆరతీ కరీతో - సాయినాథ దేవా ।
చిన్మయరూప దాఖవీ ఘేఉని - బాలక్ లఘుసేవ ॥కా॥ 1
కామక్రోధ మద మత్సర ఆటుని - కాకడా కేలా
వైరాగ్యాచే తూప్ ఘాడునీ - మీతా భిజవీలా
సాయినాథ గురుభక్తి జ్వలనే - తోమీ పేటవిలా
తద్వృత్తీ జాళునీ గురూనే - ప్రకాశ పాడియాలా
ద్వైతతమా నాసూనీ మిళవీ - తత్స్వరూప జీవా
చిన్మయరూపదా ఖవీ ఘేఉని - బాలక్ లఘు సేవ ॥కా॥ 2
భూ ఖేచర వ్యాపునీ అవఘే - హృత్కమలీ రాహసీ
తోచి దత్తదేవతు - శిరిడీ రాహుని పావసీ
రాహుని యేథే అన్యత్రహి తూ - భక్తాస్తవ ధావిసీ
నిరసునియా సంకటా దాసా - అనుభవ దావిసీ
నకళేత్వల్లీ లాహీ కోణ్యా - దేవావా మానవా
చిన్మయరూపదా ఖవీ ఘేఉని - బాలక్ లఘుసేవ ॥కా॥ 3
త్వద్యశ దుందుభీనే సారే - అంబర్ హే కోందలే
సగుణమూర్తి పాహణ్యా ఆతుర - జన శిరిడీ ఆలే
ప్రాశుని తద్వచనామృత అముచే - దేహభాన్ హరపలే
సోడునియా దురభిమానమానస - త్వచ్చరిణీ వాహిలే
కృపాకరునియా సాయి మావులే - దాస్ పదరిఘ్యావా
చిన్మయరూప దాఖవీ ఘేఉనీ - బాలక్ లఘు సేవ ॥కా॥ 4

7. కాకడ హారతి

భక్తీచియా పోటీ (- బోధ్ కాకడా జ్యోతీ
పంచప్రాణ జీవే భావే - ఓవాళూ ఆరతీ ॥ 1
ఓవాళూ ఆరతీ మాఝ్యా - పండరీనాథా ।
మాఝ్యా సాయినాథా ।
దోన్హీ కర జోడూనీ చరణీ - ఠేవిలా మాథా ॥ 2
కాయ మహిమా వర్ణూ ఆతా - సాంగణే కితీ ।
కోటీ బ్రహ్మహత్య - ముఖ పహతాం(జాతీ ॥ 3
రాఈ రఖుమాబాఈ ఉభ్యా - దోఘీ దోబాహీ ।
మయూరపింఛ చామరే ఢాళితి - సాయీచాతాయీ ॥ 4
తుకా హ్మణే దీప ఘేఉని - ఉన్మనీత శోభా ।
విఠేవరీ ఉభా దిసే - లావణ్య గాభా ॥ ॥ ఓ వాళూ ॥ 5

8. పదము

ఉఠా ఉఠా సాధుసంత - సాధా - ఆపులాలే హిత
జాఈల్ జాఈల్ హా నరదేహా - మగ్కైచా భగవంత ॥ 1
ఉఠోనియా పహాటే బాబా - ఉభా అసే విటే
చరణ తయాచే గోమటే - అమృతదృష్టి అవలోకా ॥ 2
ఉఠా ఉఠా హోగేవేసీ చలా - జా ఊ రాఉళాసీ
జలతిల పాతకాన్ చ్యారాశీ - కాకడ ఆరతి దేఖలియా 3
జాగేకరా రుక్మిణీవర - దేవ అహే నిజసురాంత
వేగే లింబలోణ్ కరా - దృష్టీ హో ఈల్ తయాసీ 4
ద్వారీ బాజంత్రీ వాజతీ - ఢోలు ఢమామే గర్జతీ
హోతసే కాకడ ఆరతీ మాఝ్యా - సద్గురు రాయాం(చీ ॥ 5
సింహనాద్ శంఖభేరి - ఆనంద హోతో మహాద్వారీ
కేశవరాజ విఠేవరీ - నామాచరణ వందితో ॥ 6

౯. భజన

సాయినాథ గురు మాఝే ఆయీ - మజలాఠావ ద్యావా సాయీ
దత్తరాజగురు మాఝే ఆయీ - మజలాఠావ ద్యావా సాయీ
సాయినాథ గురుమాఝే ఆయీ - మజలాఠావ ద్యావా సాయీ
దత్తరాజగురు మాఝే ఆయీ - మజలాఠావ ద్యావా సాయీ

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై.

10. ప్రభాతాష్టకము

ప్రభాతసమయీ నభా శుభ రవిప్రభా ఫాకలీ
స్మరే గురూ సదా అశా సమయిత్యా ఛళే నా కలీ ।
హ్మణోని కర జోడునీ కరు అతా గురు ప్రార్థనా
సమర్థగురు సాయినాథ పురవీ మనోవాసనా 1
తమా నిరసి భాను హా గురుహి నాసి అజ్ఞానతా
పరంతు గురుచీ కరీ నర విహీ కధీ సామ్యాతా
పున్హా తిమిర జన్మ ఘే గురు కృపేని అజ్ఞానా ॥స॥ 2
రవి ప్రగటిహో ఉనీ త్వరిత ఘాలవీ ఆలసా
తసా గురుహి సోడవీ సకల దుష్కృతీ లాలసా
హరోని అభిమానహీ జడవి తత్పదీ భావనా ॥స॥ 3
గురూసి ఉపమాదిసే విధిహరీ హరాచీ వుణీ
కుఠోని మగ్ హేఇతీ కవనియా ఉగీ పాహుణీ
తురీఘచ ఉపమా తులా బరవి శోభతే సజ్జనా ॥స॥ 4
సమాధి ఉతరోనియా గురు చలా మశీదేకడే
త్వదీయ వచనోక్తితీ మధుర వారితీ సాకడే
అజాతరిపు సద్గురో అఖిలపాతకా భంజనా ॥స॥ 5
ఆహా సుసమయా సియా గురు ఉఠోనియా బై సలే
విలోకుని సదా శ్రితా తదియ ఆపదే నాసిలే
అసా సుహితకారియా జగతి కోణిహీ అన్య నా ॥స॥ 6
అసే బహుత శాహణా పరినజ్యా గురూ కృపా
న తత్స్వహి త్యాకళే కరితసే రికామ్యా గపా
జరీ గురుపదా ధరీ సుదృఢ భక్తి నేతో మనా ॥స॥ 7

సుఖదుఃఖాలను నిరోధించుకోవడానికి దైవప్రార్థన ఒక్కటే సరైన మార్గం

గురో వినతి మీ కరీ హృదయమందిరీ యా బసా
సమస్త జగ్ హే గురుస్వరూపచీ ఠసో మానసా
కరో సతత సత్కృతీ మతిహీదే జగత్పావనా ॥స॥ 8

స్రగ్ధరా

ప్రేమేయా అష్టకాశీ పఢుని గురువరా - ప్రార్థితీ జే ప్రభాతి
త్యాచే చిత్తాసి దేతో అఖిలహరునియా - భ్రాంతి మీ నిత్యశాంతి
ఐసేహే సాయినాథే కథుని సుచవిలే - జేవి యా బాలకాశీ
తేవీత్యా కృష్ణపాయీనముని సవినయే - అర్పితో అష్టకాశీ
శ్రీ సచ్చిదానంత సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై

11. పదము

సాయి రహమ్ నజర్ కరనా, బచ్చోంకా పాలన కరనా ॥ 2
జానా తుమనే జగత్పసారా సబహీ ఝూట్ జమానా ॥జా॥ ॥సా॥
మై అంధాహూం బంధాం ఆపకా - ముఝుసే ప్రభు దిఖలానా ॥మైం॥ ॥సాయి॥
దాసగణు కహే అబ్ క్యా బోలు, థక్‌గయి మేరీ రసనా ॥దాస॥ సాయి॥

12. పదము

రహమ్ నజర్ కరో, అబ్ మోరే సాయీ
తుమబిన నహీ ముఝే మాబాప్ భాయీ ॥రహమ్॥
మై అంధాహూం బందా తుమ్హారా (2)
మైనా జాను (3) అల్లా ఇలాహీ ॥రహమ్॥
ఖాలీజమానా, మైనే గమాయా (2)
సాథీ ఆఖరికా (3) కియా న కోయీ ॥రహమ్॥
అప్‌నే మస్‌జిద్‌కా ఝూడూ గనూ హై, (2)
మాలిక్ హమారే (3) తుమ్ బాబా సాయి ॥రహమ్॥

13. పదము

తుజ కాయదే ఊ సావళ్యామీ భాయాతరీయో (2)
మీదుబళి బటిక నామ్యాచీ జాణ శ్రీహరీ (2)
ఉచ్ఛిష్ఠ తులా దేణేహి గోష్ఠ నా బరియో (2)
తూ జగన్నాద్, తుజదే ఊ కశీరే భాకరి (2)
నకొ అంత మదీయా పాహు సఖ్యా భగవంతా - శ్రీకాంతా!
మధ్యాహ్నరాత్రి ఉలటోని గేలి హీ అతా - అణ చిత్తా
జైహూ ఈల్ తుఝారే కాకడాకీ రా ఉళాతరియో (2)
అణతీల్ భక్తనైవేద్యహి నానాపరీ (2)

14. పదము

శ్రీ సద్గురు బాబా సాయి ఓం (2)
తుజవాచుని ఆశ్రయ నాహీఀభూతలీ (2)
మీపాపిపతిత ధీమందాహో (2)
తారణే మలా గురునాథా, ఝుడకరీ
తూ శాంతి క్షమే చామేరూహో (2)
తూ భవార్ణవీచే తారూ గురువరా (2)
గురువరా, మజసి పామరా, అతా ఉద్ధరా, త్వరితలవలాహీ
త్వరితలవలాహీ,
మీ బుడతో భవభయడోహీ ఉద్ధరా (2) ॥ శ్రీ సద్గురు ॥

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై !
రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ ! శ్రీ సాయినాథ మహరాజ్
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై !

(పుష్పాల్ని స్వామివారి పాదాలవద్ద చల్లాలి)

కాకడ హారతి కార్యక్రమము సమాప్తము.

మధ్యాహ్న హారతి

(మధ్యాహ్నం 12 గంటలకు, ధూప, దీప నైవేద్యానంతరం
5 వత్తులతో హారతి ఇవ్వబడుతుంది)

I. అభంగము

1. ఘేవునియా పంచారతీ - కరూ బాబాన్సీ ఆరతీ
సాయినీ ఆరతీ - కరూ బాబాన్సీ ఆరతీ (1)
ఉఠా ఉఠాహో బాంధవ - ఓవాళూహో రమాధవ
సాయి రమాధవ - ఓవాళూ హో రమాధవ (2)
కరూనియా స్థిర మన - పాహు గంభీర హే ధ్యాన
సాయిచే హే ధ్యాన - పాహు గంభీర హే ధ్యాన (3)
కృష్ణనాథా దత్తసాయి - జడోచిత్త తుఝెపాయీ
దత్తబాబా సాయీ - జడో చిత్త తుఝెపాయీ (4)

2. ఆరతి

2. ఆరతి సాయిబాబా - సౌఖ్యదాతారజీవా - చరణ రజాతలీ ।
ద్యావా దాసా విసావా ! భక్తా విసావా ॥ ఆ ॥
జాళునియా అనంగ - స్వస్వరూపీ రాహే దంగ
ముముక్షు జనదావీ - నిజడోలా శ్రీరంగ ॥డోళా - ఆ ॥ 1
జయ మనీ జైసా భావ - తయాతైసా అనుభవ !
దావిసీ దయాఘనా - ఐసీ తుఝీ హీ మావ ॥తుఝీ - ఆ ॥ 2
తుమచే నామా ధ్యాతా - హరే సంస్కృతివ్యధా ।
అగాధ తవ కరణి - మార్గ దావిసీ అనాథా ॥ ॥దావీ - ఆ॥ 3
కలియుగీ అవతార - సగుణ బ్రహ్మ సచార ।
అవతీర్ణ ఝూలాసే - స్వామీ దత్తదిగంబర ॥ దత్త - ఆ ॥ 4
అఠా దివసా గురువారీ - భక్త కరీతీ వారీ !
ప్రభుపద పహావయా - భవభయోఽనివారీ ॥ ॥ భ - ఆ ॥ 5

మాఝూ నిజద్రవ్య ఠేవ - తవ చరణరజ సేవా!
మాగణే హేచి ఆతా - తుహ్మా దేవాధిదేవా॥దేవా - ఆ ॥ 6
ఇచ్ఛితా దీనచాతక - నిర్మలతోయ నిజసూఖ
పాజవే మాధవాయ - సంభాళ ఆపుళీభాక॥ఆపు - ఆ ॥ 7

3. ఆరతి

జయదేవ జయదేవదత్తా అవధూతా - ఓ సాయీ అవధూతా
జోడుని కరతవచరణీఠేవీతో మాథా - జయదేవ జయదేవ ॥
అవతరసీ తూ యేతా ధర్మాన్ తే గ్లానీ
నాస్తికా నాహి తూ లావిసీనిజభజనీ
దావిసి నానాలీలా అసంఖ్య రూపానీ
హరిసీ దీవాన్‌చే తూ సంకట దినరజనీ ॥జయ॥ 1
యువన స్వరూపీ ఏక్యా దర్శన త్వాదిధలే
సంశయ నిరసునియా తద్వయితా ఘాలవిలే
గోపీచందా మందా త్వాన్‌చీ ఉద్ధరిలే
మోమిన వంశీ జన్మని లోకా తారియలే ॥జయ॥ 2
భేద్ న తత్త్వీ హిందూయవనాన్ చా కాహీ
దావాయాసీ ఝూలా పునరపి నరదేహీ
పాహసి ప్రేమానేన్‌తూ హిందూ యవనాహీ
దావిసి ఆత్మత్వానే వ్యాపక్ హా సాయీ ॥జయ॥ 3
దేవా సాయినాథా త్వత్పదనత హ్వావే
పరమాయా మోహిత జనమోచన ఝుణిహ్వావే
త్వత్కృపయా సకలాన్‌చే సంకట నిరసావే
దేశిల తదిదే త్వద్యశ కృష్ణావే గావే ॥జయ॥ 4

4. అభంగము

శిరిడీ మాఝే పండరపుర - సాయిబాబా రమావర,
బాబా రమావర - సాయిబాబా రమావర
శుద్ధభక్తి చంద్రభాగా - భావ పుండలీక జాగా
పుండలీక జాగా - భావ పుండలీక జాగా
యాహో యాహో అవఘే జన - కరూబాబాన్సీ వందన
సాయీసీ వందన కరూ - బాబాన్సీ వందన
గణూ హ్మణే బాబా సాయీ - ధావపావ మాఝే ఆయీ
పావ మాఝే ఆయీ - ధావ పావ మాఝే ఆయీ

5. స్తవనము

ఘాలీన లోటాంగణ, వందీన చరణ
డోల్యాని పాహీన రూప తుఝే,
ప్రేమే ఆలింగన, ఆనందే పూజీన్
భావే ఓవాళిన హ్మణే నామా ॥
త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ !
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ !
త్వమేవ సర్వం మమ దేవ దేవ ॥
కాయేన వాచా మన సేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతి స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి ॥
అచ్యుతం కేశవం రామనారాయణం,
కృష్ణ దామోదరం వాసుదేవం హరిం
శ్రీధరం మాధవం గోపికా వల్లభం,
జానకీ నాయకం రామచంద్రం భజే ॥

6. నామస్మరణము

హరేరామ హరేరామ రామరామ హరేహరే
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే
హరిః ఓం గురుదేవదత్త.

7. మంత్రపుష్పం

హరిః ఓం యజ్ఞేన యజ్ఞమయజంత దేవాస్తాని ధర్మాణి
ప్రథమాన్యాసన్ ! తేహనాకం మహిమాన స్సచంత
యతప్రూర్వే సాధ్యాస్సంతి దేవా ః ।
ఓం రాజాధిరాజాయ ప్రసహ్యాసాహినే
నమోవయంవై శ్రవణాయ కుర్మహే
సమే కామాన్ కామకామాయ మహ్యం ।
కామేశ్వరో వై శ్రవణోదధాతు ।
కుబేరాయ వై శ్రవణాయ మహారాజాయనమః ।
ఓం స్వస్తి సామ్రాజ్యం, భోజ్యం,
స్వారాజ్యం, వైరాజ్యం, పారమేష్ట్యం, రాజ్యం,
మహారాజ్య, మాధిపత్యమయం సమంతపర్యా ।
ఈశ్యాత్ స్సార్వభౌమ స్సార్వాయుష ఆన్ ।
తాదాపదార్థాత్ పృథివ్యైసముద్ర పర్యంతాయ
ఏకరాళ్మితి తద ప్యేషశ్లోకోః భిగీతో మరుతః
పరివేష్టారో మరుత్తస్యావసన్ గృహే ।
ఆవిక్షితస్య కామప్రేర్ విశ్వేదేవాః సభాసద ॥ఇతిః॥
శ్రీ నారాయణ వాసుదేవ సచ్చిదానంద
సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై ।

8. నమస్కారాష్టకము

అనంతా తులాతే కసేరే స్తవావే
అనంతా తులాతే కసేరే నమావే
అనంతా ముఖాంచా శిణే శేషగాతా
నమస్కార సాష్టాంగ శ్రీ సాయినాథా ॥ 1
స్మరావే మనీ త్వత్పదా నిత్యభావే
ఉరావే తరీ భక్తి సారీ స్వభావే
తరావే జగా తారునీ మాయతాతా ॥ న ॥ 2
వసే జో సదా దావయా సంతలీలా
దిసే ఆజ్ఞ లోకాపరీ జో జనాలా
పరీ అంతరీ జ్ఞాన కైవల్యదాతా ॥ న ॥ 3
భరాలాధలా జన్మ హా మానవాచా
నరాసార్థకా సాధనీభూత సాచా
ధరూ సాయిప్రేమా గళాయా అహంతా ॥ న ॥ 4
ధరావే కరీసాన అల్పజ్ఞ బాలా
కరావే అహ్మాధన్య చుంబో నిగాలా
ముఖీ ఘాల ప్రేమే ఖరా గ్రాస ఆతా ॥ న ॥ 5
సురాదీక జ్యాంచ్యా సదా వందితాతీ
శుకాదీక జాతీ సమానత్వ దేతీ
ప్రయాగాది తీర్థే పదీ నమ్ర హోతా ॥ న ॥ 6
తుఝ్యా జ్యా పదా పాహతా గోపబాలీ
సదారంగలీ చిత్స్వరూపీ మిళాలీ
కరీ రాసక్రీడా సవే కృష్ణనాథా ॥ న ॥ 7
తులా మాగతో మాగణే ఏక ధ్యావే
కరాజోడితో దీన అత్యంత భావే
భవీ మోహనీరాజహా తారి ఆతా
నమస్కార సాష్టాంగ శ్రీ సాయినాథా । ॥ న ॥ 8

౯. ప్రార్థన

ఐసా యే యీబా - సాయి దిగంబరా ।
అక్షయరూప అవతారా ! సర్వహి వ్యాపక తూ ।
శృతిసారా - అనసూయాఽత్రి కుమారా ।
మహారాజ్ యే ఈబా ॥ ధృ ॥
కాశీస్నానజప, ప్రతిదివిసి; కొల్హాపుర భిక్షేసీ ।
నిర్మల నదితుంగా, జలప్రాసీ ।
నిద్రా మాహుర దేశీ । ॥ ఐ ॥ 1
ఝూళీలోంబతోసే - వామకరీ - త్రిశూలఢమరుధారీ ।
భక్తావరద సదా సుఖకారీ - దేశిల ముక్తి చారీ ॥ ఐ ॥ 2
సాయి పాదుకా జపమాల్హా । కమండలూ మృగఛాలా ।
ధారణకరిశీ బా । నాగజటా - ముకుట శోభతో మాథా॥ ఐ ॥ 3
తత్పర తుఝ్యాయా - జేధ్యానీ । అక్షయ త్యాంచే సదనీ
లక్ష్మీవాస కరీ - దినరజనీ । రక్షసి సంకట వారుని॥ ఐ ॥ 4
యా పరిధ్యాన తుఝే - గురురాయా ॥
దృశ్యకరీ నయనాయా -
పూర్ణానంద సుఖే - హీ కాయా - లావిసి హరిగుణ గాయా
ఐసా యే ఈబా ॥ సాయి దిగంబరా .... మహారాజ్ యే ఈబా 5

10. సాయి మహిమ్నాస్తోత్రం

సదాసత్స్వరూపం చిదానందకందం
జగత్సంభవస్థానసంహార హేతుమ్ ।
స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం,
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥ 1
భవధ్వాంత విధ్వంస మార్తాండ మీడ్యం
మనోవాగతీతం మునిర్ ధ్యాన గమ్యమ్ ।
జగద్వ్యాపకం నిర్మలం నిర్గుణం త్వాం ॥నమామీ॥ 2

భవాంభోధి మగ్నార్దితానాం జనానాం
స్వపాదాశ్రితానాం స్వభక్తి ప్రియాణాం ।
సముద్ధారణార్థం కలౌ సంభవంతం ॥నమామీ॥ 3
సదానింబవృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య ప్రియంతమ్ ।
తరుం కల్పవృక్షాధికం సాధయంతం ॥నమామీ॥ 4
సదా కల్పవృక్షస్య సత్యాధిమూలే
భవద్భావ బుద్ధ్యా సపర్యాది సేవామ్ ।
నృణాంకుర్వతాం భుక్తిముక్తి ప్రదంతం ॥ నమామీ॥ 5
అనేకాశృతాతర్క్యలీలా విలాసైః
సమావిష్కృతేశాన భాస్వత్ప్రభావమ్ ।
అహం భావహీనం ప్రసన్నాత్మభావం ॥నమామీ॥ 6
సతాం విశ్రమారామమేవాభిరామం,
సదాసజ్జనైస్సంస్తుతం సన్నమద్భిః।
జనామోదదం భక్తభద్రప్రదంతం ॥నమామీ॥ 7
అజన్మాద్యమేకం పరం బ్రహ్మసాక్షాత్
స్వయం సంభవం రామమేవావతీర్ణమ్ ।
భవద్దర్శనాత్సంపునీతః ప్రభోఽహం ॥నమామీ॥ 8
శ్రీ సాయీశ కృపానిధే ఽఖిల నృణాం సర్వార్థ సిద్ధిప్రద,
యుష్మత్పాదరజః ప్రభావమతులం ధాతాపి వక్తాఽక్షమః।
సద్భక్త్యాః శరణం కృతాంజలిపుట స్సంప్రాప్తితోఽస్మి ప్రభో
శ్రీమత్సాయి పరేశ పాదకమలాన్ నాన్యచ్ఛరణ్యం మమ ॥ 9
సాయి రూపధర రాఘవోత్తమం
భక్తకామ విభుధద్రుమం ప్రభుమ్ ।
మాయాయోపహత చిత్తశుద్ధయే,
చింతయామ్యహమహర్నిశం ముదా ॥ 10
శరత్సుధాంశు ప్రతిమ ప్రకాశం
కృపాతపత్రం తవ సాయినాథ ।

త్వదీయ పాదాబ్జ సమాశ్రితానాం
స్వచ్ఛాయయా తాపమమపాకరోతు ॥ 11
ఉపాసనా దైవత సాయినాథ ।
స్తవైర్మయోపాస నినాస్తుత స్త్వమ్ ।
రమేన్మనోమే తవపాదయుగ్మే,
భృంగో యథాబ్జే మకరంద లుబ్ధః ॥ 12
అనేక జన్మార్జిత పాప సంక్షయో
భవేద్భవత్పాద సరోజ దర్శనాత్ ।
క్షమస్వ సర్వానపరాధ పుంజకాన్,
ప్రసీద సాయీశ సద్గురో దయానిధే ॥ 13
శ్రీ సాయినాథ చరణామృత పూర్ణచిత్తా
స్త్వత్పాద సేవనరతా స్సతతంచ భక్త్యా।
సంసార జన్మ దురితౌఘ వినిర్గతాస్తే
కైవల్యధామ పరమం సమవాప్నువంతి ॥
(స్తోత్రమేతత్పఠేద్భక్త్యా యోనరస్తన్మనస్సదా ।
సద్గురో సాయినాథస్య కృపాపాత్రం భవద్ధ్రువం ॥)

II. ప్రార్థన

11. కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా
శ్రవణ నయనజం వా మానసం వా ఽ పరాధమ్ ।
విదితమవిదితం వా సర్వమేతత్ క్షమస్వ
జయజయ కరుణాబ్ధే శ్రీ ప్రభో సాయినాథ ॥

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై ॥

ఓం రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సాయినాథ్ మహారాజ్‌కి జై!

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కి జై

(మధ్యాహ్న హారతి కార్యక్రమము సమాప్తము)

సాయం సంధ్యా హారతి

(సాయంకాలం గం॥ 6-15లకు ధూపదీప నైవేద్యానంతరం
1 వత్తితో హారతి ఇవ్వబడుతుంది)

I. ఆరతి

1. ఆరతి సాయిబాబా - సౌఖ్యదాతార జీవా - చరణరజతాలీ ।
ద్యావాదాసా నిసావా । భక్తా నిసావా ॥ ఆ ॥
జాళునియా అనంగ । స్వస్వరూపీ రాహే దంగ ।
ముముక్ష జనదావీ । నిజడోలా శ్రీరంగ ॥ డోళా - ఆ ॥ 1
జయా మనీ జైసా భావ । తయా తైసా అనుభవ ।
దానిసి దయాఘనా । ఐసీ తుఝీ హా మావ ॥ తుఝీ - ఆ ॥ 2
తుమచేనామమా ధ్యాతా । హరే సంస్కృతి వ్యధా ।
అగాధ తవ కరణీ । మార్గ దావిసీ అనాథా ॥ దావి-ఆ॥ 3
కలియుగీ అవతార । సగుణ బ్రహ్మ సచార ।
అవతీర్ణ ఝూలాసే । స్వామీ దత్త దిగంబర ॥ దత్త - ఆ ॥ 4
ఆఠా దివసా గురువారీ । భక్త కరీతీ వారీ ।
ప్రభుపద పహావయా । భవ భయనివారీ ॥ భవ - ఆ ॥ 5
మాఝీ నిజద్రవ్యఠేవ । తవ చరణ రజసేవా ।
మాగణే హేచి ఆతా । తుహ్మా దేవాధిదేవా ॥ దేవా - ఆ ॥ 6
ఇచ్ఛితా దీనచాతక । నిర్మలతోయ నిజసూఖ
పాజావే మాధవాయ । సంభాళ ఆపుళీభాక ॥ ఆ పు - ఆ ॥ 7

2. అభంగ్

శిరిడీ మాఝే పండరపుర - సాయిబాబా రమావర
బాబా రమావర - సాయిబాబా రమావర
శుద్ధ భక్తి చంద్రభాగా - భావ పుండలీక జాగా

పుండలీక జాగా - భావ పుండలీక జాగా
యాహో యాహో అనఘే జన - కరూబాబాన్సీ వందన
సాయిసీ వందన - కరూ బాబాన్సీ వందన
గణూహ్మణే బాబా సాయీ - ధావపావ మాఝే ఆయీ
పావ మాఝే ఆయీ - ధావపావ మాఝే అయీ.

(కర్పూరము వెలిగించవలెను)

ఘాలీన లోటాంగణ, వందీన చరణ,
డోల్యాని పాహీన రూప తుఝే.
ప్రేమే ఆలింగన, ఆనందే పూజీన్,
భావే ఓవాళిన హ్మణేనామా ॥ 1
త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ ॥ 2
కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతి స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి ॥ 3
అచ్యుతం కేశవం రామనారాయణం,
కృష్ణదామోదరం వాసుదేవం హరిం
శ్రీధరం మాధవం గోపికావల్లభం,
జానకీనాయకం రామచంద్రం భజే ॥ 4

4. నామస్మరణం

హరేరామ హరేరామ రామరామ హరేహరే ।
హరేకృష్ణ హరేకృష్ణ - కృష్ణ కృష్ణ హరే హరే ।

హరిః ఓం గురుదేవదత్త ।

5. నమస్కారాష్టకం

అనంతా తులాతే కసేరేస్తవావే
అనంతా తులాతే కసేరేనమావే
అనంతా ముఖాచాశిణే శేషగాతా
నమస్కార సాష్టాంగ శ్రీ సాయినాథా ॥ 1
స్మరావే మనీ త్వత్పదా నిత్యభావే
ఉరావేతరీ భక్తి సాఠీ స్వభావే
తరావే జగా తారునీ మాయతాతా ॥ న ॥ 2
వసే జో సదా దావయా సంతలీలా
దిసే ఆజ్ఞ లోకా పరీ జో జనాలా
పరీ అంతరీ జ్ఞాన కైవల్యదాతా ॥ న ॥ 3
భరాలాధలా జన్మహా మానవాచా
నరాసార్థకా సాధనీభూత సాచా
ధరూ సాయి ప్రేమాగళాయా అహంతా ॥ న ॥ 4
ధరావే కరీసాన అల్పజ్ఞ బాలా
కరావే అహ్మాధన్య చుంబో నిగాలా
ముఖీ ఘాల ప్రేమే ఖరా గ్రాస అతా ॥ న ॥ 5
సురాదీక జాంచ్యా పదా వందితాతీ
శుకాదీక జాతే సమానత్వ దేతీ
ప్రయాగాది తీర్థే పదీ నమ్రహోతా ॥ న ॥ 6
తుఝ్యా జ్యా పదా పాహతా గోపబాలీ
సదారంగలీ చిత్స్వరూపీ మిళాలీ ॥ న ॥ 7
తులా మాగతో మాగణే ఏక ధ్వావే
కరాజోడితో దీన అత్యంత భావే
భవీ మోహనీరాజ హా తారి హాతా
నమస్కార సాష్టాంగ శ్రీ సాయినాథా ॥ న ॥ 8

6. ప్రార్థన

6. ఐసా యే యీబా । సాయి దిగంబరా ।
అక్షయరూప అవతారా - సర్వహి వ్యాపకతూ ।
శృతిసారా - అనసూయాఽత్రి కుమారా । మహరాజ్ యే ఈబా ॥
కాశీస్నాన జప. ప్రతిదివసీ । కొల్హాపుర భిక్షేసీ ।
నిర్మల నది తుంగా, జలప్రాసీ । నిద్రామాహుర దేశీ ॥ ఐ ॥ 1
ఝోళిలోంబతోసే - వామకరీ - త్రిశూలఢమరుధారీ ।
భక్తావరద సదా సుఖకారీ । దేశిల ముక్తి చారీ ॥ ఐ ॥ 2
సాయిపాదుకా జపమాలా - కమండలూ మృగఛాలా ।
ధారణకరిశీబా - నాగజటా - ముకుట శోభతో మాథా ॥ ఐ ॥ 3
తత్పర తర్యూయా - జేధ్యానీ - అక్షయత్వాంచే సదనీ
లక్ష్మీ వాసకరీ - దినరజనీ । రక్షసి సంకటవారుని ॥ ఐ ॥ 4
యా పరిధ్యాన తుఝే - గురురాయా ॥
దృశ్యకరీ నయనాయా । పూర్ణానంద సుఖే హీ కాయా ॥
లావిసి హరిగుణగాయా
ఐసా యేఈబా ॥ సాయిదిగంబరా - మహరాజ్ యే ఈబా ॥ 5

7. సాయి మహిమ్నాస్తోత్రం

సదాసత్స్వరూపం చిదానందకందం
జగత్సంభవస్థాన సంహార హేతుమ్ ।
స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం,
నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥ 1
భవధ్వాంత విధ్వంస మార్తాండ మీడ్యం
మనోవాగతీతం మునిర్ధ్యానగమ్యమ్ ।
జగద్వ్యాపకం-నిర్మలం నిర్గుణం త్వాం ॥ నమామీ ॥ 2
భవంభోధి మగ్నార్థితానాం జనానాం
స్వపాదాశ్రితానాం స్వభక్తి ప్రియాణాం ।

సముద్ధారణార్థం కలౌ సంభవంతం ॥ నమామీ ॥ 3
సదానింబవృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య ప్రియంతమ్ ।
తరుం కల్పవృక్షాధికం సాధయంతం ॥ నమామీ ॥ 4
సదా కల్పవృక్షస్య తస్యాధిమూలే
భవద్భావ బుద్ధ్యా సపర్యాది సేవామ్ ।
నృణాం కుర్వతాం భుక్తిముక్తి ప్రదంతం ॥ నమామీ ॥ 5
అనేకాశ్రుతా తర్క్యలీలావిలాసైః
సమావిష్కృతేశాన భాస్వత్ప్రభావమ్ ।
అహంభావహీనం ప్రసన్నాత్మభావమ్ ॥ నమామీ ॥ 6
సతాం విశ్రమారామమేవాభిరామం,
సదాసజ్జనై స్సంస్తుతం సన్నమద్భిః ।
జనామోదదం భక్త భద్రప్రదంతం ॥ నమామీ ॥ 7
అజాన్మద్యమేకం పరంబ్రహసాక్షాత్
స్వయం సంభవం రామమేవావతీర్ణమ్ ।
భవద్దర్శనాత్వంపునీతః ప్రభోఽహం ॥ నమామీ ॥ 8
శ్రీ సాయీశ కృపానిధేఽఖిల నృణాం సర్వార్థ సిద్ధి ప్రద,
యుష్మత్పాదరజః ప్రభావమతులం ధాతాపి వక్తాక్షమః ।
సద్భక్త్యాః శరణం కృతాంజలిపుట స్సంప్రాప్తితోస్మి ప్రభో
శ్రీమత్సాయి పరేశ పాదకమలా నాన్యచ్ఛరణ్యం మమ ॥ 9
సాయిరూపధర రాఘవోత్తమం
భక్తకామ విభుధద్రుమం ప్రభుమ్ ।
మాయయోపహత చిత్తశుద్ధయే,
చింతయామ్యహమహర్నిశం ముదా ॥ 10
శరత్సుధాంశు ప్రతిమ ప్రకాశం
కృపాతపత్రం తవసాయినాథ ।
త్వదీయ పాదాబ్జ సమాశ్రితానాం
స్వచ్ఛాయయా తాపమమపాకరోతు ॥ 11
ఉపాసనా దైవత సాయినాథ ।
స్తవైర్మయోపాసనినాస్తుతస్త్వమ్ ।

రమేన్మనోమే తవపాదయుగ్మే
భృంగో యధాబ్జే మకరంద లుబ్ధః ॥ 12
అనేకజన్మార్జిత పాప సంక్షయో
భవేద్భవత్పాదసరోజ దర్శనాత్ ।
క్షమస్వ సర్వానపరాధ పుంజికాన్ ;
ప్రసీద సాయీశ గురో దయానిధే ॥ 13
శ్రీ సాయినాథ చరణామృత పూర్ణచిత్తా
స్త్వత్పాద సేవనరతా స్సతతంచ భక్త్యా ।
సంసార జన్మ దురితౌఘ వినిర్గతాస్తే
కైవల్యధామ పరమం సమవాప్నువంతి ॥ 14
(స్తోత్రమేతత్పఠేద్భక్త్యా యోనర స్తన్మనాస్సదా ।
సద్గురో స్సాయినాథస్య కృపాపాత్రం భవేద్ధృవం ॥ 15

8. గురుప్రసాదయాచనా దశకం

రుసో మమ ప్రియాంబికా, మజవరీ పితాహీ రుసో
రుసో మమ ప్రియాంగనా ప్రియసుతాత్మజాహీ రుసో
రుసో భగిని బంధుహీ, శ్వశుర సాసుబాయీ రుసో
న దత్తగురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 1
పుసోన సునబాయి త్యా, మజన భ్రాతృజాయా పుసో
పుసో న ప్రియ సోయరే, ప్రియ సగే న జ్ఞాతీ పుసో
పుసో సుహృద నా సఖా, స్వజన నాప్తబంధూ పుసో
పరీ న గురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 2
పుసో న అబలా ములే, తరుణ వృద్ధహీ నా పుసో
పుసో న గురుథాకుటే, మజ న దోరసో నే పుసో
పుసో న చ భలే బురే, సుజన సాధుహీ నా పుసో
పరీ న గురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 3
రుసో చతుర తత్త్వవిత్, విబుధ ప్రాజ్ఞ జ్ఞానీ రుసో
రుసోహి విదుషీ స్త్రీయా, కుశల పండితాహీ రుసో
రుసో మహీపతి యతీ, భజక తాపసీహీ రుసో
న దత్తగురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 4

రుసో కవి ఋషీ మునీ, అనఘ సిద్ధ యోగీ రుసో
రుసో హి గృహదేవతా ని, కులగ్రామదేవీ రుసో
రుసో ఖల పిశాచహీ, మలిన ఢాకినీ హీ రుసో
న దత్తగురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 5
రుసో మృగ, ఖగ కృమీ, అఖిల జీవజంతూ రుసో
రుసో విటప ప్రస్తరా, అచల ఆపగాబ్ధీ రుసో
రుసో ఖ పవనాగ్ని వార్, అవని పంచతత్త్వే రుసో
న దత్తగురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 6
రుసో విమల కిన్నరా, అమల యక్షిణీహీ రుసో
రుసో శశి ఖగాధిహీ, గగని తారకాహీ రుసో
రుసో అమరరాజహీ, అదయ ధర్మరాజా రుసో
న దత్తగురు సాయి మా, మజవరీ కధీహీ రుసో ॥ 7
రుసో మన సరస్వతీ, చపలచిత్త తేహీ రుసో
రుసో వపు దిశాఖిలా, కఠిన కాలతోహీ రుసో
రుసో సకల విశ్వహీ 'మయితు, బ్రహ్మగోలం రుసో
న దత్తగురు సాయిమా, మజవరీ కధీహీ రుసో ॥
విమూఢహ్మఖనీ హసో, మజన మత్సరాహీ ఢసో
పదాభిరుచి ఉల్హసో, జనన కర్దమీనా ఫసో
న దుర్గ ధృతిచా ధసో, అశినభావ మాగే ఖసో
ప్రపంచ మన హే రుసో, ధృఢ విరక్తి చిత్తీ ఠసో ॥ 9
కుణాచిహిఘృణా నసో, వ చస్పృహ కశాచీ అసో
సదైవ హృదయీ వసో, మనసి ధ్యాని సాయి వసో
పదీ ప్రణయ వోరసో, నిఖిల దృశ్య బాబా దిసో
న దత్తగురు సాయిమా, ఉపరియాచనేలా రుసో ॥ 10

౨. మంత్రపుష్పం

హరిః ఓం యజ్ఞేన యజ్ఞమయజంత దేవాస్తాని ధర్మాణి
ప్రథమాన్యాసన్ । తేహనాకం మహిమానః స్సచంత
యత్రపూర్వే సాధ్యాఃస్సంతి దేవాః

ఓం రాజాధిరాజాయ ప్రసహ్యాసాహినే
నమోవయంవై శ్రవణాయ కుర్మహే
సమే కామాన్ కామ కామాయ మహ్యాం
కామేశ్వరో వై శ్రవణో దదాతు
కుబేరాయ వై శ్రవణాయ మహారాజాయ నమః ॥
ఓం స్వస్తి స్సామ్రాజ్యం, భోజ్యం,
స్వారాజ్యం, వైరాజ్యం, పారమేష్ఠ్యం, రాజ్యం
మహారాజ్యమాధిపత్యమయం సమంతపర్యా ।
ఈశ్యాః స్సార్వభౌమః స్సార్వాయుష ఆన్ ।
తాదాపరాదాత్ పృథివ్యై సముద్ర సపర్యంతాయా
ఏకరాళ్ళితి తద ష్యేష శ్లోకోఽభిగీతో మరుతః
పరివేష్ఠారో మరుత్తస్యావసన్ గృహే ।
ఆవిక్షితస్య కామప్రేర్ విశ్వేదేవాః సభాసదా ॥ ఇతిః ॥

శ్రీ నారాయణ వాసుదేవ సచ్ఛిదానంద
సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై ॥

10. ప్రార్థన

కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా
శ్రవణ నయనజం వా మానసం వాఽపరాధమ్ ॥
విదితమవిదితం వా సర్వమేతత్ క్షమస్వ
జయజయ కరుణాబ్ధే శ్రీ ప్రభో సాయినాథ ॥

శ్రీ సచ్ఛిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై !
రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సాయినాథ మహారాజ్
శ్రీ సచ్ఛిదానంద సద్గురు సాయినాథ మహారాజ్‌కీ జై !

(సాయంకాల హారతి కార్యక్రమము సమాప్తము)

శేజారతి

(రాత్రి 10 గం॥లకు ధూపదీప నైవేద్యానంతరము
5 వత్తులతో హారతి ఇవ్వబడుతుంది)

1. ఆరతి

ఓవాళూ ఆరతీ మాఝ్యా సద్గురునాథా - మాఝూ సాయినాథా !
పాన్‌చాహీ తత్త్వాస్‌చా దీప - లావిలా ఆతా ।
నిర్గుణాచీ స్థితికైసీ ఆకారా ఆలీ । బాబా ఆకారా ఆలీ ।
సర్వా ఘటీ భరూని ఉరలీ - సాయీ మా వులీ ॥ ఓవాళూ ॥ 1
రజ తమ సత్త్వతిఘే బాబా మాయా ప్రసవలీ । బాబా మాయా ప్రసవలీ
మాయేచియే పోటీ కైసీ - మాయా ఉద్భవలీ ॥ ఓవాళూ ॥ 2
సప్తసాగరీ కైసా బాబా ఖేల్ మాండీలా । బాబా ఖేల్ మాండీలా ।
ఖేలూ నియా ఖేల్ అనఘా విస్తార కేలా ॥ ఓవాళూ ॥ 3
బ్రహ్మాండాచీ రచనాకైసీ దాఖవిలీ డోలా । బాబా దాఖవిలీ డోలా
తుకాహ్మణే మాఝూ స్వామీ కృపాళూ భోళా ॥ ఓవాళూ ॥ 4

2. ఆరతి జ్ఞానరాయాచీ

ఆరతీ జ్ఞానరాజా! మహాకైవల్య తేజా ।
సేవితీ సాధుసంత మనువేధలా మాఝూ ॥ ॥ ఆ - జ్ఞా ॥
లోపలే జ్ఞాన జాగీ ! హిత నేణతీ కోణీ ।
అవతార పాండురంగ । నామ ఠేవిలే జ్ఞానీ ॥ ఆ - జ్ఞా ॥ 1
కనకాచే తాటకారీ । ఉభ్యాగోపికానారీ ।
నారద తుంబురహో సామగాయనకరీ ॥ ఆ - జ్ఞా ॥ 2
ప్రగట గుహ్యాబోలే । విశ్వబ్రహ్మాచి కేలే ।
రామ జనార్ధనీ । సాయీ మస్తక ఠేవిలే ॥ ఆ - జ్ఞా ॥ 3

ఆరతి తుకారాయాచీ

ఆరతీ తుకారామా । స్వామీ సద్గురుధామా ।
సచ్చిదానందమూర్తీ !పాయదాఖనీ ఆహ్మా ॥ఆ॥ ॥తు॥ 1
రాఘవే సాగరాతా । జైసే పాషాణ తారిలే ।
తైసే తుకో బాచే । అభంగ (ఉదకీ) రక్షిలే ॥ఆ॥ ॥తు॥ 2
తుకితా తులనేసీ । బ్రహ్మతుకాసీ ఆలే ।
హ్మణోనీ రామేశ్వరే । చరణీ మస్తక ఠేవిలే ॥ఆ॥ ॥తు॥ 3

4. శేజారతి

జైజై సాయినాథ ఆతా - పహుడావే మందిరీ హో ।
ఆళవితో సప్రేమే తుజల - ఆరతి ఘేఉని కరీహో ॥ జై జై ॥
రంజనిసీ తూ మధుర బోలునీ - మాయ జశీ నిజములా హో ।
భోగిసీ వ్యాధీ తూఁచ హరునియా - నిజసేవక దుఃఖాలా హో ।
ధావుని భక్తవ్యసన హరిసీ - దర్శన దేసీ త్యాలా హో ।
ఝూలే అసతిల కష్ట అతీశయాతుమచే - యా దేహాలా హో ॥జైజై॥ 1
క్షమా శయన సుందర హీ శోభా - సుమన శేజ త్యావరీ హో ।
ఘ్యావీ థోడీ భక్తజనాంచీ - పూజా అర్చాకరీ హో ।
ఓవాళీతో పంచప్రాణ జ్యోతి సుమతీ కరీ హో ।
సేవా కింకర భక్తప్రీతీ అత్తర పరిమళ వారీ హో । ॥జైజై॥ 2
సోడుని జాయా దుఃఖ వాటతే సాయీ త్వచ్చరణాసీ హో ।
ఆజ్ఞే స్తవ హా ఆసీ ప్రసాదఘేవుని నిజసదవాసీ హో ॥
జాతో ఆతా యేవు పునరపి - త్వచ్చరణాచే పాశీ హో ।
ఉఠవూ తుజలా సాయి మాఉలే - నిజహిత సాధాయాసీహో ॥జైజై॥ 3

5. శేజారతి

ఆతాస్వామీ సుఖేనిద్రా కరా, అవధూతా,
బాబా కరా సాయినాథా
చిన్మయ (హే) నిజసుఖధామా జావుని పహుడా ఏకాంతా
వైరాగ్యాచా కుంచాఘేవుని చౌక ఝూడిలా ॥
బాబా చౌక ఝూడిలా
తయావరీ సుప్రేమాచా శిడకావాదిధలా ॥ ॥ ఆతా ॥ 1
పాయఘడ్యా ఘతల్యాసుందర నవవిధా భక్తీ ।
బాబా నవవిధా భక్తీ
జ్ఞానాంచా సమయా లావుని ఉజళల్యా జ్యోతీ । ॥ ఆతా ॥ 2
భావార్థాంచా మంచక హృదయా కాశీ టాంగిలా ।
బాబా కాశీ టాంగిలా
మానాచీ సుమనే కరునీ కేలే బాబాశేజేలా ॥ ॥ ఆతా ॥ 3
పద్వైతాచే కపాటలావుని ఏకతకేలే - బాబా ఏకత్రకేలే
దుర్బుద్ధీంచ్యా గాంఠీ సోడునిపడదే సోడిలే ॥ ॥ ఆతా ॥ 4
ఆశాతృష్ణా కల్పనేచాసోడుని గలబలా బాబా సోడుని గలబలా
దయా క్షమా శాంతి దాసీ ఉభ్యా సేవేలా ॥ ॥ ఆతా ॥ 5
అలక్ష్య ఉన్మని ఘేవుని బాబా నాజుక దుశ్శాలా బాబా నాజుక దుశ్శాలా
నిరంజన సద్గురు స్వామీ నిజవీలే శేజేలా ॥ ఆతా ॥ 6
సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై !

6. అభంగము

పాహే ప్రసాదా చీవాట - ద్యాతా వేధువోనియూతా ॥ 1
శేషా ఘేవునీ జాఈన - తుమచే మూలియా భోజన ॥ 2
ఝూలో ఆతా ఏకసవా - తుహ్మా ఆళంవావో ॥ 3
తుకాహ్మణే ఆతాచిత్త - కరునీ రాహిలో నిశ్చిత్ ॥ 4

ప్రయాణానికి ముందెప్పుడూ భోజనం చేసి బయలుదేరడం మంచిది

7. పదము

పావలా ప్రసాద ఆతా వఠోనిజావే ।
బాబా వఠోనీ జావే
అపులాతో శ్రమ కళో యేతసేభావే ॥ 1
ఆతా స్వామీ సుఖే నిద్రాకరా గోపాలా । బాబా సాయి దయాళా ।
పురలే మనోరథ జాతో అపులే స్థళా ॥
తుహ్మాసీ జాగవూ ఆహ్మీ అపుల్యా చాడా ।
బాబా అపుల్యా చాడా
శుభాశుభ కర్మదోష హరావయా పీడా । ॥ ఆతా ॥ 3
తుకాహ్మణే దిధలే ఉచ్చిష్టాచే భోజన్ ।
బాబా ఉచ్చిష్టాచే భోజన్
నాహి నివడిలే నిహ్మా అపుల్యాభిన్న ॥ ॥ ఆతా ॥ 4

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై గురుదేవదత్త

8. అభంగము (స్తవనము)

సాయినాథ మహరాజ - ఆతా కృపాకరా గురు రాజ ॥ ధృ ॥
త్రివిధ తాపహా సాఠిలాగలా - కాహీ నసుచే కాజ ॥ ఆతా ॥ 1
మనోవృత్తి హాకితీతరీ ఉనళతీ - ఉతరీయాంచామాజా॥ ఆతా ॥ 2
హరిసీజైసా దీన జనాచే - వ్యసన కసునీమాజ ॥ ఆతా ॥ 3
కృష్ణదాస త్వచ్ఛ రణీఘాలా - లీనత్యజునిజన లాజ ॥ ॥ ఆతా॥ 4

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై
ఓం రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సాయినాథ మహరాజ్
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహారాజ్‌కి జై

శేజారతి కార్యక్రమము సమాప్తము.

శ్రీసాయినాథుని పూజా విధానం

విఘ్నేశ్వర పూజ

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్న వదనం, ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే ॥

ఇట్లని విఘ్నేశ్వరుని ధ్యానించి, పసుపుతో విఘ్నేశ్వరుని చేసి తమలపాకు నందుంచి నమస్కరించవలెను.

గాయత్రీ ధ్యానం :-

ముక్కు మూసుకొని ఈ క్రింది మంత్రమును వీలైనన్ని సార్లు జపించునది.

ఓం భూః ఓం భువః ఓం సువః ఓం మహః
ఓం జనః ఓం తపః ఓం సత్యం ఓం తత్సత్
వితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి
ధియో యోన ప్రచోదయాత్

సంకల్పం :-

మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శ్రీ పరమేశ్వర ముద్దిస్య అవిఘ్నేన పరిసమాప్త్యర్థం అథౌ విఘ్నేశ్వర పూజాం అహం కరిష్యే.
(అని నమస్కరించి పసుపుతో చేసిన విఘ్నేశ్వరునకు ఈ విధముగా పూజ చేయవలెను)

విఘ్నేశ్వర పూజ :-

అస్మిన్ హరిద్రా బింబే మహాగణపతయే నమః
(అని అక్షతలు విఘ్నేశ్వరునకు చల్లవలెను)

ధ్యాయామి - ధ్యానం సమర్పయామి (ధ్యానం చేయాలి)
ఆవాహయామి - ఆసనం సమర్పయామి (అక్షతులు వేయవలెను)
హస్తయోః అర్ఘ్యం సమర్పయామి (ఆకుతో చేతులలో నీరు వేయవలెను)
పాదయోః పాద్యం సమర్పయామి (ఆకుతో పాదముల మీద నీరుచల్లవలెను)
ఔపచారిక స్నానం సమర్పయామి (ఆకుతో నీటిని చల్లవలెను)
స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి (ఆకుతో నీటిని)
